

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 127

సోమవారం 28-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



విజేత తేలేది నేడే

హంపి, దివ్య రెండో గేమ్ కూడా 'డ్రా'. నేడు టైబ్రేక్ ద్వారా తుది ఫలితం -14లో



రిటర్నులకు వేళాయెనే

పన్ను చెల్లింపులతో సంబంధం లేదు. టీడీఎస్ రూ. 25 వేలు దాటితే తప్పదు -15లో



అంతరిక్షంపై అమితాసక్తి

అంతరిక్షంపై చిన్నారుల్లో ఆసక్తి నానాటికీ పెరుగుతోందని ప్రధాని మోదీ 124వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో చెప్పారు.

వివరాలు 6లో ▸



మాతోశ్రీకి వెళ్లిన రాజ్‌ఠాక్రే..

శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఇంటికి వెళ్లి ఎంఎన్ఎస్ చీఫ్ రాజ్ ఠాక్రే పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

వివరాలు 6లో ▸



ఆలయంలో తొక్కిసలాట

హరిద్వార్‌లోని మానసాదేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందగా 28 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో ▸



సిందూర్‌పై నేడు చర్చ

పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో నేటి నుంచి పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై సుదీర్ఘ చర్చ జరగనుంది.

వివరాలు 6లో ▸

కంప్యూటర్స్‌పై కోటి ఆశలు



కన్వీనర్ కోటా కింద తాజాగా పెరిగిన 5,549 సీట్లు

- తొలి విడత ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో మిగిలిన 13,944 సీట్లు
- రెండో విడతకు అందుబాటులో మొత్తం 19,493 కంప్యూటర్ బ్రాంచీల సీట్లు
- 6 వేలకు పైన ర్యాంకు వచ్చినా సీటు వస్తుందనే అంచనా
- ఆయా బ్రాంచీల్లో సీటు కోసం భారీయెత్తున విద్యార్థుల ఆప్షన్లు
- 95 వేల మంది విద్యార్థులు... అన్నీ కలిపి 27 లక్షల ఆప్షన్లు
- 30న ఇంజనీరింగ్ రెండో విడత సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్

కంప్యూటర్ సైన్స్ సీట్లు పెరగడంతో రెండో దశ ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో ఆ బ్రాంచిపై విద్యార్థుల ఆశలు పెరిగాయి. ఈసారి కంప్యూటర్ సీటు వస్తుందని భావిస్తున్నారు. తొలివిడతలో ఇతర బ్రాంచీల్లో సీట్లు వచ్చిన వాళ్లూ ఆప్షన్లు మార్చుకున్నారు. తొలి ప్రాధాన్యతగా సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సులను ఎంచుకున్నారు. వెబ్ ఆప్షన్ల గడువు ఆదివారం ముగిసేనాటికి 95 వేల మంది 27 లక్షల ఆప్షన్లు ఇచ్చినట్టు ఎప్‌సెట్ క్యాంప్ కార్యాలయం అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 30న రెండో విడత సీట్ల కేటాయింపు ఉంటుంది.

పెరిగిన సీట్లన్నీ ప్రైవేటు కాలేజీల్లోనే..

తొలిదశ కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటా కింద కంప్యూటర్ సైన్స్, ఇతర ఎమర్జింగ్ బ్రాంచీల్లో 58,742 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 57,042 సీట్లు కేటాయించారు. అయితే 44,798 మంది మాత్రమే రిపోర్టు చేశారు. దీంతో 13,944 సీట్లు మిగిలిపోయాయి. తాజాగా కన్వీనర్ కోటా కింద కంప్యూటర్ సైన్స్ సీట్లు 5,549 పెరిగాయి. దీంతో మొత్తం 19,493 కంప్యూటర్ సంబంధిత బ్రాంచీల సీట్లు రెండో విడత కౌన్సెలింగ్‌లో అందుబాటులోకి వస్తాయి. పెరిగిన సీట్లన్నీ ప్రైవేటు కాలేజీల్లోనే ఉన్నాయి. టాప్ కాలేజీల్లో తొలి దశ కేటాయింపులో గరిష్టంగా 5 వేల ర్యాంకు వరకూ సీట్లు వచ్చాయి. రెండోదశలో 6 వేలపైన ర్యాంకుకు కూడా సీటు రావచ్చని ఎప్‌సెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 25 వేల ర్యాంకు వరకూ టాప్ కాలేజీల్లో సీట్లు వస్తాయని చెబుతున్నారు.

భారీగా కాలేజీలు, ఆప్షన్ల మార్పు

సివిల్, ఈఈఈ, మెకానికల్ వంటి కోర్ గ్రూపుల్లో సీట్లు వచ్చిన విద్యార్థులు రెండో విడత కౌన్సెలింగ్‌లో కాలేజీల మార్పుపై ఎక్కువగా దృష్టి పెట్టారు. ఇప్పుడు వచ్చిన కాలేజీ కన్నా, బెస్ట్ కాలేజీలకు తొలి ప్రాధాన్యత ఇచ్చారు. ఈ క్రమంలో 78 శాతం విద్యార్థులు బ్రాంచీ మార్పుకు ఆప్షన్లు ఇచ్చారు. సివిల్‌లో సీటు వచ్చిన విద్యార్థులు టాప్ 30 కాలేజీల్లోనైనా కంప్యూటర్స్ లేదా ఎలక్ట్రానిక్స్‌లో సీటు వస్తుందేమోనన్న ఆశతో ఆప్షన్లు ఇచ్చారు. మరోవైపు టాప్ కాలేజీల్లో సీట్లు వచ్చిన వాళ్ళు కూడా ఆప్షన్లలో కాలేజీ మార్చుకున్నారు. అయితే ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌ల్లో కంప్యూటర్ సీట్లు వచ్చిన విద్యార్థులు మాత్రం

మిగతా 3వ పేజీలో ▶

ఆర్టీసీలో అడియాసలు



పింఛను లేదు.. బకాయిలు రావు

ఉద్యోగ విరమణ చేసిన సిబ్బంది గగ్గోలు

- రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాల్సిన దుస్థితి
- ఆర్థిక ఇబ్బందులతో దిక్కుతోచని పరిస్థితుల్లో 16 వేల కుటుంబాలు
- ఇక ప్రతి సోమవారం రోడ్డెక్కి నిరసనలు తెలపాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: 'మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పించిన తర్వాత 200 కోట్ల ఉచిత ప్రయాణాలు నమోదయ్యాయి. వీటి రూపంలో మహిళలకు రూ.6,680 కోట్లు ఆదా కాగా ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేసింది. తద్వారా సంస్థ లాభాల్లోకి వచ్చింది. ఇప్పుడు ఆర్టీసీ నష్టాలతో మునిగిపోయే నావ కాదు.. లాభాల్లోకి వచ్చిన సంస్థ'.. ఉచిత ప్రయాణ పథకం కింద 200 కోట్ల ఉచిత టికెట్ల మైలురాయిని చేరుకున్న తరుణంలో ఆరు రోజుల క్రితం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పిన మాటలివి. వారే స్వయంగా ఆర్టీసీ లాభాల్లో ఉందని ప్రకటించారు. అయినప్పటికీ.. సంస్థలో దశాబ్దాల పాటు పని చేసి ఉద్యోగ విరమణ పొందిన వేల మంది ఉద్యోగులు తమకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాల కోసం ఆర్టీసీ కార్యాలయాల వద్ద ధర్నాలు, ర్యాలీలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొని ఉండటం, పెన్షన్ లేకపోవడంతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటం శోచనీయం.

వేదన వర్ణనాతీతం

రిటైర్ అయిన ఆర్టీసీ సిబ్బందికి ఇవ్వాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చెల్లించకపోగా, కనీసం ఎప్పుడిస్తారో కూడా చెప్పకపోవటంతో రిటైర్ అయిన ఉద్యోగులు, సిబ్బంది ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. పెన్షన్ లేని ఉద్యోగం కావటంతో.. ఆర్థిక పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నవారిని పక్కన పెడితే సెక్యూరిటీ, శ్రామిక్, డ్రైవర్,

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

3న నీట్ పీజీ ఎంట్రన్స్



దేశవ్యాప్తంగా వచ్చే నెల 3న నీట్–పీజీ ప్రవేశపరీక్షను ఒకే విడతలో నిర్వహించేందుకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ నుంచి సుమారు 10 వేల మంది రాసే అవకాశం ఉందని అంచనా.

- వివరాలు 2లో▶

ఎప్పటికీ బాబు మనుషులమే అని సీఎం రమేశ్ చెప్పారు



'ఎంపీ సీఎం రమేశ్ ఇంటికి కేటీఆర్ లేదా నేను వెళితే తప్పేంటి? భయపెడితేనే బీజేపీలోకి వెళ్లామని.. మేం ఎప్పటికీ చంద్రబాబు మనుషులమేనని రమేశ్ మాతో చెప్పారు' అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు.

- వివరాలు 2లో▶

భూమి వేగంగా తిరుగుతోంది



ఈ మధ్య భూమి వేగంగా తిరుగుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. దీంతో టైమ్ ఆధారంగా పనిచేసే కంప్యూటర్లు, జీపీఎస్ శాటిలైట్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, స్టాక్ మార్కెట్ల వంటి ఆర్థిక వ్యవస్థలన్నీ ప్రభావితమవుతాయి.

- వివరాలు 2లో▶

పోరాటం కూడా గర్వించేలా..



ఇంగ్లండ్‌తో మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్టును భారత జట్టు అసాధారణ పోరాట పటిమతో 'డ్రా' చేసుకుంది. కెప్టెన్ గిల్‌తో పాటు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్‌లు సెంచరీలు సాధించి భారత్‌ను గట్టెక్కించారు.

- వివరాలు 14లో▶

ఇదండీ సంగతి



.. రాష్ట్రాన్ని నెంబర్‌వన్ చేస్తారంటే.. అప్పుల్లోనా సార్!



'సృష్టి'ంచకుండా శిశు విక్రయాలు!

సరోగసీ పేరుతో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ దందా

- ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండానే చేస్తామంటూ జంటలతో ఒప్పందాలు
- ఒక్కో కేసుకు రూ.40 లక్షల దాకా వసూలు.. సరోగసీ నిర్వహించకుండా పేదింటి పిల్లల అప్పగింత

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఓ జంటను మోసగించడం..తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టించగా, దీనిపై పోలీసుల దర్యాప్తులో నిర్ఘాంతపోయే విషయాలు వెలుగులోకొచ్చాయి. ఈ సెంటర్ కేంద్రంగా వ్యవస్థీకృత శిశు విక్రయాల దందా సాగుతున్న వైనం బట్టబయలయ్యింది. ఇప్పటికే పది కేసులు ఉండి, ఎలాంటి అనుమతులు లేకుండా ఈ సెంటర్ నిర్వహిస్తున్న అట్లూరి నమ్రత అలియాస్ పచ్చిపాల నమ్రత మరో వైద్యురాలి పేరుతో కథ నడిపిస్తున్నట్లు తెలిసింది. సంతానం కోసం వచ్చే వారికి ప్రభుత్వ అనుమతి, ఇతర ప్రొసీజర్‌తో

మిగతా 3వ పేజీలో ▶



కనిపెట్టి.. కాపాడుదాం

విద్యార్థుల ఆత్మహత్యల నివారణపై నిపుణుల సూచన

- ఏదో ఒక సందర్భంలో వాళ్లు బాధను వ్యక్తపరుస్తారు.. తేలిగ్గా తీసుకోవద్దు..
- ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి.. పిల్లలు చెప్పేది వినాలని తల్లిదండ్రులకు హితవు

సాక్షి, స్పెషల్ డెస్క్: ఇటీవలి కాలంలో పరీక్షల ఒత్తిడి, ఫెయిలవుతామన్న భయం, మార్కులు తగ్గితే అందరూ తమను చిన్నచూపు చూస్తారన్న ఆందోళన వంటి కారణాలతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడాలని, ఒత్తిడికి లోనై బలవన్మరణాలకు పాల్పడకుండా నివారించాలని దేశ అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం వ్యాఖ్యానించడం సమస్య తీవ్రతకు నిదర్శనం. అంతేకాకుండా వ్యవస్థల స్థాయిలో ఎలాంటి చర్యలు చేపట్టాలో కూడా సుప్రీంకోర్టు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. అసలు ఇంతకీ... విద్యార్థుల బలవన్మరణాలకు

మిగతా 12వ పేజీలో ▶

ఐదు జిల్లాల్లో ఇంకా లోటే!

రాష్ట్రంలో ఇప్పటికీ సాధారణ వర్షపాతమే • వారం రోజుల వర్షానికి బ్రేక్



సాక్షి, హైదరాబాద్: వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు కాస్త బ్రేక్ పడింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ఉన్న రైతులకు తాజా వర్షాలు భారీ ఊరటనిచ్చాయి. ప్రస్తుత గణాంకాలు సాధారణ స్థితిలో ఉన్నా, మరిన్ని వర్షాలు కురవాల్సిన అవసరముందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం నైరుతి సీజన్ వర్షపాత గణాంకాలు పరిశీలిస్తే... జూలై 27వరకు రాష్ట్రంలో కురవాల్సిన సాధారణ వర్షపాతం 33.40 సెంటీమీటర్లు కాగా, నమోదైన వర్షపాతం 33.68 సెంటీమీటర్లు. నెలాఖరు నాటికి 35.81 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. రెండ్రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, రేపట్నుంచి

మిగతా 3వ పేజీలో ▶

ఈ మధ్య భూమి వేగంగా తిరుగుతోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. భూభ్రమణం వల్లనే పగలు, రాత్రి ఏర్పడతాయి. అంటే వేగం ప్రభావం కాలం మీదా పడుతుంది. టైమ్ ఆధారంగా పనిచేసే కంప్యూటర్లు, జీపీఎస్ శాటిలైట్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, స్టాక్ మార్కెట్ల వంటి ఆర్థిక వ్యవస్థలు.. అన్నీ ప్రభావితమవుతాయి. అంటే.. సుదీర్ఘకాలంలో మానవాళికి ఓ అకాల సమస్య సవాలు విసరనుందా?

- సాక్షి, స్పెషల్ డెస్క్



భూమి.. వేగంగా తిరుగుతోంది!

వాతావరణ మార్పులు, మంచు కరగడమే కారణం • భూభ్రమణ వేగం వల్ల '24 గంటల్లో' స్వల్ప తగ్గుదల • కంప్యూటర్లు, శాటిలైట్ల వంటి వ్యవస్థలపై ప్రభావం

లీప్ సెకన్

కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ – యూటీసీ నుంచి ఒక సెకను తీసేస్తే నెగటివ్ లీప్ సెకండ్ అంటారు. పాజిటివ్ లీప్ సెకన్ అంటే యూటీసీకి ఒక సెకన్‌ను జోడిస్తారు. భూభ్రమణ వేగం పెరిగినప్పుడు నెగటివ్ లీప్ సెకన్ అవసరమవుతుంది. దీనివల్ల ఒక రోజు 86,400 సెకన్ల కంటే కొంచెం తక్కువగా ఉంటుంది.

సాధారణంగా సమయాన్ని గంటలు, నిమిషాలు, సెకన్లలో చెప్తాం. ఉదాహరణకు.. 23:59:59 తరవాత.. 00:00:00 వస్తుంది. కానీ పాజిటివ్ లీప్ సెకన్ ఉంటే.. 23:59:59, 23:59:60 తరవాత 00:00:00 వస్తుంది.

అదే నెగటివ్ లీప్ సెకన్ అయితే... 23:59:57, 23:59:58 తరవాత 00:00:00 వస్తుంది.



1949లో మొట్టమొదటి అణు గడియారం తయారైనప్పటి నుంచి చూస్తే 2024 జూలై 5ను శాస్త్రవేత్తలు అతి పొట్టి రోజుగా గుర్తించారు. ఈ రోజున 24 గంటల కంటే 1.66 మిల్లీసెకన్లు తక్కువ నమోదయ్యాయి.

ఈ ఏడాది వేసవిలో భూమి చాలా వేగంగా తిరిగింది. ఫలితంగా రోజు వేగంగా గడిచిపోతోంది. జూలై 10.. ఈ ఏడాదిలో అత్యంత పొట్టి రోజు. రోజుకు ఉండాల్సినవి 24 గంటలు. కానీ ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్, యూఎస్ నేవల్ అబ్జర్వేటరీల వంటి వాటి ప్రకారం ఆ రోజున 1.36 మిల్లీ సెకన్లు (0.00136 సెకన్లు) తక్కువయ్యాయి. జూలై 22, ఆగస్టు 5న కూడా ఇలాంటి పొట్టి రోజులే నమోదు కానున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరుసగా 1.34, 1.25 మిల్లీ సెకన్లు ఈ రెండు రోజుల్లో లోటు పడతాయట.

86,400 సెకన్లకు అటూ ఇటుగా..

భూమి తనచుట్టూ తాను తిరగడానికి 24 గంటలు లేదా 86,400 సెకన్ల సమయం పడుతుందని మనం చదువుకున్నాం. కానీ, చంద్రుడి గురుత్వాకర్షణ, భూకేంద్రంలో మార్పుల ప్రభావం.. వీటన్నింటివల్ల కచ్చితంగా 86,400 సెకన్లు ఉండదు. కాస్త అటూ ఇటుగా ఉంటుంది. స్వల్పకాలంలో దీని ప్రభావం మనపై పెద్దగా కనిపించదు కాబట్టి మనకు తెలియదు.

అణు గడియారాలు

సమయాన్ని అత్యంత కచ్చితంగా కొలిచేందుకు రూపొందించినవే అణుగడియారాలు. ప్రతి అణువుకు ఒక నిర్దిష్ట పౌనఃపున్యం (ఫ్రీక్వెన్సీ) ఉంటుంది. ఈ పౌనఃపున్యం ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుంది. అణు గడియారాలు ఈ పౌనఃపున్యాన్ని ఉపయోగించి సమయాన్ని కొలుస్తాయి. ఈ సమయాన్నే కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్ (యూటీసీ) అని పిలుస్తారు. ఇది దాదాపు 450 అణు గడియారాలపై ఆధారపడి ఉంటుంది. ఇది సమయపాలనకు ప్రపంచ ప్రమాణం, అలాగే మన ఫోన్‌లు, కంప్యూటర్‌లు అన్నింటిలోనూ పొందుపరిచిన సమయం కూడా ఇదే.

1972 నుంచి..

1972 నుంచి భూమి భ్రమణ వేగం బాగా తగ్గింది. అణు గడియారాలతో పోలిస్తే.. ఈ సమయం తక్కువ కావడంతో యూటీసీకి 'లీప్ సెకన్'ను జోడించాలని ఇంటర్నేషనల్ ఎర్త్ రొటేషన్ అండ్ రిఫరెన్స్ సిస్టమ్స్ సర్వీస్ ఆదేశించింది. దీన్ని పాజిటివ్ లీప్ సెకన్ అని పిలుస్తారు. చెప్పాలంటే ఇది లీప్ ఇయర్ లాంటిది. 1972 జూన్ 30 నుంచి మొత్తం ఇలా 27 లీప్ సెకన్లను యూటీసీకి అదనంగా జోడించారు. కానీ, 2016 డిసెంబర్ 31 తరవాత మాత్రం ఒక్కటి కూడా అదనంగా చేరలేదు.

ఎందుకు ఈ వేగం?

డంకన్ ఆగ్న్యూ అగ్న్యూ అంచనాల ప్రకారం.. చంద్రుడు, సముద్ర అలల కారణంగా భూభ్రమణంలో అత్యంత స్వల్ప కాల మార్పులు సంభవిస్తున్నాయి. చంద్రుడు భూమధ్యరేఖకు పైన ఉంటే భూమి నెమ్మదిగా తిరుగుతోంది. వేసవిలో భూమి కాస్త వేగంగా తిరుగుతుంది.

వాతావరణ మార్పులు కూడా లీప్ సెకన్‌కు కారణమవుతున్నాయి. గత ఏడాది 'నేచర్'జర్నల్‌లో ప్రచురితమైన ఆగ్న్యూ అధ్యయనం ప్రకారం.. అంటార్కిటికా, గ్రీన్‌ల్యాండ్‌లలోని మంచు కరిగి సముద్రాల్లోకి కలిసి, సముద్ర మట్టాలు పెరిగి భూభ్రమణ వేగం తగ్గుతోంది. మంచు కరగడం భూమి అక్షంలో కూడా మార్పులకు కారణమవుతోందని స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ ప్రొఫెసర్ బెనెడిక్ట్ సోజా పరిశోధనలో తేలింది. 'సాధారణంగా చంద్రుడు భూభ్రమణాన్ని ఇంతవరకు ప్రభావితం చేస్తున్నాడు. కానీ, ఈ శతాబ్దం చివరి నాటికి.. భూమిపై గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలు భారీగా పెరిగి అవి భూభ్రమణ వేగాన్ని ప్రభావితం చేసినా ఆశ్చర్యపోనవసరం లేదు' అంటున్నారు సోజా.

లీప్ సెకన్ ప్రభావం?

టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు, కంప్యూటర్లు, ఆర్థిక లావాదేవీలు, ఎలక్ట్రిక్ గ్రిడ్‌లు, జీపీఎస్ శాటిలైట్లు వంటి అనేక వ్యవస్థలు సమయంపై ఆధారపడి పనిచేస్తాయి. ఇంతవరకు ఇవి పాజిటివ్ లీప్ సెకన్‌నే చూశాయి. నెగటివ్ లీప్ సెకన్ వల్ల ఇవి ఎలా ప్రభావితమవుతాయో చెప్పడం కష్టం అంటున్నారు శాస్త్రవేత్తలు.

ఉంచాలా.. తీసేయాలా?

'లీప్ సెకన్ అనేది మనం సృష్టించింది. ఈ లీప్ సెకన్ పద్ధతినే తీసేస్తే గొడవ ఉండదు కదా' అని వాదించేవారు లేకపోలేదు.

'గడియారంలోంచి మనం తీసేయగలం. కానీ, భూభ్రమణంలో వచ్చే మార్పులను చెరిపేయలేం. సుదీర్ఘకాలంలో మానవాళిపై వాటి ప్రభావాన్ని తుడిచేయలేం. భూమి నెమ్మదిగానో వేగంగానో తిరుగుతోందని.. అందుకు భూతాపం వంటివి కారణమవుతున్నాయని తెలుసుకునేందుకు.. ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు ఇది ఉపయోగపడుతుంది. కాబట్టి ఇది ఉండాల్సిందే' అని గట్టిగా వాదిస్తున్నవారూ ఉన్నారు.

క్లుప్తంగా...

యాదగిరీశుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి



జస్టిస్ మాధవిదేవి దంపతులకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవిదేవి కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రావణమాసంలో శ్రీ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న జస్టిస్ మాధవి దేవికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా.. అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర సచివాలయంలో సమావేశం కానుంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు, వర్షాకాల అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. గిగ్ వర్కర్స్ సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న బిల్లు, గో సంరక్షణ విధివిధానాలపై సైతం చర్చించి మంత్రివర్గం ఆమోదించనుంది. కేంద్రం తీసుకున్న విధాన నిర్ణయం ఆధారంగా ప్రైవేటు క్యాబ్ సేవలను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావడం వంటి అంశాలపై సైతం మంత్రివర్గ భేటీలో చర్చించే అవకాశం ఉంది.

'బండి' వాంగ్మూలం నమోదు వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎస్ఐబీ కేంద్రంగా జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌తో పాటు ఆయన సహాయకుల వాంగ్మూలాల నమోదు మరోసారి వాయిదా పడింది. 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంట్‌లో చర్చ కారణంగా.. సోమవారం వాంగ్మూలం ఇవ్వలేనని, త్వరలోనే మరో తేదీని వెల్లడిస్తానని ఆయన సిట్ ఏసీపీకి ఆదివారం లేఖ రాశారు. దీంతో వాంగ్మూలాల నమోదును సిట్ వాయిదా వేసింది.

ఆర్టీసీలో అడియాసలు

▶ మొదటి పేజీ తరువాయి

కండక్టర్ లాంటి తక్కువ జీతాలతో పనిచేసిన వారు పేదరికంలో మగ్గుతున్న తీరు, వారు పడుతున్న కష్టాలు కన్నీళ్లు తెప్పిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒకరు, ఇద్దరు కాదు.. దాదాపు 16 వేల కుటుంబాలు నానా అవస్థలకు గురవుతున్నాయి. తమ బాధలు చెప్పుకోవటానికి వెళ్తే ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం, నిస్సహాయ పరిస్థితుల్లో ఇక నుంచి ప్రతి సోమవారం సంబంధిత డిపోల ముందు, ప్రతి నెలా రీజినల్ కార్యాలయాల ముందు ధర్నాలు చేయాలని రిటైర్డ్ ఉద్యోగులు నిర్ణయించుకున్నారు.

ఎట్టకేలకు వేతన సవరణ జరిగినా..

ప్రతి నాలుగేళ్లకోమారు ఆర్టీసీ ఉద్యోగుల వేతనాలను సవరించాలి. 2017లో జరగాల్సిన వేతన సవరణ 2024లో అమలులోకి వచ్చింది. అంతవరకు 16 ఇంటెరిమ్ రిలీఫ్ (మధ్యంతర ఉపశమనం)లతో నెట్టుకొచ్చి, గత ఏడాది ఏప్రిల్‌లో 21 శాతం ఫిట్‌మెంట్‌తో ప్రభుత్వం వేతన సవరణ చేసింది. అదే ఏడాది జూన్ నుంచి అమల్లోకి తెచ్చింది. పాత బకాయిలు పదవీ విరమణ సమయంలో ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ, అప్పటికే రిటైర్ అయిన వారి సంగతేంటో సంస్థ చెప్పలేదు. అదే వారి పాలిట శాపంగా మారింది. ఈ వేతన సవరణ కాలంలో సంస్థలో పనిచేసి ఆ తర్వాత రిటైర్ అయినవారందరికీ ప్రయోజనం లభించాల్సి ఉంది. మొత్తం 16 వేల మంది రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక లబ్ధి కలగాల్సి ఉంది.



పొదుపు చేసుకున్న మొత్తానికి వడ్డీ బకాయిలు చెల్లించాలని ఇటీవల ఆర్టీసీ సహకార పొదుపు సంఘం కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఎన్ని బకాయిలో..

- 2017 వేతన సవరణ, ఆ ఏడాది ఏప్రిల్ నుంచే అమలులోకి రావాల్సి ఉంటుంది. కానీ 2024 జూన్ నుంచి అమలులోకి వచ్చినందున.. ఆ ఏడాది మే వరకు రిటైర్ అయిన అందరికీ ఇప్పుడు ఆ బకాయిలు చెల్లించాలి. కండక్టర్, డ్రైవర్ లాంటి వారికి నెలకు సగటున రూ.5 వేల చొప్పున 2017 ఏప్రిల్ నుంచి చెల్లించాల్సి ఉంది.
- పనిచేసిన కాలంలో 300 వరకు పేరుకునే ఆర్జిత సెలవుల (దాదాపు 10 నెలలు) మొత్తాన్ని కూడా రిటైర్మెంట్ సమయంలో ఉద్యోగులకు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇది కూడా బకాయి ఉంది. 2022 జూన్‌లో రిటైర్ అయిన డిపో మేనేజర్ స్థాయి అధికారికి ఆ బకాయి మొత్తం రూ.11 లక్షలుగా ఉంది.
- 2017 వేతన సవరణతో జీతాలు పెరిగినందున, ఆర్జిత సెలవు బకాయిలు కూడా పెరుగుతాయి. రూ.10 లక్షల బకాయి ఉన్నవారికి మరో రూ.4 లక్షల వరకు ఈ వేతన సవరణ వల్ల అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.
- 2019 జూలై నుంచి ఆర్టీసీలో డీఏల చెల్లింపు నిలిచిపోయింది. గతేడాది ఒకేసారి ఐదు పెండింగు డీఏలను చెల్లించారు. ఈ మధ్య కాలంలో రిటైర్ అయినవారికి ఆ లబ్ధి ఇవ్వలేదు. ఒక్కో పెండింగు డీఏ నికరంగా 2.5 శాతం నుంచి 3.2 శాతం మధ్య ఉంది. ఆ మొత్తం కూడా రిటైర్డ్ ఉద్యోగులకు భారీగా లభించాల్సి ఉంది.
- అలాగే గ్రాట్యుటీపై 2017 వేతన సవరణ ప్రభావాన్ని లెక్కగట్టి ఇవ్వాల్సి ఉంది. వేతన సవరణతో పెరిగే జీతం ప్రకారం పీఎఫ్ మొత్తం కూడా పెరుగుతుంది.
- ఆర్టీసీ సహకార పరపతి సంఘంలో రిటైర్డ్ ఉద్యోగులు అధిక వడ్డీ ఆశతో దాచుకున్న మొత్తాలపై ప్రస్తుతం వడ్డీ చెల్లింపు నిలిచిపోయింది.

లబ్ధి అందకుండానే కన్నుమూత!

డ్రైవర్, శ్రామిక్, సెక్యూరిటీ.. లాంటి కష్టతరమైన ఉద్యోగాలు ఏళ్లపాటు చేయటంతో ఆరోగ్యాలు దెబ్బతిని చాలా మంది సగటు జీవిత కాలం కంటే ముందే చనిపోతున్నారు. చాలామంది తమకు రావాల్సిన బకాయిలు రాకముందే చనిపోతున్నారని సంఘాల సంఘాలు నేతలు చెబుతున్నారు.

'హైదరాబాద్‌తో ప్రత్యేక అనుబంధం'



ఫలహారం బండ్ల ఊరేగింపులో పోతరాజులతో మంత్రి కోమటిరెడ్డి

ఉప్పల్ (హైదరాబాద్): ఉప్పల్ చిలుకానగర్‌లో ఆదివారం నిర్వహించిన బోనాల జాతర, ఫలహార బండి ఊరేగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి భక్తులను ద్దేశించి మాట్లాడుతూ.. తనకు హైదరాబాద్ నగరంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. అందులోనూ చిలుకానగర్ వాసులు పిలిస్తే రానని చెప్పబుద్ధి కాదన్నారు. పోతరాజులతో కలిసి మంత్రి హుషారుగా నృత్యం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఫలహార బండ్ల ఊరేగింపులో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

3న నీట్ పీజీ ఎంట్రన్స్

ఈ నెల 31 నుంచి అడ్మిట్ కార్డులు

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వచ్చే నెల 3న నీట్–పీజీ ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం 9 గంటల నుంచి 12:30 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు విద్యార్థులు 45 నిమిషాలకు ముందే ఎగ్జామ్ సెంటర్లకు చేరుకోవాల్సి ఉంది. వాస్తవానికి జూన్ 15న రెండు షిఫ్టుల్లో జరగాల్సిన ఈ పరీక్షను ఒకే షిఫ్టులో నిర్వహించాలంటూ సుప్రీంకోర్టు ఆదేశించడంతో ఎన్‌బీఈఎంఎస్ దీన్ని ఆగస్టు 3కు వాయిదా వేసింది. దేశవ్యాప్తంగా 2 లక్షల మందికిపైగా విద్యార్థులు నీట్ పీజీ రాయనుండగా తెలంగాణ నుంచి సుమారు 10 వేల మంది రాసే అవకాశం ఉందని అంచనా. ఇందుకోసం రాష్ట్రంలో హైదరాబాద్ సహా 10 కేంద్రాలను ఎంపిక చేశారు. విద్యా ర్థులకు జూలై 31 నుంచి అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంచనున్నారు. సెప్టెంబర్ 3 నాటికి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. గతేడాది కౌన్సెలింగ్ ద్వారా మొత్తం 25,791 సీట్లను కేటాయించారు.

హాఫ్ మారథాన్.. ఫుల్ జోష్..

రంగనాయక సాగర్ కట్టపై వేలమంది పరుగు

- సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్, సాక్షి మీడియా నిర్వహణ
- ఉత్సాహభరితంగా సాక్షి డాట్ గేమ్స్.. విజేతలకు బహుమతులు



రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్టపై హాఫ్ మారథాన్



అశ్విత్‌గౌడ్



సుల్తానా



సురేందర్

చిన్నకోడూరు (సిద్దిపేట): ఉరిమే ఉత్సాహం.. నువ్వా నేనా అన్నట్లుగా పరుగు.. చిన్నా పెద్ద తేడా లేకుండా వందల మది పోటీ. సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాక్షి మీడియా సపోర్టింగ్ స్పాన్సర్‌గా ఆదివారం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్ కట్టపై నిర్వహించిన హాఫ్ మారథాన్ దృశ్యాలివి. 5, 10, 21 కి.మీ. విభాగాల్లో నిర్వహించిన పరుగు పో టీల్లో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కూడా ఆసక్తిగా పాల్గొన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు జెండా ఊపి పరుగును ప్రారంభించారు. విజేతలకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ పోటీల్లో మూడు వేలమందికి పైగా పాల్గొన్నారు.

గేమ్స్.. సాక్షి సెల్ఫీ పాయింట్

రంగనాయక సాగర్‌కు వచ్చిన రన్నర్స్ అక్కడ సాక్షి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాక్షి డాట్ గేమ్స్‌లో కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. డాట్ గేమ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన సాక్షి సెల్ఫీ పాయింట్‌లో ఫొటో దిగడానికి రన్నర్స్ ఆసక్తి చూపారు. సాక్షి మీడియా బృందంతో పాటు ఎంపీ రఘునందన్‌రావు, సినీ నటుడు సంపూర్ణేష్ బాబు తదితరులు పాల్గొని సెల్ఫీ పాయింట్‌లో సెల్ఫీ దిగారు.

హాఫ్ మారథాన్ విజేతలు వీరే..

హాఫ్ మారథాన్‌లో మహిళలు, పురుషుల విభాగాల్లో ముగ్గురు విజేతలుగా నిలిచారు. 21 కే పురుషుల విభాగంలో మొదటి స్థానంలో దివ్యాన్ష్ తోమర్, రెండో స్థానంలో రమావత్ రమేశ్ చంద్ర, మూడో స్థానంలో మంచికంటి లింగన్న నిలిచారు. మహిళల విభాగంలో మొదటి స్థానంలో ఎం ఉమ, రెండో స్థానంలో సునిమా దిలా, మూడో స్థానంలో జయశ్రీ వర్మ నిలిచారు. 10 కేలో పురుషుల విభాగంలో హరీశ్, సురేందర్, విజయ్ వరుసగా మొదటి, రెండు, మూడో స్థానాలు దక్కించుకున్నారు. మహిళల విభాగంలో స్వప్న, సమ్రీన్, ముషారఫ్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 5 కేలో మహిళల విభాగంలో అభినయశ్రీ, మధుప్రియ, అఫ్రీన్, పురుషులు గగన్ కుమార్, టిక్లూ, శివరాజు మొదటి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు గెలుచుకున్నారు.

సాక్షి డాట్ గేమ్ విజేతలు..

సాక్షి డాట్ గేమ్‌లో ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కంకటి అశ్విత్‌గౌడ్ (చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామం), రెండో బహుమతి సుల్తానా (సుభాష్‌నగర్, సిరిసిల్ల), మూడో బహుమతి సురేందర్ (వెల్లటూరు గ్రామం, సిద్దిపేట అర్బన్ మండలం)లు గెలుచుకున్నారు. వీరిని సాక్షి మీడియా బృందం అభినందించింది.

నేషనల్ చాంపియన్ కావటమే లక్ష్యం..

సిద్దిపేటలో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో మూడు సార్లు పాల్గొని విజేతగా నిలిచాను. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతూ అథ్లెటిక్స్‌లో కూడా పాల్గొంటున్నాను. నేషనల్ చాంపియన్‌గా నిలవటమే నా లక్ష్యం.

- ఉమ, నూతనకల్, సూర్యాపేట జిల్లా

మధ్యప్రదేశ్ నుంచి వచ్చాను..

నేను మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ నుంచి వచ్చి హాఫ్ మారథాన్‌లో పాల్గొన్నా. ఇక్కడికి రావడం మొదటి సారి. ఇతర రాష్ట్రాలలో చాలా సార్లు మారథాన్‌లో పాల్గొని విజేతగా నిలిచా. ఇక్కడ మొదటి సారిగా పాల్గొని 21 కేలో విజేతగా నిలవడం చాలా సంతోషంగా ఉంది.

- దివ్యాన్ష్ తోమర్

ఎప్పటికీ చంద్రబాబు మనుషులమేనని

సీఎం రమేశ్ చెప్పారు

ఈడీ, సీబీఐ పేరుతో భయపెడితే బీజేపీలోకి వెళ్లామన్నారు

- జీవితకాలంలో ఎక్కువ రోజులు బాబు ఇంట్లో, ఢిల్లీలోని రేవంత్ ఇంట్లోనే ఉన్నావ్
- సీసీటీవీ ఫుటేజీ తీద్దామా..
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్



సాక్షి, హైదరాబాద్: 'ఎంపీ సీఎం రమేశ్ ఇంటికి కేటీఆర్ లేదా నేను వెళితే తప్పు ఏంటి? మమ్మల్ని ఈడీ, సీబీఐ పేరుతో భయపెడితేనే బీజేపీలోకి వెళ్లామని..మేం ఎప్పటికీ చంద్రబాబు మనుషులమేనని సీఎం రమేశ్ మాతో చెప్పారు' అని మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. నీ జీవితకాలంలో ఎక్కువ రోజులు.. చంద్రబాబు ఇంట్లో, ఢిల్లీలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలోనే ఉన్నావు. సీసీటీవీ ఫుటేజీ తీద్దాం పదా.. నువ్వు, నీ తమ్ముడు ఎన్ని రోజులు తుగ్లక్ రోడ్‌లోని నివాసంలో ఉన్నారో చూద్దాం' అని జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి మాటలు వింటే గోబెల్స్ ఆత్మహత్య చేసుకుంటారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్ గోబెల్స్‌ను మించిపోయారు. జైపాల్‌రెడ్డికి ఉన్న మంచిపేరును తన ఖాతాలో వేసుకోవాలని రేవంత్ ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌రెడ్డి..నాడు నోట్ల కట్టలతో దొరికినట్టు..నేడు బనకచర్ల విషయంలో దొరికిపోయారు. రేవంత్‌రెడ్డి కుర్చీలో ఐదేళ్లు ఉండాలని మేము కోరుతున్నాం. కానీ, ఆయనన్ను ఎప్పుడు పీకేస్తారో తెలియదు. ఎవరెవరు రెచ్చిపోతున్నారో వాళ్ల సంగతి మేం చూసుకుంటాం'అని జగదీశ్‌రెడ్డి అన్నారు. 'పార్లమెంట్ ఎన్నికల ముందు బీజేపీతో పొత్తు అంటే కేసీఆర్ మమ్మల్ని పిలిచి అరిచారు. బీజేపీ తెలంగాణకు పనికివచ్చే పార్టీ కాదు. బీఆర్ఎస్ భావజాలం వేరు..బీజేపీ భావజాలం వేరు. రాబోయే రోజుల్లో దేశ ప్రభుత్వాన్ని నడపటంలో కేసీఆర్ కీలకం అవుతారు. బీజేపీ వచ్చి బీఆర్ఎస్ పార్టీలో విలీనం అవుతామన్నా కేసీఆర్ ఒప్పుకోరు. బ్రోకర్లు మాట్లాడితే అది పట్టించుకోవద్దు'అని జగదీశ్‌రెడ్డి అన్నారు. 'అబద్ధం సిగ్గుపడేలా మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి ఆస్కార్ అవార్డుకు అర్హుడు. ఆయనకు స్క్రిప్ట్ రాసిస్తున్న వారు రేవంత్‌రెడ్డి పరువు తీస్తున్నారు. సహచర మంత్రులంటే భయంతోనే సీఎం వాళ్ల ఫోన్లు ట్యాప్ చేయిస్తున్నారు. అందుకే ఒక మంత్రి ఫోన్ ట్యాపింగ్‌కు భయపడి డబ్బా ఫోన్ వాడుతున్నారు'అని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు.

దేవతామూర్తుల నమూనాల విడుదల



యాదఋషి విగ్రహం నమూనా

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వెళ్లే దారిలో.. కొండ దిగువనున్న రింగ్ రోడ్డు సర్కిల్స్‌లో ప్రతిష్ఠించే దేవతామూర్తుల విగ్రహ నమూనాలను ఆలయ ఈవో వెంకట్రావ్ ఆదివారం విడుదల చేశారు. పాతగుట్ట రోడ్డుకు వెళ్లే తెలంగాణ చౌరస్తా వద్ద గరుడ సర్కిల్, మల్లాపురం వెళ్లే మార్గంలో యాదఋషి సర్కిల్, ప్రెసిడెన్షియల్ సూట్ మార్గంలో ప్రహ్లాద సర్కిల్, వైకుంఠద్వారం వద్ద హనుమాన్ సర్కిల్, కొండపైకి వెళ్లే మూడో ఘాట్‌రోడ్డు సమీపంలో రామానుజ సర్కిల్ నమూనాలతో ఫ్లెక్సీలను విడుదల చేశారు. సర్కిల్స్ నిర్మాణానికి విరాళాలిచ్చే దాతల కోసం ఆలయానికి చెందిన యూనియన్ బ్యాంక్ ఖాతా క్యూఆర్ కోడ్‌ను సైతం అందులో పొందుపరిచారు. కాగా పాతగుట్టకు వెళ్లే మార్గంలో అదనంగా సర్కిల్ ఏర్పాటు చేసి.. అక్కడ గరుడ సర్కిల్‌ను ఏర్పాటు చేయనున్నారు.

నేడో రేపో పీసీ ఘోష్ కమిషన్ నివేదిక

- కాళేశ్వరంపై విచారణ నివేదిక సిద్ధం
- హైదరాబాద్ చేరుకున్న పీసీ ఘోష్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై సుదీర్ఘ విచారణ నిర్వహించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ఒకటిరెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. జస్టిస్ చంద్రఘోష్ ఆదివారం హైదరాబాద్‌కు చేరుకోగా, ఆయనకు విమానాశ్రయంలో నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఎన్సీ కె.శ్రీనివాస్, సీఈ విజయ్‌భాస్కర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగియనుండగా, ఆలోపే ప్రభుత్వానికి నివేదికను సమర్పించేందుకు జస్టిస్ ఘోష్ ఏర్పాట్లు చేసుకున్నారు. నివేదికలోని అంశాలు బయటకి పొక్కకుండా అన్ని రకాలుగా జాగ్రత్తలు తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్ కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం బుంగలు ఏర్పడి నీళ్లు సీపేజీ అయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బరాజ్‌ల నిర్మాణంలో సాంకేతిక లోపాలతో పాటు అవినీతి ఆరోపణలపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 16 నెలలకు పైగా విచారణ నిర్వహించింది.

‘సృష్టి’ంచకుండా శిశు విక్రయాలు!

▶ మొదటి పేజీ తరువాయి

పని లేకుండా సరోగసీ చేస్తామని చెప్పి లక్షల్లో వసూళ్లు చేస్తూ.. చివరకు అలాంటి ప్రక్రియ ఏదీ చేయకుండా నిరుపేద దంపతులకు ఎరవేసి, వారికి చెందిన పిల్లల్ని అప్పగిస్తున్నట్లు తేలింది. రాజస్తాన్‌కు చెందిన ఓ జంటకు కూడా ఇలాగే చేయగా..వారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ‘సృష్టి’నిర్వాకం తాజాగా మరోసారి బయట పడింది. గోపాలపురం పోలీసులు నమోదు చేసిన కేసుకు సంబంధించి హైదరాబాద్, విశాఖ పట్నంలో కలిపి 8 మందిని అరెస్టు చేశామని, వీరిలో గాంధీ ఆస్పత్రి అనస్థీషియా స్పెషలిస్ట్ సదానందం కూడా ఉన్నట్లు నార్త్‌జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్ ఆదివారం వెల్లడించారు. మరో 50 మంది పరారీలో ఉన్నారని వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని తెలిపారు. ఏసీపీ సుబ్బయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు.

ఇప్పటికే 10 కేసులు.. రెన్యువల్ కాని లైసెన్స్

1995 నుంచి వైద్య వృత్తిలో ఉన్న నమ్రత 1998 నుంచి ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ రంగంలోకి దిగారు. సికింద్రాబాద్, కొండాపూర్, విశాఖ పట్నం, విజయవాడల్లో యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో క్లినిక్స్ నిర్వహిస్తు న్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు సహా అనేక అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఈమె పై హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నంలో 10 కేసులు నమోదయ్యాయి. దీంతో ఆమె ఫెర్టిలిటీ సెంటర్ నిర్వహణ లైసె న్స్‌ను 2021లో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పొడిగించలేదు. దీంతో తాను ఆ వృత్తి నిర్వహించట్లేదంటూ నమ్రత లేఖ కూడా ఇచ్చారు.


డాక్టర్ నమ్రత

నగరంలో నాలుగు చోట్ల సెంటర్లు

నమ్రత సికింద్రాబాద్‌లోని గోపాలపురంలో నాలుగు అంతస్తుల భవనంతో పాటు మరో మూడుచోట్లా అక్రమంగా ఈ సెంటర్లు నిర్వహిస్తున్నారు. అయితే తన పేరుతో కాకుండా డాక్టర్ సూరి శ్రీమతి పేరుతో ముద్రించిన లెటర్ హెడ్స్‌తో కథ నడిపిస్తున్నారు. ఆన్‌లైన్‌తో పాటు కరపత్రాల ద్వారా ఐవీఎఫ్ విధానం పేరుతో ప్రచారం చేస్తున్న నమ్రత.. సంతాన భాగ్యం కోసం తమ వద్దకు వచ్చే వారికి కొన్ని పరీక్షలు చేసి, ఆ విధానంతో ఫలితం లేదని చెప్తున్నారు. ప్రభుత్వ అనుమతి అవసరం లేకుండా గుట్టుగా సరోగసీ చేస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు. అంగీకరించిన భార్యభర్తల నుంచి ఎగ్, వీర్య సంగ్రహణ పేరుతో సికింద్రాబాద్‌తో పాటు వైజాగ్‌లో ఉన్న క్లినిక్స్‌లో హడావుడి చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ తంతు నిర్వహణలో గాంధీ ఆస్పత్రి అనస్థీషియా స్పెషలిస్ట్ నార్గుల సదానందం సహకరిస్తున్నారు. ఎంపిక చేసిన మహిళతో సరోగసీ చేస్తున్నామని, వివరాలన్నీ రహస్యమని చెబుతూ భార్యభర్తలకు ఫోన్ ద్వారా మాత్రమే సమాచారం ఇస్తున్నారు. అయితే సరోగసీ ప్రక్రియ ఏదీ నిర్వహించడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకున్న దళారుల ద్వారా నిరుపేద గర్భవతుల్ని గుర్తించి వారి భర్తలతో సంప్రదింపులు జరుపుతున్నారు. పుట్టిన శిశువును తమకు విక్రయిస్తే నగదు ఇస్తామంటూ ఒప్పందాలు చేసుకుంటున్నారు. ప్రసవ సమయానికి మహిళల్ని తామే తీసుకువెళ్లి డెలివరీలు చేస్తున్నారు. ఒక ప్రాంతానికి చెందిన వారిని మరో ప్రాంతానికి తరలించి ఈ తంతు పూర్తి చేస్తున్నారు. ఆ సమయంలోనూ సిజేరియన్ సహా మరికొన్ని ఖర్చులు అయ్యాయంటూ ఒప్పందం చేసుకున్న వారి నుంచి మరికొంత గుంజుతున్నారు. వేరే వారికి పుట్టిన శిశువును ఆయా జంటలకు సరోగసీ బిడ్డగా అప్పగిస్తున్నారు. ఇలా ఒక్కో కేసుకు రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

ఎవరైనా ప్రశ్నిస్తే రంగంలోకి నమ్రత కుమారుడు

ఈ దందాలో ఎవరికైనా, ఏదైనా అనుమానం వచ్చి ప్రశ్నిస్తే.. ‘సృష్టి’ప్రాంగణంలో లీగల్ ఆఫీస్ నిర్వహిస్తున్న నమ్రత కుమారుడు, న్యాయవాది జయంత్ కృష్ణ రంగంలోకి దిగుతాడని తెలిసింది. ఈ వ్యవహారంలో మీదీ నేరమే అని, విషయం బయటకు వస్తే అంతా అరెస్టు అవుతారని చెప్పి భయపెడతాడని, సెంటర్ ఆర్థిక లావాదేవీలను ఇతడే పర్యవేక్షిస్తుంటాడని తెలిసింది. కాగా తన పేరుతో ఈ సెంటర్ నడుస్తున్నట్లు సూరి శ్రీమతికి తెలుసా? లేదా? అనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. ‘సృష్టి’బారినపడి మోసపోయిన వాళ్లు ఉంటే తమకు ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.

శిశువు పోలికలపై అనుమానంతో..

సికింద్రాబాద్‌లో నివసించిన రాజస్తాన్ జంటను నమ్రత ఇలానే మోసం చేశారు. శిశువు పోలికలపై అనుమానం వచ్చిన దంపతులు నమ్రతను నిలదీయగా సరైన సమాధానం రాలేదు. దీంతో ఢిల్లీలో డీఎన్‌ఏ టెస్టులు చేయించుకోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సరోగసీ పేరుతో తమ వద్ద రూ.30.25 లక్షలు తీసుకున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదైంది. దీంతో నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సాయంతో దాడులు చేసిన గోపాలపురం పోలీసులు.. నమ్రత, జయంత్ కృష్ణ, విశాఖ బ్రాంచ్ మేనేజర్ సి.కళ్యాణి, టెక్నీషియన్ జి.చిన్నారావు, సదానందం, దళారి డి.సంతోషి, అసోం నుంచి వచ్చి నగరంలో నివసిస్తున్న సదరు శిశువు తల్లిదండ్రులైన మహ్మద్ అలీ ఆదిక్, నస్రీన్ బేగంలను అరెస్టు చేశారు. ‘సృష్టి’నుంచి సేకరించిన రికార్డుల ఆధారంగా మరో 50 మందిని నిందితులుగా గుర్తించారు. వీరికోసం గాలిస్తున్నారు. ఫిర్యాదు చేసిన జంట నుంచి శిశువును స్వాధీనం చేసుకున్న పోలీసులు శిశు విహార్‌కు తరలించారు.


సినారె సాహిత్య పురస్కారాలను అందుకున్న కవులతో జస్టిస్ లక్ష్మణ్, సిధారెడ్డి

తెలుగు సాహిత్యంపై చెరగని సంతకం సినారె

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్

భువనగిరి: తెలుగు సాహిత్యంపై డాక్టర్ సి.నారాయణరెడ్డి రచనలు చెరగని సంతకంలాంటివని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్ అన్నారు. ఆదివారం భువనగిరి పట్టణంలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో కవి సి. నారాయణరెడ్డి 94వ జయంతిని పురస్కరించుకుని జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సినారె సాహిత్య పురస్కార ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ లక్ష్మణ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో సినారె తనదైన విశిష్టతను సొంతం చేసుకున్నారని కొనియాడారు. తెలంగాణ భాషకు సాహిత్య గౌరవాన్ని తీసుకువచ్చిన ఘనత సినారెకే దక్కుతుందని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. సినారె తెలంగాణ భాషా సాహిత్యంపై సాధికారతను సాధించి, తర్వాత తరం కవులకు మార్గదర్శకులుగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 11 మందికి సినారె సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు.

కంప్యూటర్స్‌పై కోటి ఆశలు

▶ మొదటి పేజీ తరువాయి

ఆప్షన్లు పెద్దగా మార్చుకోలేదు. అయితే వర్సిటీల్లో సివిల్, ఈఈఈ వంటి కోర్ గ్రూపుల్లో సీట్లు వచ్చిన చాలామంది ప్రైవేటు కాలేజీల్లో ఎమర్జింగ్ గ్రూపుల్లో సీట్ల కోసం ఆప్షన్లు ఇచ్చారు. కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటా కలిపి మొదటి విడత కౌన్సెలింగ్ నాటికి 1,07,444 సీట్లు ఉంటే, రెండో విడత నాటికి కంప్యూటర్ బ్రాంచీలతో పాటు కోర్ గ్రూపుల్లో పెరిగిన 9,433 సీట్లను పరిగణనలోకి తీసుకుంటే ఇంజనీరింగ్‌లో మొత్తం 1,16,877 సీట్లు ఉన్నట్టయింది.

జడ్జిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగోపాల్

ప్రధాన కార్యదర్శిగా కె.మురళీమోహన్ ఎన్నిక


రాజగోపాల్


మురళీమోహన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ న్యాయమూర్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి జి.రాజగోపాల్, ప్రధానకార్యదర్శిగా కె.మురళీమోహన్ ఎన్నికయ్యారు. 2025–27 కాలపరిమితికిగాను సంఘం ఎన్నికలు జూలై 19న జరగ్గా, ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఫలితాలను హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి(ఎన్నికల అధికారి) ఎస్. శశిధర్‌రెడ్డి వెల్లడించారు. అధ్యక్షుడిగా రాజగోపాల్, ప్రధానకార్యదర్శిగా కె.మురళీమోహన్, ఉపాధ్యక్షులుగా డి.దుర్గాప్రసాద్, జి.వేణు, పి.లక్ష్మీశారద, అదనపు కార్యదర్శులుగా సీహెచ్.సంపత్, పీ.శ్రీదేవి, ఎం.రాజు ఎన్నికయ్యారు మహిళా ప్రతినిధిగా జే.మైత్రేయి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా జే.ఉపేందర్‌రావు, గౌస్‌పాషా, కల్పన, గోపీకృష్ణ, పూజ, హిమబిందు, సాయికిరణ్, శ్యామ్‌ప్రసాద్, శివనాయక్, అసదుల్లా షరీఫ్, అరుణ్‌కుమార్, కుష్బూ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

ఐదు జిల్లాల్లో ఇంకా లోటే!

▶ మొదటి పేజీ తరువాయి

వర్షాలు మోస్తరుగా కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

అక్కడ ఇంకా లోటే...

సీజన్ ప్రారంభం నుంచి దాదాపు ఆరువారాల వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రాష్ట్రంలో సగటు వర్షపాతం తీవ్ర లోటులో ఉంది. గతవారం రోజులుగా కురిసిన వర్షాలతో వర్షపాత గణాంకాలు అమాంతం పైకిలేచాయి. అయినా, ఐదు జిల్లాల్లో ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది.

- మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, జనగామ జిల్లాల్లో 20% పైబడి లోటులో ఉన్నట్టు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. లోటు వర్షపాతం ఉన్న మండలాల్లోఅత్యధికం ఉత్తర ప్రాంత జిల్లాల్లోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు పంటల సాగుపై తీవ్ర ప్రభావాన్నే చూపనున్నాయి.
- సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 20శాతం పైబడి వర్షాలు కురవడంతో ఆయా జిల్లాలు అధిక వర్షపాతం కేటగిరీలో ఉన్నాయి.
- మిగిలిన 23 జిల్లాల్లో వర్షపాత గణాంకాలు సాధారణ స్థితిలో నమోదయ్యాయి.

వర్షపాత గణాంకాలు ఇలా..

లోటు:	సాధారణం:	అధికం:
132 మండలాలు	339 మండలాలు	131 మండలాలు

అత్యధికం: 132 మండలాలు

నేడు.. రేపు తేలికపాటి వానలు

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు తేలికపాటి వర్షాలు నమోద వుతాయని వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం రుతుపవన ద్రోణి బికనీర్, కోట, వాయవ్య మధ్యప్రదేశ్ దాని పరిసరాల్లో కొనసాగుతోంది. దీని ప్రభావం రాష్ట్రంపై పెద్దగా లేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రానికి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయి. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు, ఒకట్రెండు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని అధికారులు చెబుతున్నారు. ఉత్తర ప్రాంత జిల్లాల్లోని కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

జైపాల్‌రెడ్డి ఉన్నత శిఖరం: సీఎం

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ పార్లమెంటేరియన్, మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు నివాళులర్పించారు. రాష్ట్ర, దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి ఒక ఉన్నత శిఖరమని సీఎం అభివర్ణించారు. జైపాల్ రెడ్డి ఆశయాలు, ఆకాంక్షలను ముందుకు తీసుకుపోవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు.

మధ్యప్రదేశ్ జలపాతంలో ఇద్దరు హైదరాబాద్ విద్యార్థులు గల్లంతు

సెహోర్: మధ్యప్రదేశ్‌లోని సెహోర్ జిల్లాలో ఉన్న జలపాతంలోకి దిగిన ఇద్దరు హైదరాబాద్ విద్యార్థులు గల్లంతయ్యారు. బెరుఖో జలపాతం వద్ద ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. కొత్రి ప్రాంతంలో ఉన్న వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఐదుగురు విద్యార్థులు ఖియోనీ సాంక్చువరీకి పిక్నిక్ కోసం వచ్చారు. వీరిలో హైదరాబాద్‌కు చెందిన హేమంత్ రావ్, సిన్మయ్(20) జలపాతంలోకి దిగి గల్లంతయ్యారు. మిగతా ముగ్గురు విద్యార్థులు ఇది గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. అప్పటికే చీకటి పడటంతో సహాయక చర్యలను చేపట్టడం వీల్లేకుండాపోయింది. సోమవారం ఉదయం వారి కోసం అన్వేషణ మొదలుపెడతామని పోలీసులు తెలిపారు.

మహంకాళి అమ్మవారికి పీవీ సింధు బంగారు బోనం



చాంద్రాయణగుట్ట: చారిత్రక ప్రసిద్ధి చెందిన లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు బంగారు బోనం సమర్పించారు. ఆలయంలో ఆదివారం మారు బోనం సమర్పణ కార్య క్రమం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన అనంతరం పీవీ సింధు కుటుంబసభ్యులతో వచ్చి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీవీ సింధు మాట్లాడుతూ.. లాల్‌దర్వాజా అమ్మవారు అంటే తనకు ఎంతో భక్తి అని, ప్రతి సంవత్సరం అమ్మవారిని దర్శించుకోవడానికి వస్తూ ఉంటానని తెలిపారు.

కేసీఆర్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్

మాజీ ఎంపీ సంతోష్‌కుమార్

కీసర: కేసీఆర్ స్ఫూర్తితో గ్రీన్ ఇండియా చాలెంజ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి ఏడేళ్లలో 20 కోట్లకు పైగా మొక్కలను నాటినట్లు సంస్థ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ చెప్పారు. ఆయన ఆదివారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ 8వ ఎడిషన్ లోగోను ఆవిష్కరించారు. అంతకుముందు మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డి కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరస్వామి సేవలో పాల్గొన్నారు.



గ్రీన్ ఇండియా చాలెంజ్ 8వ ఎడిషన్ లోగోను ఆవిష్కరిస్తున్న సంతోష్‌కుమార్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

సీపీఎస్ రద్దు కోసం 1న మహాధర్నా

సిద్ధమవుతున్న పీఆర్‌టీయూటీఎస్ శ్రేణులు


శ్రీపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలనే డిమాండ్‌తో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టేందుకు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. ఈ అంశంపై ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఆదివారం పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డితో కలిసి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీపీఎస్ రద్దు కోరుతూ తమకు అందుతున్న వినతిపత్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తున్నా స్పందన లేకపోవడంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. సెప్టెంబర్ 1న విద్రోహ దినం పేరుతో హైదరాబాద్‌లో మహాధర్నా చేపట్టాలని తీర్మానించారు. దీనికన్నా ముందు జిల్లా పర్యటనలు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్లు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. సీపీఎస్ రద్దును ఉపాధ్యాయులతోనే ఆపకుండా ఇతర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలతోనూ సమన్వయం చేసుకొనే యోచన చేస్తున్నామని ఆయన ‘సాక్షి’కి తెలిపారు. ఈ విషయంలో ఎలాంటి ఒత్తిడి వచ్చినా ఉపాధ్యాయుల పక్షాన నిలబడతానని చెప్పారు.



అంతః దృష్టితో ప్రకృతి యొక్క పరమసత్యాన్ని స్వానుభవంతో తెలుసుకుంటూ మనసు యొక్క నిర్మలతను వృద్ధి చేసుకోవటం ద్వారా కలిగిన మనోబలంతో ఒక వ్యక్తి అనేకమంది మేలుకోసం ఎన్నో పనులు చేయగలుగుతాడు.

– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి

సోమవారం, 28 జూలై 2025

వాదం - అనువాదం

స్వతంత్ర రచయితా, అనువాదకుడా – ఎవరు గొప్ప అని ప్రశ్నిస్తే; ఎవరైనా స్వతంత్ర రచయితే నంటారు, రచయిత లేకుండా అనువాదకుడు ఉండనే ఉండడు కనుక ఎప్పుడైనా స్వతంత్ర రచయితదే ప్రథమ స్థానం. 'అనువాద' మనడంలోనే ఆ సూచన ఉంది. 'ఒకరు చెప్పిన దానిని వేరొక భాషలో తిరిగి చెప్పడ'మని ఆ మాటకు వ్యుత్పత్త్యర్థం. క్రియలో చూస్తే, అనువాదకుడు స్వతంత్ర రచయితకు సమవుజ్జీ అనే కాక, కొన్ని విషయాల్లో అతణ్ణి మించగలడని కూడా అనిపిస్తుంది. అయినాసరే, మూల రచనను అందించిన స్వతంత్ర రచయితదే ప్రథమ స్థానమూ, అనువాదకుడిది ద్వితీయస్థానమేనంటారా; అనువాదకుడిది మరీ తక్కువ స్థానమేమీ కాదని గుర్తిస్తే చాలు!

స్వతంత్ర రచనా, అనువాదమూ సృష్టీ, పునఃసృష్టి లాంటివి. సృష్టి గొప్పదా, పునఃసృష్టి గొప్పదా అంటే; దేని గొప్ప, దేని కష్టాలు, దేని సౌలభ్యాలు దానికే ఉన్నాయి. సృష్టిలో సృజనశక్తి కీలకమవుతుంది కనుక ఆ మేరకు దాని స్థానం దానిదే, ఎంతైనా అనువాదం అనుసృజన మాత్రమే. అయితే సృష్టిలో ఉన్న ఒక సౌలభ్యమేమిటంటే, అది ఇంకొకదాన్ని అనుసరించాల్సిన అవసరం లేదు కనుక, ఏది ఎలా ఉండాలో, ఎంతవరకు ఉండాలో నిర్ణయించుకునే అపరిమిత స్వేచ్ఛ దానికుంటుంది. అనువాదకునికి లేనిదదే; మూలరచన విధించిన హద్దులకు లోబడే తన అనుకృతిని తీర్చి ఒప్పించి మెప్పించవలసిందే. ఆ కోణంలో, అనువాదమనేది నెత్తిమీద కలశాలను పెట్టుకుని, పళ్ళెం అంచుల మీద చేసే నృత్య విశేషం లాంటిదైతే, మూలరచన నిర్నిబంధ, స్వేచ్ఛానర్తనం.

అనువాదమంటే ఒక భాష నుంచి ఇంకొక భాషలోకి తేవడమే కదా అనుకుంటాం; అందుకూ కొంత నేర్పూ, శ్రమా అవసరమే కానీ, ఇటీవలి కాలంలో కృత్రిమ మేధ దానిని మరింత సులభతరం చేసిందని కూడా అనుకుంటున్నాం. అయితే, అనువాదమంటే కేవలం భాషానువాదమే కాదన్న సంగతి అనువాదంలోకి తలదూర్చితేనే అర్థమవుతుంది. భాషానువాదం పైకి కనిపించే తొలిమెట్టు మాత్రమే; దానికి పైన కనిపించని మెట్లు చాలా ఉంటాయి. వాటిని కూడా మనోనేత్రంతో దర్శించి వాటి మీదుగా తన అనుకృతిని చివరి మెట్టు దాకా ఒడుపుగా నడిపించి మూలాన్ని మరిపించడంలోనే అనువాదకుడి ప్రతిభ పండుతుంది. అంటే, అతను భాషనే కాక మూలరచయిత శైలీ, శిల్పం, భావం సహా సమస్త రచనాంగాలనూ అనువదిస్తాడు; అంతిమంగా మూలరచయిత హృదయాన్నీ, మేధనూ అనువదిస్తాడు; అలా తనే మూల రచయిత అయిపోతాడు. ఇది మాంత్రికులు చెప్పే పరకాయ ప్రవేశానికేమాత్రం తక్కువ కాదు. ఎంత కృత్రిమ మేధ అందుబాటులోకి వచ్చినా ఈ సహజ మేధకు ప్రత్యామ్నాయమవుతుందా అన్నది సందేహమే.

ఇంతకీ సారాంశమేమిటంటే, మూల రచయితది ఏకపాత్రాభినయమైతే, అనువాదకుడిది ద్విపాత్రాభినయం; అతని(లేదా ఆమె)లో అనువాదకుడు, మూల రచయితా ఇద్దరూ ఉంటారన్న మాట. అలా చూసినప్పుడు ప్రతిభలో అనువాదకుడు మూల రచయితకు దాదాపు సమానుడవుతాడు; అదే అతను పడే పరిశ్రమకు వస్తే, అది ద్విగుణితమూ, త్రిగుణితమూ కూడా అవుతుంది. ఆ విధంగా, స్వతంత్ర రచయిత ప్రథమ గణ్యుడే కానీ, అనువాదకుడు అగస్త్య భ్రాతేమీ కాదు.

ఆధునిక కాలానికి వస్తే, దేశీయంగా, విదేశీయంగా కూడా బహు భాషా సాహిత్యాలు, సాహిత్య ప్రక్రియలతో పరిచయం పెరిగి, అనువాద రంగం బహుముఖాలుగా అభివృద్ధి చెందడం చూస్తున్నాం. కాకపోతే, అనువాదంలో మెళకువలు, ప్రమాణాలు, ఎదుర్కొనే క్లిష్టతా మొదలైన విషయాల్లో ప్రాచీనులు, ఆధునికుల అవగాహనలో పెద్ద తేడా లేకపోవడం ఒక విధంగా ఆశ్చర్యకరమే. అసలు తెలుగు సాహిత్యం నన్నయ భారతానువాదంతో ప్రారంభమవడమే ఒక విశేషమనుకుంటే, అనువాదంలోని క్లేశాన్ని గుర్తించి చెప్పిన తొలి అనువాదకుడు కూడా నన్నయే కావడం మరో విశేషం. అనువాదమంటే కేవలం భాషానువాదం కాదు కనుకనే, 'గహనమైన అర్థాలనే జలాలతో నిండిన భారతమనే మహాసముద్రాన్ని చివరిదాకా ఈదడం బ్రహ్మకైనా సాధ్యమవుతుందా? అయినా నాకు చేతనైన మేరకు ప్రయత్నిస్తా'నని చెప్పుకుని ముందే జాగ్రత్తపడతాడు. ఆ ఒరవడిలోనే తిక్కన, 'నా నేర్చిన భంగి చెబుతా'నంటూనే, మహాభారత మూలకర్త వ్యాసమహర్షిని మనసునిండా నిలుపుకొని మరీ ముందుకెడతానంటాడు. నన్నయ మిగిల్చిన అరణ్య పర్వ శేషాన్ని పూరించిన ఎఱ్ఱాప్రగడ అయితే, అనువాదంతోపాటు, అచ్చం నన్నయలానే రచించాలనే మరో సవాలును మీదేసుకుంటాడు. భట్ట హర్షుని 'నైషధ' కావ్యాన్ని 'శృంగార నైషధము' పేరిట అనువదిస్తూ శ్రీనాథుడు నిర్దేశించిన ప్రమాణాలు త్రికాలాలలోనూ శిరోధార్యాలే. 'శబ్దాన్ని అనుసరించి, అభిప్రాయాన్ని గుర్తించి, భావాన్ని ఉపలక్షించి, రసాన్ని పోషించి, అలంకారాన్ని భూషించి, ఔచిత్యాన్ని ఆదరించి, అనౌచిత్యాన్ని పరిహరించి మూలానుసారంగా రచిస్తా'నంటాడాయన.

అలా 'మూలానుసారంగా' అనువదించడం కూడా ఒక సార్వకాలికమైన ప్రాథమిక విధేననుకుంటే, 'స్వేచ్ఛానువాదం', 'సంక్షిప్తానువాద' మనేవి మూలాతిక్రమణలే కావచ్చు; సరే, అది వేరే ముచ్చట. ఏ రెండు భాషల నిర్మాణమూ ఒకేలా ఉండాలని లేదు కనుక ఒక్కోసారి మూలం నుంచి పక్కకు జరగడమూ అనివార్యమవుతుంది, నిజమే కానీ, అలాంటివి మినహాయింపులు మాత్రమే, నిబంధన మాత్రం మూలానుసరణమే! అసలు దేనికైనా తప్పనిసరి ముడిసరకు ప్రతిభే అనుకున్నప్పుడు స్వతంత్రమా, అనువాదమా అన్న చర్చ పక్కకు తప్పుకుని అనువాదమే స్వతంత్ర రచనలానూ భాసించవచ్చు.

వాళ్లకు న్యాయం చేయడం ఎలా?



కామెంట్

కరణ్ థాపర్

మన ప్రజాస్వామ్యం ఎన్నో విధాలుగా మనకు గర్వకారణం. అందుకు విరుద్ధంగా భావించడానికి కూడా అన్ని విధాలుగా ఆస్కారం ఉంది. మన వైఫల్యాల జాబితా చిన్నదేం కాదు. గత వారమే ఈ జాబితాలో మరో భయానక వాస్తవం చోటు చేసుకుంది. మన సమష్టి మనస్సాక్షిపై దీని ప్రభావం సంవత్సరాల తరబడి అలా ఉండిపోతుంది. ఇది అంత తేలిగ్గా మానే గాయం కాదు. ఈ అపరాధ భావన మనల్ని ముమ్ముందు కూడా వేధిస్తూనే ఉంటుంది. దీన్నుంచి బయటపడేందుకు మనం ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అంత కష్టపడగలమా? అసలు అలా కష్టపడేందుకు మనం సిద్ధంగా ఉన్నామా? ఇది మరీ ముఖ్యమైన ప్రశ్న.

పన్నెండు మంది(ఇందులో ఒకరు ఇప్పటికే మరణించారు) సాటి పౌరులు వారు. న్యాయం పొందడానికి మీకూ నాకూ ఎంత హక్కు ఉందో... వారికీ అంతే ఉంది. కానీ ఏం జరిగింది? నేరం చేశారంటూ అభియోగాలు ఎదుర్కొన్నారు. దోషులుగా తొలుత 'నిరూపణ' జరిగింది. 19 సంవత్సరాలు జైల్లో గడిపారు. నిర్దోషులు అయ్యుండీ 'శిక్ష' అనుభవించారు. మనం వారిని పట్టించుకోలేదు. వారి దుస్థితిని మర్చిపోయాం. వారి ఖర్మకు వారిని వదిలేశాం. నిన్న మొన్న హైకోర్టు తీర్పు వచ్చేవరకూ ఇదే జరిగింది.

చెదిరిన భ్రమలు

ఎట్టకేలకు బాంబే హైకోర్టు తీర్పు వెలువడింది. అప్పుడు గానీ వారు జైలు నుంచి విడుదల కాలేదు. ఇది మనకు సిగ్గుచేటు. ''నిందితుల మీద మోపిన కేసును నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైంది. నిందితులు నేరం చేశారని నమ్మడం కష్టం.'' మనం తలలు దించుకోడానికి ఈ ఒక్క మాట చాలదా? (ఈ తీర్పు మీద ప్రస్తుతానికి సుప్రీంకోర్టు స్టే ఇచ్చినా, విడుదలైనవారిని తిరిగి జైలుకు రప్పించబోమని వ్యాఖ్యానించింది.)

హైకోర్టు తీర్పు అక్కడే ఆగిపోలేదు. వారిపై మోపిన అభియోగాల నిరూపణ సవ్యంగా, సక్రమంగా జరిగిందని మనం అనుకున్నాం. న్యాయం పట్ల మనం ఎంతో నమ్మకం ఉంచాం. అయితే, మన భ్రమలను ఈ తీర్పు పటాపంచలు చేసింది. ''కేసును మోసపూరితంగా క్లోజ్ చేయడం వల్ల ప్రజల విశ్వాసం దెబ్బ తిన్నది.''

సరే, ఇప్పుడు మనం ఏం చేయగలం? ఈ పన్నెండు మందికి ఎలా ఊరట కలిగించగలం? అసలు ఈ పని మన వల్ల అవుతుందా?



◆ ముంబయి రైలు బాంబు పేలుళ్ల నిందితులైన ఆ పన్నెండు మంది (ఇందులో ఒకరు ఇప్పటికే మరణించారు) 19 సంవత్సరాలు జైల్లో గడిపారు. నిర్దోషులు అయ్యుండీ 'శిక్ష' అనుభవించారు. వారికి ఎలా ఊరట కలిగించగలం? వారు జీవితంలో రెండు దశాబ్దాలు కోల్పోయారు. ఇరవై ఏళ్ల పాటు వారిని తల్లితండ్రులకు, పిల్లలకు, కుటుంబానికి, మిత్రులకు దూరం చేశాం. కోల్పోయిన ఆ జీవితం ఎప్పటికైనా తిరిగొస్తుందా? మరి దానికి ఏది సరైన పరిహారం అవుతుంది? ప్రభుత్వం తరఫున లోతైన క్షమాపణ? శేష జీవితం సుఖంగా గడపడానికి ఆర్థిక సాయం?

వారు జీవితంలో రెండు దశాబ్దాలు కోల్పోయారు. వాటిని ఎప్పటికీ తిరిగి ఇవ్వలేం. ఇరవై ఏళ్ల పాటు వారిని తల్లితండ్రులకు, పిల్లలకు, కుటుంబానికి, మిత్రులకు దూరం చేశాం. కోల్పోయిన ఆ జీవితం ఎప్పటికైనా తిరిగొస్తుందా? దీనికి ప్రాయశ్చిత్తం ఉంటుందా? నాకు తెలియదు. కానీ మనం ఏదైనా చేయాలి.

క్షమాపణ చెప్పకూడదా?

చేతులు ముడుచుకుని కూర్చోకూడదు. ఎక్కడో ఒక దగ్గర మొదలు పెట్టాలి. కాబట్టి ముందుగా మనం క్షమాపణ చెప్పాలి. ఆ క్షమాపణ లోతైనదిగా ఉండాలి. బేషరతుగా చెప్పాలి. దాన్ని బాహాటంగా ప్రకటించాలి. ఇక్కడ మనం అంటే... ఎవరు? అభియోగాలు మోపి, తప్పుడు సాక్ష్యాలతో వారిని ఇరికించిన పోలీసులా? కేసును అన్యాయంగా 20 ఏళ్లు నడిపించిన న్యాయవ్యవస్థ కూడానా? విచారణ ఆరంభ దశలోనే 9 ఏళ్లు గడచిపోయాయి. తర్వాత హైకోర్టు స్థాయిలో వాద ప్రతివాదాలు వినకుండానే, ఈ కేసు మరో 9 సంవత్సరాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడేలా పడి ఉంది. గత ఏడాదే కేసులో కదలిక వచ్చింది. వారి సహ పౌరులమైన మనం సైతం పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పాల్సిన వారిలో ఉంటామా? ఉంటే, ఆ మనం- అంటే మీరు, నేను, ఈ విశాల సమాజం- తరఫున మాట్లాడే వారెవరు? కచ్చితంగా ప్రభుత్వమే కదా? మనం అనుకుంటున్నట్లు ప్రభుత్వంలోని వారు మనకు ప్రాతినిధ్యం వహిస్తూ ఉంటే, వారి మీదే ఈ బాధ్యత ఉంటుంది.

అయితే, క్షమాపణ సరిపోతుందా? ఇప్పటి వరకూ అనుభవించిన క్షోభను పూర్తిగా తొలగించలేక పోయినా, ఈ చర్య ఆ 12 మంది బాధను కొంతైనా తగ్గిస్తుంది. ఇంకా ఏం చేయగలం? నాతో ప్రతి ఒక్కరూ ఏకీభవిస్తారో లేదో చెప్పలేను కానీ, దీనిపై నాకంటూ స్పష్టంగా ఒక అభిప్రాయం ఉంది. దాన్ని మీతో పంచుకుంటాను. ఏకీభవించాలో లేదో మీరో నిర్ణయించుకోండి. కానీ, ముందు నా అభిప్రాయాన్ని జాగ్రత్తగా పరిశీలించండి.

కొత్త జీవితానికి ఆర్థిక పరిహారం

ఇతరత్రా ఎలా ఉన్నా ఆర్థికంగా అన్నా ఇబ్బందులు లేకుండా వారు తమ శేష జీవితం సుఖంగా గడిపేలా చూడటం మన బాధ్యత. కాబట్టి ఆ మేరకు వారికి ఆర్థిక పరిహారం అందించాలి. ఇది సరిపోతుందని కాదు. మనం అండగా ఉన్నామని చెప్పడానికైనా ఈ సుహృద్భావ చర్య తోడ్పడుతుంది. సంతోషంగా కొత్త జీవితంలోకి అడుగు పెట్టేందుకు వారికి ఒక అవకాశం ఇద్దాం. బతుకు పుస్తకంలో ఒక పేజీ తిప్పడానికి సరికొత్త అధ్యాయం ప్రారంభించడానికి మనం సహాయపడదాం.

అలా చేస్తామా? మనకు, మన విలువలకు ఇదొక పరీక్ష. వ్యవస్థల కర్కశత్వానికి గురై నలిగిపోయిన సాటి పౌరుల పట్ల మనం నిబద్ధతతో ఉండాలి. వారి గురించి ఆందోళన చెందాలి. సమైక్య సమాజంగా, ఒక దేశంగా కొనసాగాలంటే మనం ఇప్పుడే స్పందించాలి. లేనట్లయితే, దెబ్బతింటాం. అద్దంలో చూసుకునే మన ముఖం మన ఒక్కరిదే కాదు, సమష్టిగా మన అందరిదీ! ఆ ప్రతిబింబం ఆహ్లాదకరంగా, భరోసా ఇచ్చేదిగా ఉండాలి. మరోలా కాకుండా అది అలానే ఉండటం మన మీదే ఆధారపడి ఉంది.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

మలుచుకోగలిగే జ్ఞాపకాలు



మీరు జీవిత క్షణాల్ని జ్ఞాపకాలుగా మలుచుకోవడానికి ప్యారిస్‌కో, లాస్ వెగాస్‌కో ప్రయాణించనక్కర్లేదు. ఇంట్లో ఉంటూ కూడా ఏదో ప్రత్యేకంగా, భిన్నంగా చేయొచ్చు. జీవిత క్షణాల్ని దాచుకోగలిగేలా చేయగలిగే కొన్ని చిన్న వస్తువులను కొనడానికి డబ్బు పని కొస్తుంది. చిట్టచివరగా జీవితమంటేనే – కొన్ని మంచి, చెడు జ్ఞాపకాల దొంతర. వీలైనన్ని మంచి జ్ఞాపకాలను పోగేసుకోండి.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

డబ్బులా? ప్రభుత్వోద్యోగమా?



ఇలా చెబితే అందరికీ నచ్చకపోవచ్చు. కానీ యూపీఎస్సీ, ఎస్సెస్సీ, బ్యాంక్ పీఓలు, ఇంకా ఇతర ప్రభుత్వోద్యోగాల పరీక్షల్లో ఉత్తీర్ణులు కాగలిగే తెలివైన మెదళ్లు నిజానికి ప్రభుత్వోద్యోగంలోకి వెళ్లకపోతేనే సులభంగా ఏడాదికి 50 లక్షలు సంపాదించగలిగే శక్తి ఉన్నవి.

– ముదిత్ గుప్తా, యూట్యూబ్ టీచర్

స్వీయ విమర్శ ముఖ్యం!



మన బలహీనతల పట్ల గుడ్డిగా ఉన్నట్టు నటించడం మన అతిపెద్ద లోపం. కానీ అదే ఇంకెవరో ఏదైనా తప్పుచేస్తే వెంటనే వారి గొంతు పట్టుకుంటాం. ఎదుటివాళ్ల వైపు ఎప్పుడూ వేలెత్తి చూపడం కాకుండా స్వీయ విమర్శ చేసుకోవడం నేర్చుకోవాలి. తీర్పులు ఇవ్వడాన్ని అందరికంటే న్యాయమైన తీర్పరికి వదిలేద్దాం!

– ముఫ్తి మెంక్, ఆధ్యాత్మిక గురువు

అక్కడికే!



మీరు సరైన మార్గంలోనో, ఇంకో మార్గంలోనో ఎలా దేవుడిని ప్రేమించినా మీరు చివరికి స్వర్గానికే చేరుకుంటారు. వెళ్లడానికి ఇంకో చోటే లేదు.

– నీల్ డోనాల్డ్ వాల్ష్, రచయిత

మిన్ను విరిగి మీదపడ్డా...



నా భౌతిక ఆరోగ్యమే నా మొట్టమొదటి ప్రాధాన్యం. నాకు టైము లేదని ఎప్పుడూ అనుకోను. వ్యాయామం చేయకుండా నా రోజును మొదలుపెట్టను. ఒకవేళ ప్రపంచం ఇంకోవైపు కూలిపోతుందని తెలిసినా సరే, నా వ్యాయామం ముగిసేవరకు అది ఇంకో 45 నిమిషాలు ఆగుతుందని అనుకుంటాను.

– పౌజన్ సామ్యూల్, అల్ట్రా రన్నర్

జంట చెట్లు



నాలిగింటికి లేచాను. 'మినూ' వైపు మంచం ఖాళీగా కనబడి భయాందోళనకు గురయ్యాను. ఆమె పెళ్లికి వెళ్లిందని గుర్తొచ్చింది. కానీ ఒక ఆలోచన గట్టిగా తగిలింది. ఏదో ఒకరోజు మాలో ఒకరం ముందుగా వెళ్లిపోతాం. 35 ఏళ్లుగా కలిసి బతికిన తర్వాత, మేము వేర్లు చుట్టుకుపోయిన చెట్లలా మారిపోయాం.

– సందీప్ మాల్, రచయిత


ఉత్తినే తీసేశారు!



నాకు ఢిల్లీలో ఈమధ్య బిహారీలు ఎదురవుతున్నారు. వీళ్లందరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లు పొరపాటుగా లేకుండా పోయినవాళ్లే! దానిక్కారణం పెద్దగా ఏమీలేదు. అధికారులు ఓటర్ల జాబితా సవరణకు వచ్చినప్పుడు వీళ్లంతా ఇక్కడ పనిచేస్తున్నారు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అంతుచిక్కని భూమ్యాకర్షణ శక్తి!



సైన్స్ టుడే

డా‌॥ సి.వి. సర్వేశ్వర శర్మ

భూమ్యాకర్షణ శక్తి కారణంగానే మొక్కలు ఎదుగుతున్నాయి. మనం నేల మీద నడవగల్గుతున్నాం. ఈ శక్తి వలననే సమస్త జంతుజాలానికి ఒక భౌతిక రూపం ఏర్పడుతోంది. కానీ ఈ శక్తి ఎలా ఏర్పడుతున్నది? ఈ విషయంపై ఇంతవరకు ఎవరికీ సంతృప్తికరమైన జవాబు దొరకలేదు.

ఈ శక్తి ఎలా ఏర్పడుతున్నదో తెలిస్తే దానిని అదుపు చేయడం సాధ్యమౌతుంది. న్యూటన్ దీనిని గుర్తించి 300 ఏళ్ళు దాటినా ఇది ఇంకా పరిశోధన అంశంగానే ఉంది. కాంతికి, వేడికి శక్తి కల్గించే 'విద్యుదయస్కాంతత్వం', 'పరమాణు కేంద్రకాలను ఏకం చేసే కేంద్రక బలాలు', ' రేడియో ధార్మికతను' బలహీనపరిచే శక్తుల గురించిన సమాచారం శాస్త్రవేత్తలు తెలుసు కోగలిగారు. ఇన్ని విజయాలు సాధించిన శాస్త్రవేత్తలు భూమ్యాకర్షణ శక్తి రహస్యాలు తెలుసు కోవడంలో ఎటువంటి ప్రగతీ సాధించలేకపోయారు.

ఏ వస్తువునైనా సరే భూమి ఆకర్షిస్తుంది. ఈ ఆకర్షణ బలమే ఆ వస్తువు బరువు. ఈ ఆకర్షణ ఒక్క భూమికే కాదు, ప్రతి గ్రహానికీ ఉంది. ఈ 'గురుత్వాకర్షణ శక్తి' అనేది ప్రతి చోటా కనిపిస్తుంది. దీనినుండి ఎవరూ తప్పించుకోలేరు. ఇదొక ప్రకృతి శక్తి. భూమికి బాగా ఎత్తుగా అంతరిక్షంలోకి వెళ్ళినపుడు ఈ భూమ్యాకర్షణ శక్తి బాగా తగ్గిపోయి మనిషికి భార రహిత స్థితి వస్తుంది. పదార్థ నిర్మాణంలో ఉన్న అస్థిరత వల్ల రేడియో ధార్మిక పదార్థాలలో రేడియో ధార్మిక లక్షణం క్షీణిస్తుంది. అయితే భూమ్యాకర్షణ శక్తి అనేది భూమి అస్థిరత వల్ల వచ్చినది కాదు. భూమికి ద్రవ్యరాశి ఉన్నంత కాలం భూమ్యాకర్షణ శక్తి ఉంటుంది.

భూమి ద్రవ్యరాశి స్థిరంగా ఉండి దాని వ్యాసార్ధం తగ్గితే, అప్పుడు భూమి మీద ఉన్న వస్తువుకు, భూకేంద్రానికి మధ్యన ఉన్న దూరం తగ్గిపోతుంది. వీటి మధ్య దూరం తగ్గితే భూమ్యాకర్షణ బలం పెరుగుతుంది. భూ కేంద్రం వద్ద వస్తువును ఉంచితే దీనికి ఒక వైపున గల భూద్రవ్యరాశి దానిపై కలిగించే ఆకర్షణ బలాన్ని, రెండవ వైపుగల భూద్రవ్యరాశి దానిపై కలిగించే ఆకర్షణ బలాన్ని రద్దు చేస్తుంది. అందువల్ల భూకేంద్రం వద్ద ఉంచిన వస్తువుపై ఎటువంటి భూమ్యాకర్షణ బలమూ ఉండదు.

మన శరీరంలో రక్త ప్రసరణ నిరంతరం జరిగేందుకు రక్తాన్ని గుండె పంపు చేస్తూ ఉంటుంది. ఇది భూమ్యాకర్షణ బలానికి వ్యతిరేకంగా పని చేయాలి. భూమ్యాకర్షణ బలం తగ్గితే గుండె పని తగ్గుతుంది, ఫలితంగా శరీరంలో రక్త పోటు తగ్గుతుంది.

ఐన్‌స్టీన్ ఉద్దేశంలో భూమ్యాకర్షణ లేదా గురుత్వాకర్షణ ఒక శక్తి కాదు. దీనిని 'అంత



రిక్షంలో ఉండే పెద్ద గొయ్యి'తో పోల్చి చెప్పాడు. గొయ్యి చుట్టుపక్కల ఉండే వస్తువులన్నీ అటువైపు దొర్లుతూ అందులో పడిపోతాయి. ఆదేవిధంగా వస్తువులు గురుత్వాకర్షణ కారణంగా అటువైపు పడిపోతున్నాయని ఆయన వాదన. ఐన్‌స్టీన్ సైద్ధాంతిక శాస్త్రవేత్త మాత్రమేననీ, ప్రాయోగిక శాస్త్రవేత్త కాదనీ ఇతర శాస్త్రవేత్తలు ఆయన సిద్ధాంతాన్ని ఆమోదించలేదు.

అంతరిక్ష ప్రయోగాలు ఎన్నో విజయాలు సాధిస్తున్న ఈ తరుణంలో భూమ్యాకర్షణ రహస్యాలు బట్టబయలైతే దానిని అదుపు చేసే విధానాలు తెలుస్తాయి. అప్పుడు నీటిలో చేపపిల్లలు ఈదినట్లు మనం కూడా భూవాతావరణంలో తేలుతూ ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లవచ్చు.

వ్యాసకర్త పాపులర్ సైన్స్ రచయిత


మనుషులను కలిపేదే సాహిత్యం

'మనుషులను విడదీసేందుకు చాలా దారులు ఉన్నాయి. కానీ వారిని కలిపే పని సాహిత్యమే చేయగలదు. బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్‌ను నిర్వహించడం వెనుక ఈ సంకల్పమే ఉంది' అన్నారు సతీష్ చప్పరికె. గత సంవత్సరం మొదలై ఇకపై ప్రతి ఏటా నిర్వహించ తలపెట్టిన నాలుగు దక్షిణాది భాషల భారీ సాహిత్య సమ్మేళనం 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్' 2025 సంవత్సరానికిగాను బెంగళూరులో ఆగస్టు 8, 9, 10 తేదీల్లో జరగనుంది. ఈ సందర్భంగా ఈ ఫెస్టివల్ ఫౌండర్, సీనియర్ పాత్రికేయుడు సతీష్ చప్పరికెతో సంభాషణ:

గత సంవత్సరం బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్‌కు వచ్చిన స్పందన ఎలా అనిపించింది?

నాలుగు దక్షిణాది రాష్ట్రాల రచయితలను ఒకచోట చేర్చి, వారు ఒకరితో ఒకరు పరిచయమయ్యేలా, పాఠకులతో ఇంటరాక్ట్ అయ్యేలా చేసి, మనదైన సాహితీ వాతావరణం ఏర్పరచడమే ఈ లిటరేచర్ ఫెస్టివల్ ఉద్దేశం. దక్షిణాది రచయితలందరూ పాల్గొనే ఇలాంటి ఫెస్టివల్ ఇంతకు మునుపు లేదు. అందుకే గత సంవత్సరం మూడు రోజుల పాటు 36 వేల మంది హాజరైతే, వీడియో ప్రసారాలను 42 దేశాల్లో రెండున్నర లక్షల మంది తిలకించారు. ఇది చాలా పెద్ద స్పందన.

ఈ సంవత్సరం విశేషాలు ఏమిటి?



సతీష్ చప్పరికె

గత సంవత్సరం నాలుగు రాష్ట్రాల నుంచి 300 మంది రచయితలు పాల్గొంటే, ఈ సంవత్సరం 450 మంది పాల్గొంటున్నారు. ఐదు వేదికల మీద మూడు రోజుల పాటు నిరాటంకంగా సెషన్స్ జరుగుతాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు ఇంగ్లిష్‌లో సెషన్స్ ఉంటాయి. దక్షిణాదిలో పుట్టి ఇంగ్లిష్‌లో రాస్తున్న రచయితలను కూడా ఈసారి ఆహ్వానించాం. ఈసారి పాల్గొంటున్న వారిలో అదూర్ గోపాలకృష్ణన్, దామోదర్ మౌజో, శశి థరూర్, బాను ముష్తాక్, జయమోహన్, సచ్చిదానందన్, మను పిళ్లై తదితరులెందరో ఉన్నారు. మరో విషయం... ఈ ఫెస్టివల్‌లో రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు ఉండరు. ఇది పూర్తిగా సాహిత్య ఉత్సవం.

కన్నడ భాష నుంచి బాను ముష్తాక్ ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్ గెలిచారు. ఆమెకు ఏదైనా సత్కారం ఉంటుందా?

ఆమెను ఈ ఫెస్టివల్‌కు ఆహ్వానించి పాఠకులు ఆమెతో ముచ్చటించేలా చేయడమే మేము చేసే సత్కారం. ఒక రచయిత పాఠకులను కలవడం కంటే ఏం కావాలి!

మీరు ఆహ్వానించే రచయితలు ఏ ధోరణి సాహిత్యానికి ప్రతినిధులు?

మీ ప్రశ్న నాకు అర్థమైంది. మేము లెఫ్ట్ వింగ్ కాదు, రైట్ వింగ్ కాదు. ప్రజల తరఫున మాట్లాడే, సాహితీ వికాసం కోరే ప్రతి రచయితా మాకు మిత్రుడే.

ఈసారి తెలుగు నుంచి ఎవరెవరు ఆహ్వానం అందుకున్నారు?

గత సంవత్సరం 30 మందిని ఆహ్వానించాం. ఈసారి రచయితలు, పబ్లిషర్లు, పెర్ఫార్మర్లు దాదాపు 100 మంది వరకూ ఉంటారు. భాష ఒకటే అయినా రెండు రాష్ట్రాల నుంచి సమాన సంఖ్యలో ఆహ్వానించాం. ఈసారి ఆహ్వానం అందుకున్న వారిలో సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, బండి నారాయణ స్వామి, మధురాంతకం నరేంద్ర, కొలకలూరి ఇనాక్, పెద్దింటి అశోక్ కుమార్, షాజహానా తదితరులు ఉన్నారు. తగుళ్ల గోపాల్, బాల సుధాకర మౌళి తదితర యువ కవులను ఆహ్వానించాం. గతంలో వచ్చినవారు రిపీట్ కాకుండా ఉండాలని ప్రయత్నిస్తున్నాం. ఈసారి ఆహ్వానం అందుకోనివారు వచ్చే సంవత్సరం అందుకుంటారు. అందరూ ఏదో ఒక సంవత్సరం పాల్గొనాలనేదే మా కోరిక. వీరిని ఆహ్వానించడంలో అనువాదకుడు అజయ్ వర్మ అల్లూరి మాకు సహకరిస్తున్నారు.

లక్ష్యం ఏమిటి?


మన దక్షిణాది భాషల్లో గొప్ప రచయితలు ఉన్నారు, రచనలు ఉన్నాయి. ప్రపంచ భాషలకు ఏమాత్రం తగ్గని పుస్తకాలు ఉన్నాయి. వాటిని ప్రపంచ భాషల్లోకి అనువాదం చేయించడం బుక్ బ్రహ్మ లక్ష్యంగా పెట్టుకుంది. దక్షిణాది భాషల సాహిత్య సౌరభాన్ని దేశం ఎదుట సగర్వంగా నిలిపేందుకు ఈ ఫెస్టివల్ జరుగుతూనే ఉంటుంది. దీనికి ఎవరైనా ఉచితంగా రిజిస్టర్ చేసుకుని హాజరు కావచ్చు.

ఇంటర్వ్యూ: 'సాక్షి' ప్రతినిధి

ఎవరు చెప్పినా...

ఒకరోజు ఒకతను ఒక ముని దగ్గరకు వెళ్లాడు. ఆయనకు నమస్కరించి 'జ్ఞానం అంటే ఏమిటి? నేను కలిసిన కొందరు ఒక్కోలా చెప్పారు... మరి మీరేమంటారో తెలుసుకోవాలని ఉంది' అన్నాడు.

'జ్ఞానం అంటే సుఖాన్ని పొందినప్పుడు పట్టరాని ఆనందంతో ఉన్న చోటుని మరచిపోవడం కాదు... బాధలో అలసిసొలసి డీలా పడిపోవడం కాదు. కష్టమో సుఖమో దేనికైనా స్థిరంగా ఉండటం ముఖ్యం' అన్నారు ముని.



'మీరు దీనిని ఎక్కడి నుంచి నేర్చుకున్నారు?' అని అడిగాడతను.

అంతట ఆ ముని 'నేను ఈ నిజాన్ని గాడిద నుండి నేర్చుకున్నాను' అన్నారు. 'ఏమిటి మీరు చెప్పున్నది? అది ఎలా సాధ్యం?' అని అడిగాడు మునిని.

ఒక గాడిద ఆ దారిన పోతోంది. ముని దాని వంక చూడమన్నారు. 'ఈ గాడిద వీపు మీద ప్రతి ఉదయం మురికి బట్టల మూటలు పెట్టి తోలుకుంటూ పోతాడు దాని యజమాని. నదిలో మురికి బట్టలన్నింటినీ ఉతికి సాయంత్రం శుభ్రమైన బట్టల మూటలను గాడిద వీపు మీద ఉంచి ఇంటిబాట పడతాడు. మనం ఆ గాడిదలా ఉండాలి. ఉదయం పోతున్నప్పుడు మురికి బట్టల మూటలని అదేమీ బాధపడలేదు. సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు శుభ్రమైన బట్టల మూటలని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవదు. దేన్ని చూసీ అది చలించలేదు. ఆ స్థిరమైన జ్ఞానాన్ని దాని నుంచి నేర్చుకున్నాను'.

అలాంటి స్థితి పరిపక్వతతోనే సాధ్యం. సుఖమైనా, కష్టమైనా స్థితప్రజ్ఞత ముఖ్యం. ఎవరు బోధిస్తారనేది ముఖ్యం కాదు. గురువు ఎవరైనా కావచ్చు. కానీ మనం ఏమి నేర్చుకుంటున్నామనేదే ముఖ్యం.

– యామిజాల జగదీశ్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ-మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, **తిథి:** శు.చవితి రా.11.46 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పుబ్బ రా.7.02 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.2.41 నుండి 4.23 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.07 నుండి 3.59 వరకు, **అమృతఘడియలు:** ప.12.22 నుండి 2.01 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

దేశంలోని కార్మిక, నైపుణ్య (బ్లూ, గ్రే కాలర్) ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో సగం మందికి పైగా.. ఉద్యోగంలో చేరిన ఏడాది లోపే తమ ఉద్యోగాన్ని విడిచిపెట్టే ఆలోచనలో ఉంటున్నారని స్త్రీ సాధికార సంస్థ 'ఉదయతి ఫౌండేషన్', ఐటీ కంపెనీలకు ఉద్యోగులను సమకూర్చే 'క్వెస్ కార్ప్' కలిసి రూపొందించిన తాజా నివేదికలో వెల్లడైంది. రెండేళ్లకు పైగా తమ ఉద్యోగాల్లో నిలదొక్కుకోగలిగిన మహిళల్లో ఉద్యోగం మానేయాలన్న తలంపు 3 శాతం మాత్రమే ఉండగా, ఒక ఏడాది కంటే తక్కువ కాలం ఉద్యోగం చేస్తున్న వారిలో ఇది 52 శాతంగా ఉందని నివేదిక తెలిపింది. ఉద్యోగంలో చేరిన కొత్తల్లో ఇంటా బయటా మహిళలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని ఈ ధోరణి తెలియజేస్తోందని నివేదిక పేర్కొంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్


అతివలను.. నిలువనివ్వని కొలువు

చేరిన ఏడాదిలోపే మానేస్తున్న మహిళలు

పనికి అనువుగా లేని పరిస్థితులే కారణం

గత 6 నెలల్లోనే మానేసిన వారు **67%**

బ్లూ, గ్రే కాలర్ ఉద్యోగాల్లో ఇదీ పరిస్థితి

రిటైల్, వస్తు ఉత్పత్తి, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా వంటి రంగాలలో ప్రస్తుతం పని చేస్తున్న 10,000 మంది, గతంలో పనిచేసిన 1,500 మంది మహిళా కార్మిక ఉద్యోగులపై ఉదయతి, క్వెస్ కార్ప్ సర్వే నిర్వహించి 'స్టేట్ ఆఫ్ ఉమెన్ ఇన్ ది బ్లూ-గ్రే కాలర్ వర్క్‌ఫోర్స్ 2025' అనే పేరుతో ఈ నివేదికను రూపొందించాయి. తక్కువ జీతం, సదుపాయంగా లేని రోజువారీ ప్రయాణం, భద్రతా సమస్యలు, ఉద్యోగంలో ఎదుగుదలకు పరిమిత అవకాశాలు, అన్నీ కలిసి మహిళా కార్మిక ఉద్యోగులు తమకు తాముగా ఉద్యోగం మానేసే పరిస్థితులను కల్పిస్తున్నాయని సర్వే స్పష్టం చేసింది.

జీతం పెంచితే మళ్లీ వస్తాం..: 54 శాతం మంది మహిళలు తమ ఆదాయం ఏమంత సంతృప్తికరంగా లేదని చెప్పగా, వారిలో 80 శాతం మంది నెలకు రూ. 2,000 కంటే తక్కువ ఆదా చేయగలుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మెరుగైన జీతం ఉంటే మహిళలు ఉద్యోగం మానేయాలన్న భావనలో ఉండేవారు కాదని సర్వే చెబుతోంది. రూ. 20,000 కంటే ఎక్కువ సంపాదించే మహిళలు ఉద్యోగం మానేసే అవకాశం 21 శాతం తక్కువగా ఉండగా, పని మానేసి వెళ్లిన వారిలో 42 శాతం మంది తమకు మెరుగైన వేతనాలు ఇస్తామంటే తిరిగి ఉద్యోగంలో చేరుతామని చెప్పినట్లు నివేదిక తెలిపింది.


67 శాతం మానేశారు

బ్లూ-గ్రే ఉద్యోగాలలో ఉన్న ఎంట్రీ-లెవల్ మహిళల్లో సగం మంది ఒక సంవత్సరం లోపే ఉద్యోగ విరమణ చేయాలన్న ఆలోచనకు వచ్చేస్తున్నారు.

2020-21లో 16 శాతంగా ఉన్న బ్లూ-గ్రే కాలర్ ఉద్యోగాలలో మహిళల వాటా 2023-24లో 19 శాతానికి పెరిగినప్పటికీ, 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్' సర్వే ప్రకారం, గత ఆరు నెలల్లో అనేక ప్రతిబంధకాల కారణంగా 67 శాతం మంది మహిళలు ఉద్యోగాలు మానేసి వెళ్లిపోయారు.

ఆ 5 కీలకం

మహిళల్ని ఉద్యోగం మానేయకుండా ఆపగలవని నివేదిక గుర్తించిన 5 అంశాలు...
- మెరుగైన వేతనం
- సురక్షితమైన ప్రయాణ సదుపాయం
- అనువుగా మార్చిన కార్యాలయ మౌలిక సదుపాయాలు
- స్పష్టమైన వృద్ధి అవకాశాలు
- అందరినీ కలుపుకొనిపోయే కార్యాలయ సంస్కృతి



మహిళలు సామర్థ్యం లేకపోవడం వల్ల ఉద్యోగం మాని వెళ్లిపోవడం లేదు. వారికి తగినట్లుగా మనమింకా మౌలిక సదుపాయాలను కల్పించడం లేదు. వారి నుంచి అత్యుత్తమ ఫలితాలను సాధించటానికి అనువుగా పని ప్రదేశాలను మలుచుకోవడం లేదు. అందుకే వాళ్లు మధ్యలోనే ఉద్యోగం మానేస్తున్నారు

- పూజా గోయల్, ఉదయతి ఫౌండేషన్ వ్యవస్థాపక సీఈఓ

సురక్షితం కాని రాకపోకలు..: ప్రస్తుత మహిళా ఉద్యోగుల్లో 57 శాతం మంది నివాస స్థలానికి, పని ప్రదేశానికి మధ్య సజావైన రవాణా సదుపాయం లేక ఇబ్బంది పడుతున్నామని చెప్పారట. 11 శాతం మంది తమ ప్రయాణ మార్గంలో, ముఖ్యంగా రాత్రి షిఫ్టులలో సురక్షితంగా లేమని భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. చాలామంది హాస్టళ్లపై ఆధారపడతారు కానీ, ప్రయాణాల్లో మళ్లీ అదే భయం, అదే అభద్రత. ఉద్యోగం వదిలిపెట్టిన ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు, ఇంటికి దగ్గరగా ఉద్యోగావకాశం వస్తే తిరిగి ఉద్యోగానికి వెళ్తామని చెప్పారు. పని ప్రదేశంలో మహిళల భద్రత కూడా ఆందోళనకరంగానే ఉంది. 22 శాతం మంది మహిళలు పనిలో తాము సురక్షితంగా లేమని భావిస్తున్నారట. 28 శాతం మహిళలు.. ఎక్కువ గంటలు, కష్టతరమైన పరిస్థితుల వల్లే తాము ఉద్యోగం మానేశామని చెప్పారు. వారిలో మూడింట ఒక వంతు మంది తమకు ఒత్తిడిని తట్టుకునే శక్తి లేకపోవటమే కారణమన్నారు.

ఎదిగే అవకాశాలు అస్పష్టం..: కెరీర్లో ఎదుగుదలకు సంబంధించి స్పష్టమైన దారేదీ కనిపించక ఉద్యోగాన్ని వదిలేశామని 21 శాతం మంది మహిళలు తెలిపారు. ముఖ్యంగా బీ.ఎఫ్.ఎస్.ఐ. (బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా) టెలికం రంగాల్లో ఎదుగుదల అవకాశాలు అస్పష్టంగా ఉన్నప్పుడు ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం ఆ ఉద్యోగంలో పని చేసిన పోస్ట్ గ్రాడ్యుయేట్లలో ఉద్యోగ విరమణ చేసే అవకాశం మూడు రెట్లు ఎక్కువగా ఉందని డేటా తెలిపింది. అయినప్పటికీ 11 శాతం మంది మహిళలు అదనపు నైపుణ్యాలలో శిక్షణ పొంది ఉద్యోగాలలో కొనసాగుతున్నారు.

ఆ ఇద్దరూ క్యారెక్టర్ ఆర్టిస్టులే..

- జగదీశ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డిపై ఎంపీ చామల ఆగ్రహం



సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి క్యారెక్టర్ ఆర్టిస్టులని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో ఆ ఇద్దరూ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా విమర్శిస్తూ.. ఆదివారం మీడియాకు చామల ఒక వీడియో విడుదల చేశారు. జగదీశ్‌రెడ్డిని నల్లగొండ టైగర్‌గా కేటీఆర్ అంటారు కానీ.. ఆయన టైగరా ఎలుగుబంటా అనేది జిల్లా ప్రజల్ని అడిగితే చెబుతారన్నారు. తనకు ఓట్లు వేయకపోతే.. పాడెపై పడుకుంటానన్న కౌశిక్‌రెడ్డిని పాడె కౌశిక్‌రెడ్డి, సూసైడల్ స్టార్ అంటారని ఎద్దేవా చేశారు. బీసీ కులగణన, సామాజిక న్యాయంతో సీఎం రేవంత్‌రెడ్డి దేశవ్యాప్తంగా అందరికీ నచ్చిన నాయకుడిగా ఎదిగారన్నారు.

రేవంత్‌ను ఏం చేయలేరని గ్రహించండి

- ఎమ్మెల్సీ దయాకర్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యంగా.. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వృథా ప్రయాసలను చూస్తుంటే నవ్వొస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డిని డీగ్రేడ్ చేయాలని కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డిలు ఎంత ప్రయత్నిస్తే.. ఆయన అంత పైకి వెళ్తున్నారని చెప్పారు. అలా ప్రయత్నాలు చేయాలనుకుంటున్న వారు మాత్రం పరువు తీసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని ఏమీ చేయలేరన్న వాస్తవాన్ని వారు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిదని సూచించారు. రేవంత్‌రెడ్డిని ఏదైనా చేయడం కేసీఆర్‌తోనే కాలేదని, ఈ బుడంకాయలు, వంకాయలు, దోసకాయలు ఏం చేయగలవని ఎద్దేవా చేశారు.

చోరీకి వచ్చి.. ఆమ్లెట్ వేసుకొని

- డబ్బు, బంగారం దొరకక బట్టలకు నిప్పంటించిన దొంగ



దుండగుడు నిప్పంటించడంతో కాలిపోయిన బట్టలు

షాద్‌నగర్‌రూరల్: తాళం వేసిన ఇంట్లోకి చోరీకి వచ్చాడు.. ఆమ్లేట్ వేసుకొని తిన్నాడు.. డబ్బులు, బంగారం దొరకకపోవడంతో బట్టలన్నీ ఒకచోట వేసి తగులబెట్టాడో దొంగ. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. షాద్ నగర్‌లోని ఆఫీసర్స్‌కాలనీ చెందిన తిరుపతి గౌడ్ ఇంట్లోని పైఅంతస్తులో మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామానికి చెందిన ఆంజనేయులు కుటుంబంతో అద్దెకు ఉంటున్నాడు. ఇటీవల ఆయన తండ్రి మరణించడంతో అందరూ సొంతూరుకి వెళ్లారు. మూడు రోజులుగా ఇంటికి తాళం వేసిన విషయాన్ని గమనించిన ఓ వ్యక్తి దొంగతనానికి ప్రయత్నించాడు. ఇంట్లోకి చొరబడి ఆమ్లేట్ వేసుకొని తిన్నాడు. తర్వాత వెతికినా, డబ్బు, బంగారం దొరకలేదు. దీంతో ఇంట్లోని బట్టలన్నీ ఒకచోట వేసి వాటికి నిప్పంటించాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సుశీల తెలిపారు.

గురుకులంలో ఫుడ్ పాయిజన్

- 64 మంది విద్యార్థినులకు అస్వస్థత
- చికిత్స అనంతరం నిలకడగానే ఆరోగ్యం
- బాధ్యులపై కఠిన చర్యలు: మంత్రి జూపల్లి

గురుకుల హాస్టల్‌లో వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రానికి సమీపంలోని ఉయ్యాలవాడలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు లోనయ్యారు. పాఠశాలలో శనివారం సాయంత్రం స్నాక్స్ కింద క్యాబేజీ పకోడి అందించగా, రాత్రి 8 గంటల సమయంలో అన్నం, వంకాయ, సాంబార్‌తోపాటు పెరుగు వడ్డించారు. పెరుగన్నం తిన్న విద్యార్థినులకు కొద్దిసేపటి తర్వాత కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు అయ్యాయి. రాత్రి 11 గంటల తర్వాత అంబులెన్స్‌లో మొదట 10 మంది, ఆ తర్వాత 54 మందిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విద్యార్థుల పరిస్థితి నిలకడగా ఉండటంతో ఆదివారం సాయంత్రానికి డిశ్చార్జ్ చేశారు. విషయం తెలియగానే పాఠశాలను మంత్రి జూపల్లి కృష్ణారావు సందర్శించారు. మెరుగైన భోజన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్‌లోని వంటగది, కూరగాయల గదిని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి తదితరులు కూడా పాఠశాలను సందర్శించారు. ఫుడ్ పాయిజన్ ఘటనలో ప్రాథమిక విచారణ ఆధారంగా హాస్టల్ క్యాటరింగ్ కాంట్రాక్టును రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ బదావత్ సంతోశ్ ప్రకటించారు.

చేతగానితనం వల్లే వరుస ఘటనలు

ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాలను సందర్శించిన హరీశ్‌రావు



గురుకుల పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సాక్షి, నాగర్‌కర్నూల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యం వల్లే పాఠశాలల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం ఉయ్యాలవాడలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో 80 మంది వరకు విద్యార్థులు ఆస్పత్రిలో చేరారని చెప్పారు. ఇటీవల కాలంలోనే జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి బీసీ గురుకులాల్లో ఫుడ్ పాయిజన్, హుజూరాబాద్ బీసీ గురుకులంలో ఎలుకలు కరిచి విద్యార్థులు ఆస్పత్రిలో చేరారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 20 నెలల సమయంలో రాష్ట్రంలోని గురుకులాల్లో 100 మంది విద్యార్థులు చనిపోయారని, అయినా సీఎం రేవంత్ రాతి గుండె కరగడం లేదన్నారు. విద్యాశాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయన సొంత జిల్లాలోనే రోజుకో సంఘటన జరుగుతుంటే ఏమనాలని ప్రశ్నించారు. తాము పాఠశాలను సందర్శించేందుకు వస్తున్నామని తెలిసి, విద్యార్థులను చికిత్స మధ్యలోనే హడావుడిగా ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారన్నారు.గురుకులాల్లో చోటు చేసుకుంటున్న ఫుడ్ పాయిజన్ సంఘటనలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమోటోగా కేసు స్వీకరించాలని రెండు చేతులు జోడించి హరీశ్‌రావు అభ్యర్థించారు. పాఠశాలను సందర్శించిన వారిలో మాజీమంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు ఉన్నారు.

నాన్నా.. నీ కాళ్లు మొక్కుతా.. నన్ను ఏమీ చేయకు

- పదేళ్ల కూతురిపై తండ్రి అఘాయిత్యం
- ఏమీ చేయొద్దని వేడుకున్నా కనికరించని రాక్షసుడు
- బాలిక పరిస్థితి విషమం.. ఆస్పత్రికి తరలింపు

మరికల్: 'నాన్న.. నీ కాళ్లు మొక్కుతా.. నన్ను ఏమీ చెయ్యొద్దంటూ ప్రాధేయపడినా ఆ తండ్రి కనికరించలేదు. సభ్యసమాజం తల దించుకునేలా మృగంలా మారి కన్న కూతురిపైనే దారుణ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని ఓ గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాము కథనం ప్రకారం.. కుర్వ కుర్మయ్యకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరు మక్తల్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే చిన్న కూతురు (10)కు రెండు నెలల క్రితం కుక్క కరవటంతో చికిత్స చేయించి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే 5వ తరగతి చదివిస్తున్నారు. ఈ నెల 25న తల్లి కూలీ పనులకు, తండ్రి మేకల దగ్గరకు వెళ్లాడు. చిన్న కూతురు పాఠశాల నుంచి వచ్చి సాయంత్రం ఇంట్లో చదువుకుంటుండగా ఇంటికి వచ్చిన తండ్రి కుర్మయ్య.. ఒంటరిగా ఉన్న కూతురిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. నాన్న.. నీ కాళ్లు మొక్కుతా.. నన్ను ఏమీ చేయొద్దని ప్రాధేయపడినా కనికరించలేదు. ఇంట్లో నుంచి బాలిక అరుపులు విన్న చుట్టుపక్కల వారు వచ్చి బాలికను కాపాడారు. అప్పటికే బాలికకు తీవ్ర రక్తస్రావమైంది. కూలీ పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన తల్లికి జరిగిన విషయాన్ని చెప్పగా.. గ్రామంలోని ఆర్‌ఎంపీకి చూపించారు. పరిస్థితి విషమంగా ఉందని ఆర్‌ఎంపీ చెప్పగా.. భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో కుర్మయ్య భార్యను కొట్టి గ్రామం నుంచి పరారయ్యాడు. బాలిక పరిస్థితి మరింత విషమంగా మారడంతో అదే రోజు రాత్రి మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మహబూబ్‌నగర్‌కు తీసుకెళ్లాలని చెప్పగా.. కుటుంబ సభ్యులు మరుసటి రోజు శనివారం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి బాలికను తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పోలీసు కేసు అయితేనే చికిత్స చేస్తామని చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆదివారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రియురాలి స్కూటీకి జీపీఎస్ ట్రాకర్

- తేజేశ్వర్ హత్య కేసులో మరో ట్విస్ట్ వెలుగులోకి..!
- సాంకేతిక పరిజ్ఞానంతో తిరుమలరావు పథక రచన
- రెండోరోజు కొనసాగిన విచారణ

గద్వాల క్రైం: ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ఆదివారం మరో ట్విస్ట్ వెలుగు చూసింది. ఏ-1 తిరుమలరావు, ఏ-2 ఐశ్వర్య అలియాస్ సహస్రలను రెండోరోజూ సీఐ శ్రీను విచారించారు. కర్నూలు జిల్లాలో ఉన్న సన్నిహిత పరిచయంలోనే తిరుమలరావు తన ప్రియురాలిపై విపరీతమైన వ్యామోహంతో నిత్యం నిఘా నీడలో ఉండేలా పథక రచన చేశాడు. ఆమె ఎక్కడ ఉంటుంది.. ఎక్కడకు వెళుతుంది..ఇంటికి ఎప్పుడు వస్తుంది.. ఇలా అన్ని విషయాలు తెలుసుకునేందుకు కొన్ని నెలల క్రితం ఐశ్వర్యకు బహుమతిగా అందించిన స్కూటీకి జీపీఎస్ ట్రాకర్‌ను అమర్చినట్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. అయితే జీపీఎస్ ట్రాకర్ అమర్చిన విషయం ఇప్పటి వరకు ఐశ్వర్యకు తెలియదని చెప్పినట్లు తెలిసింది. తేజేశ్వర్‌తో ఐశ్వర్యకు నిశ్చితార్థమైన రెండురోజులకే తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని తిరుమలరావుతో చెప్పడంతో.. బెంగళూరులో ఉంటున్న తన బంధువుల ఇంటికి పంపించాడు. ఈ క్రమంలో కర్నూలులోని నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఐశ్వర్య కనిపించడం లేదని ఆమె కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని ఆమె బెంగళూరులో ఉన్నట్టు గుర్తించి.. వారి బంధువులకు అప్పగించారని విచారణలో బహిర్గతమైందని తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంపై గద్వాల పోలీసులు అక్కడి పోలీసుల నుంచి వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

నిత్యం సాంకేతిక శోధన..

తిరుమలరావు నిత్యం సాంకేతిక విషయ పరిజ్ఞానంతో ముందు నుంచి ఓ పథకంతో ఉండేవాడు. కేసు నుంచి తప్పించుకునేందుకు వివిధ అంశాలపై గూగుల్‌లో సెర్చ్ చేసి వ్యూహాత్మకంగా సాంకేతిక అంశాలనే అమలు చేశాడు. అయితే తేజేశ్వర్ మృతదేహంపై దాదాపు 9 కత్తిపోట్లు ఉన్నట్లు పోస్టుమార్టం నివేదికలో ఉంది. హత్య చేసిన నిందితుల రక్త నమూనాలు, తేజేశ్వర్ మృతదేహం నుంచి తీసిన ఎముకల నమూనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపించినట్లు సమాచారం.

కీలక విషయాలపై ఆరా తీస్తున్నాం..

తేజేశ్వర్ హత్య కేసులో కీలక విషయాలపై ఆరా తీస్తున్నాం. సాంకేతిక పరిజ్ఞానంతో తిరుమలరావు కేసు నుంచి బయటపడేందుకు నిత్యం గూగుల్ సెర్చ్ చేస్తుండేవాడు. వ్యతిరేకంగా ఉన్న వారి కదలికలను గుర్తించేందుకు జీపీఎస్ ట్రాకర్‌తో తెలుసుకునేవాడు. తేజేశ్వర్‌తో ఐశ్వర్య నిశ్చితార్థం తర్వాత కర్నూలు జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు, తదితర విషయాలపై ఆరా తీస్తున్నాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం. - శ్రీను, సీఐ, గద్వాల

బస్టాండ్‌లో బిడ్డను వదిలేసి..

- ఇన్‌స్టాగ్రామ్ ప్రియుడితో వివాహిత పరారీ

నల్లగొండ: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ప్రియుడి కోసం ఒక మహిళ తన కొడుకును బస్టాండ్‌లో వదిలేసి వెళ్లిపోయింది. నల్లగొండ బస్టాండ్‌లో ఆదివారం జరిగిన ఈ సంఘటనపై టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. హైదరాబాద్‌కు చెందిన వివాహితకు.. నల్లగొండ పాతబస్తీకి చెందిన యువకునితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈమెకు ఏడాదిన్నర కొడుకు కూడా ఉన్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడిని కలి సేందుకు.. ఆదివారం తన కుమారుడితో కలిసి నల్లగొండ బస్టాండ్‌కు వచ్చింది. కుమారుడిని బస్టాండ్‌లో వదిలేసి యువకుడితో వెళ్లిపోయింది. తల్లి కనిపించకపోవడంతో.. వెతుకుతూ చిన్నారి ఏడుస్తుండగా ప్రయాణికులు, డిపో సిబ్బంది టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు బస్టాండ్‌కు చేరుకుని సీసీ ఫుటేజీని పరిశీలించారు. బాలుని తల్లి బైక్‌పై వెళ్తున్నట్లు గుర్తించారు. నంబర్ ప్లేట్ ఆధారంగా విచారణ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడి కోసం ఆ మహిళ భర్త, కొడుకును వదిలేసి వెళ్లేందుకు సిద్ధమైందని తేలింది. ఆ తర్వాత పోలీసులు యువకుడిని, మహిళను, ఆమె భర్తను సఖి కేంద్రానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలుడిని అతని తండ్రికి అప్పగించినట్లు టూటౌన్ ఎస్ఐ సైదులు తెలిపారు.


రేవ్ పార్టీ భగ్నం

- 11 మందిపై కేసు, 9 మంది అరెస్ట్
- కొండాపూర్‌లోని సర్వీస్ అపార్ట్‌మెంట్స్‌లో నిర్వహణ

గచ్చిబౌలి: వీకెండ్‌లో అమ్మాయిలతో డ్యాన్స్‌లు, గంజాయి, డ్రగ్స్, మందు తాగుతూ చిందేస్తుండగా..పక్కా సమాచారంతో ఎస్‌టీఎఫ్ బీ టీమ్, ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి రేవ్‌పార్టీని భగ్నం చేశారు. వివరాల్లోకి వెళితే... కొండాపూర్ జేవీహిల్స్ కాలనీలోని ఎస్‌వీ.నిలయం అనే సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో వీకెండ్‌లో ఏపీకి చెందిన కొందరు కొంతకాలంగా రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి కూడా అలాంటి పార్టీ జరిగింది. దీనిపై పక్కా సమాచారం అందగా దాడులు చేశారు. విజయవాడకు చెందిన నాయుడు అలియాస్ వాసు, శివంనాయుడు కొంతమంది అమ్మాయిలను తీసుకొచ్చి, యువకులతో ఎంజాయ్ చేయిస్తున్నారు. వీరిని ఎస్టీఎఫ్ బీ టీమ్ పట్టుకుంది. ఆ తర్వాత శేరిలింగంపల్లి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ సంధ్య తెలిపారు. వీరి వద్ద నుంచి 2 కేజీల గంజాయి, 50 ఓజీ కుష్ గంజాయి, 11.57 గ్రాముల మ్యాజిక్ ముష్రూమ్, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆరు కార్లు, 11 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో డ్రగ్స్ తెప్పించే కింగ్‌కెన్‌షేర్ రాహుల్, ఆర్గనైజర్ ప్రవీణ్‌కుమార్ అలియాస్ మన్నె అప్పికొట్ల అశోక్‌కుమార్, మరో ఆర్గనైజర్ సమ్మెల సాయికృష్ణ, హిట్ జోసఫ్, తోట కుమార స్వామి, అడపా యశ్వంత్, శ్రీదత్, నంద, సమతాతేజ ఉన్నారు. వీరితోపాటు మరో ముగ్గురిపై కూడా కేసు నమోదు చేశారు. వారు పరారీలో ఉన్నట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేసిన వాహనాల్లో టీడీపీ నాయకులకు చెందినవి ఉన్నట్టు తెలిసింది. ఆ పార్టీకి చెందిన అశోక్ నాయుడు వాహనం కూడా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు.

బంగారం చోరీ కేసులో మహిళ అరెస్టు

- నిందితురాలి నుంచి 14తులాల బంగారం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు ఇవే

సూర్యాపేటటౌన్: సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసాయి సంతోషి జ్యువెలరీ షాపులో ఈ నెల 21న రాత్రి జరిగిన భారీ చోరీ కేసులో పోలీసులు ఒక మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమె నుంచి 14తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ వెల్లడించారు. ఆదివారం ఉదయం పోలీసులు సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తుండగా ఖమ్మం పరిధిలోని నాయుడుపేటకు చెందిన మేకల యశోద అనుమానాస్పదంగా కనిపించింది. ఆమె బ్యాగును తనిఖీ చేయగా శ్రీసాయి సంతోషి జ్యువెలరీ షాపులో చోరీకి గురైన కొన్ని ఆభరణాలు లభ్యమయ్యాయి. ఆభరణాలు అమ్మేందుకు హైదరాబాద్‌కు వెళ్తూ హైటెక్‌బస్టాండ్‌లో పట్టుబడింది. ఆమెను స్టేషన్‌కు తరలించి విచారించగా బంగారం షాపులో దొంగతనం చేసిన నిందితులకు ఆశ్రయం ఇచ్చి చోరీకి సహకరించినట్టు అంగీకరించింది. దొంగిలించిన బంగారం ఇక్కడ అమ్మితే అనుమానం వస్తుందని నేపాల్‌కు తీసుకెళ్లి అమ్ముదామని దొంగలు నిర్ణయించారు. ఈమేరకు నిందితులకు ఆశ్రయం ఇచ్చి సహకరించిన అమర్ బట్, మేకల యశోద ఖర్చులకు కొన్ని బంగారు ఆభరణాలు ఇచ్చి మిగతా ఐదుగురు నిందితులు నేపాల్‌కు వెళ్లిపోతున్నట్లు వారికి చెప్పారు. నిందితురాలు ఇచ్చిన సమాచారం మేరకు ప్రత్యక్షంగా చోరీకి పాల్పడిన నేపాల్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మొత్తం ఐదుగురిని గుర్తించామని ఎస్పీ తెలిపారు. నిందితులంతా ఖమ్మంలో దొంగతనాలు చేసి దొరికిపోయారని, అక్కడ చోరీ చేసే మళ్లీ దొరికిపోతామని, సూర్యాపేట పట్టణాన్ని ఎంచుకున్నారన్నారు. ఈ కేసులో జ్యువెలరీ షాపు యజమాని రెండున్నర కిలోల బంగారం, కొంత నగదు దొంగతనానికి గురైనట్టు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చినట్టు ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ వెంకటయ్య, ఎస్ఐ శివతేజ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల మందపై చిరుత దాడి

- అడ్డుకోబోయిన కాపరి, మరో ఇద్దరికి గాయాలు



దాడిలో గాయపడ్డ మైబన్న

పాలమూరు: గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. అడ్డుకోబోయిన కాపరితో పాటు మరో ఇద్దరిని కూడా చిరుత గాయపరిచింది. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌కొండ మండలంలోని కొత్లాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కొత్లాబాద్ గ్రామానికి చెందిన గొల్ల మైబన్న శనివారం తన గొర్రెల మందను కుమ్మరికుంట వద్ద నిలిపాడు. రాత్రి 10 గంటల సమయంలో మందలోకి ఓ చిరుత దూరి గొర్రెలపై దాడి చేసింది. మంద పక్కనే కూర్చొని ఉన్న మైబన్నతోపాటు చెన్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి గొర్రెల అలజడిని గమనించారు. మైబన్న మందలోకి వెళ్లి బ్యాటరీ వేసి చూడగా చిరుత అతడిపై దాడి చేసింది. వెంటనే చెన్నారెడ్డి, సత్యనారాయణరెడ్డి కూడా మందలోకి వెళ్లగా వారిపై కూడా దాడి చేసింది. దీంతో ముగ్గురు గట్టిగా కేకలు వేయడంతో చిరుత పారిపోయింది. అప్పటికే చిరుత నాలుగు గొర్రెలపై దాడిచేయగా మూడు చనిపోయాయి. అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి రాజశేఖర్, ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారికి కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి పరామర్శించారు.

అంతరిక్షంపై చిన్నారుల్లో

అమితాసక్తి

శుభాంశు అంతరిక్ష యాత్ర విజయవంతం కావడం హర్షణీయం

- స్పేస్ సెక్టార్‌లో 200కుపైగా స్టార్టప్ కంపెనీలొచ్చాయి
- దేశ అభివృద్ధి కోసం స్వదేశీ ఉత్పత్తులే ఉపయోగిద్దాం
- 'మన్ కీ బాత్'లో మోదీ పిలుపు

సాక్షి, న్యూఢిల్లీ: భారత వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్ష యాత్ర విజయవంతం కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. అంతరిక్షంపై చిన్నారుల్లో ఆసక్తి నానాటికీ పెరుగుతోందని చెప్పారు. అంతరిక్ష రంగంలో 200కుపైగా స్టార్టప్ కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఆయన ఆదివారం 124వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఆత్మనిర్భర్ భారత్'కు అతిపెద్ద ఆధారం 'వోకల్ ఫర్ లోకల్' అని పునరుద్ఘాటించారు. '2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్' అనే లక్ష్య సాధన కోసం కృషి చేస్తున్నామని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గత కొన్ని వారాల్లో క్రీడలు, సైన్స్, సాంస్కృతికం తదితర రంగాల్లో ఎన్నో ఘనతలు నమోదయ్యాయని, అవి ప్రతి భారతీయుడికీ గర్వకారణమని చెప్పారు. శుభాంశు శుక్ల అంతరిక్ష యాత్రతో దేశమంతా పులకించిపోయిందని, ఆయన క్షేమంగా తిరిగి వచ్చాక గర్వంతో ఉప్పొంగిపోయిందని, ప్రతి హృదయం సంతోషంతో నిండిపోయిందని వ్యాఖ్యానించారు. 2023 ఆగస్టులో చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైనప్పుడు భారతీయులు ఎంతగానో గర్వించారని గుర్తుచేశారు. చిన్నారుల్లో సైన్స్, అంతరిక్షం పట్ల ఆసక్తి పెరిగిందని, చంద్రుడిపైకి చేరుకుంటామని చెబుతున్నారని వెల్లడించారు. స్పేస్ సైంటిస్ట్ కావాలన్న ఆలోచన వారిలో నాటు కుందని, ఇదొక శుభ పరిణామమని ఉద్ఘాటించారు. 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

ఒలింపియాడ్‌లో మన విద్యార్థుల ఘనత

''చిన్నారుల్లో నూతన ఆవిష్కరణ పట్ల ఉత్సాహం పెంచడానికి ఇన్‌స్పైర్–మానక్ అభియాన్ ప్రారంభించాం. ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురిని ఎంపిక చేశాం. లక్షలాది మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో చేరారు. చంద్రయాన్–3 తర్వాత వారి సంఖ్య రెట్టింపయ్యింది. స్పేస్ స్టార్టప్‌లు ఐదేళ్ల క్రితం కేవలం 50 ఉండేవి. ఇప్పుడు వాటి సంఖ్య 200 దాటేసింది. 21వ శతాబ్దంలో నూతన శక్తితో సైన్స్ పురోగమిస్తోంది. కొన్ని రోజుల క్రితం ఇంటర్నేషనల్ కెమిస్ట్రీ ఒలింపియాడ్‌లో మన విద్యార్థులు దేవేశ్ పంకజ్, సందీప్ కుచీ, దేవదత్ ప్రియదర్శి, ఉజ్వల్ కేసరి పతకాలు గెలుచుకున్నారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. ఇంటర్నేషనల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్‌లో మన విద్యార్థులు ఆరు పతకాలు సాధించారు.

విప్లవాల మాసం ఆగస్టు

ఆగస్టు రాబోతోంది. ఆగస్టు అంటే విప్లవాల మాసం. 18 ఏళ్ల స్వాతంత్య్ర సమర యోధుడు ఖుదిరాం బోస్‌ను ఆగస్టులోనే బ్రిటిష్ పాలకులు ఉరి తీశారు. లోకమాన్య బాల గంగాధర్ తిలక్ ఆగస్టు 1న మరణించారు. ఆగస్టు 8న గాంధీ నాయకత్వంలో క్విట్‌ఇండియా ఉద్యమం మొదలైంది. ఆగస్టు 15న మనకు స్వాతంత్య్రం వచ్చింది. దేశ విభజన కూడా ఇదే నెలలో జరిగింది. ప్రతిఏటా ఆగస్టు 14వ తేదీని 'విభజన అకృత్యాల సంస్మరణ దినం'గా నిర్వహించుకుంటున్నాం. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం ఆరంభమైంది. స్వదేశీ ఉత్పత్తులు వాడాలన్న పిలుపునకు అప్పటి ప్రజలు స్పందించారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహిస్తున్నాం.

అదే మనందరి సంకల్పం

మన దేశం మరింత అభివృద్ధి చెందాలంటే స్థానిక ఉత్పత్తులు విరివిగా ఉపయోగించాలి. మన దేశంలో తయారైన వస్తువులే విక్రయించాలి. అవే కొనుక్కోవాలి. అదే మనందరి సంకల్పం కావాలి. ఎందుకంటే వాటి తయారీ కోసం మనం స్వేదం చిందించాం. కొన్నిసార్లు కొన్ని విషయాలు కొందరికి అసాధ్యంగా కనిపిస్తాయి. కానీ, మనమంతా ఒక్కటై పని చేస్తే అసాధ్యాలే సుసాధ్యాలవుతాయి. అందుకు తగిన ఉదాహరణ స్వచ్ఛ భారత్ మిషన్. ఈ కార్యక్రమానికి 11 ఏళ్లు పూర్తి కాబోతున్నాయి. ఇదొక ప్రజా ఉద్యమంగా మారింది. స్వచ్ఛతను ప్రజలు తమ బాధ్యతగా భావిస్తున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ అవసరం ఇప్పటికీ ఉంది. 4,500 పట్టణాలు, నగరాలు ఇందులో భాగమయ్యాయి. 15 కోట్ల మందికిపైగా జనం పాలుపంచుకున్నారు. ఇది సాధారణ విషయం కాదు.



బృహదీశ్వర ఆలయంలోకి కలశంతో వెళ్తున్న ప్రధాని మోదీ

మాజీ నక్సలైట్ల విజయాలు స్ఫూర్తిదాయకం

జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో మాజీ నక్సలైట్లు చేపల పెంపకంలో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. హింసను వీడి మత్స్య రంగంలో ప్రవేశించారు. క్లిష్టమైన పరిస్థితుల్లోనూ అభివృద్ధి దీపం వెలిగించవచ్చని నిరూపించారు. కొన్నిసార్లు దట్టమైన చీకటి నుంచే ప్రకాశవంతమైన వెలుగు ఉద్భవిస్తుంది. గతంలో తుపాకులు పట్టుకొన్న నక్సలైట్లు ఇప్పుడు వలలు చేతబూని చేపల వేట సాగిస్తున్నారు. చక్కటి ఆదాయం పొందుతూ బతుకులు మార్చుకుంటున్నారు. ఈ విజయ గాథలు అందరికీ స్ఫూర్తిదాయకం.

'సిందూర్'తో

సత్తా చాటాం

- ఉగ్రవాదులకు సురక్షిత స్థానం ఎక్కడా లేదని నిరూపించాం
- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- రాజేంద్ర చోళ–1 జయంతి వేడుకలకు హాజరైన ప్రధాని

గంగైకొండ చోళపురం: భారతదేశ శక్తి సామర్థ్యాలు ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచానికి తెలిసొచ్చాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదులకు, మన శత్రువులకు సురక్షిత స్థానం అంటూ ఎక్కడా లేదన్న నిజాన్ని నిరూపించామని చెప్పారు. మన సార్వభౌమత్వంపై దాడి జరిగితే ప్రతిస్పందన ఎంత భీకరంగా ఉంటుందో అందరికీ తెలిసిపోయిందని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ దేశ ప్రజలకు నూతన ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందని స్పష్టంచేశారు. ఆదివారం తమిళనాడులోని గంగైకొండ చోళపురంలో చోళరాజు రాజేంద్ర చోళ–1 జయంతి వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. 'ఆది తిరువత్తిరై' పేరిట నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రసంగించారు. రాజరాజ చోళ, ఆయన కుమారుడు రాజేంద్ర చోళ–1 చక్రవర్తుల పేర్లు మన దేశ గుర్తింపునకు పర్యాయపదాలు అని కొనియాడారు. వారు మనందరికీ గర్వకారణమని చెప్పారు. తమిళనాడులో భారీ ఎత్తున వారి విగ్రహాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. మన చరిత్రకు అవి దర్పణాలు అవుతాయని నరేంద్ర మోదీ అన్నారు. సాధారణంగా ప్రజాస్వామ్యం గురించి ప్రస్తావనకు వచ్చినప్పుడు యూకేలోని మాగ్నాకార్టా గురించి మాట్లాడుతుంటారని, నిజానికి వెయ్యి సంవత్సరాల క్రితమే చోళుల పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థ అమల్లో ఉందని గుర్తుచేశారు.

బృహదీశ్వర ఆలయంలో పూజలు

గంగైకొండ చోళపురంలో చోళ రాజులు నిర్మించిన బృహదీశ్వర ఆలయాన్ని ప్రధాని మోదీ దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మోదీ సంప్రదాయ వస్త్రాలు ధరించి, పవిత్ర జలంలో కూడిన కలశం చేతబూని ఆలయంలోకి ప్రవేశించారు. గర్భాలయంలో పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపారాధన చేశారు. అనంతరం భారత పురావస్తు సర్వే విభాగం నిర్వహించిన ప్రదర్శనను తిలకించారు. అంతకముందు గంగైకొండ చోళపురంలో ప్రధాని మోదీ రోడ్ షోలో పాల్గొన్నారు. రహదారికి ఇరువైపులా జనం బారులు తీరి ఆయనకు స్వాగతం పలికారు. 3 కిలోమీటర్ల మేర జరిగిన ఈ రోడ్ షోలో బీజేపీ, ఏఐఏడీఎంకే పార్టీల జెండాలు రెపరెపలాడాయి.

ప్రధానితో పళని స్వామి భేటీ

తమిళనాడు పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీతో శనివారం రాత్రి ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి, తమిళనాడు మాజీ సీఎం పళని స్వామి సమావేశమయ్యారు. తిరుచిరాపల్లి ఎయిర్‌పోర్ట్‌లో ఈ భేటీ జరిగింది. తమిళనాడులో బీజేపీ, ఏఐఏడీఎంకే మధ్య పొత్తు కుదిరిన తర్వాత మోదీ, పళనిస్వామి కలుసుకోవడం ఇదే మొదటిసారి. రాబోయే అసెంబ్లీ ఎన్నికలపై వారు చర్చించుకున్నట్లు సమాచారం

కలాంకు మోదీ నివాళులు

దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆదివారం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. గొప్ప దార్శనికుడిగా, శాస్త్రవేత్తగా, గురువుగా, దేశభక్తుడిగా కలాం చిరస్మరణీయులు అని మోదీ కొనియాడారు. దేశాన్ని అభివృద్ధి చేసుకొనే దిశగా కలాం ఆలోచనలు, ఆశయాలు యువతకు ఎప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని స్పష్టంచేశారు.

పహల్గాం దాడి, సిందూర్‌పై నేడు పార్లమెంటులో చర్చ

మారథాన్ చర్చను నిర్వహించనున్న ఉభయ సభలు

న్యూఢిల్లీ: వారం రోజులపాటు అంతరాయాల మధ్య నడిచిన పార్లమెంటు వర్షకాల సమావేశాల్లో నేటి నుంచి ఉత్కంఠభరితమైన చర్చ జరగనుంది. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌పై తలపడేందుకు ఉభయ సభల్లోని అధికార, ప్రతిపక్ష కూటములు సిద్ధమయ్యాయి. జాతీయ భద్రత, విదేశాంగ విధానం వంటి కీలక అంశాలు కావడంతో మాట్లాడేందుకు ఇరు పక్షాల అగ్ర నేతలు సిద్ధమవుతున్నారు. అధికార పక్షం నుంచి హోంమంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తమ వైఖరిని స్పష్టం చేయనున్నారు. మంత్రులు అనురాగ్ ఠాకూర్, సుధాంశు త్రివేది, నిషికాంత్ దూబేలతోపాటు.. 'ఆపరేషన్ సిందూర్'ను ప్రపంచ దేశాలకు తమ వాదనను వినిపించిన ఎన్డీయే సభ్యులు సైతం మాట్లాడతారు. ఇక ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అఖిలేశ్ యాదవ్‌తో పాటు, ఇతర కీలక నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాదనలు వినిపించే అవకాశం ఉంది. భారత్–పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తానే తగ్గించానని, కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం తానే వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పదేపదే వ్యాఖ్యానించారు. దీనిని విదేశాంగశాఖ తోసిపుచ్చినా.. ట్రంప్ అవే వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం వైఖరిని ప్రతిపక్షాలు తప్పుబట్టాయి. ఇక, ప్రధాని మోదీ మౌనం వహించడంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం విమర్శలు గుప్పించారు. మరోవైపు... కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మాత్రం ఉగ్రవాద దాడి తర్వాత ప్రభుత్వం తీసుకున్న ప్రతి చర్యను పొగడ్తలతో ముంచెత్తారు. దీంతో పార్టీతో ఆయన సంబంధాలు దెబ్బతిన్నాయి. అయితే విదేశాలకు వెళ్లిన బృందాల్లో ఒక బృందానికి కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నాయకత్వం వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు జరిగే చర్చలో ప్రతిపక్షం నుంచి ఆయన మాట్లాడతారా? లేదా? అనే సంశయం నెలకొంది.

విప్ జారీ చేసిన కాంగ్రెస్

ఆపరేషన్ సిందూర్‌పై సోమవారం నుంచి పార్లమెంట్‌లో చర్చ జరుగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తమ లోక్‌సభ ఎంపీలకు విప్ జారీ చేసింది. వరుసగా మూడు రోజులపాటు తప్పనిసరిగా పార్లమెంట్ సమావేశాలకు హాజరు కావాలని ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంట్ దిగువ సభలో వాడీవేడిగా చర్చ జరిగే పరిస్థితి కనిపిస్తోంది. ఈ అంశంపై పార్లమెంట్‌లో కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఎస్.జైశంకర్ మాట్లాడుతారని తెలుస్తోంది. ప్రధాని మోదీ సైతం సభలో సమాధానం చెబుతారని సమాచారం.

గాజాలో కాల్పులకు వ్యూహాత్మక విరామం

మానవతా సహాయాన్ని పెంచేందుకేనన్న ఇజ్రాయెల్ ● ఇకపై తమను నిందించొద్దన్న ప్రధాని నెతన్యాహూ

డెయిర్ అల్–బలాహ్/జెరూసలేం: పాలస్తీనా భూభాగంలో ఆకలి మరణాలపై అంతర్జాతీయంగా పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో ఇజ్రాయెల్ వ్యూహాత్మక విరామం ప్రకటించింది. గాజా నగరం, డెయిర్ అల్ బలాహ్, మువాసీ నగరాల్లో రోజుకు పది గంటలు పాటు కాల్పుల విరామం ఉంటుందని తెలిపింది. తదుపరి నోటీసు వచ్చే వరకు స్థానిక సమయం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సైనిక కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. గాజా స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఆహారం, మందులు పంపిణీ చేసే కాన్వాయ్‌ల కోసం సురక్షిత మార్గాలు తెరిచి ఉంటాయని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఈ ప్రకటన గాజా వాసులకు కొంత ఉపశమనం కలిగించింది. అయితే ఈ సహాయ నిర్ణయాన్ని ఇజ్రాయెల్ జాతీయ రక్షణ మంత్రి ఇటమర్ బెన్–గ్విర్ విమర్శించారు. ఇది తన ప్రమేయం లేకుండానే జరిగిందన్నారు. హమాస్ మోసపూరిత ప్రచారానికి లొంగిపోవడంగా అభివర్ణించారు. గాజాకు అన్ని రకాల సహాయాన్ని నిలిపివేయాలని, భూభాగాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆయన పునరుద్ఘాటించారు.

ఆదివారం నుంచే అందిన ఆహారం..

వ్యూహాత్మక కాల్పుల విరమణతో.. ఆదివారం జోర్డాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విమానాలు పారాచూట్ల ద్వారా 25 టన్నుల సహాయాన్ని గాజా ఎన్‌క్లేవ్‌లో జారవిడిచాయి. జికిమ్ సరిహద్దు క్రాసింగ్ నుంచి ఆదివారం సహాయ ట్రక్కులు ఉత్తర గాజాలోకి ప్రవేశించాయి. ఆదివారం కెరెమ్ షాలోమ్ క్రాసింగ్ ద్వారా దక్షిణ గాజాకు 1,200 మెట్రిక్ టన్నులకు పైగా ఆహారాన్ని పంపినట్లు ఈజిప్టు రెడ్ క్రెసెంట్ తెలిపింది. ఇజ్రాయెల్–పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ మధ్య దోహాలో జరిగిన కాల్పుల విరమణ చర్చలు ఎటువంటి ఒప్పందం లేకుండానే ముగియడం, గాజాలో మానవతా సంక్షోభం నెలకొనడంతో ఇజ్రాయెల్‌పై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలొచ్చాయి. అయితే.. ఆ దేశం వాటిని తిరస్కరిస్తూ వస్తోంది. తాజా వ్యూహాత్మక విరామం నేపథ్యంలో.. గాజాలో సంక్షోభానికి ఇక తమ ప్రభుత్వాన్ని నిందించడం మానేయాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ సూచించారు. ఇంతకుముందు కూడా సురక్షిత మార్గాలున్నా యని, ఇకనుంచి అధికారికంగా ఉంటాయని ఆయన తెలిపారు.



విమానాల ద్వారా గాజాలో ఆహార ప్యాకెట్ల జారవేత

పోషకాహార లోపంతో ఆరుగురు మృతి

గాజాలో పోషకాహార లోపంతో గత 24 గంటల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఆకలితో మరణించిన వారి సంఖ్య 133కి చేరుకుంది. వీరిలో 87 మంది పసి పిల్లలు ఉండటం గమనార్హం. మరోవైపు, ఆదివారం సహాయం కోసం ఎదురు చూస్తున్న సమయంలో ఇజ్రాయెల్ జరిపిన కాల్పుల్లో 17 మంది మరణించారని, 50 మంది గాయపడ్డారని సెంట్రల్ గాజాలోని అల్–అవ్దా, అల్–అక్సా ఆసుపత్రుల అధికారులు తెలిపారు. ఈ దాడులపై ఎలాంటి వ్యాఖ్యలు చేయని ఇజ్రాయెల్ సైన్యం.. ఆదివారం గాజాలో తమ సైనికులు ఇద్దరు మరణించారని ప్రకటించింది.

ఆలయంలో తొక్కిసలాట

ఆరుగురు మృతి, 28 మందికి గాయాలు

హరిద్వార్: పవిత్ర పుణ్యక్షేత్రం హరిద్వార్‌లో విషాదం జరిగింది. నగరంలో కొండపై ఉన్న ప్రసిద్ధ మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట జరిగింది. ఆదివారం ఉదయం జరిగిన ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. 28 మంది గాయపడ్డారు. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయన్న పుకారు తొక్కిసలాటకు దారి తీసిందని పోలీసులు తెలిపారు. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. 500 అడుగుల ఎత్తులో ఉన్న శివాలిక్ కొండలపైకి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఇరుకైన ప్రవేశ ద్వారం గుండా ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. ఈ సమయంలో విద్యుత్ వైర్లు తెగిపడ్డాయన్న పుకారుతో ఒక్కసారిగా జనం తోసుకుంటూ అక్కడి నుంచి బయటపడే ప్రయత్నం చేశారు. దీంతో తొక్కిసలాట జరిగింది. వెంటనే సహాయ సిబ్బంది స్పందించి.. ఊపిరాడక స్పృహ కోల్పోయిన 34 మందిని ఆస్పత్రికి తరలించారు. వారిలో ఆరుగురు మరణించారు. ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి వెంటనే స్పందించారు. ఘటనపై విచారం వ్యక్తం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. హరిద్వార్‌లోని జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. వారి కుటుంబాలకు అన్ని రకాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఆర్థిక సహాయం ప్రకటించారు.



తొక్కిసలాట జరిగిన చోట గుమికూడిన జనం

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం..

ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి మోదీ విచారం వ్యక్తం చేశారు. 'హరిద్వార్‌లోని మానసా దేవి ఆలయానికి వెళ్లే మార్గంలో తొక్కిసలాట జరిగి భక్తులు మరణించడం తీవ్ర బాధాకరం. బాధిత కుటుంబాలకు నా హృదయపూర్వక సంతాపం. గాయపడిన భక్తులందరూ త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను' అని రాష్ట్రపతి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి నా సంతాపం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా' అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.

థాయ్, కాంబోడియా సరిహద్దు ఘర్షణలు

నేడు మలేసియాలో చర్చలు

బ్యాంకాక్: థాయ్‌లాండ్, కాంబోడియాల మధ్య సరిహద్దు వివాదంతో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఘర్షణలకు తెరపడే అవకాశాలు కన్పిస్తున్నాయి. థాయ్, కాంబోడియా నేతలు సోమవారం మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో సమావేశమవనున్నారు. ఈ విషయాన్ని థాయ్ ప్రధానమంత్రి కార్యాలయం ఆదివారం తెలిపింది. మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆహ్వానం మేరకు జరిగే ఈ చర్చల్లో థాయ్ తరఫున తాత్కాలిక ప్రధాని ఫుంతమ్ వెచయాచై పాల్గొంటారని పేర్కొంది. కాంబోడియా ప్రధాని హున్ మనెట్ కూడా చర్చలకు హాజరవుతారని తెలిపింది. అయితే, కాంబోడియా అధికారికంగా స్పందించలేదు. ఆసియాన్ చైర్మన్ స్థానంలో ఉన్న మలేసియా ప్రధాని ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు తన ప్రయత్నాలు ప్రారంభించారని పేర్కొంది.

ట్రంప్..ఆసియాన్ జోక్యం

ఘర్షణలను ఆపేయాలంటూ ఆ రెండు దేశాల నేతలను కోరినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శనివారం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ప్రకటించడం తెల్సిందే. ఒక ఒప్పందానికి రాకుంటే రెండు దేశాలతో ఎటువంటి వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోబోమంటూ హెచ్చరించడంతో ఇద్దరు ప్రధానులు దిగివచ్చారని ట్రంప్ చెప్పుకున్నారు. బేషరతు కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని ట్రంప్‌కు చెప్పినట్లు కాంబోడియా ప్రధాని హున్ మనెట్ తెలిపారు. థాయ్ ప్రధాని సైతం ఇందుకు సిద్ధమయ్యారని ట్రంప్ తనకు చెప్పారన్నారు. ఈ విషయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో, థాయ్ విదేశాంగ మంత్రితో చర్చలు జరిపే బాధ్యతను తమ డిప్యూటీ ప్రధాని ప్రాక్ సొఖొన్‌కు అప్పగించానన్నారు. అయితే, కాంబోడియా నిజాయితీతో చర్చలకు ముందడుగు వేస్తేనే తామూ కలిసి వస్తామని థాయ్ అంటోంది.

34కు చేరిన మరణాలు

వివాదాస్పద సరిహద్దు ప్రాంతంలో గురువారం మందుపాతర పేలి థాయ్ సైనికులు గాయపడటంతో వివాదం తీవ్రరూపం దాల్చడం తెల్సిందే. శాంతి నెలకొల్పేందుకు ఒక వైపు దౌత్యపరమైన ప్రయత్నాలు సాగుతుండగా, ఆదివారం కూడా రెండు దేశాల సైనికుల మధ్య సరిహద్దుల్లో ఘర్షణలు కొనసాగాయి. పౌర ప్రాంతాలపైకి కాల్పులు జరిపారంటూ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. నాలుగు రోజుల ఘర్షణల్లో ఇప్పటి వరకు 34 మంది చనిపోగా 1.68 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

అమెరికాలో కత్తిపోట్లు..

11 మందికి గాయాలు

ట్రావెర్స్ సిటీ: అమెరికాలోని మిషిగన్ రాష్ట్రం ట్రావెర్స్ సిటీలో శనివారం చోటుచేసుకున్న కత్తిపోట్ల ఘటనలో 11 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. క్షతగాత్రులందరినీ మున్సన్ హెల్త్‌కేర్ ఆస్పత్రికి తరలించారు. ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని పోలీసులు చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు. వాల్‌మార్ట్ స్టోర్ వద్దకు వచ్చిన వారిపైకి అతడు ఫోల్డబుల్ చాకుతో దాడికి పాల్పడ్డాడు. ఆయుధం సహా అతడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు మిషిగన్ వాసి అని తెలిపిన పోలీసులు అంతకుమించి వివరాలను వెల్లడించలేదు. ఇలా ఉండగా, అల్బుక్వెర్క్‌లోని న్యూమెక్సికో యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి అనుమానితుడు జాన్ ఫుయెంటెస్(18)ని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కాల్పుల్లో 14 ఏళ్ల బాలుడు చనిపోగా మరొకరు గాయపడటం తెల్సిందే.

ఉద్ధవ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపేందుకు

మాతోశ్రీకి వెళ్లిన రాజ్‌ఠాక్రే

ముంబై: శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేను సోదరుడు, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే కలవడం మహారాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. పుట్టినరోజు సందర్భంగా ఉద్ధవ్ నివాసం మాతోశ్రీకి వచ్చిన రాజ్‌కు.. ఉద్ధవ్, సంజయ్ రౌత్ స్వాగతం పలికారు. ఉద్ధవ్‌కు భారీ పుష్పగుచ్ఛం అందించిన రాజ్ ఠాక్రే.. పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆ తరువాత.. పెదనాన్న బాల్ ఠాక్రే చిత్ర పటం ముందు ఉద్ధవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న చిత్రాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'మా అన్న శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పుట్టిన రోజు సందర్భంగా తన నివాసం మాతోశ్రీకి వెళ్లాను. శుభాకాంక్షలు తెలిపాను' అని సందేశాన్ని జోడించారు. అయితే.. చాలా సంవత్సరాల తరువాత రాజ్ మాతోశ్రీకి రావడం, శుభాకాంక్షలు తెలపడంతో తన ఆనందం రెట్టింపయ్యిందని ఉద్ధవ్ తెలిపారు. 2005లో శివసేనను విడిచిన రాజ్ ఠాక్రే.. ఆ తరువాత ఉద్ధవ్ నివాసం మాతోశ్రీకి అరుదుగా వెళ్లారు. 2012జూలైలో ఉద్ధవ్‌కు యాంజియోగ్రఫీ అనంతరం.. ముంబైలోని లీలావతి ఆసుపత్రి నుంచి ఇంటికి తీసుకెళ్లారు. ఆ తరువాత.. 2019 జనవరిలో తన కుమారుడు అమిత్ వివాహ ఆహ్వానాన్ని ఇవ్వడానికి మాత్రమే వెళ్లారు. ఆ తరువాత బంధువుల వేడుకల్లో అప్పుడప్పుడూ కలిసినా.. త్వరలో ముంబై మున్సిపల్ ఎన్నికలుండటంతో ఆదివారం జరిగిన భేటీ రాజకీయ చర్చకు దారి తీసింది. అయితే.. వారిద్దరూ కలవడం సంతోషకరమైన విషయమని, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడాన్ని రాజకీయ కోణం నుంచి ఎందుకు చూడాలని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ అన్నారు. రాష్ట్రంలో భాషా వివాదం తరువాత సోదరులిద్దరూ రాజకీయంగా ఒక్కటవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. దానికి ఊతమిస్తూ.. జూలై 5న ముంబైలో రాజ్‌తో కలిసి జరిగిన ర్యాలీలో ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ.. 'కలిసి ఉండటానికి కలిసి వచ్చాం' అని ప్రకటించడం గమనార్హం.



ఉద్ధవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న రాజ్ ఠాక్రే

కాంగోలో చర్చిపై దాడి..

38 మంది మృతి

ఇస్లామిక్ తీవ్రవాదుల పనేనని అనుమానం

గోమా: కాంగోలోని కేథలిక్ చర్చిలో ఐఎస్ అనుబంధ ఇస్లామిక్ ఉగ్రవాదులు జరిపిన నరమేధంలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చర్చిలోకి తుపాకులు, కత్తులతో ప్రవేశించిన అలైడ్ డెమోక్రాటిక్ ఫోర్స్(ఏడీఎఫ్)కు చెందిన దుండగులు కాల్పులు జరుపుతూ దొరికిన వారిని దొరికినట్లు నరికారని ప్రత్యక్ష సాక్ష్యులు తెలిపారు. అనంతరం కొందరిని తమ వెంట అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లారని చెప్పారు. ఎందరిని తీసుకెళ్లిందీ తెలియాల్సి ఉంది.అంతకుముందు వారు చర్చి చుట్టుపక్కల నివాసాలకు నిప్పుపెట్టారు.'మృతదేహాలు ఇప్పటికీ చర్చి ప్రాంగణంలోనే ఉన్నాయి. చర్చి ఆవరణలోపలే వీరందరికీ సామూహిక ఖననాలు జరిపేందుకు వలంటీర్లు ఏర్పాట్లు చేస్తున్నారు'అని ఇటురి ప్రావిన్స్ లోని కొమాండ అధికారి ఒకరు తెలిపారు. 10 మంది చనిపోయినట్లు మిలటరీ చెబుతు న్నా.. స్థానిక మీడియా మాత్రం ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 40కి పైగానే ఉంటుందని పేర్కొంది. ఐరాసకు చెందిన రేడియో స్టేషన్ మాత్రం 43 మంది వరకు దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు సైన్యం తెలిపిందని వెల్లడించింది. అంతకుముందు, సమీపంలోని మచోంగమి గ్రామంపై ఉగ్రవాదులు దాడిచేసి ఐదుగురిని పొట్టన బెట్టుకున్న ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.



వైద్యారోగ్య శాఖలో లీకువీరులు
నగరంలో అనుమతులు లేకుండా ఆస్పత్రులు, క్లినిక్‌లు కొనసాగుతున్నాయి. ఎలాంటి అర్హతలు లేకుండానే వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. -8లో



వానల్లో హాయి.. హాయి..
నగరంలో ప్రస్తుతం వర్షాలు ముసురుకున్నాయి. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో సరైన జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/23.0

వాతావరణం
నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

దేశాభివృద్ధిని సామాజిక బాధ్యతగా భావించాలి

– గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



హెచ్‌ఎన్‌ఎస్ చికిత్సాలయ్‌ను ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రసూల్‌పురా: దేశాభివృద్ధిని ప్రతి పౌరుడూ సామాజిక బాధ్యతగా భావించాలని, స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. కంటోన్మెంట్ డైమండ్ పాయింట్ ట్రాన్స్‌పోర్ట్ రోడ్డులో హరియాణా నాగరిక్ సంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎన్‌ఎస్ చికిత్సాలయ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. దేశ ప్రగతికి వైద్య సేవలు పునాది వంటివన్నారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకతీతంగా ప్రజలందరికీ వైద్య సేవలు అందాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు హెచ్‌ఎన్‌ఎస్ చికిత్సాలయ్ వంటి స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. తెల్ల రేషన్‌కార్డుతో పాటు వివిధ రకాల బీమా కార్డుదారులకు అవసరమైన వైద్య సేవలు అందిస్తామని చికిత్సాలయ్ అధ్యక్షుడు పురుషోత్తం అగర్వాల్ అన్నారు. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద, చికిత్సాలయ్ ప్రతినిధులు పథమ్ జైన్, రాంగోయల్, ప్రధాన కార్యదర్శి దీపక్ బింబ్రాజ్, సుశీల్ అగర్వాల్, సందీప్ మిట్టల్, నారాయణ చౌదరి, రాజేందర్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

చిరుతా.. చిక్కవే..!

- కొనసాగుతున్న గాలింపు
- 14 ట్రాప్ కెమెరాల ఏర్పాటు
- లభించని ఆనవాళ్లు



మూసివేసిన ట్రెక్ పార్క్

మణికొండ: అటవీ అధికారులను చిరుత పులి ఉరుకులూ పరుగులూ పెట్టిస్తోంది. ఈ నెల 21న ఓ చిరుత నార్సింగి మున్సిపాలిటీ మంచిరేవులలోని పోలీస్ గ్రేహౌండ్స్‌లో కానిస్టేబుల్‌కు కనిపించింది. ఆ విషయాన్ని అటవీశాఖ అధికారులకు చెప్పడంతో ఏడు సీసీ కెమెరాలు, నాలుగు బోన్లను ఏర్పాటు చేశారు. 23న రోడ్డు దాటుతూ సీసీ కెమెరాలో కనిపించటం, సాయంత్రం ఓ ఎత్తయిన బండరాయిపై కూర్చుని పక్కనే ఉన్న విల్లాల నివాసితులకు కనిపించింది. 24న అర్ధరాత్రి గ్రేహౌండ్స్ నుంచి ఔటర్ రింగ్ రోడ్డు దాటి మంచిరేవుల రెవెన్యూలోని సర్వీసు రోడ్డుకు ఆనుకుని ఉన్న అటవీ ట్రెక్ పార్క్‌లోకి వచ్చింది. అటవీ అధికారులు అక్కడా మరో ఏడు సీసీ కెమెరాలు, రెండు బోన్లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రెక్ పార్క్‌లో ప్రజలు వాకింగ్ చేస్తుండటంతో వారికి ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని పార్క్‌ను మూసివేశారు. ఆదివారం రోజంతా ప్రత్యేక టీములు చిరుతను కనిపెట్టేందుకు కృషి చేశామని, అయినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని చిలుకూరు అటవీ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ట్రెక్ పార్క్, ఔటర్ సర్వీస్ రోడ్డు, గ్రే హౌండ్స్‌లలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వాట్సాప్‌తోనూ ప్రజావాణి అర్జీల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజావాణి'కి హాజరు కాలేని వయో వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు వాట్సాప్ ద్వారా తమ అర్జీలు పంపించవచ్చని కలెక్టర్ హరిచందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం సూచన మేరకు ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలకు మరింత చేరువ చేసే దిశలో భాగంగా ప్రత్యేకంగా ఒక వాట్సాప్ నంబర్ '74166 87878' కేటాయించినట్లు చెప్పారు. అర్జీదారులు వ్యయప్రయాసలకోర్చి కలెక్టరేట్‌కు వచ్చే వీల్లేకుండా వాట్సాప్ నంబర్‌కు తమ దరఖాస్తులు పంపిస్తే వాటిని సిబ్బంది డౌన్‌లోడ్ చేసుకుని అందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పోర్టల్‌లో నమోదు చేస్తారన్నారు. ఒక ఐడీ నంబర్ కేటాయించి అర్జీ ముట్టినట్లుగా సమాచారం అందిస్తామన్నారు. ఆయా శాఖ అధికారుల నుంచి నివేదిక వచ్చిన తర్వాత ఆ సమాచారాన్ని వ్యక్తిగత మొబైల్ నంబర్‌కు పంపిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిచందన సూచించారు.



హిమాయత్ సాగర్ జలాశయం



ఉస్మాన్ సాగర్ జలాశయం



'జంట'కు జల కళ!

జంట జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. ఆదివారం ఉస్మాన్‌సాగర్‌కు మూసీ ద్వారా 150 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా.. హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు ఈసీ ద్వారా 350 క్యూసెక్కుల వరద కొనసాగింది. ఉస్మాన్‌సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 1790 అడుగులకు గాను 1782.90 అడుగులకు చేరింది. హిమాయత్‌సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 1763.50 అడుగులకు గాను 1761.65 అడుగులకు వచ్చింది. – సాక్షి, సిటీబ్యూరో

నిబంధనలు నిర్వీర్యం!

నగరంలో స్పెర్మ్ కలెక్షన్ ఏజెన్సీలు!

- అనుమతులు లేకుండానే దందా
- నిరుద్యోగులు, చిరుద్యోగుల నుంచి వీర్యం సేకరణ
- మహిళల్లో ఉత్పత్తయ్యే ఎగ్స్‌కు భారీ డిమాండ్
- దేశంలోని అక్రమ సరోగసీ కేంద్రాలకు విక్రయం
- ఇండియన్ స్పెర్మ్ టెక్ క్లినిక్‌పై దాడితో నిజాలు వెలుగులోకి
- ఆరుగురు నిందితుల అరెస్టు, కొనసాగుతున్న దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: సరోగసీ (అద్దె గర్భం) పేరుతో శిశు విక్రయాల దందా చేస్తున్న యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారంతో పాటు మరో గలీజు దందా కూడా వెలుగులోకి వచ్చింది. సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయో సిస్టమ్స్‌పై దాడి చేసిన నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఇదో స్పెర్మ్ కలెక్షన్ ఏజెన్సీగా గుర్తించారు. ఇక్కడ అక్రమంగా ఎగ్, వీర్యం సేకరిస్తున్న నిర్వాహకులు దేశ వ్యాప్తంగా ఉన్న అనేక సరోగసీ, ఫెర్టిలిటీ సెంటర్లకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. నగరంలో ఇలాంటి ఏజెన్సీలు మరికొన్ని ఉన్నాయనే అనుమానంతో దర్యాప్తు, నిఘా ముమ్మరం చేశారు.

సరోగసీ యాక్ట్ మార్పులతో..

సంతానోత్పత్తి కోసం సరోగసీ పేరుతో జరుగుతున్న దందాకు చెక్ చెప్పడానికి కేంద్రం 2021లో 'ది సరోగసీ (రెగ్యులేషన్) యాక్ట్'ను అమలులోకి తీసుకువచ్చింది. దీంతో ప్రభుత్వ అనుమతితోనే, సంబంధీకుల ద్వారానే సరోగసీ ద్వారా బిడ్డలు పొందే అవకాశం ఉంది. దేశ వ్యాప్తంగా పెరిపోతున్న సంతాన లేమి సమస్యను దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం 2023లో ఈ చట్టంలో కొన్ని మార్పులు చేసింది. దీని ప్రకారం సంతానం ఆశించే భార్యాభర్తలు ఎగ్, స్పెర్మ్ డొనేషన్ విధానంలో తీసుకునే అవకాశం కల్పించింది. భార్యలో లోపం ఉంటే డోనర్ అయిన మహిళ నుంచి ఎగ్, భర్తలో లోపం ఉంటే డోనర్ అయిన పురుషుడి నుంచి స్పెర్మ్ తీసుకోవచ్చు. ఈ వ్యవహారాల్లో ఎక్కడా ఆర్థిక లావాదేవీలు, క్రయ విక్రయాలకు ఆస్కారం ఉండకూడదు.

అనేక ప్రాంతాల్లో వెలసిన కేంద్రాలు..

దీన్ని క్యాష్ చేసుకోవడానికి దేశ వ్యాప్తంగా అనేక అక్రమ కేంద్రాలు వెలిశాయి. సంతాన భాగ్యం లేని భార్యాభర్తల్లో ఉన్న లోపాలను క్యాష్ చేసుకోవడానికి దందాలు ప్రారంభించాయి. లైసెన్స్ ఉన్న అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ (ఏఆర్టీ) బ్యాంక్‌లకు అనుబంధంగా, వాటితో సంబంధం లేకుండా వెలసిన అక్రమ కలెక్షన్ ఏజెన్సీలు ఎన్నో ఉంటున్నాయి. ఓ రాష్ట్రం, నగరంలో దందా చేసే సరోగసీ కేంద్రంగా మరో ప్రాంతాల్లో ఉన్న ఏజెన్సీల నుంచి వీటిని ఖరీదు చేస్తున్నాయి. తమ ఉనికి, దందా బయటపడకుండా ఉండేందుకే ఇలా చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. వివిధ ప్రాంతాల్లో దళారులను ఏర్పాటు చేసుకుంటున్న ఈ ఏజెన్సీలు నిరుద్యోగులు, చిరుద్యోగులతో పాటు రహదారుల వెంట బతికే వాళ్లు, యాచకులను ఎంచుకుంటున్నారు.



పోలీసుల అదుపులో ఇండియన్ స్పెర్మ్ టెక్ సెంటర్ నిర్వాహకులు

భారీ మొత్తంతో క్రయవిక్రయాలు...

యువకులు అందించే వీర్యం కంటే మహిళలు అందించే ఎగ్‌కే డిమాండ్ ఎక్కువ. వీటిని విక్రయించే వాళ్లు తక్కువగా ఉండటమే దీనికి కారణమని పోలీసులు చెబుతున్నారు. తమ ఎగ్, స్పెర్మ్ విక్రయించడానికి వచ్చిన డోనర్‌కు తొలుత కొన్ని పరీక్షలు చేస్తున్నారు. వీటి ఫలితాలు, వారి వయసు, శరీర దారుఢ్యం తదితరాల ఆధారంగా ఎగ్ దాతకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు, స్పెర్మ్ దాతకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు చెల్లిస్తున్నారు. వీటిని నగరంతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న అక్రమ సెంటర్లకు రూ.వేల నుంచి రూ.లక్షల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా సాగుతున్న ఈ దందానే అక్రమ సరోగసీ వ్యవహారాలకు మూలంగా మారుతోందని అధికారులు చెబుతున్నారు.

దానం, పరిహారం పేరుతో దందా...

ఆ నగరంలో 'ఇండియన్ స్పెర్మ్ టెక్' పేరుతో స్పెర్మ్ బ్యాంక్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' పేరుతో ఓ సంస్థ నడుస్తోంది. దానికి, ఈ ఏజెన్సీకి సంబంధాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయోసిస్టమ్స్ సంస్థ తమ దందాను చిన్న చిన్న విజిటింగ్ కార్డుల ద్వారా ప్రచారం చేసుకుంటోంది. ఆ సంస్థలో ఉన్న వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డోనర్‌గా వచ్చే వారి నుంచి పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటో, గుర్తింపు కార్డు, ఓడీఎస్ ఒరిజినల్, జిరాక్సు ప్రతులు సేకరిస్తున్నారు. నగరంలో ఇలాంటి ఏజెన్సీలు మరికొన్ని ఉన్నాయని భావిస్తున్న పోలీసులు నిఘా ముమ్మరం చేశారు.

అహ్మదాబాద్ లింకులపై ఆరా..

నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం రెజిమెంటల్ బజార్‌లోని ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయోసిస్టమ్స్‌పై దాడి చేశారు. నిర్వాహకులైన పంకజ్, అమిత్ పాటిల్‌లతో సహా ఆరుగురిని అరెస్టు చేశారు. ఆ సమయంలో స్పెర్మ్ విక్రయించడానికి వచ్చిన 16 మంది యువకులను అదుపులోకి తీసుకుని విచారణ తర్వాత విడిచిపెట్టారు. వీరిని ఈ కేసులో సాక్షులుగా పరిగణించే అవకాశం ఉంది. ఇండియన్ స్పెర్మ్ టెక్ క్రయోసిస్టమ్స్‌లో ఎగ్, స్పెర్మ్‌ను శాస్త్రీయంగా సేకరించడానికి, నిల్వ చేయడానికి అవసరమైన పరికరాలను సీజ్ చేశారు. దీని నిర్వాహకులు నీలి చిత్రాలు చూపించి స్పెర్మ్ సేకరిస్తున్నారనే వార్తలు వస్తున్నా... దీన్ని పోలీసులు కొట్టిపారేస్తున్నారు. ఇక్కడ సేకరించిన ఎగ్, స్పెర్మ్ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు పంపిస్తున్నట్లు పంకజ్ బయటపెట్టారు.

'మత్తు'బాబుల్లో మార్పు వస్తోంది.. తమకు ఉన్న వ్యసనాన్ని మానుకోవడానికి డీ అడిక్షన్ కోసం ప్రయత్నిస్తున్నారు.. దీనికోసం ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. గడచిన ఐదేళ్లలో ఈ సంఖ్య గణనీయంగా పెరిగింది. ఒక్క ఎర్రగడ్డ మానసిక వైద్యశాల (ఐఎంహెచ్) విషయాన్నే తీసుకున్నా డీ అడిక్షన్ రోగుల సంఖ్య 2020–21లో 701 ఉండగా 2024–25లో (జనవరి వరకు) ఇది ఏకంగా 9,832కు చేరింది. ఈ పేషెంట్లలో మత్తు పదార్థాలతో పాటు కొద్ది సంఖ్యలో మద్యం బానిసలూ ఉంటారని వైద్యులు చెబుతున్నారు. పోలీసులు, ప్రత్యేక ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యలు, తల్లిదండ్రుల్లో పెరిగిన అవగాహనే దీనికి కారణమని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. –సాక్షి, సిటీబ్యూరో

దారికొస్తున్నారు!

డీ అడిక్షన్ కోసం ఆస్పత్రి బాటపడుతున్న 'కన్స్యూమర్లు'

- మద్యం, మాదకద్రవ్యాలకు దూరం కావడానికే ఇలా..
- స్పష్టం చేస్తున్న ఎర్రగడ్డ మానసిక వైద్యశాల గణాంకాలు
- 2020-21లో ఈ రోగుల సంఖ్య 701, గత ఏడాది 9,832
- పోలీసులతో పాటు ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యలతోనే



ఇలా మొదలై అలా మారిన వాళ్లే ఎక్కువ..

మద్యంతో పాటు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్న వారిలో అత్యధికులు సరదా కోసమో, స్నేహితుల బలవంతంతోనో ఈ ఉచ్చులోకి దిగుతున్నారు. తొలినాళ్లల్లో సిగరెట్, మద్యంతో మొదలవుతున్న ఈ వ్యసనాలు ఆపై గంజాయి వరకు వెళ్తున్నాయి. ఓ దశలో గంజాయి వినియోగంతోనూ సంతృప్తి చెందక కొకైన్, ఎండీఎంఏ, ఎండీ వంటి సింథటిక్ డ్రగ్స్ వరకు వెళ్తున్నారు. వీటిని పూర్తిగా బానిసలుగా మారిపోతున్న ఈ కన్స్యూమర్లు తొలుత పెడ్లర్స్ నుంచి ఖరీదు చేస్తున్నారు. అంత మొత్తం వెచ్చించి ఖరీదు చేయలేకపోయిన వాళ్లు, ఈ దందాలో భారీ లాభాలు ఉంటాయని భావించిన 'కన్స్యూమర్లు' కొన్నాళ్లకు పెడ్లర్స్‌గా ఆపై సప్లయర్స్‌గా మారి డ్రగ్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నారు.

అప్పట్లో ఉపేక్షించినా ఇప్పుడు కేసులు..

మాదకద్రవ్యాల నిరోధక (ఎన్డీపీఎస్) చట్టం ప్రకారం డ్రగ్స్‌కు బానిసల్ని బాధితులుగా చూసే అవకాశం కూడా ఉంది. వీరిలో మార్పు కోసం ప్రయత్నించే అవకాశాన్ని ఈ చట్టం ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఒకప్పుడు వినియోగదారుల విషయాన్ని ఎక్కువగా పట్టించుకునే వాళ్లు కాదు. అయితే.. వీరి వల్ల డ్రగ్ నెట్‌వర్క్ విస్తరిస్తున్న విషయం తెలియడంతో పాటు డిమాండ్‌ను తగ్గిస్తేనే సప్లై చైన్ కట్ చేయవచ్చని గుర్తించిన అధికారులు తమ పంథా మార్చారు. తరచుగా డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగించే, డ్రగ్ నెట్‌వర్క్ విస్తరణకు అవకాశం ఉందని ఆధారాలు లభించిన కన్స్యూమర్లపై ఎన్డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 27 (ఏ) వినియోగిస్తున్నారు. దీని ప్రకారం అరెస్టు చేసే అవకాశం లేకపోయినా వారినీ కేసులో నిందితులుగా చేర్చే అవకాశం ఉంటోంది.

అధికారుల తీరుతెన్నులు మారిపోవడంతో..

గంజాయి, డ్రగ్స్ నిరోధం కోసం పని చేయడానికి ఒకప్పుడు కేవలం పోలీసులు, ఎక్సైజ్ విభాగాలతో పాటు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) మాత్రమే ఉండేది. పోలీసులకు వీటిపై దృష్టి పెట్టేంత తీరిక ఉండేది కాదు. ఆ తర్వాత టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఆపరేషన్ టీమ్స్ (ఎస్వోటీ), హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ), ఈగల్ వంటి ప్రత్యేక వింగ్స్ పుట్టుకు వచ్చాయి. ఇవి సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ ప్రతి డ్రగ్ కేసులోనూ మూలాల వరకు వెళ్లి కన్స్యూమర్లను గుర్తిస్తున్నాయి. అలా వారినీ నిందితులుగా చేర్చడంతో పాటు నోటీసులు, అరెస్టులు చేస్తున్నాయి. ఆయా వినియోగదారుల కుటుంబీకులు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నాయి. దీంతో పాటు డ్రగ్స్ వినియోగదారుల లక్షణాలు, నష్టాలపై అవగాహన పెరగటంతోనూ నగరంలో రీహ్యాబ్‌కు డిమాండ్ పెరుగుతోందని పోలీసులు చెబుతున్నారు.

ఐఎంహెచ్ డేటా ప్రకారం..

ఏడాది	డీ–అడిక్షన్ పేషెంట్లు
2020-21	701
2021-22	2412
2022-23	4720
2023-24	7140
2024-25 (జనవరి)	9832

తుక్కు పాలసీ తుస్సు!

నగరంలో భారీగా కాలం చెల్లిన బండ్లు

- వాహనదారుల నుంచి కొరవడిన స్పందన
- పాతవాటిని వదులుకోవడంపై నిరాసక్తత
- ప్రోత్సాహకాలు కల్పిస్తామన్నా పట్టించుకోని వైనం

సాక్షి, సిటీబ్యూరో: కాలం చెల్లిన వాహనాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తుక్కు పాలసీ తుస్సుమంటోంది. 15 ఏళ్లు దాటిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చే వాహనదారులకు రవాణాశాఖ సముచితమైన ప్రోత్సాహకాలను ప్రకటించినా వాహనదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రావడం లేదు. ఢిల్లీ వంటి నగరాల్లో కాలం చెల్లిన వాహనాలపై నిర్బంధంగా నిషేధం విధిస్తున్నారు. హైదరాబాద్‌లో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. పాత వాహనాలను తుక్కుగా మార్చేందుకు ప్రత్యేక కేంద్రాలను కూడా ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం ఒక నెల వ్యవధిలో కనీసం 25 వాహనాలు కూడా తుక్కు కావడం లేదని అధికారులు చెబుతున్నారు. తుక్కు బండ్లు రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ పొగలు చిమ్ముతున్నాయి. ప్రమాదకరమైన సల్ఫర్, కార్బన్‌మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలతో ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి.

వ్యక్తిగత వాహనాలే టాప్...

- నగరంలో 15 ఏళ్లు దాటిన వాటిలో వ్యక్తిగత వాహనాలే టాప్‌లో ఉన్నాయి. రవాణా శాఖ లెక్కల ప్రకారం సుమారు 17 లక్షల బైక్‌లు, మరో 3.5 లక్షల కార్లు తిరుగుతున్నాయి. రవాణా వాహనాల కేటగిరీలో ఆర్టీసీ బస్సులు, స్కూల్ బస్సులు, ఆటోలు తదితర వాహనాలు సైతం కాలపరిమితి ముగిసిన తర్వాత కూడా వినియోగంలో ఉన్నాయి. ఇవి కాకుండా మరో లక్ష వరకు సరుకు రవాణా వాహనాలు ఉన్నట్లు అంచనా. గ్రేటర్‌లో 13 వేలకుపైగా స్కూల్ వాహనాలు ఉంటే వాటిలో 2500 వరకు డొక్కు బస్సులే.
- సుమారు 1.4 లక్షల ఆటోరిక్షాల్లో కనీసం 25 వేలకు పైగా కాలం చెల్లినవే. ఇవి కాకుండా వెయ్యికి పైగా ఆర్టీసీ బస్సులు, 4 వేల మ్యాక్సీ క్యాబ్‌లు ఉన్నాయి. ఇటు వ్యక్తిగత వాహనాలు, అటు రవాణా వాహనాలు అన్నీ కలిపి 25 లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ఈ వాహనాల నుంచి వెలువడే కాలుష్య కారకాల్లో పీఎం స్థాయి 2.5 శాతం వరకు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాహనాల కండీషన్ బాగా లేకపోవడం వల్ల, ఇంజన్ దెబ్బతినడం, బ్రేకులు ఫెయిల్ కావడం వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.



గ్రీన్ ట్యాక్స్ చెల్లిస్తే సరి..

- మోటారు వాహన చట్టం ప్రకారం 15 ఏళ్లు దాటిన రవాణా వాహనాలు గ్రీన్‌ట్యాక్స్ చెల్లించి మరో 5 ఏళ్ల వరకు రెన్యువల్ చేసుకోవచ్చు. 20 ఏళ్లు దాటిన వ్యక్తిగత వాహనాలకు సైతం రిజిస్ట్రేషన్ పునరుద్ధరణ సదుపాయం ఉంది.
- ఈ వెసులుబాటుతో స్వచ్ఛంద స్క్రాపింగ్‌కు స్పందన రావడం లేదు. చాలామంది రెండో వాహనం ఉన్నప్పటికీ మొదటి వాహనాన్ని వదులుకోవడానికి నిరాకరిస్తున్నారు. ఒక ఇంట్లో ఒక పాత కారు, ఒక కొత్త కారు తప్పనిసరి అవసరంగా వినియోగిస్తున్నారు.
- ద్విచక్ర వాహనాల విషయంలోనూ పాతవి, కొత్తవి ఉంటున్నాయి. కానీ పాతవాటిని మాత్రం వదులుకోవడం లేదు.

ప్రోత్సాహకాలు ఇలా..

- కాలపరిమితి ముగిసిన వాహనాలను స్వచ్ఛందంగా తుక్కుగా మార్చుకొనే వాహనదారులకు కొత్తవాటి కొనుగోళ్లలో ప్రభుత్వం సముచితమైన ప్రోత్సాహాన్ని అందజేస్తుంది
- కొత్త వాహనాల జీవితకాల పన్నులో రాయితీని ఇస్తున్నారు.
- రూ.5 లక్షల విలువైన వాహనాల కొనుగోలుపై రూ.10 వేల రాయితీ ఉంటుంది
- రూ.5- 10 లక్షల ఖరీదైన వాహనాలపై రూ.20,000
- రూ.10-15 లక్షల ఖరీదు చేసేవాటిపై రూ.30,000
- రూ.15- 20 లక్షల వరకు విలువైన వాహనాలను కొనుగోలు చేస్తే రూ.40,000 చొప్పున రాయితీ ఇస్తారు.
- తమ పాత వాహనాల తుక్కు సర్టిఫికెట్‌లను ఆర్టీఏలో అందజేస్తే ఈ రాయితీ లభిస్తుంది.

నీటిలో మునిగి బీటెక్ విద్యార్థి గల్లంతు



గాలింపు చేపడుతున్న డీఆర్ఎఫ్ బృందం



అక్షిత్ రెడ్డి (ఫైల్)

రాజేంద్రనగర్: వాటర్ ఫాల్స్ చూసేందుకు వచ్చిన బీటెక్ విద్యార్థి ప్రమాదవశాత్తు కాలు జారిపడి నీటిలో మునిగి గల్లంతైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్స్టేషన్ పరిధిలో జరిగింది. రాజేంద్రనగర్ ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన అక్షిత్‌రెడ్డి(24) బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాడు. ఆదివారం తన స్నేహితులైన రోహిత్, పవన్, అనీల్‌లతో కలిసి బైక్‌లపై ఉప్పర్‌పల్లి మొండితత్వ ప్రాంతానికి చెరుకున్నారు. అంతకుముందు వారు గూగుల్‌లో నగరానికి సమీపంలోని వాటర్ ఫాల్స్ కోసం సెర్చ్ చేయగా ఈ ప్రాంతాన్ని చూపించింది. అన్నింటికంటే దగ్గరగా ఉండటంతో నలుగురూ ఆదివారం మధ్యాహ్నం అక్కడికి చేరుకున్నారు. ఫొటోలు దిగుతూ రీల్స్ చేస్తూ సందడి చేశారు. అనంతరం అక్షిత్ రెడ్డి వాటర్ ఫాల్స్ మీదుగా ముందుకు నడుస్తూ కాలుజారి నీటిలో పడిపోయాడు. మిత్రులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినా అతడికి ఈత రాకపోవడంతో నీటిలో మునిగి గల్లంతయ్యాడు. దీంతో వారు 100కు డయల్ చేసి సమాచారం అందించడంతో రాజేంద్రనగర్ పోలీసులు డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న డీఆర్ఎఫ్ బృందం సాయంత్రం వరకు గాలించినా అతని జాడ తెలియరాలేదు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. గతంలోనే ఇదే జలపాతంలో నలుగురు నీట మునిగి మృతి చెందడంతో కంచె ఏర్పాటు చేశారు. అయినా కంచెను తొలగించి నీటిలో ఈదడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలోనే అక్షిత్ రెడ్డి మృతి చెందాడు.

వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ కోట ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో కొనసాగుతున్న కళాశాలలో బీఎస్సీ ఎంపీసీఎస్, ఎంఎస్‌సీఎస్, బీఏ, హెచ్‌ఈపీ కోర్సు ల్లో చేరేందుకు ఎస్సీ మహిళా అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తులు నేరుగా కళాశాలలో సమర్పించాలని సూచించారు. దరఖా స్తుకు 10వ తరగతి, ఇంటర్ మెమో, టీసీ జిరాక్స్ కాపీలు, 2025 జనవరి 01 తర్వాత జారీ చేసిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్ ఫొటోలు జతచేయాలని తెలిపారు. వివరాలకు 98855 04397 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వైద్యారోగ్య శాఖలో.. లీకు వీరులు..

తనిఖీలపై ముందస్తు సమాచారం

- అక్రమార్కుల నుంచి భారీగా వసూళ్లు
- మెడికల్ కౌన్సిల్ కేసులను పట్టించుకోని డీఎంహెచ్‌ఓలు
- యథేచ్ఛగా నకిలీ వైద్యులు, అనధికార ఆసుపత్రుల నిర్వహణ



అడ్డగుట్టలో మెడికల్ షాప్‌లో అక్రమంగా కొనసాగుతున్న క్లినిక్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో అనుమతులు లేకుండా ఆసుపత్రులు, క్లినిక్‌లు కొనసాగుతున్నాయి. ఎలాంటి అర్హతలు లేకుండానే వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. సదరు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులకు నివేదికలు ఇచ్చినా వాటిని పట్టించుకోవడం లేదు. ఇప్పటి వరకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సుమారు 150కి పైగా కేసులు నమోదు కాగా తదుపరి చర్యలు తీసుకోవడంలో డీఎంహెచ్‌ఓలు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో కేసు నమోదైనా సదరు నకిలీ వైద్యులు, అనధికార ఆసుపత్రులు యథావిధిగా కొనసాగుతున్నాయి. దీనికి తోడు మరికొందరు హెల్త్ ఆఫీసర్లు అడ్డదారులు తొక్కే వారిలో కుమ్మక్కై ఉన్నతాధికారుల కదలికలపై ముందస్తుగా సమాచారం అందిస్తున్నారు. దీంతో అక్రమార్కులు తప్పించుకుని తిరుగుతున్నారు. సృష్టి ఫెర్టిలిటీ కేంద్రానికి 2021తో గడువు ముగిసింది. దీనిపై కేసులు నడుస్తున్నాయి. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ రద్దయినా నాలుగేళ్లుగా అనధికారికంగా ఆసుపత్రి నడిపిస్తున్నారు. అయితే 2021 నుంచి గ్రేటర్ పరిధిలోని హెల్త్ ఆఫీసర్లు నాలుగు దఫాలు తనిఖీలు చేపట్టారని, ఎప్పుడు వెళ్లినా ఆసుపత్రి మూసి ఉందని నివేదికల్లో పేర్కొనడంపైనా అనుమానాలు తలెత్తుతున్నాయి. అనధికారిక ఆసుపత్రులపై అధికారుల తనిఖీలకు సంబంధించి సిబ్బంది ముందే సమాచారం లీక్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రతిఫలంగా పెద్దమొత్తంలో ముడుపులు అందుతున్నట్లు సమాచారం. దీంతో అక్రమార్కుల అడ్డగోలు వ్యాపారాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది.

గల్లీకో ఫెర్టిలిటీ సెంటర్..

గ్రేటర్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం లెవల్–1 ఫెర్టిలిటీ కేంద్రాలు 27 ఉండగా, లెవల్–2 ఐయూఐ, ఐవీఫ్ కేంద్రాలు 72, సరోగసీ సెంటర్లు 32 ఉన్నాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, దిల్‌సుఖ్‌నగర్, మెహిదీపట్నం, సికింద్రాబాద్, మేడ్చల్, ఉప్పల్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, మియాపూర్, కొండాపూర్, తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ఐవీఎఫ్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. వీటిలో అనుమతులు ఉన్నవి ఎన్ని, అనధికారికంగా నడుస్తున్నవి ఎన్ని అనేది ఎవరికి అంతుచిక్కని ప్రశ్నగానే మారింది. ఇదిలా ఉండగా ప్రముఖ ఆసుపత్రుల్లోనూ సంతాన సాఫల్య కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఒక రకమైన అనుమతులు తీసుకుని, మరో రకమైన వైద్యం అందిస్తున్న ఆసుపత్రులను పట్టించుకునే నాథుడే లేడు. ఐవీఎఫ్ కేంద్రాలను ఏడాదికి ఒకసారి, స్కానింగ్ సెంటర్లను ప్రతి మూడు నెలలకు ఒక సారి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారులు తనిఖీ చేయాల్సి ఉంటుంది. అయితే తనిఖీలు తూతూమంత్రంగానే కొనసాగుతున్నాయి. నగర పరిధిలో 10 మంది హెల్త్ ఆఫీసర్లు ఉన్నారు. వందల సంఖ్యలో ఆసుపత్రులు వెలుస్తున్నాయి. వీరికి తలకుమించిన భారంగానే కనిపిస్తోంది.

అనుమతులు తీసుకుంటున్నారా?

సరోగసీ ట్రీట్‌మెంట్ తీసుకోవాలంటే ఒక ప్రొసీజర్ ఉంటుంది. దీనికి ముందుగా జిల్లా వైద్యారోగ్య శాఖలో గైనిక్, పిల్లల వైద్యులతో కూడిన కమిటీ ఉంటుంది. ఈ కమిటీ సర్టిఫికెట్ ఆధారంగా లీగల్‌గా కోర్టు నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. బిడ్డను పెంచడానికి రక్త సంబంధీకులు, బంధువుల్లో ఎవరైనా ముందుకు రావాల్సి ఉంటుంది. ఇప్పుడు జరుగుతున్న వాటిలో కాగితాలపై ప్రొసీజర్ కనిపిస్తున్నప్పటికి వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. దీనిపై శాఖా పరమైన పర్యవేక్షణ కొరవడుతోంది. ఇదే అదునుగా అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారు. ఇందులో కొంత మొత్తాన్ని గిఫ్టులు, టూర్ ప్యాకేజీలు, ఇతర దారుల్లో వైద్య సిబ్బంది అందుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మహిళ ఆత్మహత్యాయత్నం

భర్త, కుమారుడికి గాయాలు..



గాయపడిన సువర్ణ

నాగోలు: మద్యానికి బానిసైన భర్త ప్రతి రోజూ తాగి వచ్చి కొడుతుండటంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఒంటిపై టర్పెంట్ ఆయిల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నాగర్‌కర్నూలు జిల్లా, డిండి మండలం, ఎత్తారుకు చెందిన కుందేటి సువర్ణ, కర్నూలు జిల్లాకు చెందిన ఆదిద రాజు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారు గత 7 నెలలుగా నాగోలు చాణక్యపురి కాలనీలోని కమిటీ హాల్‌లో వాచ్‌మెన్ పనిచేస్తూ అక్కడే గదిలో ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. మద్యానికి బానిసైన రాజు తరచూ భార్య వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం రాజు మద్యం మత్తులో ఇంటికి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి లోనైన ఆమె టర్పెంట్ ఆయిల్ పోసుకుని నిప్పంటించుకుంది. అక్కడే ఉన్న రాజు మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా అతడితో పాటు, సమీపంలో ఉన్న వారి చిన్న కుమారుడు లోహిత్ (09)కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడి చేరుకుని సువర్ణకు ప్రథమ చికిత్స అందించి గాయపడిన ముగ్గురినీ గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. సువర్ణ బంధువుల ఫిర్యాదు మేరకు నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో టోకరా

- రూ. లక్షల్లో వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- పట్టించుకోని అధికారులు



నిర్మల్‌బాబు ఇచ్చిన చెక్కు



నిర్మల్‌బాబు ఐడీకార్డు

జీడిమెట్ల: డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో పలువురిని మోసం చేసి రూ. లక్షల్లో వసూలు చేసిన ఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అపురూపా కాలనీకి చెందిన నిర్మల్‌బాబు అనే వ్యక్తి తాను జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్నట్లు చెప్పుకునేవాడు. ఎస్.ఆర్.నాయక్‌నగర్, షాపూర్‌నగర్, సాయిబాబానగర్, పాండుబస్తీలకు చెందిన వారితో స్నేహంగా ఉండేవాడు. తనకు మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులు తెలుసునని డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని నమ్మించి షాపూర్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్, బి.శ్రీనివాస్, విజయ్‌కుమార్‌ల నుంచి రూ.4లక్షలు వసూలు చేశాడు. అంతేగాక విజయ్‌కుమార్ తన బంధువులు, స్నేహితులు మరో 24మంది వద్ద నుండి రూ.2 లక్షల చొప్పున వసూలు చేసి రూ.48 లక్షలు నిర్మల్‌బాబుకు ఇచ్చాడు. అదే విధంగా ఎస్.ఆర్.నాయక్‌నగర్‌కు చెందిన మనోహర్ తన స్నేహితులు యూనూస్, సంపత్‌సింగ్, మరో వ్యక్తి రూ.8లక్షలు నిర్మల్‌బాబుకు ముట్టజెప్పారు. ఏళ్లు గడుస్తున్నా డబుల్‌బెడ్‌రూం ఇళ్లు రాకపోవడంతో వారు నిర్మల్‌బాబును నిలదీయగా గత జనవరి 26న అందరికీ అలాట్‌మెంట్ పత్రాలు ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. అయితే ఆ తర్వాత కూడా ఎలాంటి పత్రాలు ఇవ్వకపోవడంతో వారు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో కాలయాపన చేస్తున్నాడు. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు జీడిమెట్ల పోలీసులకు ఆశ్రయించారు. అయితే పోలీసులు తమను పట్టించుకోవడం లేదని మీడియా ఎదుట వాపోయారు. నిర్మల్‌బాబుకు వివిధ పోలీస్ స్టేషన్లలో ఉన్న పరిచయాలతో అతడిపై కేసులు నమోదు చేయడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ల్యాండ్ సర్వేయర్ల అర్హత పరీక్షకు 29 మంది

- 74 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



సాక్షి, రంగారెడ్డి జిల్లా: లైసెన్స్‌డ్ ల్యాండ్ సర్వేయర్ల అర్హత పరీక్షకు సంబంధించి పాలమాకులలోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఆదివారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తనిఖీ చేశారు. నిర్వహణ తీరును పరిశీలించి అభ్యర్థుల హాజరు వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కొనసాగిన పరీక్షకు 403 మంది అభ్యర్థులకు గాను 29 మంది హాజరయ్యారని, 74 మంది గైర్హాజరయ్యారు. అదనపు కలెక్టర్ వెంట జిల్లా సర్వే అండ్ ల్యాండ్స్ అధికారి కె.శ్రీనివాస్, రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్ దత్, తదితరులు ఉన్నారు. బాలాపూర్ మండలం జిల్లెలగూడ జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన గ్రామ పాలన అధికారి పరీక్షా కేంద్రాన్ని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఏఓ సునీల్ తనిఖీ చేశారు. వీరి వెంట మండల తహసీల్దార్ ఇందిరా దేవి ఉన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 111 అభ్యర్థులకు గాను 101 మంది హాజరవగా 10 మంది గైర్హాజరయ్యారు.

నేడు యూసుఫ్‌గూడలో ట్రాఫిక్ మళ్లింపులు



తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే..

బంజారాహిల్స్: ఈ నెల 28న సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు యూసుఫ్‌గూడ బెటాలియన్ పోలీసు లైన్స్‌లో కింగ్‌డమ్ సినిమా ప్రీ రిలీజ్ వేడుక నేపథ్యంలో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ మళ్లింపు చేపడుతున్నట్లు ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే తెలిపారు. కార్యక్రమానికి సాధారణ ప్రజలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరుకానుండడంతో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు చేపట్టినట్లు తెలిపారు.

- కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వైపు వచ్చే వాహనదారులు ఇతర మార్గాల్లో వెళ్లాలని సూచించారు.
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు నుంచి విజయభాస్కర్‌రెడ్డి స్టేడియం వైపు వచ్చే వాహనదారులు కృష్ణానగర్ జంక్షన్ నుంచి శ్రీనగర్‌కాలనీ, పంజగుట్ట వెళ్లాలన్నారు.
- మైత్రీవనం వైపు నుంచి జూబ్లీహిల్స్, మాదాపూర్ వైపు వెళ్లే వాహనదారులు యూసుఫ్‌గూడ బస్తీ మీదుగా ఆర్‌బీఐ క్వార్టర్స్, కృష్ణానగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు వెళ్లాలన్నారు.
- బోరబండ బస్టాపు వైపు నుంచి మైత్రీవనం వెళ్లే వాహనదారులు ప్రైమ్ గార్డెన్ కళ్యాణ్‌నగర్, మిడ్‌ల్యాండ్ బేకరీ, జెటీఎస్‌కాలనీ, కళ్యాణ్‌నగర్ జంక్షన్, ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద యూటర్న్ తీసుకుని ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద యూటర్న్ చేసుకుని మైత్రీవనం వైపు వెళ్లాలన్నారు.
- మెట్రో స్టేషన్ జానకమ్మతోటలో, సవేరా ఫంక్షన్ హాల్, మహమూద్ ఫంక్షన్ హాళ్లలో పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు.

ప్రేమ పేరుతో మోసం

వైద్య విద్యార్థిపై కేసు నమోదు

అమీర్‌పేట: పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని గర్భవతిని చేసి మోసం చేసిన వైద్య విద్యార్థిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్గొండ జిల్లా, పలుగుతాండాకు చెందిన యువతి చార్మినార్‌లోని ప్రభుత్వ నిజామియా టీబీ కళాశాలలో బీయూఎంఎస్ చదువుతోంది. గత ఫిబ్రవరిలో ఆమెకు సనత్‌నగర్ ఈఎస్ఐసీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న అనిల్ రాథోడ్‌తో పరిచయం ఏర్పడింది.ఈ పరిచయం ప్రేమకు దారి తీసింది. కుటుంబ సభ్యుల అంగీకారంతో పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఎస్ఆర్‌నగర్‌లోని ఓయో లాడ్జికి తీసుకెళ్లాడు. ఫలితంగా సదరు యువతి గర్భం దాల్చింది. అయితే రాథోడ్ ఇటీవల మరో యువతితో సన్నిహితంగా ఉంటున్నట్లు తెలియడంతో బాధితురాలు తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అందుకు నిరాకరించిన రాథోడ్ ఆమె నుంచి దూరంగా ఉంటున్నాడు. పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లై ఓవర్ నుంచి పడి వ్యక్తి మృతి

సంతోష్‌నగర్: ప్రమాదవశాత్తు అపోలో డీఆర్‌డీఓ ఫ్లై ఓవర్ పై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కమల్ కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. చంపాపేట్ హరిజనవాడకు చెందిన నరసింహ (64) చిత్తు కాగితాలు ఏరుకుని జీవనం సాగించేవాడు. ఆదివారం అతను డీఆర్‌డీఓ ఫ్లైఓవర్‌పై చెత్త పేపర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూసెన్స్ చేయొద్దన్నందుకు..

హెడ్ కానిస్టేబుల్‌పై యువకుల దాడి

అమీర్‌పేట: అదనపు డీజీ ఇంటి వద్ద న్యూసెన్స్ చేయకుండా అక్కడి నుంచి వెళ్లి పోవాలని చెప్పినందుకు హెడ్ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడిన ముగ్గురు యువకులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎస్ఆర్‌నగర్ క్వార్టర్స్ నెంబర్ 4లో ఐపీఎస్ అధికారి, అదనపు డీజీ డీఎస్. చౌహాన్ నివాసముంటున్నారు. శనివారం రాత్రి హెడ్ కానిస్టేబుల్ చౌడం భాస్కర్ అక్కడ సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఇంటి వెనక న్యూసెన్స్ చేస్తున్న నవీన్ కుమార్, అనిల్ కుమార్, హరికృష్ణ అనే వ్యక్తులను అక్కడి నుంచి వెళ్లి పోవాలని భాస్కర్ సూచించాడు. దీంతో అతడితో వాగ్వాదానికి దిగిన వారు అతడిని దూషించడమేగాక దాడి చేశారు. తనపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రాజ్యాంగం జోలికొస్తే బీజేపీ భూస్థాపితం'

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగం జోలికొస్తే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భూస్థాపితం కాక తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ 5వ వర్ధంతిని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సామెల్ అధ్యక్షతన ఆదివారం పాషనరహరి స్మారక కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, అదానీ, అంబానీ చేతుల్లో మోదీ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతోందని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా సవరణలు చేసి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. కార్మికులు 12 గంటలు పనిచేయాలని, ఇచ్చినంత వేతనం తీసుకోవాలనే విధానాన్ని అమలుకు యత్నిస్తోందన్నారు. విద్య, వైద్యరంగాలను విస్మరించిదననారు. ప్రజా సమస్యలను విస్మరించి బూతులను వల్లె వెస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలను ఎండగట్టాల్సిన అవసరం వుందన్నారు. అసమానతలు లేని సమాజ నిర్మాణం కమ్యూనిస్టులకే సాధ్యమన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహఎంతో కృషిచేసారని కొనియాడారు. సందర్భంగా నర్సింహ్మా చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఎం నేతలు నివాళులు అర్పించారు.

ప్రాణం తీసిన వేగం

- డీసీఎంను ఢీ కొట్టిన బైక్..
- ఒకరి మృతి..
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు..



శివంరామ్ మృతదేహం



డీసీఎం కింద పడి ఉన్న బైక్

జీడిమెట్ల: బైక్ అదుపుతప్పి ఆగి ఉన్న డీసీఎంను ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన శివంరామ్(18), సూరజ్, గోలు కుమార్ బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి జగద్గిరిగుట్టలోని మగ్దూంనగర్‌లో ఉంటున్నారు. సూరజ్ బైక్ మెకానిక్‌గా పని చేస్తుండగా శివంరాం కూలీగా, గోలుకుమార్ మెకానిక్‌గా పని చేసేవారు. ఆదివారం వారు ముగ్గురు కలిసి బైక్‌పై ఐడీపీఎల్ వైపు వెళ్తున్నారు. సూరజ్ బైక్ నడుపుతుండగా శివం మధ్యలో, గోలుకుమార్ వెనుక కూర్చున్నాడు. అతి వేగం కారణంగా వీరు ప్రయాణిస్తున్న బైక్ గాంధీనగర్ సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న డీసీఎంను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో జీడిమెట్ల పోలీసులు వారిని చికిత్స నిమిత్తం మల్లారెడ్డి అస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శివంరాం మృతిచెందాడు. గాయనపడిన సూరజ్, గోలుకుమార్‌లను గాంధీ అస్పత్రికి తరలించారు. జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగుదామని తీసుకెళ్లి దాడి



గాయపడిన రామ్‌దాస్

నిజాంపేట్: మద్యం తాగుదామని ఓ వ్యక్తిని తీసుకెళ్లి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నానావత్ రామ్ దాస్ (35) అనే వ్యక్తి రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నాడు.శనివారం రాత్రి అతడి ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి నీ భార్య జ్యోతి జగన్ స్టూడియో సమీపంలోని రొట్టెల దుకాణం వద్దకు రమ్మంటుందని తీసుకెళ్లాడు. అక్కడ కొద్ది సేపు ఉన్న తర్వాత మద్యం తాగుదామని అక్కడి నుంచి తీసుకెళ్లాడు. వీఎన్ఆర్ కాలేజీ సమీపంలోని వైన్స్ షాప్‌లో మద్యం కొనుగోలు చేసి భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ రోడ్డులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ మరో ఇద్దరు ఉన్నారు. రామ్‌దాసుకు మద్యం తాగించిన అనంతరం ముగ్గురూ కలిసి అతడిపై బీరు బాటిళ్లతో తీవ్రంగా కొట్టి అక్కడే వదిలివేశారు. అర్ధరాత్రి స్పృహలోకి వచ్చిన వచ్చిన తర్వాత రామ్‌దాస్ అతికష్టంపై నిజాంపేట్‌లోని తన సోదరుడి ఇంటికి చేరుకున్నాడు. అతను 100కు సమాచారం అందించగా, పోలీసుల సూచన మేరకు రామ్‌దాస్‌ను ఆసుపత్రిలో చేర్పించాడు.

భార్యపైనే అనుమానం....

వనపర్తి జిల్లా , పెద్దగూడెం తాండకు చెందిన నానావత్ రామ్ దాస్‌కు అదే జిల్లా, మర్రికుంటకు చెందిన జ్యోతితో 2009లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. వారి మధ్య విభేదాలు రావడంతో మూడేళ్లుగా విడి విడిగా ఉంటున్నారు. భర్త వేధిస్తున్నట్లు జ్యోతి వనపర్తిలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఈ కేసుపై కోర్టులో విచారణ కొనసాగుతోంది. పిల్లలతో కలిసి రామ్ దాస్ తన సొంతూరులోనే ఉంటున్నాడు. అతడి భార్య జ్యోతి నిజాంపేట్‌లోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటోంది. నెల రోజుల క్రితం పెద్దల సమక్షంలో పంచాయతీ జరగడంతో కలిసి ఉంటామని చెప్పిన జ్యోతి భర్తను తీసుకుని హైదరబాద్‌కు వచ్చింది. తనను హత్య చేసేందుకే తన భార్య జ్యోతి పథకం ప్రకారం దాడి చేయించిందని రామ్‌దాస్ ఆరోపిస్తున్నాడు.

జీరో ఎఫ్ఐఆర్ నమోదు..

దాడి జరిగిన ప్రాంతం దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోనిది కావడంతో బాచుపల్లి పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దుండిగల్ పీఎస్‌కు కేసును బదిలీ చేశారు. దుండిగల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మన్‌కీ బాత్' వీక్షణ



వీక్షిస్తున్న బీజేపీ నేతలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ పద్మాలయా అంబేడ్కర్ బస్తీ బీజేపీ నేతలు ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని వీక్షించారు. తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి సారంగుల అమర్నాథ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, తాళ్ల తిరుపతి, రోహిత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరల్లోనే జనరిక్ మందులు



జనరిక్ మెడికల్ షాపులో మందులు ఇస్తున్న సినీహీరో సుమన్

వెంగళరావునగర్: తక్కువ ధరల్లోనే జెనరిక్ మందులు అందుతున్నాయని అందుకే వాటికి తాను బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నానని ప్రముఖ సినీ హీరో సుమన్ పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ జనరిక్ మెడికల్ షాపును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ సూచనలతో ఇతర కంపెనీలు ఇచ్చే డిస్కౌంట్ కంటే భారీ ఎత్తున జనరిక్ మందులు తగ్గింపు ధరలకు అందుబాటులో ఉన్నాయన్నారు. కాగా సినీ, టీవీ టెక్నీషియన్స్‌కు అధిక రాయితీ ఇవ్వనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ ఫస్ట్ చైర్మన్ బీఎస్.రాములు తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న 'నేషనల్ సిల్క్ ఎక్స్‌పో'



చీరలు చూస్తున్న మహిళ

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగదీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2025 సోమవారం (నేడు) ముగియనున్నది. ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతోనే ప్రదర్శన ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు.

వైభవంగా వార్షికోత్సవం



గీతాలాపన, నృత్యం చేస్తున్న దృశ్యం

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లోని లెమెన్ ఎవాంజెలికల్ ఫెలోషిప్ చర్చి 90వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ అబ్రహం దైవ సందేశాన్ని ఇచ్చారు. వేడుకల్లో చిన్నారులతో యాక్షన్ సాంగ్, యువతీ, యువకులతో ప్రత్యేక భక్తి గీతాలు ఆలపించారు. జాన్ న్యూటన్ మాదిరిక భక్తి జీవితంపై నాటకం, ఎల్‌ఈఎఫ్ వ్యవస్థాపకుడు ఎస్. డానియల్ జీవిత చరిత్రపై ప్రదర్శించిన షాడో ప్లే ఆకట్టుకున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హిందీ పోటీ పరీక్షల బ్రోచర్ ఆవిష్కరణ

హిమాయత్‌నగర్: హిందీ సేవా సదన్ మహా విద్యాలయం ద్వారా సీబీఎస్‌ఈ బోర్డు ఆధ్వర్యంలోని పాఠశాలలో 1–12వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు హిందీలో పోటీ పరీక్షలకు సంబంధించిన బ్రోచర్‌ను ఢిల్లీలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా విడుదల చేసినట్లు హిందీ ప్రచార సభ హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి ఆదివారం తెలిపారు. న్యాయ సలహాదారు జే వెంకట రామనరసింహా రెడ్డి, ఏపీ అధ్యక్షుడు సీఎల్.నాయుడు, సభ్యులు రమాదేవి, రవిప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

బోధన తెరపైనే.!

- ప్రతి పాఠశాలలో 3 స్క్రీన్ల ఏర్పాటు
- కార్పొరేట్ తరహాలో పాఠ్యాంశాల బోధన
- పెరిగిన విద్యార్థుల సంఖ్య

సర్కారు బడుల్లో అందుబాటులోకి డిజిటల్ తెరలు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మెరుగైన విద్య, మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు అందజేస్తుండగా, ఇప్పుడు డిజిటల్ తరగతులను కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, బోరబండ, వెంగళరావునగర్, షేక్‌పేట డివిజన్ల పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 43 ప్రాథమిక పాఠశాలల్లో డిజిటల్ తెరలపై బోధన కొనసాగుతున్నది. ప్రతి పాఠశాలలో 3 డిజిటల్ క్లాస్‌లు అందుబాటులోకి తీసుకువచ్చి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు.



బంజారాహిల్స్ రోడ్డునంబర్-7లోని గతి ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ స్క్రీన్ బోధన

డిజిటల్ బోధనకు ప్రభుత్వం కృషి

◆ పాఠాలు వినడం కంటే దృశ్య మాధ్యమం ద్వారా బోధనతో ఎక్కువగా గుర్తుండే అవకాశం ఉంటుంది. అంతేగాకండా చదువులో వెనుకబడిన విద్యార్థులకు సైతం పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయి. బోధనా నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 250 మంది ఉపాధ్యాయులకు విద్యాశాఖ శిక్షణ కూడా ఇచ్చింది. ఉన్నత పాఠశాలల్లో డిజిటల్ తెరల ద్వారానే పాఠాలు బోధిస్తున్నారు. వీటి నిర్వహణకు ఆయా పాఠశాలల్లో వైఫై సౌకర్యం కూడా కల్పించి సమగ్ర శిక్షా ప్రాజెక్టు ద్వారా ఒక్కో పాఠశాలకు రూ.799 చొప్పున చెల్లిస్తున్నారు. ఆయా పాఠశాలలకు కంప్యూటర్లు కూడా అందజేశారు. వీటితో ఒకవైపు డిజిటల్ తరగతులు, మరోవైపు కృత్రిమ మేధ తరగతులు బోధిస్తున్నారు.

కేటీఆర్ ఆరోపణలు అవాస్తవం

జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

బంజారాహిల్స్: బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్ భార్య శ్వేతపై పోలీసులు అన్యాయంగా హత్యాయత్నానికి సంబంధించిన సెక్షన్లు నమోదు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలు వాస్తవం కాదని జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 22న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఓ చానల్ కార్యాలయంలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగానికి చెందిన కొంతమంది దాడి చేసినట్లు ఫిర్యాదు రావడంతో అదే రోజు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఇందులో గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు గుర్తించి హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఫ్లాట్ నంబర్ 1209లో అరెస్టు చేసేందుకు వెళ్లిన పోలీసుల బృందానికి ఆయన భార్య శ్వేత ఇంటి లోపలి నుంచి తాళం వేసి అనుమతించలేదన్నారు. దీంతో పోలీసులు గెల్లుకు ఫోన్ చేయగా ఇంట్లోనే మోగినట్లు గుర్తించామని, అయినా ఆమె సహకరించలేదన్నారు. తర్వాత విచారణలో బీఆర్ఎస్ భవన్‌లో ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని పేర్కొన్నారు. తదుపరి విచారణలో గెల్లు శ్రీనివాస్ తన మొబైల్ ఫోన్‌ను డ్రైవర్‌కు ఇచ్చి ఇంటికి పంపాడని, ఫోన్లోని డేటాను తొలగించాలని, దాచివేయాలని భార్య శ్వేతకు సూచించినట్లు వెల్లడైందన్నారు. ఆధారాలు దాచేందుకు, విచారణను తప్పుదోవ పట్టించేందుకు చేసిన యత్నంగా శ్వేతపై బీఎన్ఎస్ సెక్షన్ 238 కింద కేసు నమోదు చేశామే తప్ప హత్యాయత్నం సెక్షన్లు పెట్టలేదన్నారు. హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా న్యాయబద్ధంగా, నిష్పక్షపాతంగా కేసులపై దర్యాప్తు కొనసాగిస్తుందన్నారు. అవాస్తవ ప్రచారాలు మంచిది కాదని కోరారు.



ఈదమ్మ గుడికి బోనాలతో వస్తున్న బస్తీవాసులు

బోనమెత్తిన బస్తీలు

ఫిలింనగర్: శ్రావణ మాసం సందర్భంగా దుర్గాభవానీనగర్, పటేల్‌నగర్ బస్తీల్లో ఆదివారం బోనాల సందడి నెలకొన్నది. బస్తీవాసులు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దుర్గాభవానీనగర్ బస్తీలోని ఈదమ్మ–ఎల్లమ్మ అమ్మవార్లకు బస్తీ అధ్యక్షుడు వేముల జగన్ పట్టు వస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌తో పాటు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్లండ వెంకటేశ్ పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో..

బండారు బాల్‌రెడ్డినగర్, బసవతారకనగర్, దుర్గాభవానీనగర్, పటేల్‌నగర్ బస్తీల్లోని ఆలయాల్లోని అమ్మవార్లకు మహిళలు బోనాలు సమర్పించారు.





ఫిలింనగర్ 18 బస్తీల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నేత మామిడి నర్సింగరావుతో పాటు డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్, ఆకుల రాజు, ఎల్లయ్య, సాయిలు పాల్గొన్నారు.





వేడుకల్లో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, కార్పొరేటర్ వెంకటేశ్

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న అతిథులు

హిమాయత్‌నగర్: విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని శాంత బయోటెక్నిక్స్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ డాక్టర్ కేఐ వరప్రసాద్ రెడ్డి అన్నారు. కొమర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణగూడలోని తాజ్ మహల్ హోటల్లో జీవన సాఫల్య పురస్కార గ్రహీతలను సీనియర్ పాత్రికేయులు మా శర్మ, తెలుగు భాషా సాహిత్యవేత్త జితేంద్రతో కలిసి ఆదివారం సత్కరించి మాట్లాడారు. మాతృభాష ఔన్నత్యం కోల్పోకుండా భావితరాలకు అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం, శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య సీఆర్.విశ్వేశ్వరరావు, సదాశివపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మాజీ ప్రధానాచార్యులు ఆచార్య తాడేపల్లి పతంజలి, కవి వింజమూరి బాలమురళికి జీవన సాఫల్య పురస్కారాలు అందజేసి సత్కరించారు. కొమర్రాజు ఫౌండేషన్ అధ్యక్షుడు కొమర్రాజు దుర్గాప్రసాద్, కార్యదర్శి కొమర్రాజు రవి, ప్రతినిధులు సతీశ్, రాధాకృష్ణ, గాంధీ పాల్గొన్నారు.

'కారకులపై చర్యలు తీసుకోవాలి'

బంజారాహిల్స్: తెలంగాణ స్టేట్ హౌసింగ్‌బోర్డు ఉద్యోగి జగదీశ్వర్ మృతి చెందడం బాధకరమని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కుద్రాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. 2 రోజుల క్రితం హౌసింగ్‌బోర్డుకు చెందిన ఓ ఆస్తిని ఖాళీ చేయించాలంటూ ఆదేశాలు జారీ కావడంతో జగదీశ్వర్ అక్కడికి వెళ్లారన్నారు. ఆ ఒత్తిడితో ఆయన గుండెపోటుతో మరణించారని ఆరోపించారు. అధికారుల నుంచి వచ్చిన ఒత్తిళ్లు, ఆ ప్రదేశంలో వ్యక్తుల హింసాత్మక ప్రవర్తన, బౌన్సర్ల ప్రమేయంపై దర్యాప్తు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తమ యూనియన్ బాధిత కుటుంబానికి అండగా నిలుస్తుందని, న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు. త్వరలోనే సంబంధిత మంత్రి, జిల్లా కలెక్టర్, నగర సీపీని కలిసి జగదీశ్వర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవిస్తామని పేర్కొన్నారు.

'బీసీ జాబితాలో ఆ కులాలను మళ్లీ చేర్చాలి'



మాట్లాడుతున్న అధ్యక్షుడు మీరా కుమార్

పంజగుట్ట: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెలలోపే బీసీ జాబితా నుంచి తొలగించిన 27 కులాలను మళ్లీ చేర్చుతామని ఎన్నికల ముందు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నెలబెట్టుకోవాలని తెలంగాణ 27 క్యాస్ట్ బీసీ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు జీ మీరాకుమార్, సలహాదారులు కేఎస్.మూర్తి, వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కోశాధికారి కృష్ణం నాయుడు మాట్లాడుతూ.. 2014లో రాజ్యాంగ విరుద్ధంగా జీఓ 3 తీసుకువచ్చి 27 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించారన్నారు. అప్పటి నుంచి తమ పిల్లలు విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాల్లోనూ అవకాశాలు కోల్పోయి ఎంతో దీనస్థితిలో ఉన్నామని ఆవేదనవ్యక్తం చేశారు. సీఎం హామీ మేరకు వెంటనే తమను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షులు కేవీ రావు, సినీనటి రమ్యశ్రీ, రమాదేవి, సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం



శ్రీనగర్‌కాలనీ: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా హెచ్‌వైసీ (హైదరాబాద్ యూత్ కరేజ్) పార్టీ ముందుకు సాగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు సల్మాన్‌ఖాన్ అన్నారు. ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌లోని షంషీర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మహిళలు, యువత పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు.

అగర్వాల్ సమాజ్ సభ్యులందరికీ ప్రివిలేజ్ కార్డులు

హిమాయత్‌నగర్: అగర్వాల్ సమాజ్ సభ్యులందరికీ ప్రివిలేజ్ కార్డులు అందిస్తామని తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా తెలిపారు. ఆదివారం నిర్వహించిన అగర్వాల్ సమాజ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అగర్వాల్ సమాజపు ఎన్నికల్లో కేంద్ర కమిటీకి పదవీ విరమణ చేసిన అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడితో పాటు, శాఖల పదవీ విరమణ చేసిన అధ్యక్షులకు కూడా ఓటు హక్కు కల్పించే ప్రతిపాదనను ఆమోదించినట్లు చెప్పారు. డా.అంజనీ కుమార్ అగర్వాల్, డా.చంద్రకాంత్ డకోటియా, హరీశ్ గుప్తా, బద్రీ విశాల్ బన్సల్, వినోద్ అగర్వాల్, రూపేష్ కుమార్ అగర్వాల్, డా.సీమా జైన్, అచల్ గుప్తా పాల్గొన్నారు.

నగలు, నగదు బ్యాగు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ మహిళ నగదు, గొలుసు, సెల్‌ఫోన్ల బ్యాగు చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప వివరాల ప్రకారం... విజయనగరం పూల్‌బాగ్ ప్రాంతానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఎం.రాకేష్ శంషాబాద్ ఆర్‌బీనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అజంతా ఎక్స్‌ప్రెస్ రైల్లో మన్మాడ్ రైల్వే స్టేషన్ నుంచి వస్తుండగా రైలు ముత్కేడ్ రైల్వే స్టేషన్ వద్ద ఉండగా చూసుకునే సరికి రూ.10వేలు నగదు, రూ.30వేల విలువైన గొలుసు, రెండు సెల్ ఫోన్లు ఉన్న రాకేష్ తల్లి చేతి బ్యాగు కనబడలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

బోరబండ నుంచి హైటెక్ సిటీ వరకు రోడ్డు విస్తరిస్తాం



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

రహమత్‌నగర్ : బోరబండ నుంచి హైటెక్ సిటీ వరకు రహదారి విస్తరణ పనులు త్వరలోనే చేపడతామని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి హామీనిచ్చారు. బోరబండ షాహీద్ తుర్రేబాజ్ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన డివిజన్ బూత్ కమిటీ కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బోరబండకు కూత వేటు దూరంలోని హైటెక్ సిటీ రోడ్డు విస్తరణ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. అలాగే డివిజన్‌లో పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు రూ.15కోట్లతో నివేదికలు రూపొందించామని వారంలోగా నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామన్నారు. త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత బూత్ కన్వీనర్లపై ఉందని పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అశోక్, కాసుల మహేశ్ కుమార్‌గౌడ్, ఆనంద్, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



శ్రీనగర్‌కాలనీ: ఆశ్రయ్–ఆకృతి బధిర పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఎల్లారెడ్డిగూడ నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అలాగే విద్యార్థులు ఆటపాటలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. స్కూల్ డైరెక్టర్ డీపీకే బాబు బధిర పాఠశాల కోసం, సేవా కార్యక్రమాలు చేపడుతుండడంపై అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ శశికళ ప్రశంసించారు. ఎడ్యుకేషన్ డైరెక్టర్ సురేఖ, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయానికి స్థలం కేటాయిస్తాం



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

బంజారాహిల్స్: రోడ్డు నంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీలో ఇటీవల పెద్దమ్మ గుడిని కూల్చిన చోటే ఆలయానికి స్థలం కేటాయించేలా చూస్తానని గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హామీనిచ్చారు. యాదవ సంఘం సభ్యులతో పాటు బస్తీవాసులు మేయర్ నివాసంలో ఆదివారం ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఢిల్లీలో బీసీ సదస్సు కోసం తనతో పాటు ఎమ్మెల్యే దానం నాగేందర్ వెళ్లడంతో 3 రోజుల పాటు అందుబాటులో లేమన్నారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి కూల్చిన చోటే స్థలం ఇప్పిస్తామని, అవసరమైతే సీఎంతో పాటు ఒకట్రెండు రోజుల్లో కలెక్టర్‌తో సహా రెవెన్యూ శాఖ మంత్రిని కలుస్తామని తెలిపారు.

యువతి ఆత్మహత్య కేసులో నిందితుడి రిమాండ్

బంజారాహిల్స్: యువతి ఆత్మహత్య కేసులో నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకృష్ణానగర్ బీ–బ్లాక్‌లో నివసించే రేణుక కొంతకాలం క్రితం చల్లా వినయ్‌కుమార్‌ను ప్రేమించింది. సదరు యువకుడు జులాయిగా తిరుగుతుండడంతో పాటు డ్రగ్స్‌కు బానిస కావడంతో యువతి కొంతకాలంగా దూరంగా ఉంటోంది. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న యువకుడు ఈనెల 9న యువతి పని చేస్తున్న ప్రాంతానికి వెళ్లి తీవ్రంగా కొట్టి ఆమె ద్విచక్రవాహనంపైనే బలవంతంగా ఎక్కించుకుని మద్యం మత్తులో వస్తుండగా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో వారు వాహనాన్ని సీజ్ చేశారు. ఇంటికి వెళ్లిన యువతిని ద్విచక్ర వాహనం ఏదని తల్లి ప్రశ్నించగా మెకానిక్‌కు ఇచ్చానని చెప్పింది. అయితే తల్లికి అబద్ధం చెప్పానన్న బాధను తట్టుకోలేక ఈనెల 10న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. దీంతో మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితుడు వినయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న వినయ్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధిత యువతి ద్విచక్రవాహనం కూడా తన బాబాయిది కావడంతో పాటు పోలీసులు సీజ్ చేయడం, డ్రంకన్ డ్రైవ్‌లో వినయ్‌కుమార్ దొరకడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అటు వరద.. ఇటు గుంతలు..!

వర్షానికి అధ్వానంగా మారిన రోడ్లు

బంజారాహిల్స్: నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్ని అధ్వానంగా మారాయి. ఓ వైపు వరద.. మరోవైపు రోడ్లపైన ఏర్పడిన గుంతల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచిపోతుండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా జీహెచ్ఎంసీ సిబ్బంది గుంతల రోడ్లను పూడ్చడంలో నిర్లక్ష్యం చేస్తుండడంతో స్థానికంగా ఉన్న కొందరు ట్రాఫిక్ పోలీసులే పారలతో ఆ గుంతలను పూడ్చివేస్తున్నారు.



నిమ్స్ ఆస్పత్రి ఎదుట నిలిచిన వరద



జూబ్లీహిల్స్ జర్నలిస్టు కాలనీలో రోడ్లపై గుంతలు పూడ్చుతున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



శ్రీనగర్ కాలనీలో వరద



పంజగుట్ట నుంచి ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ దారిలో..



ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ పక్కన..



నాగార్జుననగర్‌లో..

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

ప్రశాంతంగా జీపీఓ, లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామక పరీక్షలు హైదరాబాద్‌లోని స్ఫూర్తి భవన్‌లో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్షల నిర్వహణను అదనపు కలెక్టర్ (రెవిన్యూ) ముకుందరెడ్డి పరిశీలించారు. పర్యవేక్షణ, అభ్యర్థుల హాజరు, ప్రశ్నపత్రాల పంపిణీ, తాగునీరు వంటి అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జీపీఓ పరీక్షకు మొత్తం 41 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా, 39 మంది మాత్రమే హాజరయ్యారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షకు 67 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 49 మంది హాజరయ్యారు. 18 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో డీఆర్‌ఓ ఈ వెంకట చారి, ఏడీ శ్రీరామ్, లా ఆఫీసర్ శ్రీధర్, ఏవో చంద్రశేఖర్ గౌడ్, లైజనింగ్ అధికారి బిక్షపతి, సెక్షన్ సూపరింటెండెంట్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గచ్చిబౌలి స్టేడియంలో '4కే ఎకో వాక్'


రాయదుర్గం: ఎకోపాట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో '4కే ఎకో వాక్'కార్యక్రమాన్ని గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో సోమవారం ఉదయం 7 గంటలకు నిర్వహిస్తారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్ రాజబాబు తోపాటు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, సినీనటుడు బాలాదిత్య, డీఆర్‌డీఓ ఏఎస్‌ఎల్ డైరెక్టర్ బీవీ పాపారావు, సైంటిస్ట్ డాక్టర్ కె.వీరబ్రహ్మం, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, పాల్గొననున్నారు.

సమాన విద్యావకాశాలు అందించాలి



సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని దివ్యాంగ చిన్నారులకు అందరితో సమాన విద్యావకాశాలు అందించాలని, సానుభూతి ఇవ్వడం కాదు వారు స్వయం శక్తితో జీవించేలా తోడ్పడాలని దేవనార్ ఫౌండేషన్ నిర్వాహకులు, ప్రముఖ నేత్రవైద్యుడు ఎ.సాయిబాబాగౌడ్ అన్నారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ త్రివేణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ ఐ.వి.చలపతిరావు ఎండోమెంట్ లెక్చర్‌ను రామకృష్ణ మఠంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ 'భారతదేశంలో గ్రామీణ పాఠశాలల నుంచి ఐఐఎంల వరకు సవాలు ఎదుర్కొంటున్న పిల్లలకు మద్దతు అవసరం: – ఒక ప్రత్యక్ష పరిశీలన'అనే అంశంపై తన అనుభవాలను పంచుకున్నారు. దేవనార్ స్కూల్ విద్యార్థులు వినూత్న విద్యా పద్ధతులు, స్పర్శ ఆధారిత సామగ్రి, డిజిటల్ సదుపాయాలు వంటివి ప్రదర్శించారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద మాట్లాడుతూ ప్రొఫెసర్ ఐవీ చలపతిరావు ప్రబోధాలను, మార్గదర్శకత్వాన్ని గుర్తు చేసుకున్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో 31న జాబ్‌మేళా




జాబ్‌మేళా వివరాలను వెల్లడిస్తున్న అధ్యాపకులు

సనత్‌నగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రిటైలర్స్ అసోసియేషన్, స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సహకారంతో జూబ్లీహిల్స్‌లోని యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 31న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సమావేశంలో డాక్టర్ వై.వెంకటేశ్వర్లు, డాక్టర్ పడాల లక్ష్మణ్, డాక్టర్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. 18 నుంచి 27 ఏళ్ల వయస్సు కలిగినవారు దీనికి అర్హులని పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్సిటీలో ప్రథమ, ద్వితీయ, ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులతోపాటు చదువు పూర్తయిన 27 సంవత్సరాల లోపువారు ఐడీ కార్డు, రెజ్యూమ్, రెండు పాస్‌పోర్ట్ ఫొటోలతో జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం కోసం సమత ఫ్రీషిప్‌లు, నిపుణ ఫెలోషిప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

డీపీఆర్ మార్పులు.. గ్రాఫిక్స్ మెరుపులు

నాలుగేళ్లు అయినా అతీగతీలేని కోహెడ పండ్ల మార్కెట్ నిర్మాణం

కనీసం భూమిపూజకూ నోచుకోని వైనం ◆ అంతర్జాతీయ సమీకృత మార్కెట్‌పై చిత్తశుద్ధి కరువు ◆ 2021 అక్టోబర్ నుంచి బాటసింగారంలో తాత్కాలిక మార్కెట్



టవర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఊహాచిత్రం

సాక్షి, సిటీబ్యూరో: రైతుల, వ్యాపారులు కండ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా, పండ్ల మార్కెట్ ఏర్పాటు అతీగతీలేదు. నాయకులు హామీ ఇచ్చి నాలుగేళ్లు అవుతోంది. డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) ఇంకా ప్రభుత్వ ఆమోదముద్రకు నోచుకోలేదు. ఇదీ కోహెడలో పండ్ల మార్కెట్ దుస్థితి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నగర శివారులోని కోహెడ్‌లో పండ్ల మార్కెట్ నిర్మిస్తామని ప్రకటించింది. అప్పటి నుంచి కంప్యూటర్ గ్రాఫిక్ చిత్రాల్లో మెరుస్తోందే తప్ప ఆచరణలో రూపుదిద్దుకోవడంలేదు. కనీసం భూమిపూజకు కూడా నోచుకోలేదు. డీపీఆర్‌లో మార్పుల కారణంగా ఈ వ్యవహారం గజిబిజిగా మారింది. తొలుత ఫ్రూట్ మార్కెట్ అని, ఆనక జాతీయ, అంతర్జాతీయ స్థాయి పూలు, పండ్లు, కూరగాయల ఇంటిగ్రేటెడ్ మార్కెట్ అని అధికారులు చెబుతూ వచ్చారు. తాజాగా గ్లోబల్ గ్రీన్ మార్కెట్‌గా పేరు మార్చారు.

రూ.399 కోట్ల నుంచి రూ.2,900 కోట్లకు..

గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను కొత్తపేట నుంచి కోహెడకు తరలించే ప్రతిపాదనల్లో నిర్మాణ విస్తీర్ణం , అంచనా వ్యయం ఏటేటా పెరుగుతున్నాయి. తొలుత రూ.399 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదించగా తాజాగా ఈ మొత్తం రూ.2,,900 కోట్లకు చేరింది. తొలి దశలో (2021) ప్రతిపాదనలు సిద్ధం చేసినపుడు 178 ఎకరాల విస్తీర్ణంలో దేశంలోనే అతి పెద్ద మార్కెట్ నిర్మించాలని నిర్ణయించారు. దీని కోసం సుమారుగా రూ.399 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. అనంతరం డీపీఆర్‌లో అనేక దఫాలు మార్పులు చేస్తూ భూసేకరణ 199 ఎకరాలకు చేరింది. నిర్మాణ వ్యయం అంచనా సుమారు రూ.2,900 కోట్లకు పెరిగింది. కోహెడ గ్లోబల్ గ్రీన్ మార్కెట్‌ను ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ)కి 167 ఎకరాలు రూ.2,044 కోట్లు, మరో 31 ఎకరాల్లో రూ.856 కోట్లతో పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ఈపీసీలో వేలం హాళ్లు, షెడ్లు, విదేశీ ఫ్లాగ్‌షిప్ పెవిలియన్, రిటైల్ జోన్లు, మినీ డేటా సెంటర్లు, కార్మిక విశ్రాంతి గదులు, పార్కింగ్, అంతర్గత రహదారులు, టవర్ ఆఫ్ ఎక్సలెన్స్, శీతల గిడ్డంగులు, ప్రాసెసింగ్ సెంటర్లు, వంటివి నిర్మించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. 2047 నాటి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని మార్కెటింగ్ శాఖ భావిస్తోంది. దీనికి అధికారికంగా ప్రభుత్వ ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. అనంతరం టెండర్లు పిలిచి, పనులు పూర్తి చేయడానికి మరికొన్నేళ్లు వేచిచూడాల్సి ఉంటుంది.

అన్నీ సక్రమంగా జరిగితే ఏడాదికి సుమారు రూ.5 వేల కోట్ల టర్నోవర్ జరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

ప్రత్యేక ఆకర్షణగా టవర్ ఆఫ్ ఎక్సలెన్స్..

కోహెడ మార్కెట్‌లో టవర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వంద అడుగుల ఎత్తులో, సుమారు 19 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీన్ని నిర్మించనున్నారు. హై స్పీడ్ ప్యాసింజర్ లిఫ్టులు, హెలీప్యాడ్‌లు సైతం అందుబాటులోకి రానున్నాయి. ఇందులో నాలుగు అంతస్తులు జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య, ఎగుమతి సంస్థలకు లీజుకు ఇవ్వనున్నారని పేర్కొంటున్నారు. గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌ను తాత్కాలికంగా బాటసింగారంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ మౌలిక వసతులు అంతంతగానే ఉన్నాయి. దీంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం త్వరితగతిన కోహెడ మార్కెట్ నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అమెరికాతో ఒప్పందం రైతులకు అనర్థం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్

కాప్రా: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ ధ్వజమెత్తారు. దీంతో సంపదంతా కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవుతోందని అన్నారు. మేడ్చల్ జిల్లా సీపీఎం శాఖ కార్యదర్శుల విస్తృతస్థాయి సమావేశం ఏఎస్‌రావునగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికాతో వ్యాపార ఒప్పందం తెలంగాణ రైతులకు నష్టదాయకమని పేర్కొన్నారు. పాలు, సోయాబీన్ దిగుమతుల కారణంగా మన పంటలకు ధరలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీలంక, బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షోభ పరిస్థితులే అందుకు ఉదాహరణ అని అన్నారు. భారత్ కూడా అదే దిశగా వెళ్లే ప్రమాదం ఉందని, ప్రజలే దీన్ని ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అటవీ ప్రాంతంలో లభించే సహజవనరులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్రలో భాగంగానే ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులపై దాడులు చేస్తోందని విమర్శించారు. ఈ సంక్షోభ పరిస్థితుల నుంచి బయటపడాలంటే ప్రజాఉద్యమాలు, సామూహిక నిరసనలే మార్గమన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, నాయకులు రాజశేఖర్, అశోక్, వినోద తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న మేజర్ జనరల్ హర్ష్ చిబ్బర్

మేజర్ జనరల్ హర్ష్ చిబ్బర్

మణికొండ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, దాన్ని పరిరక్షించేలా మన జీవనశైలిని మార్చుకోవాలని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్(సీడీఎం) మేజర్ జనరల్ హర్ష్ చిబ్బర్ అన్నారు. హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్, ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్‌లోని పర్పుల్ పెడ్లర్స్ క్లబ్ ఆఫ్ సీడీఎం ఆధ్వర్యంలో ఆదివారం నార్సింగి సైకిల్ ట్రాక్‌లో పర్యావరణంపై అవగాహనకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాయుధ దళాలు పర్యావరణ బాధ్యత, ఫిట్‌నెస్‌తోపాటు అన్ని రంగాల్లో నాయకత్వం వహించేందుకు ముందుంటాయన్నారు. ఆరోగ్యకరమైన దేశాన్ని నిర్మించేందుకు పర్యావరణ పరిరక్షణ, వెల్‌నెస్ ప్రమోషన్‌కు ఇలాంటి కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలని, ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆరేళ్ల వయసున్న రైడర్ మాస్టర్ శుభమ్ భౌమిక్ జెండా ఊపి సైక్లింగ్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ అధ్యక్షుడు డీవీ మనోహర్‌తోపాటు రైడర్‌లు పాల్గొన్నారు.

శ్రామికుల ఆరోగ్యం దేశాభివృద్ధికి ఆధారం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్



సదస్సును ప్రారంభించిన కార్మిక మంత్రి వివేక్

అమీర్‌పేట: శ్రామికుల ఆరోగ్యం మనదేశ అభివృద్ధికి బలమైన ఆధారమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. జాతీయ వృత్తి ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేర్, ఐఓహెచ్ తెలంగాణ, ఏపీ సంయుక్త ఆధ్వర్యంలో 'ఆక్యుమెడ్'కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం అమీర్‌పేట గ్రీన్‌పార్క్ మ్యారిగోల్డ్ హోటల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృత్తిపరమైన ఆరోగ్య నిపుణులు, కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు అనారోగ్య సమస్యలు, నివారణ మార్గాలు, అధునిక వైద్య సేవల ప్రాముఖ్యతపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ఆక్యుమెడ్ వంటి కార్యక్రమాలు కార్మికుల ఆరోగ్య అవసరాలు, అందుబాటులో ఉన్న సేవల మధ్య ఉన్న గ్యాప్‌ను తగ్గించడానికి సహాయపడతాయని అన్నారు. కార్యక్రమంలో కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఉప కులపతి డా. పి.వి.నందకుమార్‌రెడ్డి, బిర్లా ఎన్‌యూ ఉపాధ్యక్షులు, ఐఏఓహెచ్ మాజీ జాతీయ అధ్యక్షుడు ఎస్.పి.వివేక్ చంద్రరావు, జె.విజయ్‌రావు, కేర్ ఆసుపత్రుల సేల్స్, మార్కెటింగ్ అధికారి శలభ్ డాంగ్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శీలా సుభద్రాదేవికి 'అమరవాది' పురస్కారం



రచయిత్రి శీలా సుభద్రాదేవికి పురస్కారాన్ని అందజేస్తున్న కసిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మారుతున్న ప్రపంచంలో మనిషి సక్రమ మార్గంలో ప్రయాణించడానికి సాహిత్యం తోడ్పడుతుందని ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అమరవాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవికి అమరవాది హైమావతి సాహిత్య పురస్కారం , బాల సాహితీవేత్త అమ్మిన శ్రీనివాసరాజుకు అమరవాది ప్రసాద్ బాల సాహిత్య పురస్కారాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను స్మరించుకుంటూ ప్రతి ఏటా వారి పేర్లపై పురస్కారాలను ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. అంతకు ముందు రచయిత్రి అమరవాది నీరజ రచించిన అంజు బాలల పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాలసాహిత్యంపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంత అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్, మాడభూషి రంగాచారి స్మారక సమితి అధ్యక్షుడు మాడభూషి లలితాదేవి, రచయిత గడిపెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలు తీర్చేలా ప్రణాళికలు ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగర అభివృద్ధి ప్రణాళిక, మాస్టర్ ప్లాన్ ప్రజల అవసరాలు తీర్చే విధంగా ఉండాలని అర్బన్ పాలసీ నిపుణుడు డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో 'హైదరాబాద్‌మాస్టర్ ప్లాన్ -తీరుతెన్నులు–నిశిత పరిశీలన'అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే విధంగా, జీవనోపాధి అవకాశాలు కలిప్పించేలా, సాగునీరు, డ్రైనేజీ, ప్రజారోగ్యం, విద్య, ట్రాఫిక్, కాలుష్యం తదితర సమస్యలు పరిష్కరించేలా మాస్టర్‌ప్లాన్ ఉండాలని అభిప్రాయపడ్డారు. మాస్టర్ ప్లాన్ రూపొందించకుండానే ప్రభుత్వం నగరంలో అనేక ప్రాజెక్టులు ప్రకటిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజల భాగస్వామ్యంతో మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. సామాజిక కార్యకర్త ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ 2011లో తయారైన మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష జరగాలని, ఆ తప్పులు పునరావృతం కాకుండా కొత్త ప్లాన్ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీఎఫ్ సలహాదారు రాజీవ్‌కుమార్, డాక్టర్ జైసూర్య, ప్రధాన కార్యదర్శి వీరయ్య, ఎం.శ్రీనివాస్‌రావు, పి.నాగేశ్వరరావు, రాజమౌళి, సుకుమార్, సంగీత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి



క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న మల్లారెడ్డి తదితరులు

కీసర: యువతను క్రీడల్లో ప్రోత్సహించాలని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ అన్నారు. కీసరలోని లెగసి క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతున్న జీఎస్‌ఆర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదివారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్, మల్లారెడ్డిలు సరదాగా క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకెళ్లాలని సంతోష్ కుమార్ సూచించారు. కార్యక్రమంలో జీఎస్‌ఆర్ ట్రస్టు చైర్మన్ గుర్రం శ్రీధర్‌రెడ్డి, కీసర మాజీ సర్పంచ్ మాధురివెంకటేష్, నాయకులు తటాకం భానుచందర్, చినంగని బాల్‌రాజ్, గోరంటి ప్రవీణ్, సుమన్ బన్ని, మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల సేవలు విస్తృతమయ్యాయి..

అగ్రసేన్ బ్యాంక్ అమీర్‌పేట బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



అగ్రసేన్ బ్యాంక్ అమీర్‌పేట బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

సనత్‌నగర్: 'ఇదివరకు బ్యాంకులు అంటే డబ్బుల డిపాజిట్, విత్ డ్రా చేయడం మాత్రమే అనుకునేవారు. కానీ, ఇప్పుడా నిర్వచనం మారింది. ఖాతాదారుల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా టెక్నాలజీని మిళితం చేస్తూ వివిధ రకాల సేవలు అందిస్తున్నాయి' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఆదివారం అగ్రసేన్ బ్యాంక్ అమీర్‌పేట బ్రాంచ్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ దేశ ఆర్థిక వ్యవస్థలో సహకారం బ్యాంకుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు ఆర్థిక సేవలను అందించడంలో అవి ముందున్నాయన్నారు. ఆర్‌బీఐ వార్షిక నివేదిక 2024 ప్రకారం దేశవ్యాప్తంగా 8.5 కోట్ల మందికిపైగా ప్రజలు వీటి సేవలను వినియోగించుకుంటున్నారని చెప్పారు. మొత్తం డిపాజిట్లు, రుణాలు, రూ.5.5 లక్షల కోట్ల మార్కు ను దాటాయన్నారు. తెలంగాణలో 48 అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకులు 321 శాఖల ద్వారా అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నాయని వివరించారు.

తెలంగాణ మోడల్ పాథ్..

సహకార బ్యాంకులు లాభాపేక్షతో కాకుండా ఖాతాదారుల ప్రయోజనాల కోసం కమ్యూనిటీ ఆధారిత సేవలను అందిస్తున్నాయని శ్రీధర్‌బాబు అన్నారు. కేర్ (కమ్యూనిటీ ఫోకస్డ్, అఫర్డబుల్ అండ్ యాక్సెసిబుల్ క్రెడిట్, రిలేషన్‌షిప్ బేస్డ్ బ్యాంకింగ్, ఎంపవరింగ్ లోకల్ ఎంటర్‌ప్రెన్యూర్స్) మోడల్‌లో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార రంగ బ్యాంకుల అభివృద్ధికి పాథ్ (పాలసీ సపోర్ట్, యాక్సెస్ టు డిజిటల్ టూల్స్, ట్రెయినింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్, హైబ్రిడ్ ఫైనాన్స్ ఎకో సిస్టమ్స్) మోడల్‌ను అనుసరిస్తుందని చెప్పారు. యువత, వెనుకబడిన వర్గాలకు స్వయం ఉపాధి రుణాలు, మహిళా స్వయం సహాయక బృందాలకు రుణ అనుసంధానాలు, గ్రీన్ లోన్స్ వంటి పథకాలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రెసిడెంట్ అనిరుధ్ గుప్త, టిబారుమల్ జ్యువెలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అశోక్ కుమార్ సోమాని, అగ్రసేన్ బ్యాంక్ చైర్మన్ ప్రమోద్‌కుమార్ ఖేడియా, సీనియర్ వైస్ చైర్మన్ నవీన్ కుమార్ అగర్వాల్, వైస్ చైర్మన్ సురేష్ కుమార్ అగర్వాల్ తదితరలు పాల్గొన్నారు.

అనారోగ్యం వల్లే జనజీవన స్రవంతిలోకి..

మావోయిస్టు పార్టీ నాయకుడు సంజీవ్

అల్వాల్: అనారోగ్య కారణాల వల్లే జనజీవన స్రవంతిలో కలిశానని, లొంగిపోలేదని దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మాజీ సభ్యుడు సంజీవ్ అన్నారు. ఆదివారం యాప్రాల్‌లో జననాట్య మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కలయిక సమావేశంలో సంజీవ్ మాట్లాడారు. ఉద్యమంలో 50 సంవత్సరాలు పనిచేశానని, ప్రజా గాయకుడు గద్దర్ తన సమకాలికుడని అన్నారు. పాట రూపంలో తిరిగి వచ్చిన తనను ప్రజలు గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. 1977 నుంచి 1986 వరకు దేశవ్యాప్తంగా గద్దర్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నానని చెప్పారు. యాప్రాల్ లో మొదలైన తన ప్రస్థానం ప్రజా గాయకుడిగా, ఉద్యమకారుడిగా మారిందన్నారు. కార్యక్రమంలో సినీ నిర్మాత బి.నర్సింగరావు, సత్యం, రాజనర్సింహ, సీఎల్ యాదగిరి, ప్రేమ్ కుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో తిరిగి చేరను

ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి,సిటీబ్యూరో: బీజేపీలో తిరిగి చేరడానికి ప్రయత్నించడం లేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పష్టం చేశారు. ఆదివారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని విధాలుగా ఆలోచించే పార్టీకి రాజీనామా చేశానని చెప్పారు. బీజేపీలోకి రావడానికి ప్రయత్నిస్తున్నానని జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. అయితే తన రాజీనామాను జాతీయ నాయకత్వం ఆమోదించడం వెనక కుట్ర జరిగిందని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తనకు ఫోన్ చేయలేదని, తాను అంత పెద్దవాడిని కాదన్నారు. తెలంగాణ బీజేపీ లో జరుగుతున్న తప్పిదాలపై కేంద్రానికి లేఖ రాశానని, మెయిల్స్ చేశానని, వారి దృష్టికి వెళ్ళిందో లేదో తెలియదన్నారు. తాను ఎప్పుడూ పదవులు కావాలని అడగలేదని, అడిగినా వారు ఇవ్వరని తెలుసని పేర్కొన్నారు. బాధతోనే రాజీనామా చేశానన్నారు. తెలంగాణలో 2014, 2018, 2023 ఎన్నికల్లో బీజేపీకి ఎవరు మోసం చేశారో జాతీయ నాయకత్వం నివేదిక తెప్పించుకోవాలని కోరారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు మంచి రైటర్ అని, పార్టీ అధికారంలోకి రావాలంటే మంచి ఫైటర్ కావాలని అభిప్రాయపడ్డారు.

జీఐపై రెండు రోజుల వర్క్‌షాప్



సాక్షి, సిటీబ్యూరో: జీర్ణాశయాంతర ఉదరకోశ కేన్సర్ నిర్వహణలో 'గ్యాస్ట్రో ఇంటెస్టినల్ ఫోకస్'అత్యాధునిక క్లినికల్ ఆవిష్కరణగా నిలుస్తోందని హైటెక్‌సిటీలోని యశోద ఆసుపత్రిడాక్టర్ విజయ్ కుమార్ అన్నారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, రోబోటిక్ సైన్స్ జీఐ ఫోకస్ పోరుతో రెండు రోజుల జాతీయ కాన్ఫరెన్స్, వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం అన్నవాహిక, కడుపు కేన్సర్‌కు అత్యాధునిక రోబోటిక్, లాప్రోస్కోపిక్, ఓపెన్ టెక్నిక్ ద్వారా అనేక గ్యాస్ట్రో సర్జరీలు విజయవంతంగా ఎలా నిర్వహించాలో ఆయన వివరించారు. ఆపరేటింగ్ సర్జన్లు జీఐ శస్త్ర చికిత్స ల్లో ఉన్న సంక్లిష్టతలను అర్థం చేసుకోవడం , సర్జికల్ గ్యాస్ట్రో వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ వైద్య నిపుణులతో వారి అనుభవాలను పంచుకునేందుకు ఇదొక గొప్ప వేదికగా నిలుస్తుందన్నారు. అధునాతన జీర్ణ ఉదరకోశ శస్త్రచికిత్సా వ్యూహాలు, మల్టీమోడల్ చికిత్స ప్రణాళికపై నిపుణుల లైవ్ సెషన్లు యువ సర్జన్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి ఎండీ జీఎస్ రావు, నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, వివిధ ప్రాంతాలకు చెందిన 500 మంది సర్జన్లు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్

ఘనంగా సన్మానించిన పోలీసులు



ఆటోడ్రైవర్ నందకిషోర్‌ను సన్మానిస్తున్న పోలీసులు

శామీర్‌పేట్: ఆటోలో లభించిన ఓ ప్రయాణికురాలి విలువైన వస్తువులను ఆటోడ్రైవర్ తిరిగి ఆమెకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. దీంతో అతడిని పోలీసులు ఘనంగా సన్మానించి అభినందించారు. వివరాలు... శనివారం సాయంత్రం శామీర్‌పేట ప్రాంతంలో నంద కిషోర్‌కు చెందిన ఆటోలో ఓ యువతి ప్రయాణించింది. హడావుడిలో తన హ్యాండ్ బ్యాగును ఆటోలో మరిచిపోయి దిగి వెళ్లిపోయింది. ఆ తర్వాత గమనించిన ఆటోడ్రైవర్ ఆ బ్యాగును శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనుకు అప్పగించాడు. దీంతో సీఐ విచారణ జరిపి అల్వాల్‌కు చెందిన నల్లగళ్ల రాణి హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకుందని గుర్తించారు. ఆదివారం ఆమెను రప్పించి ఆ బ్యాగును అందజేశారు. బ్యాగులో ఉన్న విలువైన వస్తువులు, ఫోన్, నగదును తిరిగి అప్పగించిన ఆటోడ్రైవర్, పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. ఆటోడ్రైవర్ నంద కిషోర్‌ను సీఐ శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో డీఐ రాజు, ఎస్ఐ దశరథ, పోలీసు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పన్నులపై ప్రజలకు అవగాహన అవసరం



బాలకృష్ణను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

హిమాయత్‌నగర్: పన్ను చట్టాలు, విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదాయపు పన్ను(మినహాయింపులు) శాఖ కమిషనర్ బి.బాలకృష్ణ సూచించారు. ఆదివారం ఇక్కడ పన్ను చెల్లింపుదారుల అవగాహన కార్యక్రమాన్ని తెలంగాణ, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు సీఏ చంద్రశేఖర్ వేముల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ఆదాయపు పన్ను సెక్షన్లు, రిజిస్ట్రేషన్లు, పన్ను మినహాయింపుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఏలు ఆశిష్ జోషి, అజయ్ కుమార్, పి.సాంబమూర్తి, అమృత్ కుమార్ కోటా, ఎ.పి.దహిమా తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 28, జూలై, 2025



నా గ్లామర్ రహస్యం..

నవ్వుతూ ఉండటమే

› సినీతార దక్ష నగార్కర్

సాక్షి, సిటీబ్యూరో: సౌందర్య రంగంలో బ్యూటీ కేర్ తప్పనిసరని, నగరంలోని ఈ తరం ఫ్యాషన్ ఔత్సాహికులు వ్యక్తిగత సౌందర్య సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ప్రముఖ సినీతార దక్ష నగార్కర్ తెలిపారు. మణికొండ అల్కా పూర్ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన హెయిర్ అండ్ బ్యూటీ ప్రీమియం సెలూన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తన సినీ ప్రయాణంలో గ్లామర్ కీలక పాత్ర పోషించిందని, బ్యూటీ కేర్‌తోపాటు ఎల్లప్పుడూ సంతోషంగా నవ్వుతూ ఉండటం కూడా తన గ్లామర్ రహస్యమని తెలిపారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వ్యక్తిగత హెయిర్ స్టైలిస్ట్, పలువురు బాలీవుడ్ సెలబ్రిటీల స్టైలిస్ట్ అమ్జద్ హబీబ్ తన సేవలను నగరంలో అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని బిజినెస్ హెడ్ ఆపరేషన్స్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెలూన్ నిర్వాహకులు విజయలక్ష్మి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెల్లో హాయి.. హాయి.. మల్లెల్లో హాయి హాయి.. వరాల జల్లే కురిసే.. తప్పేట్లు హాయి హాయి తృమ్పేట్లు హాయి హాయి.. ఇవ్వాళ మనసే మురిసే.. మే నెల్లో ఎండ హాయి ఆగష్టు లో వాన హాయి.. జనవరిలో మంచు హాయి.. హాయి రామ హాయి.. హాయిగుంటే చాలు నంది వెయ్యి మాటలెందుకండి.. ఈ పాట వింటుంటే ఎంత హాయిగా ఉంటుందో.. సరైన ప్రణాళికతో జాగ్రత్తలు పాటిస్తే వర్షాకాలంలోనూ అంతే హాయిగా ఉంటుందంటున్నారు నిపుణులు.. భాగ్యనగరంలో ప్రస్తుతం వర్షాలు ముసురుకున్నాయి. వాతావరణ శాఖ సూచనల ప్రకారం.. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో సరైన జాగ్రత్తలు పాటించకుంటే ఇబ్బందులు పడక తప్పని పరిస్థితి.. - సాక్షి, సిటీబ్యూరో



వానల్లో హాయి.. హాయి..

భాగ్యనగరాన్ని ముసురుకున్న వర్షాలు



స్టైలిష్ ఫ్యాషన్‌తో సౌకర్యవంతంగా	ట్రావెల్ అండ్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ చేసేలా	చిన్నపాటి మార్పులతో సౌకర్యవంతమైన జీవనం	ఆహారం, తాగునీరు విషయంలో అప్రమత్తం అవసరం	సరైన ప్రణాళికతో మధురానుభూతులు సొంతం

గజిబిజి నగర జీవన శైలి.. వర్షాకాలంలో మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. ఓవైపు ముసురుకున్న వర్షాలతో తేమ బురద వాతావరణం. మరోవైపు ట్రాఫిక్ కష్టాలు.. వీటికి మించి ఆరోగ్య సమస్యలు.. ఈ నేపథ్యంలో చక్కని చిట్కాలు పటిస్తే వీటి నుంచి ఇట్టే పరిష్కారం లభిస్తుందని పలువురు నిపుణులు చెబుతున్నారు. వీటిని ఓ సమస్యగా కాకుండా జీవనశైలిలో భాగంగా మార్చుకుంటే శ్రేయస్కరం.. ఇందులో భాగంగా నగరవాసులకు పలు చిట్కాలు..

ఇంటి పరిసరాలపై శ్రద్ధ..



వర్షా కాలంలో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఇంటి చుట్టూ నిరు నిలిచే ప్రదేశాలను శుభ్రం చేసుకోవాలి. పైప్‌లైన్లు బ్లాక్ అవ్వకుండా క్లీన్ చేసుకోవాలి. మేడపై కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

- ప్రధానంగా ఇంటి నుంచి బయటకు వెళ్లే డ్రెయిన్లలోని చెత్తను తొలగించుకోవడం ఉత్తమం.
- దీంతోపాటు విద్యుత్ వైర్లు, మీటర్ల వద్ద తేమ లేకుండా చూసుకోవాలి.
- ఇన్వర్టర్లు, టార్చ్‌లైట్లు, బ్యాటరీ బ్యాకప్స్ చెక్ చేసుకోవాలి. అత్యవసర పరిస్థితులకు పవర్ బ్యాంక్స్ సిద్ధంగా ఉంచుకోవాలి.

ట్రావెల్ అండ్ వర్క్ లైఫ్..

నగరంలో వర్షాకాలం అనగానే ట్రాఫిక్ కష్టాలు తప్పవు.. ఎక్కడికక్కడ నిలిచిపోయే వర్షపు నీరు, వాహనాల బ్రేక్‌డౌన్లు సర్వసాధారణం. దీనిని దృష్టిలో ఉంచుకుని అవకాశం ఉన్న ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ తీసుకోవడం ఉత్తమం. దీనివల్ల ట్రాఫిక్ కష్టాలతో పాటు వర్షం తడవాల్సిన పరిస్థితి ఉండదు.. పైగా సమయం కూడా ఆదా అవుతుంది.

- ఒక వేళ అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తే ట్రాఫిక్ అప్డేట్స్ తెలుసుకోవాలి. ఇందుకోసం అనేక యాప్స్ అందుబాటులో ఉన్నాయి.
- ఎక్కువ దూరం నడవాల్సిన పనిలేని వారు ఎంఎంటీఎస్, మెట్రో వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఆశ్రయించడం ఉత్తమం.
- వర్షాలతో సంబంధం లేకుండా వాహనాల్లో రెయిన్ కోట్స్, గొడుగు, అదనపు మాస్క్, టవల్ క్యారీ చేయడం మంచిది.

వర్ష కాలపు ఫ్యాషన్ టిప్స్..

వర్షంలో మన ఫ్యాషన్ కూడా మారాలి. స్టైలిష్‌గా ఉండే సమయంలో ప్రాక్టికల్‌గా కూడా ఆలోచించాలి..

- వర్ష నిరోధక/వాటర్ ప్రూఫ్ షూస్, అనువుగా ఉండే రబ్బరు చెప్పులు సౌకర్యవంతంగా ఉంటాయి.
- సింథటిక్ లేదా డ్రై-ఫిట్ డ్రెస్సులు వేసుకుంటే తడవడం, ఆరిపోవడం తేలిక.
- లెదర్ బ్యాగ్స్‌కు బదులుగా వాటర్‌ప్రూఫ్ బ్యాగ్స్ ఎంచుకోవాలి.
- ల్యాప్‌టాప్ బ్యాక్స్‌కి కూడా వాటర్‌ప్రూఫ్ కవర్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని వినియోగించాలి.

సరైన ఆహారంతో ఆరోగ్య భద్రత..

చల్లని వాతావరణంలో శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి. సరైన ఆహారంతో ఆరోగ్య భద్రత సాధ్యమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా బయటి ఆహారం, స్ట్రీట్ ఫుడ్ ఎంత మేరకు నివారిస్తే అంత మంచిది.



- వీధిపక్కన దొరికే ఆహారానికి దూరంగా ఉండాలి.. ఇంట్లో చల్లని వాతావరణానికి తగినట్లు వేడివేడిగా వెజ్ సూప్స్, ఉల్లిపాయ పకోడి, అల్లం టీ వంటి హీటింగ్ ఫుడ్స్ వల్ల ఆహ్లాదంతో పాటు ఆరోగ్య సొంతం.
- నీరు తాగడంలో అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు. వేడి నీరు, శుద్ధి చేసిన నీటిని తాగడం మంచిది.
- వర్షాకాలంలో తీసుకునే ఆహారం చిన్న పిల్లలు, వృద్ధుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. వీటి విషయంలో ప్రత్యేక శ్రద్ధపెట్టాలి.



మైండ్‌ఫుల్ లివింగ్..

వర్షం మనసుకు ప్రశాంతతను, నూతనోత్సాహాన్ని తెస్తుంది. వర్షాన్ని కాఫీ కప్పుతో ఆస్వాదిస్తూ బుక్స్ చదవడం, ఇంట్లో గేమ్స్ ఆడడం, ఫ్యామిలీతో టైమ్ గడపడం లాంటి చిన్న విషయాలు జీవితాన్ని మరింత ఆహ్లాదంగా మార్చుతాయి. ఒక రకంగా వర్షాలు వరద బీభత్సాలే.. కాకుండా ఒక్కసారిగా పరిసరాలను శుభ్రం కూడా చేస్తాయి. ఫలితంగా ప్రకృతి ప్రదేశాలకు పచ్చదనాన్ని అందుతాయి. అయితే సరైన జాగ్రత్తలు లేకపోతే సమస్యలే ఎక్కువ ఇబ్బందిపెడతాయి. ముఖ్యంగా హైదరాబాదీయులు ఈ వర్షకాలాన్ని ఒక లైఫ్‌స్టైల్ ఫెస్టివల్‌గా మార్చుకుంటే.. ఈ కాలమెంతో మధురంగా మారుతుంది.



నాట్యం.. సమ్మోహనం..

శిల్పారామంలో అలరించిన భారతీయ నృత్య మహోత్సవం

మాదాపూర్ : శిల్పారామంలో భారతీయ నృత్య మహోత్సవం సందర్శకులను అలరించింది. నాట్యం సమ్మోహనం అన్న రీతిలో ప్రహ్లాద పట్టాభిషేక శబ్దం, వినరో భాగ్యము విష్ణు కథ వంటి పలు అంశాలను కళాకారులు ఆదివారం ప్రదర్శించారు. సమ్మోహన ఆర్ట్స్ అకాడమీ గురువు కిరణ్మయి బోనాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ముగింపు కార్యక్రమంలో భాగంగా సంచనల స్కూల్ ఆఫ్ డ్యాన్స్ పద్మకళ్యాణ్ శిష్యబృందం ప్రహ్లాద పట్టాభిషేక శబ్దం, వినరో భాగ్యము విష్ణుకథ తదితర అంశాలను ప్రదర్శించారు. వనశ్రీ జయరాం శిష్యుడు వసీంరాజా మహాదేవ శంభో, జగదోధరణ, దేవ దేవం భజే వంటి అంశాలను ప్రదర్శించి అలరించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ ఫౌండర్ రొయ్యూరు శేషసాయి, కూచిపూడి నాట్యగురువు వనశ్రీ రావు పాల్గొని కళాకారులను అభినందించి సత్కరించారు.



నగరంలో సరికొత్త కల్చర్..

రీ డిజైన్..

- ఓ ప్రముఖ జ్యువెలరీ సంస్థ ప్రారంభోత్సవంలో యాంకర్ సుమ

సాక్షి, సిటీబ్యూరో: వారసత్వంగా, గుర్తుగా దాచుకున్న పాత ఆభరణాలను సైతం ఈ తరానికి నచ్చేలా రీ డిజైన్ చేసే సరికొత్త కల్చర్ నగరంలో మొదలైందని ప్రముఖ యాంకర్ సుమ కనకాల తెలిపారు. అంతేకాకుండా పాత ఆభరణాలను ప్రస్తుత అధునాతన ఫ్యాషన్ డిజైనింగ్‌లో భాగంగా బట్టలు, చీరలు, బౌల్స్ మీద కూడా డిజైన్ చేసే మెళకువలు కూడా రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి డిజైనింగ్ సేవలతో నగరంలోని కొండాపూర్ వేదికగా నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ప్రముఖ జ్యువెలర్స్ సంస్థను సుమ కనకాల ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'గత స్మృతులను, వారి వైభవాన్ని అధునాతనంగా మలిచి ఈ తరానికి అందించడం డిజైనింగ్‌లో సరికొత్త ఆవిష్కరణ' అని అన్నారామె. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్, కాంగ్రెస్ సీనియర్ లీడర్ చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవంలో భాగంగా పలువురు మోడల్స్ ఫ్యాషన్ జ్యువెలరీ వేర్‌తో అలరించారు.





ఫ్యాషన్ ఫ్రమ్ నేచర్..

నోవోటెల్ వేదికగా ఇండియా కిడ్స్ ఫ్యాషన్ వీక్

- ఫారెస్ట్ థీమ్‌తో వనమ్ కలెక్షన్ ఆవిష్కరణ
- జెన్ జీ ఫ్యాషన్ ఐకాన్‌గా.. 'అమోగ్ రెడ్డి'
- చిన్న వయసులోనే ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్‌గా గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: 15 ఏళ్ల వయసులోనే ఫ్యాషన్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన.. రెండేళ్లలోనే ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. వెరసి దేశంలోనే అతి పిన్న వయస్కుడైన ఫ్యాషన్ డిజైనర్‌గా రాణిస్తున్నాడు అమోగ్ రెడ్డి. భారతీయ సంప్రదాయ, వివాహ కోచర్‌లో తన నైపుణ్యాలతో ప్రసిద్ధి చెందిన అమోగ్.. వారసత్వ హంగులను ఆధునిక ఫ్యాషన్‌తో సమ్మిళితం చేస్తూ అంతర్జాతీయ స్థాయి ఫ్యాషన్ ఔత్సాహికులను ఆకర్షిస్తున్నారు. అంతేకాకుండా 'యంగెస్ట్ డిజైనర్ ఆఫ్ ది ఇయర్' బిరుదును సైతం పొందారు. ఈ ప్రయాణంలో భాగంగానే నగరంలోని హెచ్ఐసీసీ నోవోటెల్ వేదికగా వినూత్నంగా ఫారెస్ట్ థీమ్‌తో ఆదివారం నిర్వహించిన ఇండియా కిడ్స్ ఫ్యాషన్ వీక్‌లో వనమ్ కలెక్షన్స్ ఆవిష్కరించారు.







డిజైనింగ్‌తో స్టోరీ టెల్లింగ్..

మన ఊహకందని నూతన ఫ్యాషన్ ఫార్ములాతో సమ్మిళితమై రూపొందించారు. ఆ సౌందర్యం ఒక్కొక్క లేయర్‌లా నిరంతరం ఆకర్షణీయంగా అభివృద్ధి చెందుతూ ఉంటుందని అమోగ్ రెడ్డి తన ఆలోచనలను పంచుకున్నారు. నోవోటెల్ వేదికగా చిన్నారులతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 12వ సీజన్ ఇండియా కిడ్స్ ఫ్యాషన్ వీక్‌లో అమోగ్ రూపొందించిన డిజైనింగ్ వేర్ ప్రకృతిని ప్రతిబింబించాయి. ప్రకృతిలోని వర్ణాలు, అరణ్యంలోని అందాల నుంచి ప్రేరణ పొందాయి. ఆకారాల కవిత్వమే ఈ వనమ్ కలెక్షన్ అని అమోగ్ పేర్కొన్నారు. ప్రకృతి అందాలే ఈ డిజైన్‌లను రూపొందించడానికి ప్రేరేపించాయన్నారు. క్రియేటివిటీని హైదరాబాద్‌లో ప్రారంభించి దేశంతో పాటు ప్రపంచ నలుమూలలా విస్తరింపజేయాలనే లక్ష్యంతో ఉన్నానన్నారు. ఈ కలెక్షన్‌లోని ప్రతి డిజైన్ ఒక కథను చెబుతుంది. వినూత్న పద్ధతుల్లో ఆధునిక ఫ్యాషన్ హంగులతో సంప్రదాయ హస్తకళలను సమన్వయం చేయడంతో ఫ్యాషన్ ప్రియులను అలరించాయి.

ఎలక్ట్రానిక్స్ వినియోగం ప్రపంచవ్యాప్తంగా అంతకంతకూ పెరుగుతోంది. ఇందుకు మన దేశం కూడా మినహాయింపు ఏమీ కాదు. స్మార్ట్ ఉపకరణాలు.. ప్రధానంగా ఏఐ ఆధారిత గ్యాడ్జెట్స్ ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. డిజిటల్ వినియోగానికి తగ్గట్టుగా ఉపకరణాల సంఖ్యా అధికం అవుతోంది. ఇదంతా ఒక ఎత్తైతే.. గుట్టలుగా పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ-వేస్ట్) ప్రపంచానికి సవాల్ విసురుతున్నాయి. అయితే భారత్‌లో ఈ-వేస్ట్ పునర్వినియోగం పెరుగుతుండడం విశేషం.


- సాక్షి, స్పెషల్ డెస్క్



రీసైక్లింగ్ ఒక్కటే పరిష్కారం

అరుదైన ఖనిజాల (రేర్ ఎర్త్స్) సరఫరాలో అగ్ర స్థానంలో ఉన్న చైనా ఎగుమతులను కట్టడి చేయడంతో.. ఈ కొరతకు పరిష్కారం కనుగొనడానికి మిగతా దేశాలన్నీ దారులు వెతుకుతున్నాయి. విదేశాల్లో అరుదైన లోహ ఖనిజ గనులను దక్కించుకోవడంతోపాటు దేశీయంగా వీటి ఉత్పత్తిని ప్రోత్సహించే పథకానికి భారత ప్రభుత్వం సిద్ధమవుతుండగా.. విస్మరించడానికి వీలుకాని బంగారు నిక్షేపాలుగా ఈ-వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్ తయారీలో బంగారం, వెండి, రాగి వంటి విలువైన లోహాలతోపాటు స్కాండియం, సెరియం, యూరోపియం, లాంథనమ్ వంటి అరుదైన మూలకాలనూ ఉపయోగిస్తారు. ఈ-వ్యర్థాల నుంచి ఈ విలువైన లోహాలను సేకరించాలంటే సరైన రీతిలో రీసైక్లింగ్ ఒక్కటే కీలక పరిష్కారం. మైనింగ్‌పై ఆధారపడటాన్ని తగ్గించడానికి, ఆర్థిక వ్యవస్థపై భారం పడకుండా ఈ విధానం సాయపడుతుంది.

గృహాల నుంచే ఎక్కువ



భారత్‌లో పోగైన ఈ-వ్యర్థాల్లో గృహాల నుండి సేకరించినవి 70% వరకూ ఉంటున్నాయి. ఎయిర్ కండిషనర్లు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, టెలివిజన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్స్ వంటివి వీటిలో ఉన్నాయి. మిగిలిన 30% వ్యాపార సంస్థల నుంచి సేకరించినవి. వీటిలో రిఫ్రిజిరేటర్లు, వాటర్ కూలర్లు, సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషనర్లు, హాట్ అండ్ కోల్డ్ డిస్పెన్సర్లు, పారిశ్రామిక ప్రింటర్లు, కాపీయర్లు, వాణిజ్య వాషింగ్ మెషీన్లు, ల్యాబ్ పరికరాలు, ప్రొఫెషనల్ మెడికల్ పరికరాలు, కాఫీ మెషీన్లు, సర్వర్లు, డెస్క్‌టాప్‌లు, మానిటర్లు వంటివి ఉన్నాయి.

తగ్గుతున్న బరువు

సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ఎలక్ట్రానిక్ పరికరాలు తేలికగా, చిన్నవిగా మారుతున్నాయి. సీఆర్‌టీ టీవీల నుండి ప్రస్తుతం సన్నని ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీలకు మారడం వల్ల ఈ-వ్యర్థాల యూనిట్ బరువు గణనీయంగా తగ్గింది. అనేక ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు.. ఇప్పుడు ఉక్కు, సీసం వంటి బరువైన లోహాలకు బదులుగా అల్యూమినియం, ప్లాస్టిక్‌ల వంటి తేలికైన, మరింత సమర్థవంతమైన పదార్థాలతో తయారవుతున్నాయి. ఈ మార్పు కారణంగా ఈ-వ్యర్థాల మొత్తం బరువు, పరిమాణం ప్రపంచవ్యాప్తంగా తగ్గుతోంది.

కాదిక ఈ-వేస్ట్

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 2023–24లో 12,54,286 మెట్రిక్ టన్నుల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. 2024–25లో ఇది 13,97,955 టన్నులకు చేరింది. అంటే ఏడాదిలో ఈ-వ్యర్థాలు 11.5 శాతం పెరిగాయన్న మాట. ఈ అయిదేళ్లలో అత్యధికంగా 2022–23లో 16.09 లక్షల టన్నులు పోగయ్యాయి. ఇక గత ఆర్థిక సంవత్సరంలో ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ వాటా మొత్తం వ్యర్థాల్లో 70.71 శాతం, 2023–24లో ఇది 61.94 శాతంగా ఉంది. రీసైక్లింగ్ వాటా ఏడాదిలో 14 శాతం అధికం కావడం సానుకూల అంశం. రాష్ట్రాల వారీగా చూస్తే రీసైక్లింగ్‌లో దేశంలో 3,88,160 మెట్రిక్ టన్నులతో ఉత్తర ప్రదేశ్ ముందుంది. ఈ-వేస్ట్ పోగవుతున్న నగరాల్లో ఢిల్లీ ముందు వరుసలో ఉంది. ఆ తర్వాత ముంబై, హైదరాబాద్, పుణే ఉన్నాయి.

అపార అవకాశాలు..


పరిమాణం పరంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలు అధికంగా పేరుకుపోతున్న దేశాల్లో చైనా, యూఎస్, భారత్ తొలి మూడు స్థానాల్లో ఉంటాయి. 'గ్లోబల్ ఈ-వేస్ట్ మానిటర్ నివేదిక 2024' ప్రకారం.. ఈ-వేస్ట్‌లోని లోహాల ఆర్థిక విలువ సుమారు 91 బిలియన్ డాలర్లు అని అంచనా. ఈ-వేస్ట్‌ను రీసైక్లింగ్ చేయడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా అరుదైన లోహాల డిమాండ్‌లో 1 శాతం వరకు తీరుతుందట. అంటే ఎలక్ట్రానిక్ వ్యర్థాల పరిశ్రమలో అపార వ్యాపార అవకాశాలు ఉన్నాయన్నమాట.

సేకరించిన ఈ-వ్యర్థాల్లో 70% పునర్వినియోగం

దేశంలో ఏడాదిలో 14% పెరిగిన రీసైక్లింగ్ వాటా

2024-25లో 13,97,955 టన్నుల ఈ-వేస్ట్ నిల్వలు


భారత్‌లో పోగైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు
(మెట్రిక్ టన్నుల్లో)



ఈ-వ్యర్థాలు..: పనికిరాని లేదా ఉపయోగించలేని ఎలక్ట్రానిక్ పరికరాలను ఎలక్ట్రానిక్ వ్యర్థాలు లేదా ఈ-వ్యర్థాలు అంటారు. కంప్యూటర్లు, మానిటర్లు, మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు, టీవీలు, రేడియోలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ప్రింటర్లు, స్కానింగ్ చేసే పరికరాల వంటివన్నీ ఈ కోవలోకి వస్తాయి. వీటిలో ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే ప్రమాదకర పదార్థాలు ఉంటాయి. అందువల్ల వాటిని పారేయకుండా రీసైకిల్ చేయాలి.

గత ఆర్థిక సంవత్సరంలో ఈ-వ్యర్థాల రీసైక్లింగ్ వాటా మొత్తం వ్యర్థాల్లో 70.71 శాతం. 2023-24లో ఇది 61.94 శాతంగా ఉంది. రీసైక్లింగ్ వాటా ఏడాదిలో 14 శాతం పెరగడం సానుకూల అంశం.

టాప్ - 10 రాష్ట్రాలు



గత ఆర్థిక సంవత్సరంలో రీసైక్లింగ్‌లో ముందున్న రాష్ట్రాలు (మెట్రిక్ టన్నులు)

క్లుప్తంగా...

ఏ ఎన్నికలైనా ఒంటరిగానే పోటీ చేస్తాం

- ఎరువుల కొరతకు రాష్ట్ర ప్రభుత్వమే కారణం: రాంచందర్‌రావు



నాగర్‌కర్నూల్/గద్వాల/వనపర్తి టౌన్: రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఏవైనా సరే బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ప్రకటించారు. ఆదివారం నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లా కేంద్రాల్లో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీల అభ్యున్నతికి పాటుపడుతున్నామని చెబుతున్న సీఎం రేవంత్‌రెడ్డి.. సొంత జిల్లాలోనే విద్యార్థులకు మంచి ఆహారం పెట్టడం లేదని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు స్వార్థ రాజకీయాలు తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలు అవసరం లేదని మండిపడ్డారు. తెలంగాణకు 9.5 లక్షల మెట్రిక్‌టన్నుల యూరియా కావాలని సీఎం అడిగితే.. అంతకంటే ఎక్కువ 12.02 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం సరఫరా చేసిందని చెప్పారు. అయినప్పటికీ కొరత ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. దీనిపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బహిరంగచర్చకు సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని అన్నారు. రాంచందర్‌రావు వెంట మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ ఎంపీ రాములు, తల్లోజు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

లేని యూరియాను సరఫరా చేసిందని చెప్పకోవడం శోచనీయం

- రాష్ట్రానికి కేంద్రం కేటాయించిందే 9.80 ఎల్ఎంటీ
- ఇప్పటికి వచ్చింది 4.23 ఎల్ఎంటీనే: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రా నికి వానాకాలం సీజన్‌లో కేటాయించిన యూ రియా 9.80 లక్షల మెట్రిక్ టన్నులే అయి తే, ఇప్పటి వరకు 12 లక్షల మెట్రిక్ టన్నుల యూ రియా సరఫరా అయ్యిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డు ఎన్.రాంచందర్‌రావు చెప్పడం వ్యవసాయం పట్ల ఆ పార్టీకి ఉన్న నిబద్ధతకు అద్దం పడుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. వ్యవసాయంపై కనీస అవగాహన లేకుండా, రైతాంగం గురించి కనీస పరిజ్ఞానం లేకుండా బీజేపీ అధ్యక్షుడు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 9.80 ఎల్ఎంటీ యూరియాలో నాలుగు నెలల్లో 6.60 ఎల్ఎంటీ రావాల్సి ఉండని, వచ్చింది మాత్రం కేవలం 4.23 ఎల్ఎంటీనేనని తెలిపారు. రైతుల విషయంలో ఎలాంటి రాజకీయాలకు తావివ్వకూడదని ఎన్నిసార్లు విన్నవించినా, వారి వైఖరి మారడం లేదన్నారు.

ఆగస్టు 7న గోవాలో జాతీయ ఓబీసీ మహాసభ

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఓబీసీ మహాసభ ఆగస్టు 7న గోవాలో నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మహాసభకు అతిథులుగా హాజరుకావాలని పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ, ఈటల రాజేందర్, వద్దిరాజు రవిచంద్రను ఆదివారం వారి నివాసాల్లో కలిసి ఆహ్వానించారు. మహాసభ వాల్‌పోస్టర్‌ను వారికి అందించారు. బీసీల చైతన్యం కోసం బీసీ సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీలు ఈ సందర్భంగా ప్రశంసించారు. ఈ చైతన్యాన్ని ఇలాగే కొనసాగించి బీసీ హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

కనిపెట్టి కాపాడుదాం

▶ మొదటి పేజీ తరువాయి

కారణాలేంటి? ఏయే స్థాయుల్లో, ఎలా వాటిని గుర్తించి నివారించవచ్చు? ఇందులో సమాజంలోని వివిధ వర్గాల పాత్ర ఏమిటి? నిపుణులు ఏమంటున్నారు?

విశాఖపట్నంలో ఓ కోచింగ్ సంస్థలో 'నీట్'శిక్షణ పొందుతున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతి అనుమానాస్పద మృతిపై దర్యాప్తునకు ఆదేశించాలంటూ నమోదైన కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. 'జాతీయ నేర గణాంక విభాగం లెక్కల ప్రకారం దేశంలో 2022లో 1.7 లక్షలకుపైగా ఆత్మహత్యల కేసులు నమోదైతే అందులో 7 శాతం విద్యార్థుల మరణాలే'అని అత్యున్నత న్యాయస్థానం గణాంకాలనూ ఉటంకించింది. 100 మంది విద్యార్థులు ఉన్న విద్య, శిక్షణ సంస్థలు, హాస్టళ్లలో సైకాలజిస్ట్, అర్హతగల కౌన్సిలర్, సామాజిక కార్యకర్తను నియమించాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది.

తేలిగ్గా తీసుకొనే మాటలు కావవి..

ఒత్తిడి, ఆందోళనలో ఉన్న విద్యార్థి తన కష్టాన్ని, బాధను ఏదో ఒక సందర్భంలో వ్యక్తపరుస్తారు. అది స్నేహితులు, బంధువులు, ఆఖరికి తల్లిదండ్రుల దగ్గర కూడా కావచ్చు. అలాంటప్పుడు వారి మాటలను తేలిగ్గా తీసుకోవడం మంచిది కాదు.

- 'పరిస్థితులు ఎప్పటికీ బాగుపడవు.. ఇక నేను ప్రయత్నించడంలో అర్థం లేదు'
- 'నా సమస్యలకు ఎవరూ సహాయం చేయలేరు.. నాకు మార్గం కనిపించడం లేదు'
- 'నేను పనికిరాను, నేను ఎవరికీ ముఖ్యం కాదు'
- 'ఇతరులకు భారంగా ఉన్నాను, నామీద నాకు సిగ్గుగా ఉంది'

ఇలాంటి మాటలు విద్యార్థుల నోటి నుంచి వస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

ఇలా బయటపడొచ్చు

- ఒత్తిడిని జయించడానికి, నైపుణ్యాలను అందిపుచ్చుకోవడానికి జనరేషన్-జెడ్, జెన్-ఆల్ఫా ఏం చేస్తున్నారంటే..
- గేమింగ్, ఈ-స్పోర్ట్స్: పోటీతత్వాన్ని నేర్పుతుంది. మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయి.
- మ్యూజిక్, పాడ్‌కాస్ట్: భావోద్వేగాల నియంత్రణ, ఒత్తిడి నుండి ఉపశమనం
- ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ: సృజనాత్మకత, తన టాలెంట్‌ను నలుగురికీ తెలియజేయడం
- స్వచ్ఛంద సేవ, క్రియాశీలత: సంతృప్తి, సహానుభూతి, తన చుట్టుపక్కల వారితో అనుబంధం పెంచుకోవడానికి
- ఫిట్‌నెస్, యోగా: ఒత్తిడి నుంచి బయటపడేందుకు, సానుకూల దృక్పథం
- షాపింగ్ థెరపీ: ఒత్తిడి నుంచి ఉపశమనం

ఆ ప్రవర్తనలే హెచ్చరికలు

తల్లిదండ్రులు, బడులు లేదా విద్యాసంస్థల్లోని టీచర్లు పిల్లలను నిరంతరం గమనిస్తూ ఉండాలి. వారిలో ఈ కింది లక్షణాలు కనిపిస్తే ప్రమాదం పొంచి ఉందన్న హెచ్చరికగా భావించాలి.

- ఇటీవలి కాలంలో చదువులో మీ పిల్లలు వరుసగా వెనుకబడుతుంటే
- ప్రతి చిన్న విషయానికీ కోపం, అసహనం ఎక్కువవుతుంటే
- నలుగురితో కలవకుండా, ఒంటరిగా ఉండటాన్ని ఇష్టపడుతుంటే
- తన ఒళ్లు, ఆహారం, ఆరోగ్యం.. ఇలా దేనిమీదా శ్రద్ధ లేకుండా ఉంటే
- తరగతిలో అజాగ్రత్తగా ఉండటం, మతిమరుపు
- ఏదో తలచుకుని ఏడవడం
- రాత్రుళ్లు నిద్రపట్టకపోవడం



సమయపాలన..

ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయానికి ప్రధాన కారణం ఇదే. సమయాన్ని సద్వినియోగం చేసుకోలేక, ఏ పనికి ఎంత సమయం కేటాయించాలో అంచనా వేయలేక విద్యార్థులు ఒత్తిడిని పెంచుకుంటున్నారు.

- ప్రాధాన్యతను బట్టి ఏ పనికి ఎక్కువ సమయం, ఏ పనికి తక్కువ సమయం అన్న స్పష్టమైన విభజన చేసుకోవాలి. అది చదువు / సబ్జెక్ట్, ఆటపాటలు, షికార్లు /ఎంజాయ్‌మెంట్, వ్యాయామం.. అన్నింటికీ వర్తిస్తుంది.
- ఏకబిగిన చదవకుండా మధ్యమధ్యలో విరామాలు తీసుకోవాలి
- మరునాడు చేయబోయే పనులకు సంబంధించి ముందురోజు రాత్రే టైమ్ టేబుల్ వేసుకోవాలి. అందులో ఎంత శాతం పూర్తిచేస్తున్నారో డైరీలో రాసుకోవాలి. 60, 70, 80, 90 శాతం వరకు వచ్చారంటే.. మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆ తరవాత అలా రాయాల్సిన అవసరమే ఉండదు.

> కఠిన గ్రేడింగ్ వ్యవస్థలు, మానసిక ఆరోగ్య సమస్యలు వస్తే ఓదార్చేవారు లేకపోవడం, నిరంతర పోటీతత్వం విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు. ముప్పును ముందే గుర్తించి పిల్లలకు కౌన్సెలింగ్ ఇచ్చే స్థాయిలో పాఠశాల, కళాశాల కౌన్సెలర్లకు శిక్షణ ఇవ్వాలి. భావోద్వేగాలను నియంత్రించుకునేలా, ఒత్తిడిని జయించి, ఆత్మహత్యలను నివారించేలా విద్యాసంస్థలు మేమున్నామనే భరోసా ఇవ్వాలి
>
> - నెల్సన్ వినోద్ మోసెస్, సూసైడ్ ప్రివెన్షన్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు

తల్లిదండ్రులూ.. పిల్లలు చెప్పేది వినండి

పిల్లలు చెప్పేది వినడానికి చాలామంది తల్లిదండ్రులు సిద్ధంగా ఉండరు. తాము కష్టపడి, డబ్బు పెట్టి చదివిస్తుంటే... ఏ కష్టం చదవడానికి అనుకుంటారు. ఈ ధోరణి మారాలి. వాళ్ల జీవితంలో ఏ అనుభవమూ లేకనే సమస్యలు మీకు చెబుతున్నారన్న విషయాన్ని మీరు అర్థం చేసుకుంటే సగం సమస్య పరిష్కారమైనట్టే.

పిల్లలూ.. స్క్రీన్ టైమ్ తగ్గించండి

ఇటీవలి కాలంలో విద్యార్థులు చదువు కోసం కంప్యూటర్ లేదా స్మార్ట్ ఫోన్లను ఆశ్రయిస్తున్నారు. వీటి వల్ల చాలా సమస్యలు వస్తున్నాయి. వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

- కొందరు విద్యార్థులు చదువుకు సంబంధించినవి కాకుండా ఇతరత్రా విషయాలపై ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారు.
- షార్ట్స్, రీల్స్, వీడియోలను ఒకటి తరవాత ఒకటి.. చూడటానికి మెదడు అలవాటు పడితే.. చదవాలన్న తలంపే రాకుండా పోతుంది. దానివల్ల పరీక్షల వంటి కీలక సమయాల్లో ఒత్తిడి పెరుగుతోంది.

పిల్లలూ.. సిగ్గు, మొహమాటం వద్దు

- స్నేహితులు, కుటుంబ సభ్యులు, టీచర్లు, బంధువులు.. వీరిలో మీ మనసుకు దగ్గరగా ఉండే వ్యక్తులు కచ్చితంగా ఉంటారు. మీకు ఏ సమస్య వచ్చినా నిర్మొహమాటంగా వారితో పంచుకోండి.
- చాలా సందర్భాల్లో ఈ వ్యక్తులు మీ అమ్మ లేదా నాన్న కూడా కావచ్చు.

అది బీసీ డిక్లరేషన్ కాదు.. ముస్లిం డిక్లరేషన్


- కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్ టౌన్: కాంగ్రెస్ ఇచ్చేది బీసీ డిక్లరేషన్ కాదని, ముమ్మాటికీ ముస్లిం డిక్లరేషన్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఆదివారం కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. బీసీ ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్లను అమలు చేసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరలేపిందన్నారు. తెలంగాణలో హిందువులను మైనారిటీలుగా చేసే కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం రమేశ్ వ్యాఖ్యలతో సీఎం రేవంత్ రెడ్డికి సంబంధం లేదని, బీజేపీలో బీఆర్ఎస్ చేరికపై సీఎం రమేశ్ చెప్పింది నిజమే అని, అది తప్పని నిరూపించే దమ్ము కేటీఆర్‌కు ఉందా? అని సంజయ్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీని నడిపే స్థితిలో ఎవరూ లేరని, అందుకే బీజేపీలో విలీనం చేస్తామని గతంలో ఒప్పందానికి వచ్చారని చెప్పారు. విలీనం, వారసత్వ రాజకీయాలకు బీజేపీ వ్యతిరేకమని, అందుకే తిరస్కరించామన్నారు. పార్టీని నడపలేక కేసీఆర్ చేతులెత్తేశారని, ఆ ఆక్రోశంతోనే కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సీఎంను హౌలే అంటూ తిడుతున్నా స్పందించలేని దద్దమ్మలు కాంగ్రెస్ నేతలు అని దుయ్యబట్టారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే బీజేపీ మద్దతిస్తుందని చెప్పారు.జూబ్లీహిల్స్‌లో ఉన్న పెద్దమ్మ గుడి కూల్చివేత దుర్మార్గమని సంజయ్ మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసమే గుడి కూల్చివేతకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు.

బీజేపీని ఎదుర్కోవడానికి సిద్ధం కావాలి

- 'శాంతి చర్చలు–ప్రజాస్వామిక అన్వేషణ' పుస్తకావిష్కరణ సభలో వక్తలు.. పాల్గొన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు




పుస్తకావిష్కరణలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, హరగోపాల్, జయధీర్ తిరుమలరావు తదితరులు

హిమాయత్‌నగర్: దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలన్నీ బీజేపీ వశమయ్యాయని, ఆ పార్టీని ఎదుర్కోవడానికి అందరూ సిద్ధం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. లేనిపక్షంలో తెలంగాణలో కూడా బీజేపీ ప్రభుత్వం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రొఫెసర్ జి.హరగోపాల్ రచించిన 'శాంతి చర్చలు–ప్రజాస్వామిక అన్వేషణ'పుస్తకావిష్కరణ సభ ఆదివారం పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో రాజేంద్ర అర్విణి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జి.విజయ్, ఆవిష్కర్తగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత భయానక పరిస్థితుల్లో మావోయిస్టులతో శాంతి చర్చలు ఎంతో అవసరం ఉందని అన్నారు. పాలకులు వ్యవస్థలను ఇలాగే నడిపిస్తామంటే అది ఎంతో కాలం నిలబడదని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సమాజంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఉండాలని అన్నారు. పాలకులను ప్రశ్నించేలా ప్రస్తుత సమాజంలో సమూలమైన మార్పులు రావాలని ఆకాంక్షించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. బిహార్‌లో జరుగుతున్న పరిణామాలు రేపోమాపో తెలంగాణలో కూడా జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సమాజంలో మార్పుల కోసం పనిచేస్తున్న మావోస్టులు చర్చలకు వస్తామని అన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, అమిత్ షాలకు మావోయిస్టులతో చర్చలు జరపడం ఇష్టం లేకపోతే ప్రొఫెసర్ హరగోపాల్‌తో చర్చలు జరపాలని సూచించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిజాన్ని అడ్డుకోవాలని ప్రజాస్వామికవాదులకు పిలుపునిచ్చారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగంలో రక్తపాతం లేకుండా విప్లవాత్మకమైన మార్పులు తేవాలని అంబేడ్కర్ అన్నారని, అందుకు విరుద్ధంగా రక్తపాతం జరుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. సభలో ప్రొ.డీ ఎన్.ఎం. రాఘవాచారి, పీబీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

మామునూరు ఎయిర్‌పోర్టుకు రాణిరుద్రమ పేరు పెట్టాలి

కేంద్రమంత్రి, ముఖ్యమంత్రికి లేఖ రాస్తానన్న కల్వకుంట్ల కవిత



సాక్షిప్రతినిధి, వరంగల్: మామునూరు ఎయిర్‌పోర్టుకు రాణిరుద్రమ పేరు పెట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఓరుగల్లు చరిత్ర, సంస్కృతిని పరిరక్షించిన రాణిరుద్రమదేవి వారసత్వానికి గుర్తింపుగా ఎయిర్‌పోర్టుకు ఆమె పేరు పెట్టాలన్న కవిత.. ఈ మేరకు కేంద్రమంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ కూడా రాయనున్నట్టు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో వరంగల్‌లో ఆగస్టు 6న ఘనంగా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ జాగృతి నేత దాస్యం విజయభాస్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు.

బీఆర్ఎస్‌లోనే ఉన్నా.. అనుమానం వద్దు

బీఆర్ఎస్ పార్టీలోనే తాను ఉన్నానని, ఎమ్మెల్సీగా కూడా కొనసాగుతున్నానని, ఈ విషయంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదని ఎమ్మెల్యే కవిత ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తెలంగాణ జాగృతి, బీఆర్ఎస్ వేర్వేరు కాదని, తెలంగాణ చరిత్ర, సంస్కృతిని కాపాడేందుకు తెలంగాణ జాగృతిని మరింత బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.

యంగ్ ఇండియాకు 25 ఎకరాలు ఉండాల్సిందే

- వనమహోత్సవానికి ఉమ్మడి ఖమ్మంలో పైలెట్ ప్రాజెక్టు
- కొత్తగూడెంలో జరిగిన సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. చిత్రంలో మంత్రులు తుమ్మల, వాకిటి శ్రీహరి, పొంగులేటి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి 25 ఎకరాలకు తగ్గకుండా స్థలాన్ని సేకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. 2,600 మంది పిల్లలు ఉండే క్యాంపస్‌లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుందని, 25 ఎకరాలకు పైగానే స్థలాన్ని తీసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. కొత్తగూడెంలో ఆదివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులపై జరిగిన సమీక్షలో భట్టి మాట్లాడారు. హరితహారం పేరుతో విరివిగా మొక్కలు నాటామని గత ప్రభుత్వం చెప్పుకుందని, ఉమ్మడి జిల్లాలో ఏదైనా ఒక మేజర్ పంచాయతీని యూనిట్‌గా తీసుకొని గడిచిన పదేళ్లలో అక్కడ నాటిన మొక్కలు ఎన్ని? చేసిన ఖర్చు ఎంత? ఇప్పటివరకు బతికి ఉన్న మొక్కలు ఎన్ని అనే కచ్చితమైన వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఈ పైలెట్ ప్రాజెక్టు ద్వారా వచ్చే ఫలితాలను అనుసరించి రాబోయే రోజుల్లో వనమహోత్సవం కార్యక్రమాన్ని లోపరహితంగా అమలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

మహిళా సంఘాలకు చేపపిల్లల బాధ్యత..

మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే చేపపిల్లల పెంపకం బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించే యోచనలో ఉన్నట్టు మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.

- గతంలో నిర్మించిన, మధ్యలో ఆగిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల వివరాలను గ్రామాల వారీగా సేకరించాలని, వీటిని ఆగస్టు 15లోగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు.
- మంత్రి తుమ్మల మాట్లాడుతూ వానాకాలంలో వరద ముప్పు ఎదుర్కొనేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నీళ్లు చంద్రబాబుకు.. నిధులు రాహుల్‌కు

- కాంగ్రెస్ పాలనలో అంతటా అవినీతి, అక్రమాలే
- 20 నెలల్లో విషాహారంతో అనేకమంది విద్యార్థులు మృతి
- ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో కేటీఆర్ మండిపాటు



కేటీఆర్‌కు విల్లు అందజేస్తున్న గండ్ర వెంకటరమణారెడ్డి. చిత్రంలో గండ్ర జ్యోతి, రాజిరెడ్డి

సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు నీళ్లు, నిధులు, నియామకాలు కల్పిస్తే.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నీళ్లు నారా చంద్రబాబునాయుడికి, నిధులు రాహుల్‌గాంధీకి, నియామకాలు చంద్రబాబు తొత్తులకు ఇస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగి ప్రజాధనం లూటీ అవుతోందని ఆరోపించారు. కేటీఆర్ ఆదివారం హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో పర్యటించారు. గిఫ్ట్ ఏ స్మైల్ కింద పరకాలలో 'పోచంపల్లి ఫౌండేషన్'ఆధ్వర్యంలో మహిళలకు కేసీఆర్ కిట్లు, కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. అనంతరం పరకాల, మొగుళ్లపల్లి, భూపాలపల్లిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సదస్సులో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా నాగర్‌కర్నూల్‌లో 111 మంది గురుకుల విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్ అయినట్టు తెలిసిందని ఆందోళన వ్యక్తం చేశారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో పదుల సంఖ్యలో విద్యార్థులు మరణిస్తే ప్రభుత్వం ఏం చేస్తుందని నిలదీశారు. మీ పిల్లలకు ఇలాంటి విషాహారమే పెడతారా? అని ప్రశ్నించారు. అందాల పోటీలకు వచ్చిన ప్రపంచ సుందరీమణులు, వారిని చూసి సొంగకార్చే వారి కోసం ఒక్కో భోజనానికి రూ.లక్ష చెల్లించిన ఈ ప్రభుత్వం.. విద్యార్థులకు రూ.150 వెచ్చించలేదా? అని ప్రశ్నించారు.

కాళేశ్వరం కుట్ర వెనుక కాంగ్రెస్ ఉందేమో..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ పియర్‌లు కుంగడానికి కాంగ్రెస్ నేతలే కుట్రచేశారా? అన్న అనుమానం కలుగుతోందని కేటీఆర్ అన్నారు. టెక్స్‌టైల్ పార్కులో రూ.137 కోట్ల అంచనాలు కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల ధనదాహంతో రూ.297 కోట్లకు పెరిగాయని ఆరోపించారు. కాల్వ నిర్మాణం పేరుతో కాంగ్రెస్ నేతలు రూ.167 కోట్లు దోచుకోవాలనుకున్నారని ధ్వజమెత్తారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అక్రమాలపై నిలదీస్తామని తెలిపారు. తెలంగాణలోని ప్రతీ ఆడబిడ్డకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50 వేల బాకీ ఉందని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ నాయకులకు ఆడబిడ్డలు కర్రుకాల్చి వాత పెట్టాలని సూచించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత ఇజ్జత్ లేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే చూస్తున్నానని దుయ్యబట్టారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బండా ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ ఉన్నారు.

సన్నిధి



సద్భాషణం

ఇంటా బయట ఆందోళనకరమైన జీవన విధానం. నిత్యం ఒత్తిడి, భావోద్వేగ సంఘర్షణలు. అయితే... ధ్యానం ద్వారా వాటిని సమతుల్యం చేసుకునే శక్తి మనకు ఉంది. ధ్యానం ఆత్మ సముద్ధరణకు ఉపయోగపడే అత్యున్నతమైన సాధనం. ఇంటిలో, సమాజంలో ప్రశాంతతను నెలకొల్పాలంటే ముందు మనలో ప్రశాంతత కలగాలి అని వివరించారు బ్రహ్మకుమారీస్ రాజయోగిని కులదీప్ దీదీ. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సంత్ సమాగమమ్' కార్యక్రమంలో ఆమె ఈ విషయాలను పంచుకున్నారు.

అంతర్గత సంపదే నిజమైనది



"నేటి వేగవంతమైన ప్రపంచంలో ఒత్తిడి, పోటీ, మితిమీరిన సాంకేతికత, భావోద్వేగ సంఘర్షణల కారణంగా మనశ్శాంతిని కోల్పోతున్నాం. ధ్యానం శక్తిమంతమైన, సమగ్రమైన పరిష్కారాన్ని అందిస్తుంది. సహనాన్ని ప్రోత్సహించి సామరస్యాన్ని పెంపొందిస్తుంది. మానసికంగా ఇది మనసును ప్రశాంత పరుస్తుంది. ఆందోళనను తగ్గిస్తుంది. దృష్టిని మెరుగుపరుస్తుంది. క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ఒత్తిడి హార్మోన్ల అసమతుల్యతను తగ్గిస్తుంది. మానసిక శ్రేయస్సును పెంచుతుంది. ఈ విషయాలు అనేక అధ్యయనాలు స్పష్టం చేశాయి.

యువతలో వేగవంతమైన భావోద్వేగాలు..

నేటి యువత భావోద్వేగాలకు చాలా ఎక్కువగా గురవుతోంది. వేగవంతమైన భావోద్వేగాలు, విచ్ఛిన్నమైన సంబంధాలు, ప్రేమ గురించి విరుద్ధమైన ఆలోచనలతో వారి జీవితమే కాకుండా వారి ద్వారా ఇతరులకు కూడా ఇబ్బంది కలుగుతోంది. మనం వారికి ఏం చెప్పగలం అంటే.. నిజమైన ప్రేమ అంటే కేవలం ఆకర్షణ లేదా భావోద్వేగం కాదు. అది అర్థం చేసుకోవడం, గౌరవించడం, అవసరమైనప్పుడు కొంచెం స్పేస్ కూడా ఇవ్వడం. ముందుగా మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం నేర్చుకోవాలి. లోలోపల ఖాళీగా అనిపిస్తే బయట ప్రేమ కోసం వెతకద్దు. ప్రేమ స్వీయ అవగాహనతో ప్రారంభమవుతుంది. జీవితం కేవలం ఆనందం కోసం కాదు ప్రయోజనం కోసం అని గ్రహించాలి.

గృహిణులు ఇంట్లో శాంతిని నిలబెట్టాలంటే...

'నేను ప్రశాంతమైన ఆత్మను' అనేది ముందుగా గుర్తుంచుకోవాలి. కొన్ని నిమిషాల నిశ్శబ్దం లేదా ధ్యానంతో రోజును ప్రారంభించాలి. కుటుంబ సభ్యులను కేవలం పాత్రలుగా కాకుండా ఆత్మలుగా చూడండి. ఇది సహనాన్ని, మంచి అవగాహనను తెస్తుంది. వంట చేసేటప్పుడు మీ ఆలోచనలను స్వచ్ఛంగా, ఉన్నతంగా ఉంచుకోండి. ఎటువంటి లక్షణాలు ఉన్న భోజనం తింటారో అటువంటి ఆలోచనలే వస్తాయి. జీవితం అలాగే తయారవుతుంది. గృహిణి ప్రశాంతంగా ఉన్నప్పుడు, మొత్తం కుటుంబం సురక్షితంగా, ప్రేమగా, సంతోషంగా ఉంటుంది.

మనిషి జీవితం ధ్యేయం...

'నేను ఎవరు?' నాది ఏది, సత్యత ఏంటీ.. అనేది గ్రహించాలి. రోజువారీ జీవితంలో శాంతి, ప్రేమ, స్వచ్ఛత వంటి అసలు లక్షణాలను వ్యక్తపరచాలి. మనం కేవలం శరీరాలు కాదు. మనం ఆత్మలం. ప్రతి ఆత్మ తన ప్రత్యేకపాత్రను పోషించడానికి, ప్రపంచానికి ఏదైనా మంచిని అందించడానికి ఇక్కడ ఉంది. మనం విలువలు, ఆధ్యాత్మిక అవగాహనతో జీవించినప్పుడు మనం లోపల నుండి సంతృప్తి చెందుతాం. ధ్యానం మనకు పరమాత్మతో కనెక్ట్ అవ్వడానికి, మన ఉన్నత ఉద్దేశ్యాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. 'నేను ప్రతిరోజూ మెరుగవుతున్నానా?' అని తమని తాము ప్రశ్నించుకోగలిగితే, మీరు సరైన మార్గంలో ఉన్నారనేదానికి అదే సంకేతం.

వెలితిగా ఉండటానికి పరిష్కారం..

బాహ్య, భౌతిక విజయం వాస్తవానికి అంతర్గత శూన్యతను పూరించదు. నిజమైన సంతృప్తి అంతర్గత శాంతి, ప్రేమ నుండి వస్తుంది. మన ఆత్మ పరమ సంబంధం కోరుకుంటుంది. మనం స్వచ్ఛమైన ఉద్దేశ్యంతో ఇతరులకు సేవ చేసినప్పుడు మనం అర్థవంతంగా, సంతృప్తిగా భావించడం ప్రారంభిస్తాం. నిశ్శబ్దం, సరళత, ఆధ్యాత్మికత మన హృదయాన్ని నింపుతాయి. ఇవేవీ బాహ్య విజయాల ద్వారా అందవు. ఆధ్యాత్మికత తోడవ్వాలి. అంతర్గత సంపద ఉంటే వెలితి అనేదే ఉండదు" అని తెలిపారు ఈ రాజయోగిని.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

'నేను ఒక ఆత్మను' అనే అవగాహన మనకు ఎదురయ్యే క్లిష్ట పరిస్థితులలోనూ ప్రశాంతంగా ఉండటానికి సహాయపడుతుంది. భావోద్వేగపరంగా తక్షణమే స్పందించే బదులు, అవగాహనతో ప్రతిస్పందిస్తాం.

నేను ఆత్మను అనే భావనతో అవగాహన...

ఇతరులను వారి రూపాలతో, పనులతో కాకుండా ఆత్మలుగా చూడటం ప్రారంభించినప్పుడు మానవ సంబంధాలు మెరుగుపడతాయి. ఈ అవగాహన సరైన నిర్ణయం తీసుకోవడానికి దోహదపడుతుంది.

తల్లిదండ్రులు పిల్లలను ఆస్తిగా కాకుండా వారి స్వంత ప్రయాణంతో కూడిన వ్యక్తిగత ఆత్మలుగా చూడాలి. ప్రతి బిడ్డ ప్రత్యేకమైనవాడే. ఇతరులనుండి ప్రేరణ కలిగించవచ్చు. కాని ఇతరులతో పోల్చకూడదు. ప్రేమ అంటే ప్రతి కోరికనూ నెరవేర్చడం కాదు. అలా చేస్తే వారి కోరిక తీరకపోతే

పిల్లలపై తల్లిదండ్రుల దృష్టికోణం...

మారాం చేయడమో, మొండిగా అవ్వటమో చేస్తారు. సమయం చూసి వారితో ప్రేమతో మాట్లాడాలి. కఠినంగా కాకుండా ప్రశాంతంగా, స్పష్టతతో మాట్లాడండి. పిల్లలు సురక్షితంగా, ప్రేమతో ఉన్నప్పుడు బాగా వింటారు. అంతర్గత బలం వారికి ప్రేమ, సరైన మార్గదర్శకత్వం రెండింటినీ ఇవ్వడానికి సహాయపడుతుంది.

వారం... పర్వం

విశేష ఫల ప్రదం





నాగపంచమి/గరుడ పంచమి: నాగారాధనకు సంబంధించిన ముఖ్యరోజులలో కార్తీకశుద్ధ పంచమి 'గరుడ పంచమి' లేదా 'నాగ పంచమి' గా ప్రసిద్ధి. కొన్ని ప్రాంతాలలో నాగపంచమిని శ్రావణమాసంలో ఆచరిస్తారు. గరుత్మంతుడు సూర్యుడికి రథసారథి అయిన అనూరుడికి తమ్ముడు. మేరు పర్వతంతో సమానమైన శరీరం కలవాడు, సప్తసముద్రాల్లోని జలాన్నంతటినీ ఒక్కరెక్క విసురుతో ఎగరగొట్టగల రెక్కల బలం కలవాడు. అందుకే ఆయనకి సుపర్ణుడని పేరు.

గరుడపంచమికి సంబంధించి భవిష్యత్పురాణంలో ప్రస్తావన ఉంది. దేవాలయాల్లో గరుడ వాహనాలను గమనిస్తే... ఒక మోకాలు వంచి, మరో మోకాలు మీద నిటారుగా కూర్చొని రెండు చేతులనూ చాచి మూలవిరాట్టును చూస్తూ ఉన్న మూర్తి కనిపిస్తుంది. అంటే విష్ణుమూర్తి తనను ఎక్కడికి తీసుకెళ్లమంటే అక్కడికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని తెలియజేయడం కోసమే.

నాగులనుంచి రక్షణ పొంది, నాగదోషం తగులకుండా పిల్లలను కాపాడుకొనేందుకు చేసే పూజ నాగపంచమి, నిర్మలమైన మనస్సు, తెలివైన పిల్లలకోసం చేసే పూజ గరుడపంచమి.

గరుడ పంచమి రోజున మహిళలు స్నానాంతరం ముగ్గులు పెట్టిన పీఠాపై అరటి ఆకును పరచి, బియ్యం పోసి, వారి శక్తి మేర బంగారు, వెండి నాగపడిగను ప్రతిష్ఠించి, పూజచేసి, పాయస నైవేద్యం పెడ్తారు. మనికొన్ని ప్రాంతాలలో పుట్టలో పాలుపోస్తారు. ఇలా మనపూజలందుకొనే గరుడిని వంటి మాతృ ప్రేమకల కుమారుడు కావాలని తెలిపే గరుడ/నాగ పంచమి వ్రతం అనంత సౌభాగ్యాలను కలుగచేస్తుందని నమ్ముతారు.

ఇదే రోజున నాగపంచమి వ్రతం చేసుకునేవారు నాగుల ఆకారాన్ని ఇంటి గోడలమీద తీర్చిదిద్ది పసుపు కుంకుమలతో అలంకరించి పూజిస్తారు. నాగారాధన వల్ల సర్పదోషాలు తొలగి సంతాన ప్రాప్తి కలుగుతుందని విశ్వసిస్తారు. ఈరోజున చేసే నాగారాధన వల్ల చర్మవ్యాధులు, చెవి సంబంధిత రోగాలు తొలగుతాయని కూడా ప్రతీతి.

మహనీయుల మాటలు

- ఏది మనకు అన్నం పెడుతుందో దానిని దైవంగా భావించాలి. ఏది మనకు నీడనిస్తుందో దానిని కోవెలగా భావించాలి. ఏది మనకు మంచిని నేర్పిస్తుందో దానిని నిరంతరం స్మరణ చేసుకోవాలి.
- మంచి ఆలోచనలతో మనసు నింపుకో మంచి పనులతో ప్రతిష్ఠ పెంచుకో మంచి పలుకులతో మన్ననలు అందుకో వీటి అన్నిటితో అందరిని కలుపుకొనిపో
- భవిష్యత్తులో ఏం జరుగుతుందో అని ఎప్పుడూ భయపడేవారు ఏమీ సాధించలేరు. సత్యమని మంచిదని నీవు అర్థం చేసుకున్న దానిని తక్షణమే ఆచరించు.
- బయటకు కనిపించే రంగు,రూపాన్ని చూసి ఎవ్వరినీ అంచనా వేయకూడదు. ఎందుకంటే నోరు తెరిచేంతవరకూ కాకి, కోయిల రెండూ ఒకేలా ఉంటాయి.
- అవసరమైన దానికంటె ఎక్కువ విషయాలు సేకరించేవారు, తెలుసుకున్న దాని కంటె తక్కువ మాట్లాడేవారు విజ్ఞాన వంతులు.'

తాత్త్వికథ

శ్రమ విలువ



ఒక రాజుకు తమ రాజ్యానికి ఈశాన్యాన ఉన్న కొండ మీద గుడి కట్టించాలనిపించింది. అనుకున్నదే తడవుగా మంత్రి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాడు. ఏడాది కల్లా గుడి నిర్మాణం పూర్తి అయ్యింది.

వేద పండితుల మంత్రోచ్చారణల మధ్యన, మేళతాళాలతో అంగరంగ వైభవంగా ఆలయ ప్రారంభోత్సవం జరిగింది.

ఇది జరిగిన వారం తర్వాత మంత్రి "రాజా, ఎందరో కూలీలు ఎంతో కష్టపడి గుడి నిర్మించారు. వారిని ప్రత్యేకంగా పిలిపించి తగు రీతిన సన్మానిస్తే బాగుంటుంది" అని సలహా ఇచ్చాడు.

రాజు పకపకా నవ్వి "కూలీలు ఏమైనా మనకు ఉచితంగా పని చేశారా? డబ్బు తీసుకునే కదా చేశారు. డబ్బు ఇవ్వకుంటే ఒక్క పూట అయినా పని చేసి ఉంటారా?" అని చెప్పి ససేమిరా సన్మానానికి ఒప్పుకోలేదు.

నెల గడిచిపోయింది. పౌర్ణమి రోజున తన పరివారంతో కొండ మీద ఉన్న గుడికి వెళ్ళాడు రాజు. కూలీలు గుడి ముందర, గాడిదలను వరుసగా నిలబెట్టి పూలమాలలు వేసి, కర్పూర హారతులిస్తూ వాటికి జేజేలు పలుకుతూ ఉన్నారు.

ఆశ్చర్యపోయిన రాజు వారు ఎందుకలా చేస్తున్నారని మంత్రిని అడిగాడు.

"కొండ మీద గుడి నిర్మాణం అనేది సామాన్యమైన విషయం కాదు మహారాజా... ఇంత ఎత్తులో ఉన్న ఈ కొండపైకి ఇటుక, రాయి, ఇసుక, కొయ్య, ఇతర పనిముట్లు తేవాలంటే చాలా కష్టమైన పని. ఆ భారమంతా మోసింది ఈ గాడిదలే. అవి లేకుంటే గుడి నిర్మాణం ఇంత వేగంగా పూర్తి అయ్యేది కాదు. తమకు సహకరించిన గాడిదలకు కృతజ్ఞతలు తెలపాలని వారు ఈ సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు" అని వివరించాడు.

"అవునా... ఈ కూలీల కష్టం వెనుక గాడిదల కష్టం కూడా ఉందా?" అని ఆశ్చర్యపోయాడు రాజు.

"అవును మహారాజా... ఏ పని ఫలితమైనా కొందరికే గుర్తింపును తెస్తుంది. ఆ కొందరే పని మొత్తం చేసినట్లు గుర్తింపబడతారు. ఆ పని వెనుక గాడిద కష్టం చేసిన చాలా మందికి గుర్తింపు రాదు. ఆ పని వెనుక రాలిన చెమట చుక్కలను గుర్తించాల్సింది యజమానే. ఎందుకంటే ఆ మోసే గాడిద తను మోస్తున్నది గంధపు చెక్కలా, వేపకొయ్యలా అని కూడా పట్టించుకోదు. తన యజమాని చెప్పినట్లు చేస్తుంది. అంతే... అలా రేయింబవళ్ళు పనిచేసిన గాడిదలను వాటి యజమానులైన కూలీలు ఈ విధంగా గౌరవించుకుంటున్నారు" అని వివరించాడు మంత్రి.

తన తప్పు తెలుసుకున్నాడు రాజు. వెంటనే గాడిదల సేవను గుర్తించిన కూలీలందరినీ అభినందించాడు. గుడి నిర్మాణానికి పని చేసిన కూలీలందరికీ చక్కటి విందు ఏర్పాటు చేసి ఘనమైన బహుమతులు అందించాడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

యాక్షన్ స్టార్ట్



● రష్మిక

గోండు తెగల నేపథ్యంలో రష్మికా మందన్నా లీడ్ రోల్‌లో 'మైసా' చిత్రం ఆరంభమైంది. ఈ ఫిమేల్ సెంట్రిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో ఇప్పటివరకూ చేయని సరికొత్త పాత్రను రష్మిక చేస్తున్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో ఈ పాన్ ఇండియా మూవీని అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తోంది. ఆదివారం జరిగిన ఈ చిత్రం ప్రారంభోత్సవంలో అతిథిగా పాల్గొన్న దర్శకుడు రవికిరణ్ కోలా కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత డి. సురేష్ బాబు క్లాప్ కొట్టారు. దర్శకుడు హను రాఘవపూడి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందజేసి, తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం చేశారు. "హై ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో రష్మిక పవర్‌ఫుల్ రోల్‌లో కనిపిస్తారు" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శ్రేయాస్ పి. కృష్ణ.

జెట్ స్పీడ్‌తో..!



● చిరంజీవి

చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మెగాఅనిల్' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, వెంకటేశ్, క్యాథరిన్, వీటీవీ గణేశ్ ఇతర ప్రధాన పాత్రల్లో కనిపిస్తారు. ఈ సినిమా చిత్రీకరణ జెట్ స్పీడ్‌తో జరుగుతోంది. తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో, రెండో షెడ్యూల్ ముస్సోరిలో, మూడో షెడ్యూల్ కేరళలో పూర్తి చేశారు మేకర్స్. ఇటీవల కేరళలో జరిగిన షూటింగ్ షెడ్యూల్‌లో చిరంజీవి-నయనతార పాల్గొనగా ఓ పాటను చిత్రీకరించారు. కాగా ఈ సినిమా నాలుగో షూటింగ్ షెడ్యూల్ ఆగస్టు తొలి వారంలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో సెట్ వర్క్ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో చిరంజీవితో పాటు ఈ చిత్రంలోని ప్రధాన తారాగణం పాల్గొంటారని తెలిసింది. ఈ షెడ్యూల్‌లోనే వెంకటేశ్ పాల్గొనే అవకాశం ఉందని, చిరంజీవి-వెంకటేశ్‌లపై కీలక సన్నివేశాలను అనిల్ రావిపూడి చిత్రీకరించనున్నారని సమాచారం. ఈ సినిమాను సుష్మితా కొణిదెల, సాహు గారపాటి నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమా వచ్చే సంక్రాంతికి విడుదల కానుంది.

మాస్ కథకి సై?



● నాగచైతన్య

హీరో నాగచైతన్య, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో ఓ సినిమా రానుందా? అంటే ప్రస్తుతానికి అవుననే సమాధానమే ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఇటీవల దర్శకుడు బోయపాటి శ్రీను ఓ మాస్ కథను నాగచైతన్యకు వినిపించగా, ఈ హీరో ప్రాథమికంగా అంగీకారం తెలిపారని, అన్నీ కుదిరితే ఈ ఏడాదే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది. అలాగే తనకు 'మజిలీ' వంటి సూపర్‌హిట్ ఫిల్మ్ ఇచ్చిన శివ నిర్వాణ చెప్పిన కథ కూడా విన్నారు నాగచైతన్య. మరి... ఈ ఇద్దరి దర్శకుల్లో ఎవరితో నాగచైతన్య సినిమా ముందుగా సెట్స్‌కు వెళ్తుంది? లేకపోతే ఈ ఇద్దరు దర్శకులతో నాగచైతన్య సమాంతరంగా రెండు సినిమాలూ చేస్తారా? అనే అంశాలపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే. ఇదిలా ఉంటే... ప్రస్తుతం 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ వర్మ దండుతో 'వృషకర్మ' (వర్కింగ్ టైటిల్) సినిమా చేస్తున్నారు నాగచైతన్య. ఇది నాగచైతన్య కెరీర్‌లోని 24వ చిత్రం. దీంతో నాగచైతన్య కెరీర్‌లోని 25వ సినిమాకు ఏ దర్శకుడు ఖరారు అవుతారో అనే ఆసక్తి అక్కినేని ఫ్యాన్స్‌లో నెలకొంది.

ఆఫీసర్ ఆన్ బోర్డ్



● సునీల్

ఓ కీలకమైన కేసుని పరిష్కరించడానికి రంగంలోకి దిగారు ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్. ఆ కేసు దేనికి సంబంధించినది? ఈ ఆఫీసర్ చేసిన కృషి ఏంటి? అనేది 'ఫైటర్ శివ'లో చూడాల్సిందే. సునీల్ ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా కీ రోల్ చేసిన ఈ చిత్రంలో మణికంఠ, ఐరా బన్సల్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఓ కీలక పాత్రను వికాస్ వశిష్ఠ చేశారు. ప్రభాస్ నిమ్మల దర్శకత్వంలో నర్సింగ్, ఉన్నం రమేశ్ నిర్మించారు. "ఓ పవర్‌ఫుల్ కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి" అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు.

కాంతిలా వచ్చావు...



● ధనుష్, నిత్యా మీనన్

"ఎన్న సుగమ్ ఎన్న సుగమ్ ఉళ్ల.... ఇత్తనై నాళ్ ఎంగిరుంద పుళ్ల... ఇరుళ తేడుమ్ వెళక్కుల్ల... ఒళియా వంద ఎనక్కుళ్ల..." (ఎంత సుఖం ఎంత సుఖం లోపల... ఇన్ని రోజులు ఎక్కడున్నావ్ పోరి... చీకటిని వెతికే దీపం లేదు... కాంతిలా వచ్చావు నాలోపలికి) అంటూ సాగుతుంది 'ఇడ్లీ కడై'లోని పాట. ధనుష్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రం తెలుగులో 'ఇడ్లీ కొట్టు' టైటిల్‌తో విడుదల కానుంది. ఇందులో ధనుష్ సరసన నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. ఆదివారం 'ఎన్న సుగమ్...' పాటను విడుదల చేశారు. ధనుష్, నిత్యామీనన్ కాంబినేషన్‌లో ఈ పాట సాగుతుంది. ధనుష్, ఆకాశ్ భాస్కరన్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబర్ 1న విడుదల కానుంది.

వన్ వే థ్రిల్



● వరుణ్ సందేశ్, కుష్బూ

వరుణ్ సందేశ్, కుష్బూ చౌదరి జోడీగా నటిస్తున్న 'వన్ వే టికెట్' సినిమా ఆదివారం హైదరాబాద్‌లో ఆరంభమైంది. ఏ. పళనీ స్వామి దర్శకత్వంలో శ్రీ పద్మ ఫిల్మ్స్, రంగస్థలం మూవీ మేకర్స్ పతాకాలపై జొరిగే శ్రీనివాసరావు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'వన్ వే టికెట్' సినిమా ప్రారంభోత్సవంలో అతిథులుగా పాల్గొన్న దర్శక-నిర్మాత నక్కిన త్రినాథరావు కెమెరా స్విచ్చాన్ చేయగా, సి. కల్యాణ్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత హర్షిత్ రెడ్డి స్క్రిప్ట్ అందించారు. ఈ వేడుకలో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ– "'వన్ వే టికెట్' స్క్రిప్ట్ డిఫరెంట్‌గా ఉంటుంది. ఇందులో సరికొత్త పాత్రలో కనిపిస్తాను" అని అన్నారు. "ఈ సినిమా మంచి క్రైమ్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను అలరిస్తుంది' అని తెలిపారు ఏ. పళని స్వామి. "ఇది మా రెండో చిత్రం. ప్రేక్షకుల ఆశీర్వాదాలు మా సినిమాపై ఉండాలని కోరుకుంటున్నాను" అన్నారు నిర్మాత శ్రీనివాసరావు. "13 ఏళ్ల తర్వాత మళ్లీ వరుణ్ సందేశ్‌తో సినిమా చేస్తున్నాను" అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్. ఈ చిత్రంలో నటిస్తున్న మనోజ్, సుధాకర్ ఈ కార్యక్రమంలో పాల్గొని, అవకాశం కల్పించిన దర్శక-నిర్మాతలకు ధన్యవాదాలు తెలిపారు.

కామాఖ్య ప్రారంభం



● సమైరా

సమైరా, సముద్ర ఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న మిస్టీరియస్ థ్రిల్లర్ సినిమా 'కామాఖ్య'. అభినయ కృష్ణ దర్శకత్వంలో శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ఈ సినిమాకు చెందిన ఇతర వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చిత్రయూనిట్ తెలిపింది. ఆనంద్, శరణ్య ప్రదీప్, వైష్ణవ్, ధనరాజ్, రాఘవ, ఐశ్వర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: గ్యానీ, కెమెరా: రమేశ్ కుశేందర్ రెడ్డి.

బాలు ప్రేమకథ



● అఖిల్, దర్శికా మీనన్

ఆకుల అఖిల్, దర్శికా మీనన్, 'చిత్రం' శ్రీను ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'బాలుగాడి లవ్‌స్టోరీ'. ఎల్. శ్రీనివాస్ తేజ్‌ని దర్శకుడిగా పరిచయం చేస్తూ, ఆకుల భాస్కర్ సమర్పణలో ఆకుల మంజుల నిర్మించిన చిత్రం ఇది. ఆగస్టు 8న ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. "నేటి యువతకు నచ్చేలా రొమాన్స్, యాక్షన్, సస్పెన్స్... ఇలా అన్ని అంశాలు మా చిత్రంలో ఉన్నాయి. మా సినిమాను 'సిల్వర్ స్క్రీన్' గణేశ్ తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేస్తున్నారు" అని యూనిట్ పేర్కొంది.

మోసాన్ని కూడా ముద్దుగా చెప్తారు...



● అనిల్, తరుణ్, వర్షిణి

"మై విలేజ్ షో టీమ్ డెడికేషన్, సంకల్పం అన్నింటికంటే గొప్పది. అనిల్ ఇంకా ఎంతో ఎత్తుకు ఎదుగుతారని నమ్మకంగా చెబుతున్నాను. 'మోతెవరి లవ్‌స్టోరీ' ట్రైలర్ బాగుంది" అని అన్నారు దర్శక-నటుడు తరుణ్ భాస్కర్. అనిల్ గీలా, వర్షిణి రెడ్డి జున్నుతుల ముఖ్య తారలుగా శివకృష్ణ బుర్రా రూపొందించిన సిరీస్ 'మోతెవరి లవ్‌స్టోరీ'. ఆగస్టు 8 నుంచి జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో తరుణ్ భాస్కర్ అతిథిగా పాల్గొన్నారు. 'పర్శిగాడి (అనిల్ పాత్ర) ప్రేమ పంచాయితీ, పర్శిగాడంటేనే పర్‌ఫెక్ట్!, మీ అమ్మాయిలంతా భలే ఉంటరే ... మోసాన్ని కూడా ముద్దుగా చెప్తారు...' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. "ఇలాంటి స్టేజ్ మీదకు రావాలని సంవత్సరాల నుంచి కష్టపడుతున్నాం. ఇప్పుడు ఏదో సాధించామనే ఫీలింగ్ కలుగుతోంది" అన్నారు అనిల్ గీలా. "ఈ సిరీస్ కొత్తగా ఉంటుంది" అని తెలిపారు మధుర శ్రీధర్. "మేం మొదట్లో పెద్ద చిత్రాలకు స్పూఫ్‌లు చేస్తుండేవాళ్లం. మాకీ చాన్స్ ఇచ్చిన జీ5కి థ్యాంక్స్" అని పేర్కొన్నారు నిర్మాత శ్రీరామ్ శ్రీకాంత్. "'మోతెవరి లవ్ స్టోరీ' సిరీస్ అందర్నీ మెప్పించేలా ఉంటుంది" అన్నారు శివకృష్ణ బుర్రా.



4 ఇంగ్లండ్‌తో జరుగుతున్న సిరీస్‌లో గిల్ సెంచరీల సంఖ్య. ఒకే సిరీస్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారత క్రికెటర్ల జాబితాలో గావస్కర్ (1971, 1979లో వెస్టిండీస్‌పై: 4 చొప్పున), కోహ్లి (2014-15 సిరీస్‌లో ఆస్ట్రేలియాపై: 4 సెంచరీలు) కూడా ఉన్నారు.

3 ఒకే టెస్టు సిరీస్‌లో నాలుగు సెంచరీలు చేసిన మూడో కెప్టెన్‌గా గిల్ గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో డాన్ బ్రాడ్‌మన్ (1947-48లో భారత్‌పై), సునీల్ గావస్కర్ (1978-79లో వెస్టిండీస్‌పై) కూడా ఉన్నారు.

పోరాటం కూడా గర్వించేలా...

నాలుగో టెస్టులో టీమిండియా 'ద గ్రేట్ ఎస్కేప్'

ఇది నాలుగో రోజు సంగతి! ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆలౌటైనపుడు... భారత్ రెండో ఇన్నింగ్స్ మొదలైనపుడు 0/2 స్కోరు! 5 బంతులకే ఆ 2 వికెట్లను టీమిండియా కోల్పోయింది. తర్వాత మిగిలున్న ఆ రోజు, అనంతరం ఆఖరి రోజు కలిపి 852 బంతులు పడ్డాయి. కానీ ఇంకో రెండే వికెట్లు పడ్డాయి! జట్టు ఆలౌట్ కాలేదు. ఇంగ్లండ్ నెగ్గలేదు. కానీ భారత్ నెగ్గింది. అదేంటి మ్యాచ్ 'డ్రా' కదా అయింది. భారత్ గెలిచిందంటారేంటి? అనే సందేహం రావొచ్చు. అవును... నిజమే. ఫలితం ముమ్మాటికి 'డ్రా'నే! దాటయితే లేదు టెస్టులో! కానీ భారత్ గెలిచింది ఫైట్‌లో! ఇన్నింగ్స్ పరాజయం తప్పదనుకున్న చోట... నాలుగున్నర సెషన్లు మిగిలిన ఆటలో... శుబ్‌మన్ గిల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్ ముగ్గురి 'త్రి' శతకాల శక్తి... ఎంతటి ప్రతికూలతలనైనా తట్టుకొని నిలబడగలదనే స్ఫూర్తిని రగిల్చింది. మొత్తానికి భారత జట్టు పోరాటం కూడా గర్వపడేలా అసాధారణ ఆటతీరుతో నాలుగో టెస్టును 'డ్రా'గా ముగించింది. ఈ సిరీస్‌లోని చివరిదైన ఐదో టెస్టు ఈనెల 31 నుంచి ఓవల్‌లో జరుగుతుంది.

- గిల్, జడేజా, సుందర్ శతకాల పోరాటం
- ఇంగ్లండ్‌తో భారత్ నాలుగో టెస్టు 'డ్రా'
- పేలిపోయిన భారత బ్యాటింగ్
- తేలిపోయిన ఇంగ్లండ్ బౌలింగ్
- ఈనెల 31 నుంచి ఐదో టెస్టు

మాంచెస్టర్: 'ఘోర పరాజయం తప్పదు'! 'నాలుగో రోజు ఆట ముగిసేలోపే స్పెషలిస్టు బ్యాటర్లెవరూ మిగలరు'! 'టెయిలెండర్ల వికెట్లు ఆఖరి రోజు మొదలవడంతోనే పడిపోతాయి'! 'ఇంగ్లండ్ బౌలింగ్ దెబ్బకు ఇన్నింగ్స్ పరాజయం తప్పదు'! 'ఇంగ్లండ్‌కు 3-1తో సిరీస్ విజయం ఖాయం'! ఇవన్నీ కూడా నాలుగో రోజు ఆఖరి సెషన్‌కు ముందు మాంచెస్టర్ ముచ్చట్లు!! కానీ ఐదో రోజు ఆట ముగిసే సమయానికి అదే మాంచెస్టర్‌లో చప్పట్లు! అంచనాలన్నీ తలకిందులు. విశ్లేషణలన్నీ పటాపంచలు. భారత్‌ను తక్కువ చేసిన నోళ్లే... టీమిండియా ఆటగాళ్లు గొప్పోళ్లు అని పొగిడాయి. 311 పరుగులు వెనుకబడిన జట్టు... రెండో ఇన్నింగ్స్‌లో పరుగైనా చేయకుండానే 2 వికెట్లు కోల్పోయిన జట్టు మలి రోజు (తర్వాతి ఐదో రోజు) కూడా రెండే వికెట్లు కోల్పోవడమేంటి. ఇది సాధారణ టెస్ట్! కానీ టీమిండియా పోరాటం గ్రేటెస్ట్. సంప్రదాయ క్రికెట్‌లో ఇటు గెలవకుండా... అటు ఓడకుండా... 'డ్రా'తోనే పుటల్లోకెక్కిన ఘనతంటూ దక్కితే ముమ్మాటికి అది భారత్‌కే దక్కుతుందంటే ఎలాంటి అతిశయోక్తి లేదు.

శతకాల పరాక్రమం

'టెండూల్కర్-అండర్సన్ ట్రోఫీ'లో భాగంగా భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన నాలుగో టెస్టు ఎవరూహించని విధంగా 'డ్రా'గా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 174/2తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ గ్రే'టెస్టు' ముగిసే సమయానికి 143 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 425 పరుగులు చేసింది. 2... 2... అంటే ఇంగ్లండ్ బౌలర్లు నాలుగో రోజు, ఐదో రోజు తీసిన వికెట్ల సంఖ్య అది. 3... భారత దళంలో ఇంగ్లండ్‌ను వందలకొద్దీ బంతులనునెదుర్కొని సాధించిన శతకాల సంఖ్య. కేఎల్ రాహుల్ (230 బంతుల్లో 90; 8 ఫోర్లు) వికెట్టే ఇంగ్లండ్ శిబిరానికి దక్కిన ఏకైక ఆనందం. ఎందుకంటే కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (238 బంతుల్లో 103; 12 ఫోర్లు)ను అవుట్ చేసినా అప్పటికే అతను శతకం సాధించేశాడు. ఇక మరో వికెట్ పడితే ఒట్టు! అన్నట్లుగా రవీంద్ర జడేజా (185 బంతుల్లో 107 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (206 బంతుల్లో 101 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) తొలి సెషన్ నుంచి ఆఖరి సెషన్ ఆట ముగించమని ప్రత్యర్థి కెప్టెన్ ప్రార్థించేంతవరకు కనికరించకుండా ఆడేశారు. శతకాలు పూర్తి చేశారు. భారత్‌ను ఈ టెస్టులోనే కాదు... సిరీస్‌ను ఓడకుండా కాపాడారు. ఇప్పటికి 2-1తో ఇంగ్లండ్ ఆధిక్యంలో ఉన్నప్పటికీ భారత్‌కు లభించిన ఈ సమరోత్సాహంతో ఐదో టెస్టును సానుకూల దృక్పథంతో మొదలుపెట్టడం ఖాయం.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 669; **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి జైస్వాల్ (సి) రూట్ (బి) వోక్స్ 0; కేఎల్ రాహుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టోక్స్ 90; సాయి సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0; శుబ్‌మన్ గిల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 103; వాషింగ్టన్ సుందర్ (నాటౌట్) 101; రవీంద్ర జడేజా (నాటౌట్) 107; ఎక్స్‌ట్రాలు 24; **మొత్తం (143 ఓవర్లలో 4 వికెట్లకు) 425. వికెట్ల పతనం:** 1-0, 2-0, 3-188, 4-222. **బౌలింగ్:** క్రిస్ వోక్స్ 23-4-67-2, ఆర్చర్ 23-3-78-1, బ్రైడన్ కార్స్ 17-3-44-0, డాసన్ 47-11-95-0, జో రూట్ 19-2-68-0, బెన్ స్టోక్స్ 11-2-33-1, బ్రూక్ 3-0-24-0.



సిక్స్‌తో సెంచరీ పూర్తి చేసుకున్న జడేజా సంబరం... వెనుక సుందర్ అభినందన

ఆపేద్దాం... ఆడతాం!

ఆఖరి రోజు ఆటలో... ఆఖరి గంటలో... ఆపేద్దామంటే, ఆడేద్దామనే డ్రామా చోటు చేసుకుంది. చివరి సెషన్‌లో ఇక గంట ఆటే మిగిలుంది. 15 ఓవర్లు పడాల్సి ఉంది. ఫలితం తేలని సందర్భాల్లో ఆ కనీస ఓవర్లకు ముందే ఇరు జట్ల కెప్టెన్లు పరస్పర సమ్మతితో 'డ్రా' పాట పాడే ఆనవాయితీ ఎప్పటి నుంచో ఉంది. దీనికోసం ప్రయత్నించి ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్ భంగపడ్డాడు. స్టోక్స్‌కు మింగుడుపడని విధంగా అసలేం జరిగిందంటే... 138 ఓవర్లలో భారత్ స్కోరు 386/4. 75 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇక మిగిలిపోయిన ఆ 15 ఓవర్లతో ఆలౌట్ చేయడం, తర్వాత లక్ష్యాన్ని ఛేదించడం, ఇంగ్లండ్ గెలవడం జరిగేది కాదని అర్థమైంది. దీంతో అలసిన సహచరులకు కాస్త ముందుగానే విశ్రాంతినిద్దామనే ఆలోచనతో స్టోక్స్ డ్రా కోసం 'ఇక చాలు ఆపేద్దాం' అన్నాడు. కానీ అవతలి వైపు జడేజా (89 బ్యాటింగ్), సుందర్ (80 బ్యాటింగ్) సెంచరీలకు దగ్గరవడంతో భారత దళం 'కుదరదు... ఆడేద్దాం' అంది. స్టోక్స్ ప్రతిపాదనను జడేజా తోసిపుచ్చాడు. క్రీజులో ఉన్న ఇద్దరం శతకరేసులో ఉన్నామన్నాడు. దీంతో చేసేదేమీలేక చిన్నబుచ్చుకున్న స్టోక్స్ సులువైన బౌలింగ్‌నే పురమాయించాడు. ఫోరు, సిక్స్‌తో జడేజా... తర్వాత బౌండరీలతో సుందర్ చకచకా సెంచరీలను పూర్తి చేసుకున్నారు. ఈ ఆఖరి దూకుడుతో 5 ఓవర్ల వ్యవధిలో భారత్ 39 పరుగులు చేసింది. 400 స్కోరునూ దాటింది.

విజేత తేలేది నేడే

- హంపి, దివ్య రెండో గేమ్ కూడా 'డ్రా'
- టైబ్రేక్ ద్వారా అంతిమ ఫలితం


దివ్య


హంపి

బతూమి (జార్జియా): మహిళల ప్రపంచకప్ చెస్ చాంపియన్ ఎవరో నేడు తేలనుంది. ఇద్దరు భారత స్టార్స్ కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ మధ్య జరుగుతున్న ఫైనల్లో ఆదివారం కూడా తుది ఫలితం రాలేదు. వీరిద్దరి మధ్య శనివారం జరిగిన తొలి గేమ్ 'డ్రా'గా ముగియగా... ఆదివారం రెండో గేమ్ కూడా 'డ్రా' అయింది. తెల్ల పావులతో ఆడిన ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి వేసిన ఎత్తులను దివ్య దేశ్‌ముఖ్ వ్యూహాత్మకంగా అడ్డుకుంది. 34 ఎత్తుల తర్వాత ఫలితం తేలే అవకాశం లేదని ఇద్దరికీ తెలిసిపోవడంతో 'డ్రా'కు అంగీకరించారు. నేడు టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించి విజేతను తేలుస్తారు. ముందుగా హంపి, దివ్య మధ్య ర్యాపిడ్ ఫార్మాట్‌లో 15 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు నిర్వహిస్తారు. ఈ రెండు గేమ్‌ల తర్వాత కూడా ఇద్దరూ సమంగా ఉంటే... ర్యాపిడ్ ఫార్మాట్‌లోనే ఈసారి 10 నిమిషాల నిడివిగల మరో రెండు గేమ్‌లు జరుగుతాయి. ఈసారీ విజేత నిర్ణయం కాకపోతే బ్లిట్జ్ ఫార్మాట్‌లో 5 నిమిషాల నిడివిగల రెండు గేమ్‌లు నిర్వహిస్తారు. ఇక్కడా ఫలితం రాకపోతే బ్లిట్జ్ ఫార్మాట్‌లో 3 నిమిషాల నిడివిగల ఒక గేమ్‌ను ఆడిస్తారు. ఇక్కడా ఫలితం రాకపోతే... విజేత తేలే వరకు 3 నిమిషాల నిడివిగల గేమ్‌లు నిర్వహిస్తారు. టైటిల్ సాధించిన ప్లేయర్‌కు 50 వేల డాలర్ల (రూ. 43 లక్షల 24 వేలు)తోపాటు స్వర్ణ పతకం, రన్నరప్‌గా నిలిచిన ప్లేయర్‌కు 35 వేల డాలర్ల (రూ. 30 లక్షల 27 వేలు)తోపాటు రజత పతకం లభిస్తాయి. కాంస్య పతకం చైనా గ్రాండ్‌మాస్టర్ టాన్ జోంగికి దక్కింది. చైనాకే చెందిన లె టింగ్జితో జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో టాన్ జోంగి 1.5-0.5తో గెలిచింది. శనివారం వీరిద్దరి మధ్య జరిగిన తొలి గేమ్ 'డ్రా'కాగా... ఆదివారం జరిగిన రెండో గేమ్‌లో టాన్ జోంగి 55 ఎత్తుల్లో గెలిచింది. సోమవారం జరిగే బహుమతి ప్రదానోత్సవంలో టాన్ జోంగికి 25 వేల డాలర్ల (రూ. 21 లక్షల 62 వేలు) ప్రైజ్‌మనీతోపాటు కాంస్య పతకం లభిస్తుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-గణితం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- ఇంగ్లిష్

విద్య, ఉద్యోగ సమాచారం

టీయూఎఫ్ఐడీసీలో 12 పోస్టులు

తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ).. వివిధ విభాగాల్లో అర్బన్ ప్లానర్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్‌పర్ట్, అసోసియేట్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **పోస్టుల వివరాలు:** అర్బన్ ప్లానర్-02, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్స్‌పర్ట్-09, అసోసియేట్ అకౌంటెంట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, డిగ్రీ, బీటెక్(సివిల్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.55,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.07.2025
» **వెబ్‌సైట్:** https://www.nium.org.in

ఏపీపీఎస్సీలో 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్ఎస్‌వో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(బోటనీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ లేదా అగ్రికల్చర్) లేదా కెమికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌లో ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.

శారీరక ప్రమాణాలు

» **పురుషులు:** కనీస ఎత్తు 163 సెం.మీ, ఛాతి 84 సెం.మీ.(గాలి పీల్చినపుడు 5 సెం.మీ. పెరగాలి).
» **మహిళలు:** కనీస ఎత్తు 150 సెం.మీ, ఛాతి 79 సెం.మీ.(5 సెం.మీ. విస్తరణతో) షెడ్యూల్ ట్రైబ్-కొన్ని వర్గాలకు ఎత్తులో మినహాయింపు ఉంటుంది.
» **వాకింగ్ టెస్ట్:** పురుషులు 25 కిలోమీటర్లు, మహిళలు 16 కిలోమీటర్లు 4 గంటల్లో పూర్తి చేయాలి.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ పరీక్ష, ఫిజికల్ టెస్ట్ ద్వారా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 28.07.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.08.2025
» **స్క్రీనింగ్ టెస్ట్:** 07.09.2025 (ఓఎంఆర్ విధానంలో)
» **ఫిజికల్ టెస్ట్:** వాకింగ్, మెడికల్ పరీక్ష, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్(సీపీటీ) ఎన్‌సీసీ సర్టిఫికేట్ ఉన్నవారికి బోనస్ మార్కులు ఉంటాయి.
» **మెయిన్ పరీక్ష:** తేదీ త్వరలో ప్రకటిస్తారు.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 41 పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడాలోని వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 41.
» **పోస్టుల వివరాలు:** మేనేజర్-13, సీనియర్ మేనేజర్-12, చీఫ్ మేనేజర్-02, ఫైర్ సేఫ్టీ ఆఫీసర్-14.
» **విభాగాలు:** డిజిటల్ ప్రొడక్ట్, ఫైర్ సేఫ్టీ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, స్టోరేజ్ అడ్మినిస్ట్రేటర్ అండ్ బ్యాక్అప్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా ఎంసీఏ/ఎంఎస్సీ(సీఎస్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 24 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.48,480 నుంచి రూ.1,02,300.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 12.08.2025.
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు, కోల్‌కతాలో 41 పోస్టులు

కోల్‌కతాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ పోర్టు(ఎస్‌పీఎం) వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 41.
» **పోస్టుల వివరాలు:** అకౌంట్స్ ఆఫీసర్, గ్రేడ్1-06, అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్ డివిజన్)-02, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్)-09, అసిస్టెంట్ మేనేజర్(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ సివిక్ ఫెసిలిటీస్) డివిజన్-05, అసిస్టెంట్ మేనేజర్(అడ్మినిస్ట్రేషన్ డివిజన్)-01, అసిస్టెంట్ మేనేజర్(పర్సనల్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ డివిజన్)-01, అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్ గ్రేడ్1-02, అసిస్టెంట్ సెక్రటరీ గ్రేడ్1-02, అసిస్టెంట్ మేనేజర్, ట్రాఫిక్ ఆపరేషన్స్(రైల్వేస్) డివిజన్-01, అసిస్టెంట్ మేనేజర్, ట్రాఫిక్ ఆపరేషన్స్(షిప్పింగ్ అండ్ కార్గో హ్యాండ్లింగ్)డివిజన్-01, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ గ్రేడ్1-07, అసిస్టెంట్ ఎస్టేట్ మేనేజర్ గ్రేడ్1-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీటెక్, డిగ్రీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. చార్టెడ్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియాలో సభ్యుడై ఉండాలి.
» **వయసు:**30.07.2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.07.2025.
» **వెబ్‌సైట్:** https://smp.smportkolkata.in

ఐసీఎంఆర్ న్యూఢిల్లీలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ 55 శాతం మార్కులతో పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.42,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
» **ఈమెయిల్:** ncd2.icmrhq@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.07.2025.
» **వెబ్‌సైట్:** https://www.icmr.gov.in

ఇండియన్ బ్యాంక్‌లో అప్రెంటిస్

బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. ప్రభుత్వ రంగ బ్యాంక్.. ఇండియన్ బ్యాంక్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా 1500 అప్రెంటిస్ ఖాళీలను భర్తీ చేయనుంది. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఆన్‌లైన్ రాత పరీక్ష ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఎంపికైతే నెలకు రూ.15వేల వరకూ స్టైపెండ్ అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఇండియన్ బ్యాంక్‌లో అప్రెంటిస్ ఖాళీలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» 1500 ఖాళీలకు నోటిఫికేషన్ విడుదల
» డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు
» ఎంపికైతే నెలకు రూ.15వేల స్టైపెండ్

ఇటీవల కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల భర్తీకి తరచూ నోటిఫికేషన్లు విడుదలవుతున్నాయి. వీటిల్లో ముఖ్యంగా ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఎంపిక ప్రక్రియలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ బ్యాంకులో అప్రెంటిస్‌గా శిక్షణ పొందితే.. బ్యాంకింగ్ కెరీర్‌కు అదనపు అర్హతగా దోహదపడుతుంది. ఇండియన్ బ్యాంక్ అప్రెంటిస్ నోటిఫికేషన్ బ్యాంక్ ఉద్యోగార్థులకు చక్కటి అవకాశంగా చెప్పొచ్చు.

- **మొత్తం అప్రెంటిస్ ఖాళీల సంఖ్య:** 1500
- **తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్-82, తెలంగాణ-42.
- **శిక్షణ:** 12 నెలలపాటు ఆన్‌జాబ్ ట్రైనింగ్.

అర్హతలు

01.07.2025 నాటికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 01.04.2021 తర్వాత డిగ్రీ ఉత్తీర్ణులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

వయసు

01.07.2025 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీలేయర్) అభ్యర్థులకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

స్టైపెండ్

ఎంపికై అప్రెంటిస్‌గా చేరిన అభ్యర్థులకు మెట్రో/అర్బన్ బ్రాంచ్‌ల్లో నెలకు రూ.15వేలు స్టైపెండ్ అందుతుంది. అదే విధంగా రూరల్/సెమీ అర్బన్ బ్రాంచ్‌ల్లో రూ.12వేలు స్టైపెండ్ లభిస్తుంది. వీరికి ఎలాంటి అలవెన్సులు లభించవు. కాని నెలకు ఒక క్యాజువల్ లీవ్‌తోపాటు బ్యాంక్ హాలిడేస్ అన్నీ పొందొచ్చు.

శిక్షణ-సర్టిఫికెట్

అప్రెంటిస్‌గా శిక్షణ సమయంలో అభ్యర్థుల పని తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు. ఇందుకోసం అసెస్‌మెంట్ టెస్టులు నిర్వహిస్తారు. ఇవి థియరెటికల్, అదేవిధంగా ఆన్‌జాబ్ ట్రైనింగ్ ప్రాక్టికల్‌గా ఉంటాయి. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి డిజిటల్‌గా సర్టిఫికెట్ ఆఫ్ ప్రొఫిషియన్సీని అందిస్తారు.

ఎంపిక ప్రక్రియ

ఆబ్జెక్టివ్ తరహా మల్టిఛాయిస్ ప్రశ్నల విధానంలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. దీంతోపాటు లోకల్ లాంగ్వేజ్ టెస్టు ఉంటుంది. బ్యాంక్ అవసరమనుకుంటే ఇంటర్వ్యూ కూడా నిర్వహించే అవకాశముంది.

వంద మార్కులకు పరీక్ష

- ఎంపిక ప్రక్రియలో భాగంగా వంద మార్కులకు ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. దీన్ని ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల విధానంలో నిర్వహిస్తారు. ఇందులో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. రీజనింగ్ అప్టిట్యూడ్ 15 ప్రశ్నలు-15 మార్కులకు, కంప్యూటర్ నాలెడ్జ్ 10 ప్రశ్నలు-10 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-25 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-25 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు బ్యాంకింగ్ ఇండస్ట్రీ 25 ప్రశ్నలు-25 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం ఒక గంట.
- ఆన్‌లైన్ పరీక్ష ప్రశ్న పత్రంలో ఇంగ్లిష్ విభాగం తప్ప మిగతా అన్ని విభాగాలను స్థానిక భాషల్లోనూ నిర్వహిస్తారు. ఈ ఆబ్జెక్టివ్ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 1/4 వంతు మార్కును తగ్గిస్తారు.
- రాత పరీక్షలో కనీస అర్హత మార్కులను బ్యాంక్ నిర్ణయిస్తుంది. రాత పరీక్షలో ప్రతిభ ఆధారంగా రాష్ట్రాలు, యూటీల వారీగా మెరిట్ లిస్టును రూపొందిస్తారు.
- ఆన్‌లైన్ రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారికి లోకల్ లాంగ్వేజ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారినే ఎంపిక చేస్తారు. ఏ రాష్ట్రంలో అప్రెంటిస్‌కు దరఖాస్తు చేసుకున్నారో ఆ రాష్ట్ర స్థానిక భాషలో రాయడం, చదవడం, మాట్లాడటం వచ్చి ఉండాలి.

ప్రిపరేషన్ ఇలా



- తొలుత సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించాలి. అనంతరం పాత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. ఎలాంటి ప్రశ్నలు అడుగుతున్నారు. ఏ టాపిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో గమనించాలి.
- ఇంగ్లిష్‌లో ఎక్కువ స్కోర్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, గ్రామర్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. వొక్యాబులరీ, సెంటెన్స్ కరెక్షన్, క్లోజ్ టెస్ట్, సెంటెన్స్ రీ అరేంజ్‌మెంట్, జంబుల్డ్ సెంటెన్సెస్, మిస్‌స్పెల్ట్ వర్డ్స్ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. అదే విధంగా మెయిన్ పరీక్షలోని డిస్క్రిప్టివ్ టెస్ట్‌లో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు సంబంధించి ఈ-మెయిల్స్, రిపోర్ట్, ప్రెసీ రైటింగ్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ విభాగంలో మంచి మార్కుల కోసం అర్థిమెటిక్, నంబర్ సిరీస్, సింప్లిఫికేషన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్ తదితరాలపై పట్టు సాధించాలి. 8, 9, 10వ తరగతి గణితం పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత సాధ్యమైనన్నీ గత ప్రశ్నలు, మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- రీజనింగ్ విభాగంలో రాణించేందుకు పజిల్స్, సీటింగ్ అరేంజ్‌మెంట్స్, సిలాజిజమ్స్, కోడింగ్-డీకోడింగ్, డైరెక్షన్స్, బ్లడ్ రిలేషన్స్, కాజ్ అండ్ ఎఫెక్ట్, డెటా సఫిషియన్సీ అంశాలపై పట్టు సాధించాలి.
- జనరల్ అవేర్‌నెస్ విభాగం కోసం బ్యాంకింగ్ రంగ తాజా పరిణామాలు, ఎకానమీ, బ్యాంకింగ్ టెర్మినాలజీ, జాతీయ, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్‌ను తెలుసుకోవాలి. దీనికోసం ఏదైనా ప్రామాణిక దినపత్రికను అనుసరించాలి.
- కంప్యూటర్ విభాగంలో మంచి స్కోర్ కోసం కంప్యూటర్ ఫండమెంటల్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, లాంగ్వేజెస్, తాజా డవలప్‌మెంట్స్ తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 07.08.2025
- **వెబ్‌సైట్:** www.nats.education.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 721	నిఫ్టీ ▽ 225
81,463	24,837

విదేశీ సూచీలు			
నాస్డాక్	21,108	△	50
డోజోన్స్	44,902	△	208
ఎఫ్టీఎస్ఈ 100	9,120	▽	18
డాక్స్	24,217	▽	78
హాంగ్సెంగ్	3,594	▽	12
నికాయ్	41,456	▽	370

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	రూపాయలు	84.68	87.61
£	బ్రిటన్ పౌండ్	రూపాయలు	113.75	118.01
€	యూరో	రూపాయలు	99.27	103.14
¥	జపాన్ యెన్ (100)	రూపాయలు	58.08	59.57
AU$	ఆస్ట్రేలియా డాలర్	రూపాయలు	54.32	58.12
S$	సింగపూర్ డాలర్	రూపాయలు	65.18	68.84
SAR	సౌదీ రియాల్	రూపాయలు	22.20	23.68
UAE	యూఏఈ దిర్హామ్	రూపాయలు	22.66	23.91
¥	చైనా యువాన్	రూపాయలు	11.19	13.02

రిటర్నులకు వేళాయెనే..!

వేతన జీవుల్లో చాలా మంది ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేస్తుంటారు. చిరుద్యోగులు, స్వయం ఉపాధి పొందేవారు, కొన్ని రకాల వృత్తి నిపుణులు మాత్రం దూరంగా ఉండడం గమనించొచ్చు. పైగా రిటర్నులు వేయడం కేవలం ఉద్యోగులు, వ్యాపారులకు సంబంధించిన విషయమేనని కొందరు భావిస్తుంటారు. అసలు ఆదాయపన్ను రిటర్నులు ఎవరు దాఖలు చేయాలి..? పన్ను పరిధిలోకి వచ్చేంత ఆదాయం లేకపోయినా సరే.. రిటర్నులు దాఖలు చేయాల్సిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. విద్యార్థులు, విశ్రాంత జీవులు, రైతులు, చివరికి గృహిణులు సైతం నిబంధనల ప్రకారం రిటర్నులు వేయాల్సిందే. ఎప్పుడు ఎలా అన్న విషయమై అవగాహన కల్పించే ప్రయత్నమే ఇది.

- సాక్షి, బిజినెస్ డెస్క్



2024–25 ఆర్థిక సంవత్సరానికి (2025–26 అసెస్మెంట్ సంవత్సరం) ఆదాయ పన్ను రిటర్నుల దాఖలుకు సెప్టెంబర్ 15 వరకు గడువు ఉంది. వాస్తవ గడువు జూలై 31 కాగా, కొన్ని సాంకేతిక అంశాల కారణంగా గడువును పెంచుతూ ఆదాయపన్ను శాఖ నిర్ణయం తీసుకుంది. అధిక ఆదాయ పరిధిలో ఉన్న వారే రిటర్నులు వేయాలని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ, ఇది పొరపాటు. పన్ను చెల్లించాల్సిన ఆదాయం లేకపోయినా సరే చట్టంలోని నిబంధనల ప్రకారం పన్ను రిటర్నులు వేయాల్సి రావచ్చు. పైగా రిటర్నులు సమర్పించడం మంచి సంప్రదాయం కిందకు వస్తుంది.

పరిమితులు..

ఒక వ్యక్తి వార్షిక ఆదాయం బేసిక్ ఎగ్జెంప్షన్ (ప్రాథమిక మినహాయింపు) పరిమితి దాటినట్టయితే రిటర్నులు (ఐటీఆర్) తప్పనిసరిగా దాఖలు చేయాలని చట్టం నిర్దేశిస్తోంది. పాత పన్ను విధానంలో 60 ఏళ్లు దాటని వారికి రూ.2,50,000 ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిగా ఉంది. 60–80 ఏళ్ల మధ్యవయసు వారికి రూ.3,00,000, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5,00,000 పరిమితి అమల్లో ఉంది. కొత్త విధానం కింద అన్ని వయసుల వారికి ఈ పరిమితి రూ.3,00,000గా ఉంది. ఆదాయం ఈ పరిమితికి మించకపోతే సాధారణంగా ఐటీఆర్ దాఖలు చేయడం తప్పనిసరి కాదు. కానీ, ఆదాయం ఈ పరిమితుల్లోనే ఉన్నా కానీ, పన్ను రిటర్నులు దాఖలు చేయాల్సిన సందర్భాలు కూడా ఉన్నాయి.

ఐటీఆర్ వేయాల్సిందే..

''నేను ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. కనుక నేను ఎందుకు రిటర్నులు వేయాలి?'' చాలా మంది ఇలానే భావిస్తుంటారు. ఆదాయపన్ను చట్టం 1961 ప్రకారం.. స్థూల ఆదాయం పైన చెప్పుకున్న పరిమితులను దాటితే తప్పకుండా రిటర్నులు వేయాల్సిందే. చట్టంలో కల్పించిన రాయితీలు, మినహాయింపుల ప్రకారం ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేకపోయినా సరే.. రిటర్నులు సమర్పించడం ద్వారానే వాటిని క్లెయిమ్ చేసుకుని, ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. రిటర్నులు దాఖలు చేయకపోతే మినహాయింపులను క్లెయిమ్ చేసుకునే హక్కును కోల్పోతారు.

- ఉదాహరణకు రవివర్మ వార్షిక ఆదాయం రూ.2.4 లక్షలు. పింఛను, బ్యాంక్ డిపాజిట్లపై వడ్డీ రూపంలో ఈ మొత్తం సమకూరింది. కానీ, వడ్డీ ఆదాయంపై 10 శాతం టీడీఎస్ కింద బ్యాంక్ మినహాయించింది. ఈ కేసులో ఎలాంటి పన్ను చెల్లించక్కర్లేదు. కానీ, బ్యాంక్ నుంచి ఆదాయపన్ను శాఖకు వెళ్లిన టీడీఎస్ మొత్తాన్ని తిరిగి పొందాలంటే (రిఫండ్) రిటర్నులను నిర్ణీత గడువులోపు సమర్పించడం ద్వారానే సాధ్యపడుతుంది.
- ఎవరైనా ఒక ఆర్థిక సంవత్సరం పరిధిలో తమ సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలో రూ.50 లక్షలకు మించి డిపాజిట్ చేస్తే తప్పకుండా ఐటీఆర్ దాఖలు చేయాలి.
- ఒకటి లేదా ఒకటికి మించిన కరెంట్ ఖాతాలలో కలిపి (వాణిజ్య, కోపరేటివ్ బ్యాంకుల) రూ.కోటి, అంతకు మించి డిపాజిట్ చేస్తే రిటర్నులు సమర్పించాలి. వ్యక్తులకే గానీ వ్యాపార సంస్థలకు ఈ నిబంధన వర్తించదు.
- ఏడాదిలో అమ్మకాల ఆదాయం గనుక రూ.60 లక్షలు మించితే వ్యాపార సంస్థలు రిటర్నులు వేయాలి.
- వృత్తి ద్వారా ఆదాయం రూ.10 లక్షలకు మించినప్పుడు రిటర్నులు దాఖలు చేయాలి.
- ఒక విద్యుత్ బిల్లు రూ.లక్ష మించినా లేదా ఒక ఆర్థిక సంవత్సరం మొత్తం మీద విద్యుత్ బిల్లు రూ.లక్షకు మించిన సందర్భంలోనూ పన్ను రిటర్నులు సమర్పించాల్సి ఉంటుంది.
- వివిధ రూపాల్లో టీడీఎస్ ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.25,000, అంతకు మించి ఉంటే అప్పుడు కూడా రిటర్నులు వేయాల్సిందే. 60 ఏళ్లు నిండిన వారికి ఈ పరిమితి రూ.50,000గా ఉంది.
- విదేశీ ఆస్తుల సమాచారాన్ని ఐటీఆర్లోని షెడ్యూల్ ఎఫ్ఏ కింద తప్పకుండా వెల్లడించాలి. విదేశీ ఖాతాకు సంతకం చేసే అధికారం కలిగి ఉన్న వారు సైతం రిటర్నులు వేయాల్సిందే. భార్యా, భర్తలు సంయుక్తంగా విదేశాల్లో ఆస్తికి యజమానులుగా ఉంటే అప్పుడు ఇద్దరూ విడిగా రిటర్నులు దాఖలు చేసి, ఆస్తి వివరాలు వెల్లడించాలి.
- విదేశీ కంపెనీల షేర్లను కలిగి వారు సైతం రిటర్నులు ద్వారా ఆ వివరాలు వెల్లడించాలి.
- దేశీయ అన్లిస్టెడ్ కంపెనీల్లో వాటాలు (షేర్లు) కలిగిన వారు కూడా రిటర్నులు దాఖలు చేసి వెల్లడించాలి.
- ఒక ఆర్థిక సంవత్సరంలో విదేశీ పర్యటనలపై (తనకోసం, ఇతరుల కోసం) చేసిన ఖర్చు రూ.2 లక్షలకు మించినట్టయితే పన్ను రిటర్నులు తప్పకుండా దాఖలు చేయాలి.
- మూలధన నష్టాలను క్యారీ ఫార్వార్డ్ (తదుపరి ఆర్థిక సంవత్సరాలకు బదిలీ) చేసుకోవాలని అనుకుంటే సెక్షన్ 139(3) కింద గడువులోపు రిటర్నులు వేయడం తప్పనిసరి. సెక్షన్ 54, 54బి, 54ఈసీ లేదా 54 ఎఫ్ కింద మూలధన నష్టాలపై మినహాయింపులు క్లెయిమ్ చేసుకోవడం రిటర్నుల దాఖలుతోనే సాధ్యపడుతుంది.
- సెక్షన్ 10(1) కింద వ్యవసాయ ఆదాయంపై పన్ను లేదు. వ్యవసాయంపై ఆదాయానికి అదనంగా.. వ్యవసాయేతర కార్యకలాపాల ద్వారా ఆదాయం ప్రాథమిక మినహాయింపు పరిమితికి మించి ఉంటే అప్పుడు రిటర్నులు సమర్పించాల్సిందే.

- పన్ను చెల్లింపులతో సంబంధం లేదు..
- టీడీఎస్ రూ.25 వేలు దాటితే తప్పదు
- విదేశాల్లో ఆస్తులను వెల్లడించాల్సిందే..
- అధిక విలువ లావాదేవీలకూ తప్పనిసరి
- అన్లిస్టెడ్ షేర్లు కలిగి ఉన్నా రిటర్నులు వేయాల్సిందే..

దాఖలుకు ముందు ఇవి అవసరం..

ఐటీఆర్ దాఖలు చేయడానికి ముందు కీలక డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచుకోవాలి. తద్వారా రిటర్నుల్లో కీలక సమాచారం వెల్లడించే విషయమై ఎలాంటి జాప్యానికి, తప్పులకు చోటివ్వకుండా చూసుకోవచ్చు.

ఫారమ్-16: వేతనంతోపాటు, టీడీఎస్ వివరాలు ఇందులో ఉంటాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక కంపెనీ నుంచి మరో కంపెనీకి మారిపోతే, పాత-కొత్త యాజమాన్యాల నుంచి ఫారమ్–16ను తప్పకుండా తీసుకోవాలి. ఇందులో పార్ట్-ఏ కింద టీడీఎస్ మినహాయించినట్టయితే ఆ వివరాలు నమోదై ఉంటాయి. పార్ట్-బీ కింద జీత భత్యాలు, మినహాయింపుల క్లెయిమ్ వివరాలు ఉంటాయి. ఫిక్స్డ్ డిపాజిట్ల వడ్డీపై టీడీఎస్, బీమా కంపెనీ నుంచి కమీషన్కు సంబంధించి వివరాల కోసం 'ఫారమ్–16ఏ'ని తీసుకోవాలి. ప్రాపర్టీ లావాదేవీ విలువ (రిజిస్టర్డ్) రూ.50 లక్షలకు మించినప్పుడు టీడీఎస్ అమలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి 'ఫారమ్–16బీ'ని కొనుగోలుదారుడు విక్రయదారుడికి జారీ చేస్తారు. నెలవారీ ఇంటి అద్దె రూ.50,000 మించితే, అప్పుడు సైతం టీడీఎస్ అమలు చేయాలి. కిరాయిదారుడు ఇంటి యజమానికి 'ఫారమ్–16సీ'ని అందిస్తారు. ఐటీఆర్ దాఖలు చేసే సమయంలో ఈ వివరాలు ముందుగానే నింపి ఉండడం గమనించొచ్చు. వాటిని సరిపోల్చుకుని, అవసరమైతే అదనపు వివరాలు నమోదు చేసి సమర్పించాల్సి ఉంటుంది.

మూలధన లాభాల రిపోర్ట్: షేర్లు, మ్యూచువల్ ఫండ్స్లో పెట్టుబడులను విక్రయించినప్పుడు స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాలు వస్తుంటాయి. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నివేదికను బ్రోకర్ల నుంచి, ఫండ్స్ సంస్థల నుంచి తీసుకోవాలి. ఇందులోని వివరాలను ఐటీఆర్లో నమోదు చేయడం తప్పనిసరి. క్లియర్ ట్యాక్స్ తదితర సంస్థల ద్వారా రిటర్నులు వేసేట్టు అయితే క్యాపిటల్ గెయిన్స్ రిపోర్ట్ను అప్లోడ్ చేస్తే ఐటీఆర్ పత్రంలో ఆ వివరాలన్నీ ఆటోమేటిక్గా భర్తీ అవుతాయి.

ఏఐఎస్/ఫారమ్-26ఏఎస్: 'ఫారమ్–26ఏఎస్'లో టీడీఎస్, టీసీఎస్ వివరాలు ఉంటాయి. ఏఐఎస్లో అద్దె, డివిడెండ్లు, ఆస్తుల అమ్మకాలు ఇలా అన్ని రకాల ఆర్థిక లావాదేవీలు, పెట్టుబడులు, విదేశీ చెల్లింపులు, డిపాజిట్లపై వడ్డీ ఆదాయం, జీఎస్టీ టర్నోవర్ వివరాలు ఉంటాయి. ఏఐఎస్నే టీఐఎస్ అని కూడా అంటారు. వీటితోపాటు బ్యాంక్లు, పోస్టాఫీసులు, ఆర్థిక సంస్థలు జారీ చేసే ఇంటరెస్ట్ సర్టిఫికెట్లు, పన్ను మినహాయింపు పెట్టుబడులు, వ్యయాలకు సంబంధించిన ఆధారాలు (బీమా ప్రీమియం సర్టిఫికెట్, ట్యూషన్ ఫీజులు తదితర) సిద్ధంగా ఉంచుకోవాలి.

ప్రయోజనాలు..



పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోయినా పన్ను రిటర్నులు దాఖలు చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. ఒక వ్యక్తి ఆర్థిక వ్యవహారాలకు సంబంధించి పాస్పోర్ట్గా పన్ను రిటర్నులు పనిచేస్తాయి. రుణం కోసం దరఖాస్తు చేసుకున్న సందర్భంలో బ్యాంక్ ఐటీఆర్ కాపీ కోరొచ్చు. తిరిగి చెల్లించే సామర్థ్యానికి ఐటీఆర్ను పరిగణనలోకి తీసుకుంటాయి. టీడీఎస్లను తిరిగి పొందేందుకు, మూలధన నష్టాలను క్యారీఫార్వార్డ్ చేసుకుని, తదుపరి ఆర్థిక సంవత్సరాల్లో మూలధన లాభాలతో సర్దుబాటు చేసుకునేందుకు ఐటీఆర్ దాఖలు వీలు కల్పిస్తుంది. ముఖ్యంగా యూఎస్, యూకే, షెంజెన్ దేశాలకు (29 యూరప్ దేశాల సమూహం), కెనడా వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే క్రితం 2-3 సంవత్సరాలకు సంబంధించి పన్ను రిటర్నుల కాపీలను సమర్పించాల్సి వస్తుంది. లేదంటే దరఖాస్తును తిరస్కరించొచ్చు. ముఖ్యంగా స్వయం ఉపాధిలో ఉన్న వారికి, కుల వృత్తులు నిర్వహించుకునే వారికి ఆదాయ రుజువులు ఉండవు. వీరికి ఐటీఆర్ ఆదాయ ధ్రువీకరణగా పనికొస్తుంది. ఇలాంటి వారు రుణం, టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవడానికి ఐటీఆర్ కాపీని సమర్పిస్తే సరిపోతుంది. స్టార్టప్లు, వ్యాపారాల నమోదు సమయంలో గత కాలపు ఐటీఆర్లు మంచి ఆధారంగా పనికొస్తాయి.


చట్టపరమైన చర్యలకు బాధ్యులు..



విదేశాల్లో బ్యాంక్ ఖాతాలు, పెట్టుబడులు, ఈ-సాప్లు, స్థిరాస్తులను కలిగిన వారు ఆదాయంతో సంబంధం లేకుండా తప్పకుండా వెల్లడించాల్సిందే. లేదంటే బ్లాక్ మనీ అండ్ ఇంపోజిషన్ యాక్ట్ కింద పెనాల్టీలు పడతాయి. అవసరమైతే విచారణను కూడా ఎదుర్కోవాల్సి రావచ్చు. ఇటీవలి కాలంలో అంతర్జాతీయంగా వివిధ దేశాలు సంయుక్త వెల్లడి ప్రమాణాలను (సీఆర్ఎస్) అమలు చేస్తున్నాయి. దీనికింద సమాచారాన్ని ఇచ్చి పుచ్చుకుంటున్నాయి. విదేశీ ఆస్తుల సమాచారం పన్ను అధికారులకు తెలియదని అనుకోవడం పొరపాటే అవుతుంది. నిబంధల ప్రకారం పన్ను రిటర్నులు సమర్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, దాఖలు చేయనట్టు గుర్తిస్తే.. అప్పుడు ఆదాయపన్ను శాఖ నోటీసు జారీ చేస్తుంది. రిటర్నులు దాఖలు చేయాలని కోరుతుంది. అప్పుడు అయినా రిటర్నులు సమర్పించడం ద్వారా తప్పును సరిదిద్దుకోవచ్చు. లేదంటే పెనాల్టీ చార్జీలు, దానిపై వడ్డీ చెల్లించాల్సి వస్తుంది. పన్ను చెల్లించాల్సిన బాధ్యత ఉండీ, రిటర్నులు కూడా వేయకపోతే అప్పుడు చట్టం పరిధిలో అసలు పన్నుకు ఎన్నో రెట్ల జరిమానా, జైలు శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుంది.

షాపర్స్ స్టాప్ | యాంటిక్ స్టాక్ బ్రోకింగ్ | కొనొచ్చు

స్టాక్ స్కోప్



ప్రస్తుత ధర: రూ. 530 **టార్గెట్:** రూ. 807

ఎందుకంటే: ఫ్యాషన్ రంగ డిపార్ట్మెంట్ స్టోర్ల దిగ్గజం షాపర్స్ స్టాప్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో అంచనాలను మించిన ఫలితాలు ప్రకటించింది. క్యూ1(ఏప్రిల్-జూన్)లో లాభదాయకత, నిర్వహణ లాభ(ఇబిటా) మార్జిన్లలో బలమైన ప్రదర్శన కనబరచింది. ఇబిటా మార్జిన్లు వార్షికంగా 1.45 శాతం పుంజుకుని 15.2 శాతానికి చేరాయి. ఇందుకు నిర్వహణ వ్యయాలలో అత్యుత్తమ సామర్థ్యం, అత్యధిక ప్రీమియం పోర్ట్ఫోలియో, ప్రయివేట్ బ్రాండ్ల విభాగంలో అత్యుత్తమ మార్జిన్ల ఆర్జన, పనితీరు మెరుగుపడని స్టోర్ల మూసివేత నేపథ్యంలో మార్జిన్లు మెరుగుపడ్డాయి. ప్రత్యర్థి సంస్థల లోతైన డిస్కౌంట్ల కారణంగా తాజా త్రైమాసికంలో ఇన్ట్యూన్ స్టోర్ల పనితీరు నిరాశపరచింది. దీంతో తొలుత ప్రకటించిన 12 స్టోర్ల ఏర్పాటు(గైడెన్స్)కు బదులుగా ఈ కాలంలో కొత్తగా 4 ఇన్ట్యూన్ స్టోర్లను మాత్రమే జత చేసుకుంది. వెరసి పూర్తి ఏడాదిలో గతంలో ప్రకటించిన 40–60 స్టోర్ల స్థానే 30–40 స్టోర్ల ఏర్పాటుకే కట్టుబడనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అయితే ప్రీమియమైజేషన్ను పెంచుకోవడంపై అధికంగా దృష్టి పెట్టనున్నట్లు వెల్లడించింది. ఇందుకు నిరంతరంగా కొత్త ప్రొడక్టుల విడుదలకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. తద్వారా ఈ ఏడాది మొత్తం అమ్మకాలలో ప్రీమియం పోర్ట్ఫోలియో వాటాను 70 శాతానికి చేర్చుకోవాలనే లక్ష్యంతో సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల(2026, 2027)కు ఇబిటా అంచనాలలో 3, 5 శాతంమేర కోత పెడుతున్నాం. మెచూరిటీ సాధించేలోగా ఇన్ట్యూన్ స్టోర్ల నుంచి నమోదయ్యే నష్టాల ప్రభావం ఆధారంగా తాజా అంచనాలు ప్రకటించాం.

గెలాక్సీ సర్ఫాక్టెంట్స్ | మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 2,595 **టార్గెట్:** రూ. 3,180

ఎందుకంటే: ఇటీవల ముంబైలో స్పెషాలిటీ కెమికల్స్ దిగ్గజం గెలాక్సీ సర్ఫాక్టెంట్స్ నిర్వహించిన క్యాపిటల్ మార్కెట్ డేకు హాజరయ్యాం. కంపెనీ వెల్లడించిన కీలక అంశాలను పరిశీలిద్దాం.. గత పదేళ్లలో అటు సైక్లికల్గా, ఇటు ప్రాంతీయంగా ఎదురైన సవాళ్లలోనూ సమర్థవంతంగా ఎదురీది సామర్థ్యాన్ని నిరూపించుకుంది. 2015 నుంచి 2025వరకూ అమ్మకాల పరిమాణాన్ని రెట్టింపునకు పెంచుకుంటూ వచ్చింది. ఇందుకు మార్కెట్లో మరింత అధికంగా చొచ్చుకుపోవడంతోపాటు.. ఇతర విభాగాలలోనూ కార్యకలాపాలు విస్తరించడం సహకరించింది. ప్రధానంగా వ్యక్తిగత సంరక్షణ, గృహ సంరక్షణ విభాగాలలో సాధించిన వృద్ధి తోడ్పాటునిచ్చింది. దీంతో ఈ కాలంలో నిర్వహణ లాభం(ఇబిటా) మూడు రెట్లు ఎగసింది. ఇందుకు పటిష్ట నిర్వహణా సామర్థ్యం, కొత్త ప్రొడక్టుల విడుదలతోపాటు.. తరచుగా విభిన్న ఉత్పత్తుల (ప్రొడక్ట్ మిక్స్)ను రూపొందించడం వంటి అంశాలు దన్నుగా నిలిచాయి. వీటికితోడు వ్యయాల నియంత్రణసహా.. పటిష్ట ఎగ్జిక్యూషన్ నికర లాభాల్లో 5 రెట్లు వృద్ధికి దోహదం చేశాయి. ఈ బాటలో 2030కల్లా కంపెనీ నిర్మాణాత్మక, భారీ లక్ష్యాలను నిర్దేశించుకుంది. రానున్న ఐదేళ్లలో అమ్మకాల పరిమాణాన్ని రెట్టింపునకు పెంచుకునే ప్రణాళికలకు తెరతీసింది. దీంతోపాటు ఇబిటాలో 2.5 రెట్లు వృద్ధి, 22% పైన ఆర్ఓసీఈని నిలుపుకోవడంపై దృష్టి పెట్టింది. వీటిలో అంతర్గతంగా నిర్దేశించుకున్న మరో కీలక టార్గెట్ కేజీకి రూ. 25 ఇబిటాను సాధించడం. కొత్త కస్టమర్లను గెలుచుకోవడం, భారత్సహా ఏఎంఈఏటీ మార్కెట్లలో మరింతలోతుగా విస్తరించడం, అమెరికా, ఈయూలలో వ్యాపార విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వనుంది.

గమనిక: ఈ కాలమ్లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

న్యూ ఫండ్ ఆఫర్

మోతీలాల్ ఓస్వాల్ స్పెషల్ అపార్చునిటీస్ ఫండ్


మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్.. స్పెషల్ అపార్చునిటీస్ ఫండ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ)ను ప్రకటించింది. ఆగస్ట్ 8తో ముగుస్తుంది. తిరిగి ఆగస్ట్ 21 నుంచి పెట్టుబడులకు అందుబాటులోకి వస్తుంది. వ్యాపార పరంగా ప్రత్యేక అవకాశాలను చూస్తున్న కంపెనీల్లో ఈ పథకం పెట్టుబడులు పెడుతుంది. కార్పొరేట్ స్థాయిలో కంపెనీ వ్యాపారాల విభజన, విలీనాలు, కొనుగోళ్లు, ప్రభుత్వ విధానాల్లో మార్పులు, ఏదైనా రంగాల్లో కొత్తగా అవకాశాలు ఏర్పడుతుండడం, నియంత్రణపరమైన మార్పులను అవకాశాలుగా మలుచుకుని ఇన్వెస్ట్ చేస్తుంది. కనీసం రూ.500 నుంచి ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. పెట్టుబడిని మొదటి మూడు నెలల్లో వెనక్కి తీసుకుంటే 1% ఎగ్జిట్ లోడ్ చార్జీ పడుతుంది. ఆ తర్వాత ఉపసంహరణపై ఎలాంటి చార్జీలుండవు. ఈ పథకంలో రిస్క్ ఎక్కువ. నిఫ్టీ 500 టీఆర్ఐ ఈ పథకం పనితీరుకు ప్రామాణికం. అజయ్ ఖండేల్వాల్, అతుల్ మెహ్రా, బాలచంద్ర షిండే, రాకేశ్ శెట్టి, సునీల్ సావంత్ ఫండ్ మేనేజర్లుగా సేవలు అందించనున్నారు.

జెరోధా మల్టీ అస్సెట్ ప్యాసివ్ ఎఫ్వోఎఫ్

జెరోధా మ్యూచువల్ ఫండ్ కొత్తగా జెరోదా మల్టీ అస్సెట్ ప్యాసివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్వోఎఫ్)ను ప్రారంభించింది. ఈక్విటీ, డెట్ ఇండెక్స్ ఫండ్స్/ఈటీఎఫ్లు, కమోడిటీ ఈటీఎఫ్లలో ఇన్వెస్ట్ చేస్తుంది. ఆగస్ట్ 8న ఎన్ఎఫ్వో ముగుస్తుంది. ఐదు పనిదినాల అనంతరం తిరిగి క్రయ, విక్రయాలకు అందుబాటులోకి వస్తుంది. ఈక్విటీ, డెట్, కమోడిటీల్లో పెట్టుబడులకు ఈ పథకం వీలు కల్పిస్తుంది. పోర్ట్ఫోలియోకి రిస్క్, అస్థిరతలు తగ్గించడం ప్రధాన ధ్యేయం. ముఖ్యంగా 50–70 శాతం పెట్టుబడులను ఈక్విటీ ఈటీఎఫ్/ఇండెక్స్ ఫండ్స్లో ఇన్వెస్ట్ చేస్తుంది. 10–20 శాతం డెట్ ఈటీఎఫ్/ఇండెక్స్ ఫండ్స్, 20–30 శాతం కమోడిటీ ఈటీఎఫ్లకు (బంగారం, వెండి) కేటాయిస్తుంది. పెట్టుబడులను వివిధ సాధనాల మధ్య వైవిధ్యం చేసుకోవాలని చూసే వారి కోసం ఈ పథకం తీసుకొచ్చినట్టు తెలుస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్లో ..
ఫెడ్ పాలసీ, ఫలితాలు కీలకం
రిస్క్ - రాబడి సమతుల్యం కోటక్ మిడ్క్యాప్ ఫండ్

ఒకటికి మించిన ఫండ్స్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్




సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ ప్లాన్ (ఎస్డబ్ల్యూపీ) అంటే ఏంటి? ఏక మొత్తంలో ఓ పథకంలో పెట్టుబడి పెట్టి, తదుపరి నెల నుంచి ఎస్డబ్ల్యూపీ ద్వారా ఆదాయం పొందొచ్చా? అలా అయితే అది నా పెట్టుబడిపై ప్రభావం చూపిస్తుందా? - రాఘవరాజు

పెట్టుబడులను పెట్టడమే కాదు.. వాటిని వెనక్కి తీసుకునే విషయంలోనూ తగిన ప్రణాళిక కలిగి ఉండాలి. మార్కెట్లలో అస్థిరతలను అధిగమించేందుకు క్రమానుగత పెట్టుబడులకు సిప్ ఎలా ఉపయోగపడుతుందో..? అదే మాదిరి.. పెట్టుబడిని నిర్ణీత కాలానికి ఓసారి వెనక్కి తీసుకునేందుకు ఎస్డబ్ల్యూపీ వీలు కల్పిస్తుంది. మార్కెట్లు కనిష్టాల్లో (తక్కువ విలువల వద్ద) ఉన్నప్పుడు పెట్టుబడి మొత్తాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవాల్సిన అవసరం లేకుండా ఎస్డబ్ల్యూపీ సాయపడుతుంది. రిటైర్మెంట్ తీసుకున్న వారికి, అదనపు ఆదాయం కోరుకునే వారికి అనుకూలం. దీని ద్వారా వారు తమకు కావాల్సినంత స్థిరమైన ఆదాయం పొందే ఏర్పాటు చేసుకోవచ్చు. ఎన్ని రోజులకు ఒకసారి ఆదాయం రావాలన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉంటుంది. ఇన్వెస్టర్ ప్రతీ నెలా నిర్ణీత తేదీన, నిర్ణీత మొత్తాన్ని ఎస్డబ్ల్యూపీ ద్వారా రావాలని నిర్ణయించుకుంటే.. అదే రోజు ఆ మొత్తం బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఆ మేరకు పెట్టుబడుల విలువ తగ్గుతుంటుంది. సిప్ ఎంపిక చేసుకుంటే.. ప్రతీ నెలా నిర్ణీత మొత్తం బ్యాంకు ఖాతా నుంచి మ్యూచువల్ ఫండ్ పథకంలో పెట్టుబడిగా వెళుతుంది. దీనికి పూర్తి వ్యతిరేకంగా పనిచేసేదే ఎస్డబ్ల్యూపీ. మీ మొత్తం పెట్టుబడుల్లో కనీసం మూడింట ఒక వంతును ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. ఒక ఏడాదిలో ఎస్డబ్ల్యూపీ ద్వారా ఉపసంహరించుకునే మొత్తం పెట్టుబడుల విలువలో 4–6 శాతం మించకుండా జాగ్రత్తపడాలి. దీని వల్ల పెట్టుబడికి నష్టం లేకుండా ఉంటుంది. ఉదాహరణకు మీ పెట్టుబడులపై రాబడి వార్షికంగా 8–9 శాతంగా ఉండి, 5 శాతాన్ని వెనక్కి తీసుకునేట్టు అయితే.. అప్పుడు మిగిలిన 3–4 శాతం రాబడి పెట్టుబడిని వృద్ధి చేస్తుంటుంది. దీనివల్ల ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెట్టుబడి విలువ క్షీణించకుండా స్థిరంగా ఉంటుంది. ఎస్డబ్ల్యూపీ ద్వారా ఏటా ఉపసంహరించుకునే మొత్తంపై పన్ను పడదు. నికర లాభంపై పన్ను చెల్లిస్తే సరిపోతుంది. ఏడాదిలో రూ.1.25 లక్షల దీర్ఘకాల మూలధన లాభంపై పన్ను లేదు. అంతకు మించిన మొత్తంపైనే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను పడుతుందని గుర్తు పెట్టుకోవాలి. ఏడాదిలోపు ఈక్విటీ పెట్టుబడులపై 15 శాతం స్వల్పకాల మూలధన లాభం చెల్లించాలి. డెట్ పెట్టుబడులపై లాభం వార్షిక ఆదాయానికి కలుస్తుంది.

ఒకటికి మించిన ఫండ్ విభాగాల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచి నిర్ణయమేనా? - చిట్టి లాస్య

ఒకటికి మించిన మ్యూచువల్ ఫండ్స్ విభాగాల్లో పెట్టుబడులు పెట్టుకున్నప్పటికీ.. నిర్ణీత కాలానికి ఒకసారి పోర్ట్ఫోలియోని రీబ్యాలన్స్ (సమీక్ష/మార్పులు, చేర్పులు) చేసుకోవడం మర్చిపోవద్దు. ప్రత్యామ్నాయంగా ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్లో ఇన్వెస్ట్ చేసుకోడాన్ని పరిశీలించొచ్చు. ఎందుకంటే ఈ పథకాలు అన్నిరకాల మార్కెట్ విభాగాల్లోని కంపెనీల్లో (స్మాల్క్యాప్, మిడ్క్యాప్, లార్జ్క్యాప్) ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మార్కెట్ పరిస్థితులు, వ్యాల్యూషన్ల ఆధారంగా ఆయా విభాగాలకు కేటాయించే పెట్టుబడుల మొత్తం మారిపోతుంటుంది. సాధారణంగా ఫ్లెక్సీక్యాప్ పథకాలు తమ నిర్వహణలోని పెట్టుబడుల్లో 70–75 శాతాన్ని లార్జ్క్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేస్తుంటాయి. మిగిలిన పెట్టుబడులను మిడ్క్యాప్, స్మాల్క్యాప్ పథకాలకు కేటాయిస్తుంటాయి. కనుక మీరు రెండు నుంచి మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఫ్లెక్సీక్యాప్ పథకాలు ఎక్కువ మొత్తాన్ని లార్జ్క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక మీరు విడిగా లార్జ్క్యాప్ ఫండ్స్ను ఎంపిక చేసుకోవాల్సిన అవసరం లేదు. పెట్టుబడులపై అధిక రాబడులు కోరుకుంటూ, రిస్క్ తీసుకునే సామర్థ్యం కలిగిన వారు.. ఫ్లెక్సీక్యాప్నకు అదనంగా 10–15 శాతం పెట్టుబడులను మిడ్, స్మాల్క్యాప్ ఫండ్స్కు కేటాయించుకోవచ్చు.





Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం : 28-7-2025

పోషకాల 'పుట్ట' గొడుగులు

సమతుల్య ఆహారమే కాక ఆరోగ్యం కూడా..

గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో సంప్రదాయ ఆహారంగా వాడుక



గిరిజనులు సేకరించిన పుట్టగొడుగులు



అటవీ ప్రాంతంలో మొలకెత్తిన పుట్టగొడుగులు



కూర వండేందుకు శుభ్రం చేశాక...

కరకగూడెం: వర్షాకాలం ప్రారంభం కాగానే అటవీ ప్రాంతంలో పుట్టగొడుగులు పెరుగుతుంటాయి. గ్రామాల్లో మొలిచే పుట్టగొడుగులతో పోలిస్తే అటవీ ప్రాంతంలో పెరిగేవి గిరిజన, ఆదివాసీల ఆహారంలో ఏళ్లుగా భాగమవుతున్నాయి. అంతేకాక వీటి అమ్మకం ద్వారా గిరిజనులు ఆర్థిక వనరుగా ఉపయోగించుకుంటున్నారు. గిరిజన, ఆదివాసీలు పుట్టగొడుగులను సేకరించి చిన్న కట్ట రూ.50కి, కేజీ రూ.500–రూ.700 వరకు ప్రాంతాల ఆధారంగా విక్రయిస్తుంటారు. ఏటా ఈ సీజన్‌లో మాత్రమే దొరికేవి కావడంతో ఆదరణ కూడా బాగుంటోంది.

పుట్టగొడుగుల రకాలు.. గుర్తింపు

గిరిజన ప్రాంతాల్లో తెల్ల, నల్ల పుట్టగొడుగులు కనిపిస్తాయి. అయితే, ఇందులో తినదగినవే కాక విషపూరితమైనవి కూడా ఉంటాయి. వీటి మధ్య తేడాను గుర్తించే పరిజ్ఞానం గిరిజనులకు అనాదిగా వస్తుండటంతో సులువుగానే సేకరిస్తుంటారు. పుట్టగొడుగుల రంగు, ఆకారం, వాసే కాక అవి పెరిగిన ప్రదేశం ఆధారంగా తినదగినవా, విషపూరితమైనవా అన్నది గుర్తిస్తారు. తేమతో కూడిన వాతావరణంలో చెట్ల మొదళ్ల వద్ద, కుళ్లిన కలపపై లేదా మట్టిలో మొలి చే పుట్టగొడుగులను జాగ్రత్తగా సేకరిస్తారు. వీటితో కూర, పులుసులు, వేపుళ్లు, కొన్ని ప్రాంతాల్లో పచ్చళ్లు చేసుకుంటుండగా.. ఎక్కువగా సేకరిస్తే సమీప సంతలు, పట్టణాల్లో అమ్ముతుంటారు.

పోషకాల పవర్‌హౌస్


పుట్టగొడుగులు రుచికరమైనవే కాకుండా, ప్రొటీన్లు, విటమిన్లు (ముఖ్యంగా విటమిన్ బీ, డీ,), సెలీనియం, కాపర్, పొటాషియం వంటి ఖనిజాలే కాక ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. పుట్టగొడుగులలో ఉండే కొన్ని సమ్మేళనాలు రోగనిరోధక శక్తిని పెంచడంలో సాయపడతాయి. తద్వారా వర్షాకాలంలో వచ్చే జ్వరాలు, ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుందని నమ్ముతారు. అలాగే కొన్ని రకాల పుట్టగొడుగులను సంప్రదాయ వైద్యంలో ఔషధాలుగానూ వినియోగిస్తారు.

ఏటా ఎదురుచూస్తాం..



వర్షాకాలం వస్తుందంటే పుట్టగొడుగుల కోసం ఎదురుచూస్తాం. అడవిలోకి వెళ్లి సేకరించడం అలవాటు. వీటితో వండిన కూర రుచిగా ఉంటుంది. అందుకే చిన్నాపెద్దలు ఇష్టంగా తింటారు. ఎక్కువగా దొరికినప్పుడు అమ్ముకోవడం ద్వారా కాస్త డబ్బులు కూడా వస్తాయి.

– సావిత్రి, మొగిలితోగు గ్రామస్తురాలు



చిన్నప్పటి నుంచి తింటూనే ఉన్నాం..



చిన్నప్పటి నుంచి పుట్టగొడుగులు తింటున్నాం. ఏది తినాలి, ఏది విషపూరితమైనదో పెద్దల ద్వారా తెలుసుకున్నాం. వర్షాకాలంలో తినడానికే కాక అమ్ముతూ ఎంతో కొంత సంపాదిస్తాం. అడవిలో సహజంగా దొరికేది కావడంతో మాకు బలాన్ని ఇస్తుందని తప్పక తింటాం.

– సమ్మయ్య, రేగళ్ల గ్రామస్తుడు

ఆరోగ్యానికి ఎంతో మేలు



పుట్టగొడుగుల్లో ప్రొటీన్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. రోగనిరోధక శక్తి పెంచడం, వర్షాకాలంలో ఇన్ఫెక్షన్ల కట్టడికి ఉపయోగపడతాయి. ఇందులో ఏవి తినదగ్గవో సరిగ్గా గుర్తించకపోతే ప్రాణాంతకం అవుతాయి. అందుకే ఎంపికలో జాగ్రత్తగా ఉండాలి.

– రవితేజ, వైద్యాధికారి, కరకగూడెం పీహెచ్‌సీ



ఆదివారం ప్రముఖ జర్నలిస్టు, రచయిత్రి రాణా అయూబ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంపై రచిస్తున్న కొత్త పుస్తకం కోసం పరిశోధనలో భాగంగా రాణా అయూబ్ భేటీ అయ్యారు.



జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ శ్రీరామ సుబ్రహ్మణ్యంకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడు (ప్రొటోకాల్) హర్కర వేణుగోపాల్

బీజాపూర్ ఎన్‌కౌంటర్ మృతుల గుర్తింపు



ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో శనివారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టుల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌రాజ్ వెల్లడించారు. మృతుల్లో సౌత్ సబ్ జోనల్ బ్యూరో, ఏరియా కమిటీ సభ్యురాలు బీమే, సౌత్ సబ్ జోనల్ బ్యూరో, ప్లాటూన్ నంబర్ 10కి చెందిన ఏరియా కమిటీ మెంబర్, కమ్యూనికేషన్ టీం ఇన్‌చార్జ్ సంతోష్‌కు బాడీగార్డుగా వ్యవహరిస్తున్న నిహాల్ అలియాస్ రాహుల్, ఏరియా కమిటీ సభ్యుడు హుంగా, ప్లాటూన్ నంబర్ 30కి చెందిన ఏరియా కమిటీ సభ్యుడు లఖే ఉన్నట్లు తెలిపారు. వీరిలో నిహాల్ అలియాస్ రాహుల్‌పై రూ.2 లక్షలు, మిగతా ముగ్గురిపై రూ.5 లక్షల చొప్పున రివార్డు ఉందని వెల్లడించారు. సంఘటనా ప్రాంతం నుంచి పలు ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. 2024లో మావోయిస్టులపై సాధించిన విజయాల ఉత్సాహంతో ఈ ఏడాది కూడా ముందుకు సాగుతున్నామన్నారు. మృతుల బంధువులు సరైన ఆధారాలతో వస్తే మృతదేహాలు అప్పగిస్తామని తెలిపారు.

యాదగిరిగుట్టకు శ్రావణ తాకిడి

యాదగిరిగుట్ట: శ్రావణ మాసంతో పాటు ఆదివారం సెలవు కావడంతో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణ మాసంలో వచ్చిన మొదటి ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీస్వామిని దర్శించుకునేందుకు అధికంగా తరలి వచ్చారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.31,32,463 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.




శ్రీస్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కొండపోచమ్మను కొలిచి..

- ఆషాఢంలో వన భోజనాలు.. శ్రావణంలో పూజలు
- ఇతర జిల్లాల నుంచి భక్తుల రాక
- హాలీడే స్పాట్‌గా ఆలయ పరిసరాలు
- రూ.50 లక్షల అంచనాలతో రోడ్డు సౌకర్యం
- వనదేవతగా కొండపోచమ్మ ప్రాచుర్యం



కొండపైన ఆలయంలో భక్తుల పూజలు



కోరెం కొండపోచమ్మ ఆలయద్వారం, మెట్లు



కొండపై కొలువైన పోచమ్మ తల్లి

బోయినపల్లి(చొప్పదండి): ఆషాఢమాసంలో వనభోజనాలతో.. శ్రావణమాసంలో భక్తుల పూజలతో కిటకిటలాడతాయి కోరెం కొండపోచమ్మ ఆలయ పరిసరాలు. కొండపై వన దేవతగా వెలసి.. భక్తుల పాలిట కొంగుబంగారంగా నిలుస్తోంది పోచమ్మ తల్లి. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కోరెం గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని గుట్టపై పోచమ్మ వెలసిందని గ్రామస్తులు చెబుతుంటారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో గుట్ట ఉంటుంది. గుట్ట(కొండ)పై వెలసిన దేవత కాబట్టి కొండపోచమ్మ అని పిలుస్తారు. ప్రతీ ఆది, గురువారాల్లో ఇక్కడికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

ప్రకృతి ఒడిలో కొండపోచమ్మ

కొండపోచమ్మ గుట్ట పరిసరాలు పచ్చని పొలాలతో అందంగా కనిపిస్తాయి. గుట్టపైకి వెళ్లడానికి సుమారు 50 మెట్లు ఉంటాయి. గుట్టపైనున్న గుండుపై ఆలయంలో పోచమ్మ తల్లి ఉంటుంది. అక్కడ పోచమ్మ దేవతకు భక్తులు మొదట పూజలు చేస్తారు. బోనం తీసి మొక్కులు చెల్లిస్తారు. అమ్మవారికి టెంకాయలు, ఉల్లిగడ్డలు, కాగితపు చిలకలు, నూనె సమర్పిస్తారు. కోరెం గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణులు పూజలు చేస్తారు.

వన భోజనాలకు ప్రసిద్ధి : వనదేవతగా వెలసిన కోరెం కొండపోచమ్మ ఆలయం హాలీడే స్పాట్‌గా మారింది. ఆషాఢ మాసంలో ఇక్కడికి వనభోజనాలకు ఎక్కువగా వస్తారు. కరీంనగర్, హైదరాబాద్, వరంగల్ జిల్లా ప్రజలతో పాటు.. భివాండి పట్టణం నుంచి దేవతను దర్శించుకుంటారు. రైతులు వానాకాలం ముందు దేవతకు మొక్కులు చెల్లిస్తారు. ఆదివారం భక్తుల రాక ఎక్కువగా ఉంటుంది. మొదట పోచమ్మ దేవతకు మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం గుట్ట కింద ప్రకృతి ఒడిలో అందరూ కలిసి వన భోజనాలు చేస్తారు. భక్తులు వంటలు చేసుకునేందుకు ఓపెన్‌షెడ్లు ఉన్నాయి. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసిన వారు సైతం ఇక్కడ పూజలు చేస్తారు. ప్రతీ ఆది, గురువారాల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, వారి వాహనాలతో కోరెం కొండపోచమ్మ ఆలయ పరిసరాలు సందడిగా ఉంటాయి. కొత్తగా షెడ్లు నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

ఎమ్మెల్యేగా గెలవాలని పూజలు

చొప్పదండి అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా గత ఎన్నికల్లో బరిలో నిలిచిన ఎం.సత్యం గెలుపొందితే మొక్కులు చెల్లించుకుంటామని గంగాధర మండల కాంగ్రెస్ నాయకులు పడాల రాజిరెడ్డి, జాగీరపు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మొక్కుకున్నారు. సత్యం ఎమ్మెల్యేగా గెలుపొందడంతో వారు 2024 జనవరి 10న ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే సత్యం సైతం కోరెం జెడ్పీ రోడ్డు నుంచి కొండపోచమ్మ ఆలయం వరకు రూ.50 లక్షలతో సీసీ రోడ్డు మంజూరు చేయించారు.

ఇలా వెళ్లాలి.. : కరీంనగర్ నుంచి వచ్చే భక్తులు గంగాధర మీదుగా బోయినపల్లి మండల కేంద్రం నుంచి 10 కిలోమీటర్లు ప్రయాణించి కోరెంలోని కొండపోచమ్మ ఆలయానికి చేరుకోవచ్చు. సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు బోయినపల్లి మండల కేంద్రానికి చేరుకోకముందే ఎడమ వైపు వెళ్తే కోరెం ఆలయానికి చేరుకుంటారు.




ఏటా వస్తుంటాం

మాది కరీంనగర్ జిల్లా పోతుగంటి గ్రామం. ఏటా కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి కొండపోచమ్మ ఆలయానికి వస్తాం. గుట్టపైన అమ్మవారికి బోనం మొక్కులు చెల్లించుకుంటాం. ఆలయ పరిసరాల్లోని పచ్చని పొలాల వద్ద వన భోజనాలు చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, అంజిరెడ్డి, లచ్చిరెడ్డి, పోతుగంటి, కరీంనగర్


పర్యాటకంగా అభివృద్ధి



విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దేవత పోచమ్మతల్లి. అమ్మవారికి విశ్వబ్రాహ్మణులే నిత్యం పూజలు చేస్తారు. కోరెం కొండపోచమ్మ ఆలయం పురాతన కాలం నుంచి ప్రసిద్ధి చెందింది. ఇక్కడికి పెద్దమొత్తంలో భక్తులు వస్తారు. ప్రభుత్వం కోరెం కొండపోచమ్మ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి.

– ఉదారి నర్సింహాచారి, అధ్యక్షుడు, మండల విశ్వబ్రాహ్మణ సంఘం, బోయినపల్లి

సీసీ రోడ్డు నిర్మాణం



కోరెం నుంచి వట్టెంల వెళ్లే దారిలో కొండపోచమ్మ ఆలయం ఉంటుంది. ఆలయానికి వెళ్లేందుకు రోడ్డు కావాలని ఎమ్మెల్యే సత్యం దృష్టికి తీసుకెళ్లాం. రూ.50 లక్షలతో జెడ్పీ రోడ్డు నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం జరిగింది. దీంతో భక్తులకు రవాణా సౌకర్యం మెరుగు పడింది.

– వన్నెల రమణారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, బోయినపల్లి

మెదక్‌లో పర్యాటక కాటేజీలు నిర్మించండి

- మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: మెదక్ నియోజకవర్గంలోని పర్యాటక కేంద్రాలకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించాలని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం మంత్రికి లేఖ రాశారు. అతి పెద్ద పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రమైన ఏడుపాయల వన దుర్గ భవాని దేవస్థానం వద్ద 25 కాటేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ ఖిల్లాకు కావాల్సిన వసతులు సమకూర్చాలని కోరారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చికి వచ్చే పర్యాటకులు, భక్తుల కోసం 10 కాటేజీలు నిర్మించాలని సూచించారు. పబ్లిక్ ప్రైవేటు పార్టనర్‌షిప్ టూరిజం ప్యాకేజీలో ఈ నిర్మాణాలు చేర్చాలని శశిధర్ రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లది ఫెవికాల్ బంధం

- చొప్పదండి ఎమ్మెల్యే సత్యం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ, బీఆర్‌ఎస్‌లు రెండూ వేర్వేరు కాదని మొదటి నుంచి చెబుతున్నామని, ఆ రెండు పార్టీల మధ్య ఫెవికాల్ బంధం ఉందని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. బీజేపీకి హోల్‌సేల్‌గా బీఆర్‌ఎస్‌ను అమ్మేందుకు కేటీఆర్ ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. సత్యం ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తన కుటుంబ సభ్యులపై కేసులు పెట్టకుండా ఉంటే బీఆర్‌ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తామని కేటీఆర్ కోరినట్లు బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ వెల్లడించారన్నారు. ఈ విలీనం చర్చల మాట వాస్తవమేనని బీజేపీ ఎంపీ బండి సంజయ్ కూడా అంగీకరించారని గుర్తు చేశారు. ఇంత జరిగిన తర్వాత కూడా ఇంకెన్నాళ్లు తెలంగాణ ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. సీఎం రమేశ్‌ను తానే చర్చకు తీసుకువస్తానని బండి సంజయ్ చెప్పిన నేపథ్యంలో.. తేలుకుట్టిన దొంగలా ఉండకుండా చర్చలకు ఎప్పుడు వెళ్తారో కేటీఆర్ చెప్పాలని డిమాండ్ చేశారు.

కౌశిక్‌రెడ్డికి ఇదే చివరి హెచ్చరిక

- ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కౌశిక్‌రెడ్డికి ఇదే చివరి హెచ్చరికని.. ఆయన కథలు ఎక్కువయ్యాయని వ్యాఖ్యానించారు. సాయికుమార్ ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి తన స్థాయి తెలుసుకోవాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



తీరంలో కేరింత

సముద్రంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు.. తీరాన ఆ అలలతో పోటీపడేలా యువతలో ఉత్సాహం.. ఆదివారం చల్లని సాయంత్రం వేళ విశాఖ ఆర్కే బీచ్ యువత కేరింతలతో పులకించి పోయింది. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పైరు పచ్చగా..

నాట్లు పూర్తి కావడంతో పంటపొలాలు పచ్చదనాన్ని సింగారించుకుంటున్నాయి. ఎరువులకోసం పడిగాపులు పడి దక్కించుకున్న రైతులు భుజాన ఎరువుల సంచులతో పొలంబాట పట్టారు. విజయవాడ శివారులోని గూడవల్లి వద్ద రైతులు పొలంలో ఎరువులు చల్లుతున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



శ్రావణ శోభ

పవిత్ర శ్రావణమాసం సందర్భంగా విశాఖ నగరంలో స్థిరపడిన మార్వాడీలు శోభాయాత్ర నిర్వహించారు. మురళీనగర్ నుంచి ఆర్కేబీచ్ వరకు ఈ శోభాయాత్ర కన్నులపండువగా సాగింది. పెద్ద సంఖ్యలో మార్వాడీలు ఈ శోభాయాత్రలో పాల్గొన్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం

పాములే ఆహారం.. వాగులే ఆవాసం

అత్యంత ప్రమాదకరం గిరినాగులు

పాపికొండల అభయారణ్యంలో సంచారం

- గిరినాగులు 14 నుంచి 20 అడుగుల పొడవు ఉంటాయి
- మగ గిరినాగులను ఆకర్షించేందుకు ఆడ గిరినాగులు ఫెర్మోన్స్ అనే రసాయన పదార్థానాన్ని వెదజల్లుతాయి. ఆ వాసన బట్టి మగ గిరినాగులు వాటిని అనుసరిస్తాయి
- గిరినాగులు రక్తపొడ, తాచుపాము, కట్లపాము, జెర్రిగొడ్డు వంటి పాములను ఆహారంగా స్వీకరిస్తాయి
- గిరినాగులు గుడ్లు పెట్టి 18 రోజులపాటు పొదుగుతాయి. 21వ రోజున పిల్లలు బయటకు వస్తాయి
- పాపికొండల అభయారణ్యంలోని జలతారువాగు ప్రాంతంలో వీటి సంచారం ఎక్కువగా ఉంది
- గిరినాగులు కాటు వేస్తే 10 నిమిషాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది



గిరినాగు (కింగ్ కోబ్రా) అత్యంత ప్రమాదకరమైన సర్పం. దట్టమైన అటవీ ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి. అరుదైన సర్పజాతికి చెందిన గిరినాగులకు ఇతర పాములే ఆహారం. వర్షాకాలంలో పాములను తినేందుకు ఇవి బయటకు వస్తుంటాయి. పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు సమీపంలో వీటి జాడ ఎక్కువగా ఉన్నట్టు అటవీ అధికారులు చెబుతున్నారు. అరుదైన గిరినాగులు కనిపిస్తే చంపవద్దని, తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

ఏలూరు, అల్లూరు సీతారామరాజు జిల్లాల మధ్య 1,01,200 హెక్టార్ల పరిధిలో పాపికొండల జాతీయ వన్య మృగ అభయారణ్యం విస్తరించి ఉంది. అరుదైన జంతు జాలానికి నిలయంగా ఉన్న ఈ అభయారణ్యంలో గిరినాగుల సంచారం ఎక్కువగా ఉంది. దట్టమైన అటవీ ప్రాంతాలకు పరిమితమయ్యే ఈ సర్పాలు అత్యంత విషపూరితం. అలాగే ఇవి అరుదుగా కనిపిస్తాయి. అయితే ఇటీవల ఇవి జనావాసాల్లోకి వస్తున్నాయి. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాల్లో గిరినాగులు కనిపించినట్టు రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా పాపికొండల అభయారణ్యంలోని జలతారు వాగు పరిసర ప్రాంతాలు వీటికి అడ్డాగా మారాయని వైల్డ్ లైఫ్ అధికారులు అంటున్నారు.


ఆహారం కోసం బయటకు..

మార్చి నుంచి జూలై వరకు గిరినాగులు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అటవీ ప్రాంతంలో జలవనరులు తగ్గినప్పుడు నీటి చెమ్మను వెతుక్కుంటూ బయటకు వస్తుంటాయి. రబీ సీజన్ అనంతరం ఇతర పాములు పొలాల్లో ఉండటంతో ఆహారం కోసం వాటిని వెతుక్కుంటూ గిరినాగులు వస్తుంటాయి. గతేడాది వర్షాకాలంలో బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం సమీపంలో, ఇనుమూరు, జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం అటవీ ప్రాంతంలో, ఇటీవల గడ్డపల్లి, ముంజులూరు, తంగేడికొండ, దారావాడ, కోంద్రుకోట అటవీ ప్రాంతాల్లో గిరినాగులు కనిపించినట్టు ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. పాపికొండల అభయారణ్యంలో గిరినాగులతో పాటు పది అడుగుల తాచుపాములు, రక్తపింజర వంటి ప్రమాదకరమైన పాములు కూడా ఉన్నాయి.

పట్టుకుని అడవిలో వదిలేస్తూ..

ఇటీవల కాలంలో వర్షాకాలంలోనూ గిరిజనులు పొలాల్లో సంచరిస్తున్నాయి. వీటి సమాచారం అందిస్తే ఫారెస్ట్ అధికారులు వాటిని పట్టుకుని మళ్లీ అటవీ ప్రాంతంలో వదిలేస్తున్నారు. ఇవి అరుదైన పాములు కావడంతో వాటి సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

–బుట్టాయగూడెం



20 అడుగుల పొడవు



గిరినాగు పాము చాలా ప్రమాదమైంది. 20 అడుగుల పైగా పొడవు ఉంటుంది. బాగా ముదిరిన పాము చాలా డేంజర్. నేను చాలాసార్లు వాటిని చూశాను. అటవీ ప్రాంతంలో పర్యటించినప్పుడు అవి కనిపిస్తే పరుగులు తీసేవాళ్లం.

–ఎస్.ప్రసాద్, బుట్టాయగూడెం

మనుషులపై దాడి చేయవు



గిరినాగులు సాధారణంగా మనుషులపై దాడి చేయవు. అయితే వాటిని భయపెట్టడం లేదా రెచ్చగొట్టడం చేస్తే కాలువేస్తాయి. ఇది చాలా విషపూరితమైన పాము. కాటు వేస్తే మరణమే తప్ప జీవించే అవకాశం ఉండదు. చాలా జాగ్రత్తగా ఉండాలి. –గంధం విక్టర్, బుట్టాయగూడెం

సమాచారం ఇవ్వండి



పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో గిరినాగులు కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వండి. ప్రాణభయంతో పాములను చంపవద్దు. మాకు సమాచారం ఇస్తే వాటిని పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేస్తాం. ఈ పాములు అరుదైనవి. అభయారణ్యంలో వణ్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

–ఎస్‌కే వల్లీ,
రేంజ్ అధికారి, పోలవరం

అత్యంత ప్రమాదకరం



గిరినాగులు అత్యంత ప్రమాదకరం. వీటిని పట్టుకోవడం అంత సులువు కాదు. పాపికొండలు, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి ప్రాంతాల్లో ఇవి కనిపిస్తున్నట్టు ఫోన్‌లు వస్తున్నాయి. గిరినాగు పాము కనిపిస్తే ఎవరూ చంపవద్దు. 8099855153 నంబర్‌కు ఫోన్ చేస్తే నేను పట్టుకుని అడవిలో వదిలేస్తా.

–చదలవాడ క్రాంతి,
స్నేక్ సేవియర్స్ సొసైటీ
వ్యవస్థాపకుడు, జంగారెడ్డిగూడెం

సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం అర్బన్: 'ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో రూ.1.50 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారు. 21సార్లు ఢిల్లీ పర్యటనకు వెళ్లి రాష్ట్రానికి ఏం సాధించారు? పోలవరం ఎత్తు తగ్గించినా నోరుమెదపరు... విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు సహకరిస్తున్నారు. సీఎం తీరు ఏమీ మారలేదు. అదే పరిపాలన.. అవే విధానాలు' అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. ఆయన ఆదివారం అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలోని ఏ రాష్ట్రమూ చేయని అప్పులు ఆంధ్రప్రదేశ్ చేస్తోందన్నారు. చంద్రబాబు ఢిల్లీ, సింగపూర్ పర్యటనల వల్ల రాష్ట్రానికి మేలు జరగకపోగా.. అప్పుల ఊబిలోకి నెడుతున్నారని విమర్శించారు. ఏడాది కాలంలో రూ.1.50 లక్షల కోట్లు అప్పు చేశారన్నారు. అమరావతి పేరుతో రూ.31 వేలు కోట్లు అప్పు తెచ్చారన్నారు. మరో రూ.31 వేల కోట్ల అప్పు చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌లో అభివృద్ధి ఎక్కడుందని ప్రశ్నించారు.

హామీలను నెరవేరుస్తాం

జల వనరులశాఖ మంత్రి నిమ్మల

ఓబులవారిపల్లె: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా మంగంపేట పునరావాస కాలనీలో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల మేర వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు, తల్లికి వందనం పథకం అందజేశామని తెలిపారు.

లిటిల్ బడ్స్ బర్త్‌డే.. ట్రెండీగా!

నెలకో పండగ.. ఏడాదికో ఉత్సవం

- సరికొత్తగా అలంకరణ
- విభిన్న థీమ్‌లతో నిర్వహణ
- ఏడాది పొడవునా సంబరాలు

రాజమహేంద్రవరం రూరల్: ఏ ఇంట అయినా క్యార్‌మని శబ్దం ఎప్పుడు వినిపిస్తుందా అని ఎదురుచూడని దంపతులు ఉండరు. ఆ రోజు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ. అది ఫలించిన నాడు ఆ ఇంట అంతకు మించిన పండగ ఏముంటుంది. ఆ బిడ్డ పెరుగుదలలో ప్రతి అంకం ఆ ఇంట ఓ ఉత్సవమై అలరారుతుంది. గత తరాల అమ్మమ్మల సంప్రదాయం.. నేటి అమ్మల ట్రెండీనెస్ కలగలసి బుజ్జాయిల పుట్టిన రోజులు థీమ్‌లుగా రూపాంతరం చెందుతున్నాయి. గత తరాల అమ్మమ్మలు శిశువు రెండో నెలలో నవ్వితే నువ్వుండలు చేసి పంచడం.. మూడో నెలలో బోర్లా పడితే బొబ్బట్లు చేసి సందడి చేయడం.. ఆరో నెలలో పాకడం మొదలుపెట్టగానే పరమాన్నం వండి నోరు తీపిచేయడం.. ఏడో నెల గడప దాటితే గారెలు వంటి సరదాగా దండ వేసి పంచడం.. పదో నెలలో అడుగులేస్తుంటే అరిసెలు వండడం.. అందరికీ తెలిసిందే. నేటికీ చాలా ఇళ్లలో ఈ సందడి కనిపిస్తున్నా వీటికి అదనంగా ప్రతి నెలా పుట్టినరోజు చేస్తూ తల్లిదండ్రులు మురిసిపోతున్నారు. అదికూడా ట్రెండీగా. ఏడాది పాటు ప్రతి నెలా ఒక్కో థీమ్‌తో పుట్టిన రోజును చేస్తున్నారు. ఆ పన్నెండు నెలల జ్ఞాపకాలను ఫొటో ఫ్రేమ్‌లు, వీడియోల రూపంలో క్రోడీకరించి మొదటి ఏడాది పుట్టినరోజును వైభవంగా నిర్వహిస్తూ బంధుమిత్రులకు చూపి, సోషల్ మీడియాలో పోస్టుచేసి లైక్‌లకు, కామెంట్లకు మురిసిపోతున్నారు. నయా బర్త్‌డే సెలబ్రేషన్స్‌పై 'సాక్షి' సండే స్పెషల్ స్టోరీ.



ప్రతి నెలా పండగే



మా గారాలపట్టి యశ్వి పుట్టిన రోజును ప్రతి నెలా ఓ వేడుకలా చేసుకుంటున్నాం. కుటుంబసభ్యులంతా కలిసి సందడి చేస్తాం. పిల్లల చిన్నప్పటి ఫొటోలు భద్రంగా ఉంచితే పెద్దయ్యాక చూసి మురిసిపోతారు. ప్రతినెల కొత్త బట్టలు వేసి ఒక్కో రకమైన వస్తువులు, ఇతర పండ్లతో నెలల నంబర్లు వేసి ఫొటోలు తీసుకుంటాం. ఏడాది పాటు ఈ ఫొటోలను భద్రపరచి ప్రదర్శిస్తాం.

– సుకీర్తి, సచివాలయ ఉద్యోగి, నగరం

ఒక మధుర జ్ఞాపకం



ప్రస్తుతం పిల్లల పుట్టిన రోజులు నెలవారీగా చేస్తూ ఫొటోలు తీయడం సంప్రదాయంగా మారింది. ఈ ఫొటోలు వారి శారీరక వృద్ధి, హావభావాలు, వ్యక్తిత్వ వికాసాలను నెలనెలా చిత్రీకరిస్తూ.. వారి ప్రగతిని కళ్లకు కడతాయి. ఇది కేవలం వయసు పెరిగిన రోజు కాదని, వారి బాల్యంలో అమూల్యమైన క్షణాలను పదిలం చేస్తాయి. – బి.హేమ, సైంటిస్ట్, రాజమహేంద్రవరం





కలకాలం గుర్తుండాలని...



బర్త్‌డేకి ఏడాది వరకు ఎదురు చూడడం ఎందుకని.. నెలనెలా ఒక్కో థీమ్‌తో మా పాపను రెడీ చేశా. ఫొటోలు తీసి భద్రంగా ఉంచా. పెద్దయ్యాక చూపిస్తే తను కూడా సంబర పడుతుంది. ఒకప్పుడంటే కెమెరామన్ వచ్చి ఫొటోలు తీసేవాడు. ఇప్పుడు ఫోన్‌లోనే ఫొటోలు తీసి ఎడిటింగ్ చేస్తున్నా. మంచి పాటను యాడ్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పెడితే చాలా లైక్‌లు, కామెంటు వస్తున్నాయి.

– వలవల దేదీప్య, గృహిణి, మోరంపూడి


రక్త పరీక్షలతో నిర్ధారణ



చింతూరు మండలం గవళ్లకోటకు చెందిన ఆరేళ్ల ఆమె పేరు సోడె భానుప్రియ. గత మూడ్రోజులుగా జ్వరంతో బాధపడుతుండటంతో చింతూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. అమెకు రక్త పరీక్షలు నిర్వహించగా మలేరియా జ్వరంగా నిర్ధారణ అయింది. రెండ్రోజులుగా ఆస్పత్రిలోనే ఉంటూ వైద్యం పొందుతున్నట్టు ఆమె తండ్రి గంగయ్య తెలిపాడు.

వణికిస్తున్న మలేరియా

- చాపకింద నీరులా విజృంభణ
- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం
- పెరుగుతున్న దోమల వ్యాప్తి
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో పెరుగుతున్న జ్వర పీడితులు
- రంపచోడవరం రెవెన్యూ డివిజన్‌లో 1,398 కేసుల నమోదు
- విలీన మండలాల్లో 151 హాట్‌స్పాట్లు గుర్తింపు





జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న చింతూరు ప్రభుత్వాస్పత్రి

చింతూరు: అల్లూరి జిల్లా రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో మలేరియా జ్వరాలు చాపకింద నీరులా విజృంభిస్తున్నాయి. రంపచోడవరం, చింతూరు డివిజన్లలో ఈ ఏడాది ఇప్పటివరకు 1,398 మలేరియా కేసులు నమోదు అయ్యాయి. వీటిలో రంపచోడవరం డివిజన్లో 883 , చింతూరు డివిజన్లో 515 కేసులు నమోదు అయినట్టు వైద్యారోగ్యశాఖ అధికారవర్గాలు తెలిపాయి.

- వాతావరణ మార్పులు, గ్రామాల్లో పారిశుధ్యం కొరవడటం తదితర కారణాల వల్ల దోమలు వృద్ధి చెంది, మలేరియాను వ్యాప్తి చేస్తున్నాయి. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు నిండిపోతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాలు చిత్తడిగా మారడం వల్ల దోమల ప్రభావం కూడా ఎక్కువగా ఉంది. గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుపర్చడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహిస్తునారన్న విమర్శలు ఉన్నాయి. చెత్త, చెదారంతో నిండిపోవడం, నీటి మడుగులు, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల కూడా మలేరియా దోమల లార్వా వ్యాప్తికి దోహదపడుతున్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్, డ్రైనేజీలను శుభ్రం చేయడం, చెత్త తొలగింపు, బ్లీచింగ్ చల్లించడంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నరన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విలీనంలో 151 హాట్ స్పాట్ల గుర్తింపు

మలేరియా కేసులు అధికంగా నమోదయ్యేందుకు అవకాశమున్న 151 హాట్‌స్పాట్ కేంద్రాలను చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో గుర్తించినట్లు వైద్యశాఖ అధికారులు తెలిపారు. గతేడాది రెండు కంటే ఎక్కువగా మలేరియా కేసులు నమోదైన ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించినట్లు వారు తెలిపారు. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాలను హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించి యాంటీలార్వా, ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. చింతూరు మండలంలో 64, వీఆర్‌పురం మండలంలో 39, ఎటపాక మండలంలో 21, కూనవరం మండలంలో 26 ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించారు.

పీహెచ్‌సీల వారీగా..

చింతూరు డివిజన్లో ఈ ఏడాది పీహెచ్‌సీల వారీగా తులసిపాకలో 96, మోతుగూడెం 126, ఏడుగురాళ్లపల్లి 75, కూటూరు 64, రేఖపల్లి 45, జీడిగుప్ప 44, కూనవరం 27, గొరిదేవిపేట 17, నెల్లిపాక 15, లక్ష్మీపురం ఆరు కేసులు నమోదయ్యాయి.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 85,740 మంది స్వామివారిని దర్శించుకోగా 35,555 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.41 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు విరాళం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదానం, గోసంరక్షణ ట్రస్టుకు దాతలు నగదు విరాళంగా అందజేశారు. తిరుపతికి చెందిన దాతలు కృష్ణమోహన్, పార్థసారథినాయుడు నిత్యాన్నదానానికి రూ.2 లక్షల నగదు విరాళంగా అందించారు. అలాగే గోసంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన పుష్పలత, శివప్రసాద్ రూ.లక్ష విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చూశారు.



వైభవంగా అంకాళమ్మ ఉత్సవం

పుత్తూరు: మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసిన శ్రీఅంకాళమ్మ ఆలయ వార్షిక మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. 10 గంటలకు అంబలి ప్రసాదం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన మహిళలు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

నృత్య సమ్మోహనం



చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు వీక్షకులను సమ్మోహితుల్ని చేశాయి. తొలుత 'గణేష పుష్పాంజలి' అంటూ సాగిన పాటతో మొదలై బ్రహ్మమొక్కటీ, గణేషస్తుతి, గణనాయక, ఓం శక్తి, అయిగిరి నందిని, అదివో అల్లదివో తదితర పాటలకు చిన్నారులు సాయిదీక్ష, భావన, గీషణశాన్వి, లక్ష్మీ హన్సిక, జనని, నాగభావన, మోక్షిత నాయుడు తదితరులు తమ నృత్యం, హావభావాలతో మంత్రముగ్ధుల్ని చేశారు.


అయోధ్య రామమందిరం

మనోరథ వీక్షణం

యూపీ... బిహార్... ఒడిశా... జార్ఖండ్... వెస్ట్‌బెంగాల్. ఈ టూర్‌లో... ఈ రాష్ట్రాలన్నింటినీ టచ్ చేయవచ్చు. రైలు ప్రయాణంలో మధ్యప్రదేశ్ కూడా పలకరిస్తుంది. గయలో విష్ణుపాదాన్ని దర్శించుకోవడంతో మొదలు. పూరీ జగన్నాథుడు... కోణార్క్ సూర్య భగవానుడు. గంగాసాగర కపిలమునీశ్వరుడు... కోల్‌కతా కాళిక. బైద్యనాథుడు... విశ్వనాథుడు... బాలరాముడు. వీరంతా పర్యటన ఆద్యంతం అలరించే దైవాలు. గంగలో పాద ప్రక్షాళనం సరయులో ముఖ ప్రక్షాళనం. పర్యాటకులను పునీతభావనలో ముంచే ధార్మికతలివి. మనోరథం ఆకాంక్షలను తీర్చే రైలు రథ యాత్ర ఇది.

ఐఆర్‌సీటీసీ నిర్వహించే భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్‌లో 'పూరీ కోల్‌కతా గంగాసాగర్ యాత్ర (ఎన్‌జెడ్‌బీజీ62)' చేయవచ్చు. ఆగ్రా కంటోన్మెంట్ నుంచి మొదలై తిరిగి అదే స్టేషన్‌కు చేరే ఈ పది రోజుల యాత్రలో గయ, గంగాసాగర్, కోల్‌కతా, పూరీ, కోణార్క్, బైద్యనాథ్, వారణాసి, అయోధ్యలను చూడవచ్చు. టికెట్ ధరలు కంఫర్ట్ కేటగిరీ (సెకండ్ ఏసీ)లో ఒక్కొక్కరికి 40 వేల మూడు వందలు, స్టాండర్డ్ కేటగిరీ (థర్డ్ ఏసీ)లో ఒక్కొక్కరికి 30 వేల ఐదు వందలు, ఎకానమీ క్లాస్ (స్లీపర్) లో ఒక్కొక్కరికి దాదాపు 19 వేల రూపాయలవుతాయి.



ఈ ట్రిప్ ఈ ఏడాది సెప్టెంబర్ 13వ తేదీ నుంచి మొదలవుతుంది. ప్యాకేజ్ కోడ్: https://www.irctctourism.com/tourpackageBooking?packageCode=NZBG62

1 వ రోజు ఉదయం ఆగ్రా కంటోన్మెంట్ స్టేషన్ నుంచి భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ బయలుదేరుతుంది. గ్వాలియర్, వీరాంగణ లక్ష్మీబాయ్, ఓర్చై, కాన్పూర్, లక్నో మీదుగా రాత్రికి అయోధ్య కంటోన్మెంట్ చేరుతుంది.

2 వ రోజు భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ తెల్లవారు జామున కాశీకి చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్ అవడం, రిఫ్రెష్‌మెంట్ తర్వాత గయలోని విష్ణుపాదం ఆలయం, స్థానిక ఆలయాల దర్శనం. రాత్రికి రైలెక్కి పూరీకి సాగిపోవడం.


ఫాల్గు తీరాన విష్ణుపాదం

విష్ణుపాద ఆలయం నిర్మాణపరంగా చాలా ప్రత్యేకం. ఇది బీహార్ రాష్ట్రంలో రాజధాని నగరం పట్నాకి వంద కిలోమీటర్ల దూరాన గయలో ఉంది. ఇక్కడ పిండప్రదానం చేస్తారు. రామాయణకాలంలో రాముడు, సీత ఈ ప్రదేశాన్ని సందర్శించారని చెబుతారు. ఇప్పుడు మనం చూస్తున్న ఈ నిర్మాణం దేవి అహల్యాబాయ్ హోల్కర్ నిర్మించిన ఆలయం. ఆమె ఇందోర్ రాణి. క్రీ.శ 1787లో ఫాల్గునది తీరాన ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్మాణం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టినప్పుడు మంచి రాయి కోసం అన్వేషణ జరిగింది. గయ జిల్లాలోని బథని గ్రామంలోని పర్వతం నుంచి చక్కటి బ్లాక్ గ్రానైట్‌ని గుర్తించారు. రాజస్థాన్ నుంచి శిల్పకారులను రప్పించారు. ఆ శిల్పకారులు ఆలయ నిర్మాణం కోసం నివసించిన గ్రామం పేరు పత్తర్‌కట్టి. ఇప్పుడదీ కూడా ఒక టూరిస్ట్ ప్లేస్. గయాసురుడు అనే రాక్షసుడిని విష్ణుమూర్తి హతమార్చిన ప్రదేశం అని స్థలపురాణం. ఆ సందర్భంలో విష్ణువు తన పాదాన్ని గయాసురుడి ఛాతీ మీద పెట్టి అతడిని అదిమేశాడని, ఆ ప్రదేశంలో భూమి మీద విష్ణువు పాద ముద్ర నిలిచిపోయిందని చెబుతారు. అందుకు ఆనవాలుగా పెద్ద పాదాన్ని చూపిస్తారు. గయ అనగానే బుద్ధుడు గుర్తుకు వస్తాడు. అయితే ఆ గయ ఈ గయ ఒకటి కాదు. ఈ గయకు పదిహేను కిలోమీటర్ల దూరాన బోధ్‌గయ ఉంది. అది బుద్ధుడికి జ్ఞానోదయమైన గయ అది. ఈ పర్యటనలో ఆ ప్రదేశాన్ని అక్కడి బోధివృక్షాన్ని, బుద్ధుని భారీ విగ్రహాన్ని, వివిధ దేశాల నమూనా బౌద్ధ చైత్యాలను చూడవచ్చు.


విష్ణుపాదం టెంపుల్


కాళీ మాత



విష్ణుపాదం


కోల్‌కతా కాళి టెంపుల్

3 వ రోజు మధ్యాహ్నానికి రైలు పూరీకి చేరుతుంది. జగన్నాథ ఆలయ దర్శనం, రాత్రి బస రైల్లోనే. రైలు పూరీ స్టేషన్‌లోనే ఉంటుంది.

సర్వం పూరీ జగన్నాథం

జగన్నాథ ఆలయం ఒడిశా రాష్ట్రం, పూరీ పట్టణంలో ఉంది. పురాణ కాలం నుంచి ఇక్కడ ఆలయం ఉంది. ఈ ఆలయంలో శ్రీకృష్ణుడితోపాటు అతడి అన్న బలభద్ర (బలరాముడు), చెల్లి సుభద్రల విగ్రహాలు పూజలందుకుంటాయి. ఇక్కడి దేవతా విగ్రహాలు రాతివి కాదు, దారు శిల్పాలు. మాల్వ రాజు ఇంద్రద్యుమ్నుడు ఆలయ నిర్మాణం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టినప్పుడు శ్రీకృష్ణుడు కలలో కనిపించి సముద్రంలో తేలుతూ వచ్చిన కర్రదుంగతో విగ్రహాలు చేయించమని చెప్పాడని, ఆ మేరకు రాజు బంగాళాఖాతం తీరంలో ఎదురు చూడగా ఒక వేప దుంగ కొట్టుకు వచ్చిందని, దానిని సేకరించి విగ్రహాలు తయారు చేయించాడని చెబుతారు. ఇప్పుడు మనం చూస్తున్న నిర్మాణాన్ని క్రీ.శ పదకొండవ శతాబ్దంలో తూర్పు గంగ వంశానికి చెందిన అనంత వర్మన్ చోడగంగ నిర్మించాడు. ఈ ఆలయంలో పూజాదికాలు నిర్వహించేది భిల్లు శబర జాతి ఆదివాసీలు. పూరీ జగన్నాథుని రథయాత్ర దేశమంతటా ప్రసిద్ధి. సర్వజన సమానత్వానికి ప్రతీక ఈ ఆలయం. కులాలు, జాతులు, పేదగొప్ప తేడా లేకుండా భక్తులంతా సమానమే. ఈ ఆలయం గొప్పదనం పాటించడం. అయితే ఈ ఆలయంలోకి హిందూయేతరులకు ప్రవేశం ఉండదు. విదేశీయులతోపాటు భారతీయ జైనులు, సిక్కులు, బౌద్ధులకు కూడా ప్రవేశం నిషిద్ధమే. ఈ విషయమై అనేక చర్చలు, వాదప్రతివాదాలు జరుగుతున్నాయి. కొన్ని నియమాలననుసరించి ప్రవేశం కల్పించవచ్చనే సడలింపు ప్రతిపాదన కూడా వచ్చింది. కానీ అవేవీ ఇంకా పూర్తి స్థాయిలో అమల్లోకి రాలేదు.



పూరి జగన్నాథ టెంపుల్



పూరి జగన్నాథ యాత్ర

4 వ రోజు కోణార్క్ ఆలయ దర్శనం తర్వాత రైలు కోల్‌కతాకు బయలుదేరుతుంది.

కోణార్క రథాలయం

రథం ఆకారంలో ఉన్న ఈ సూర్యదేవాలయం ఒక ఖగోళ విజ్ఞాన భండారం. క్రీ.శ 13వ శతాబ్దం నాటి ఈ ఆలయ నిర్మాణ కౌశలం దాడుల్లో ధ్వంసమైపోగా మిగిలిన ఉన్న ఆనవాళ్లలో నాటి శిల్పుల నైపుణ్యాన్ని వెతుక్కుంటూ ఆనందించడమే మిగిలింది. యునెస్కో ఈ ఆలయాన్ని హెరిటేజ్ సైట్‌గా గుర్తించింది. ప్రస్తుతం ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహణలో మెరుగులు దిద్దుకుంటోంది. ఈ సూర్యదేవాలయం ఒడిశా, పూరీ జిల్లాలో ఉంది కోణార్క్ లో ఉంది. ఈ ప్రాంగణంలోని ఛాయాదేవి ఆలయం కూడా అద్భుతమైన నిర్మాణమే. ధ్వంసమైపోయిన వైష్ణవాలయం శిథిలాలను దగ్గరగా వెళ్లి చూస్తే నాటి ఇటుకల సైజు, వాస్తుశైలి అర్థమవుతాయి. ఇక్కడ ప్రదర్శించే లేజర్ షోలో ధ్వంసమైన ఆలయాల పూర్తి రూపాన్ని చూడవచ్చు.




కోణార్క్ టెంపుల్

5 వ రోజు ఉదయం రైలు కోల్‌కతాకు చేరుతుంది. రైలు దిగి గంగాసాగర్‌కు ప్రయాణం. కపిలముని ఆశ్రమం పర్యటన తర్వాత రాత్రి బస గంగాసాగర్‌లో.

గంగ భూమ్మీదకొచ్చింది

పురాణాల్లో కపిలముని గురించి చాలామందికి తెలిసే ఉంటుంది. ఎందుకంటే గంగ భూమ్మీదకు రావడానికి కారణభూతులు కపిలముని. స్థానిక కథనాల ప్రకారం ఆ కపిలముని ఆశ్రమమే ఇది. స్థానిక రాజు సాగరుడు అశ్వమేధ యాగాశ్వాన్ని వదిలాడు. ఆ గుర్రాన్ని ఇంద్రుడు అపహరించి దానిని కపిలముని ఆశ్రమ ప్రాంగణంలో కట్టి వేసి తాను దాక్కున్నాడు. అశ్వం కోసం రాజు తన అరవైవేల మంది కొడుకులను పంపించాడు. వారు అశ్వాన్ని వెదకుతూ వచ్చి కపిలముని ఆశ్రమంలో గుర్తించారు. కపిలముని అశ్వాన్ని దొంగలించాడని ఆరోపించారు. దాంతో ఆగ్రహించిన కపిలముని వారిని తన తపశ్శక్తితో భస్మం చేశాడు. వారి ఆత్మలు నరకంలో కొట్టుమిట్టాడుతున్నాయని, వారిని స్వర్గానికి పంపించాలంటే ఎలా అని మునిని అడిగినప్పుడు... గంగ దివి నుంచి భువికి దిగి వచ్చి చితాభస్మాలను తడుపుతూ ప్రవహించినప్పుడు వారికి శాపవిమోచనం జరుగుతుందని చెప్పాడు. సాగరుడి వంశంలో తరువాతి తరాలకు చెందిన భగీరథుడు ఆ పనికి పూనుకున్నాడు. భగీరథుడి ప్రయత్నంతో గంగ నేలకు దిగి వచ్చిన ప్రదేశమే ఈ గంగాసాగర్. గంగ భూమ్మీదకు వచ్చిన రోజు మకర సంక్రాంతి. అందుకే ఏటా మకర సంక్రాంతి రోజు ఇక్కడ గంగా మాతకు విశేష పూజలు చేస్తారు. కపిల ముని ఆశ్రమం వెస్ట్‌బెంగాల్, సౌత్ 24 పరగణాస్ జిల్లా, గంగాసాగర్ గ్రామంలో ఉంది.


కపిల ముని ఆశ్రమం

6 వ రోజు గంగాసాగర్ నుంచి కోల్‌కతాకు రావడం. కాళీమాత ఆలయ దర్శనం. రాత్రికి రైలెక్కిన తర్వాత రైలు జసిదిహ్ వైపు సాగిపోతుంది.

కాళిక శక్తిపీఠం

కాళీమాత ఆలయం కలకత్తా కాళిగా దేశమంతటికీ ప్రసిద్ధి. ఇది 51 శక్తిపీఠాల్లో ప్రత్యేకమైన శక్తిపీఠం. వెస్ట్‌బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో ఉంది. ఈ ఆలయం ఆదిగంగానది తీరాన ఉంది. ఆది గంగా నది అంటే గంగోత్రిలో ఉద్భవించిన గంగానది కాదు. ఇది హూగ్లీ నది మూల స్థానం. ప్రస్తుతం మనం చూస్తున్న ఆలయం రెండు వందల యేళ్ల కిందట నిర్మించినది. కాళీమాత మొదట గుడిసె వంటి చిన్న కప్పుతో కూడిన నిర్మాణం ఉండేది. కాళీ మాత విగ్రహం మనిషి ఆకారంలో ఉండదు. ఒక రాతికి మూడు విశాలమైన బంగారు కళ్లు, పొడవైన నాలుక, నాలుగు చేతులు ఉంటాయి. కాళీమాత ఆకారం ఇలా ఉండడానికి కారణంగా ఒక కథనం చెబుతారు. శివుడు తాండవం చేసి సతీదేవి దేహాన్ని భుజాన వేసుకుని పయనిస్తున్న సమయంలో ఆమె కుడికాలి బొటనవేలు దేహాన్ని వీడి కింద పడిపోయిందని, ఆ వేలు పడిన ప్రదేశం ఇదని చెబుతారు. అందుకే కాళికామాత విగ్రహం మనిషి రూపంలో ఉండదు, బొటనవేలి ఆకారంలోనే ఉంటుంది. ఈ ఆలయ వీక్షణానికి కేవలం దర్శనం చేసుకుని వచ్చే సమయాన్ని మాత్రమే కేటాయించుకుంటే సరిపోదు. కాళికా మాత ఆలయం లోపల నట్ మందిర్, జోర్ బంగ్లా, సోస్థి తాలా, హర్‌కాత్ తాలా, రాధాకృష్ణ ఆలయం, నకులేశ్వర్ మహాదేవ్‌ఆలయం, కాకు కుండ్‌లు ఉంటాయి. ప్రశాంతంగా దర్శనం చేసుకుని, ఆధ్యాత్మికతను ఆస్వాదించాలంటే మూడు గంటల సమయం పడుతుంది.

7 వ రోజు తెల్లవారు జామున రైలు జసిదిహ్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్ అవడం. ఆ తర్వాత వైద్యనాథ్ ఆలయ దర్శనం. రాత్రికి రైలెక్కిన తర్వాత రైలు వారణాసికి సాగిపోతుంది.

జార్ఖండ్ బైద్యనాథుడు

దక్షిణాది వాళ్లకు బైద్యనాథ ఆలయం అనగానే మహారాష్ట్ర, పర్లిలో ఉన్న బైద్యనాథ ఆలయమే గుర్తుకు వస్తుంది. ఇది జార్ఖండ్, సంతాల్ పరగణా, దియోఘర్‌లో ఉన్న బైద్యనాథ ఆలయం. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఇదొకటి. పురాణాల ప్రకారం రావణాసురుడు హిమాలయాల్లో శివుని కోసం తపస్సు చేశాడు. శివుడు ఎంతకీ ప్రత్యక్షం కాకపోవడంతో తన ఒక్కో తలనూ ఖండిస్తూ తొమ్మిది తలలను ఖండించుకున్నాడు. చివరికి పదవ తలను ఖండించబోతున్న క్షణంలో శివుడు ప్రత్యక్షమై వరమిస్తాడు. కోరిన కోరికలు తీర్చే కామ్న లింగాన్ని ప్రసాదిస్తే దానిని శ్రీలంకకు తీసుకెళ్తానని అడుగుతాడు రావణుడు. అలాగే శివుడు కామ్నలింగాన్నిస్తాడు. శ్రీలంక వెళ్లే వరకు మధ్యలో ఎక్కడా నేల మీద పెట్టకూడదనే నియమాన్ని కూడా చెబుతాడు. కామ్నలింగంతో బయలుదేరిన రావణాసురుడు జార్ఖండ్, దియోఘర్‌లో ఈ ప్రదేశానికి వచ్చేటప్పటికి సంధ్యాక్రతువుల సమయమవుతుంది. ఒక గొర్రెల కాపరికి ఆ లింగాన్ని ఇచ్చి తాను వచ్చే వరకు నేల మీద పెట్టవద్దని కోరుతాడు. అలాగేనని తీసుకున్న ఆ పశువుల కాపరి రావణాసురుడు రావడం ఆలస్యం కావడంతో ఆ శివలింగాన్ని నేల మీద పెట్టి వెళ్లిపోతాడు. భయంకరమైన వర్షం కారణంగా రావణాసురుడు తిరిగి రావడం ఆలస్యమైంది. ఆ అకాలవర్షానికి కారణం విష్ణువు మాయోపాయమేనని గ్రహిస్తాడు. ఆ లింగాన్ని పెకలించి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తాడు, కానీ సాధ్యం కాదు. ఇక చేసేదేమీ లేక వెళ్లిపోతాడు. ఆ కామ్న లింగం ఉన్న ప్రదేశం కావడంతో దీనికి జ్యోతిర్లింగ క్షేత్రమైంది.

8 వ రోజు ఉదయానికి వారణాసికి చేరుతుంది. విశ్వనాథుని దర్శనం తర్వాత రాత్రి బస వారణాసిలో.

లయకారుని నిలయం

కాశీ విశ్వనాథుని జ్యోతిర్లింగ దర్శనం, గంగాహారతి వీక్షణంతోపాటు విశాలాక్షి, అన్నపూర్ణ, వారాహి అమ్మవార్ల ఆలయాలు, కాలభైరవ మందిరాలను కూడా దర్శించుకోవాలి. వీటన్నింటికీ ప్రత్యేకమైన ప్రాశస్త్యం ఉంది. మనం ఇప్పుడు చూస్తున్న విశ్వనాథుడి మందిరం కొత్తది. యూపీలో ఉన్న ఈ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ప్రాచీన కాలం నుంచి ప్రాచుర్యంలో ఉంది. అప్పట్లో ఈ ఆలయం అసలు పేరు ఆది విశ్వేశ్వరాలయం. భారత్ మీదకు దండెత్తి వచ్చిన మహమ్మద్ ఘోరీ ఈ ఆలయాన్ని ధ్వంసం చేశాడు. ఆ తర్వాత అక్బర్ ఆస్థానంలో ఉన్న మొదటి మాన్‌సింగ్, తోడరమల్‌లు దీనిని పునర్నిర్మించారు. 17వ శతాబ్దం అంటే ఔరంగజేబు పాలన కాలంలో మరోసారి ఆటుపోట్లను ఎదుర్కొన్నదీ ఆలయం. హిందూ ఆలయాన్నింటినీ కూల్చేయమన్న ఆదేశం మేరకు జరిగిన విధ్వంసంలో ఇది ప్రాభవాన్ని కోల్పోయింది. ఈ ప్రాంగణంలో జ్ఞానవాపి మసీదు వెలిసింది. 18వ శతాబ్దంలో ఇందోర్ రాణి అహిల్యాబాయ్ హోల్కర్ పునర్నిర్మించారు. ఇప్పుడు చూస్తున్న నిర్మాణం విశాలంగా అధునాతనంగా ఉంది. దీనిని 2021లో విస్తరించారు. లయకారుని ఆలయం ఇన్ని దఫాలుగా లయమైపోతూ తిరిగి ఆలయంగా మారుతూ వచ్చింది.


కాశీ విశ్వనాథాలయం

9 వ రోజు ఉదయం రైలు అయోధ్యవైపు సాగుతుంది. అయోధ్యలో రామజన్మభూమి, హనుమాన్ గరితోపాలు ఇతర ఆలయాల దర్శనం. సరయు నదిలో హారతి. ఆ తర్వాత తిరుగు ప్రయాణం మొదలైనట్లే.

రామ్‌లల్లా

ఏడాదిన్నరగా దేశం నలుమూలల నుంచి పర్యాటకులను ఆకర్షిస్తున్న ఆలయం రామ్‌లల్లా ఆలయం. అదే అయోధ్య రామమందిరం. రోజుకు లక్ష మంది దర్శించుకుంటున్నారు. ఆ సంఖ్య పర్వదినాల్లో ఒకటిన్నర లక్షకు చేరుతోంది. బాబర్ కాలంలో మసీదు రూపం సంతరించుకుని, బ్రిటిష్ పాలనకాలం తర్వాత స్వతంత్ర భారతంలో ప్రతీకాత్మకంగా రాముడు, సీత విగ్రహాలను ప్రతిష్ఠించుకుని, ముప్పై మూడేళ్ల కిందట విధ్వంసానికి గురయ్యి న్యాయస్థానం తీర్పుతో తిరిగి రూపుదిద్దుకున్న ఆలయం ఇది. ఇందులో ప్రతిష్ఠించిన బాలరాముడి విగ్రహం ఆకట్టుకుంటుంది. దర్శించుకున్న ప్రతి ఒక్కరూ తమ ఇంటి బిడ్డగా భావించేటట్లు ఉంటుంది రాముడి రూపం. కళ్లు మూసుకుని మొక్కుకోవడమే కాకుండా కళ్లారా చూడాల్సిన రూపం. ఆలయ నిర్మాణం కూడా అంతే విశిష్టంగా ఉంటుంది. ఆ తర్వాత హనుమాన్ ఘరి దర్శనం, సరయు తీర విహారం ఆహ్లాదకరంగా సాగుతాయి.


అయోధ్య రాముడు


10 వ రోజు ఉదయానికి భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్ లక్నోకు చేరుతుంది. అదే రోజు అంటే 22వ తేదీన కాన్పూర్, ఓర్చై, వీరాంగణ లక్ష్మీబాయ్, గ్వాలియర్, ఆగ్రా కంటోన్మెంట్‌కు చేరడంతో పర్యటన పూర్తవుతుంది.

గమనిక: లక్నో, కాన్పూర్, ఓర్చై, వీరాంగణ లక్ష్మీబాయి, గ్వాలియర్ స్టేషన్‌ల మీదుగా పర్యటన సాగుతుంది. ఇక్కడి పర్యాటక ప్రదేశాల సందర్శన ఈ ప్యాకేజ్‌లో లేదు. ఈ టూర్‌లో బుక్ చేసుకున్న పర్యాటకులు ఆగ్రా స్టేషన్‌కు వెళ్లాల్సిన తప్పనిసరేమీ ఉండదు. పై స్టేషన్‌లలో ఎక్కడైనా రైలెక్క వచ్చు, దిగవచ్చు.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి


అయోధ్యలోని సరయూ నది

ఐఆర్‌సీటీసీ నిర్వహించే భారత్ గౌరవ్ టూరిస్ట్ ట్రైన్‌లో 'పూరీ కోల్‌కతా గంగాసాగర్ యాత్ర (ఎన్‌జెడ్‌బీజీ62)' చేయవచ్చు. ఆగ్రా కంటోన్మెంట్ నుంచి మొదలై తిరిగి అదే స్టేషన్‌కు చేరే ఈ పది రోజుల యాత్రలో గయ, గంగాసాగర్, కోల్‌కతా, పూరీ, కోణార్క్, బైద్యనాథ్, వారణాసి, అయోధ్యలను చూడవచ్చు. టికెట్ ధరలు కంఫర్ట్ కేటగిరీ (సెకండ్ ఏసీ)లో ఒక్కొక్కరికి 40 వేల మూడు వందలు, స్టాండర్డ్ కేటగిరీ (థర్డ్ ఏసీ)లో ఒక్కొక్కరికి 30 వేల ఐదు వందలు, ఎకానమీ క్లాస్ (స్లీపర్) లో ఒక్కొక్కరికి దాదాపు 19 వేల రూపాయలవుతాయి. ఈ ట్రిప్ ఈ ఏడాది సెప్టెంబర్ 13వ తేదీ నుంచి మొదలవుతుంది. ప్యాకేజ్ కోడ్: https://www.irctctourism.com/tourpackageBooking?packageCode=NZBG62



ప్రపంచంలో ఎనిమిదవ అద్భుతం చక్రవడ్డీ[illegible]
దాని[illegible]అర్థం చేసుకున్నవాడు సంపాదిస్తాడు.
అర్థం చేసుకోనివాడు చెల్లిస్తాడు. [illegible]కొయెనికన్, ప్రఖ్యాత రచయిత
- అల్బర్ట్ ఐన్‌స్టీన్, విఖ్యాత భౌతిక శాస్త్రవేత్త



ఫెడ్ పాలసీ, ఫలితాలు కీలకం

- రేపు యూఎస్ ఫెడ్ రేట్ల సమీక్ష
- జీడీపీ, ఉపాధి గణాంకాలు సైతం
- దేశీ కార్పొరేట్ల క్యూ1కూ ప్రాధాన్యం
- గురువారం ఎఫ్అండ్‌వో ముగింపు
- ఈ వారం మార్కెట్లపై నిపుణుల విశ్లేషణ

దేశీ స్టాక్ మార్కెట్లను ఈ వారం పలు దేశ, విదేశీ అంశాలు ప్రభావితం చేయనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. మంగళవారం యూఎస్ కేంద్ర బ్యాంకు రేట్ల సమీక్ష, జీడీపీ, ఉపాధి గణాంకాలు వెలువడనున్నాయి. దేశీయంగా నేడు(28న) జూన్ పారిశ్రామికోత్పత్తి వివరాలు తెలియనున్నాయి. అంతేకాకుండా ఈ వారం మరిన్ని కంపెనీల క్యూ1 ఫలితాల వెల్లడికానున్నాయి. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్

దేశీయంగా నేడు జూన్ నెలకు పారిశ్రామికోత్పత్తి(ఐఐపీ) గణాంకాలు విడుదలకానున్నాయి. మే నెలలో ఐఐపీ వార్షికంగా 1.2 శాతం పుంజుకుంది. ఇక మరోవైపు ఇప్పటికే జోరందుకున్న కార్పొరేట్ల తొలి త్రైమాసిక(క్యూ1) ఫలితాల సీజన్ కొనసాగనుంది. ఈ వారం క్యూ1(ఏప్రిల్–జూన్) పనితీరు ప్రకటించనున్న జాబితాలో 28న ఇండస్ఇండ్ బ్యాంక్, అదానీ గ్రీన్ ఎనర్జీ, టోటల్ గ్యాస్‌సహా.. భారత్ ఎలక్ట్రానిక్స్, టొరెంట్ ఫార్మా, గెయిల్ ఇండియా, మజగావ్ డాక్ షిప్, వారీ ఎనర్జీస్, ఉన్నాయి. ఇదే విధంగా 29న ఎల్అండ్‌టీ, ఎన్‌టీపీసీ, ఏషియన్ పెయింట్స్, హ్యుందాయ్ మోటార్స్, ఇండస్ టవర్స్, కేన్స్ టెక్నాలజీ, కేపీ ఐటీ టెక్, 30న హెచ్‌యూఎల్, సన్ ఫార్మా, ఎంఅండ్ఎం, మారుతీ సుజుకీ, కోల్ ఇండియా, అంబుజా సిమెంట్స్, ఐషర్, టీవీఎస్ మోటార్, స్విగ్గీ, డాబర్ ఇండియా, ఆగస్ట్ 1న ఐటీసీ, టాటా పవర్, గోద్రెజ్ ప్రాపర్టీస్, జీఎస్‌కే ఫార్మా, ఎంసీఎక్స్, హనీవెల్ ఆటోమేషన్, ఎల్ఐసీ హౌసింగ్ జాబితాలో చేరాయి.

ఎఫ్అండ్‌వో ముగింపు

జూన్ నెల డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు గురువారం(31న) ముగియనుంది. ఇవికాకుండా జూన్ నెలకు ఆటో అమ్మకాలు, టెలికం సబ్‌స్క్రయిబర్ల వివరాలు తదితర గణాంకాలు సైతం ఈ వారం వెలువడనున్నాయి. ఇటీవల దేశీ స్టాక్స్‌లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) నికరంగా అమ్మకాలు చేపడుతున్నారు. వీటితోపాటు థాయ్‌లాండ్, కాంబోడియా వివాదాలు, ప్రపంచ మార్కెట్ల తీరు.. తదితర అంశాలన్నిటిపైనా ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. వెరసి ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లలో ఆటుపోట్లు నెలకొనవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలియజేశారు.

ట్రేడ్ డీల్స్‌పై కన్ను

భారత్‌సహా పలు దేశాలపై యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ అదనపు వాణిజ్య సుంకాలను విధించిన విషయం విదితమే. వీటిపై సస్పెన్షన్ గడువు ఆగస్ట్ 1న ముగియనున్న నేపథ్యంలో యూఎస్‌తో వాణిజ్య ఒప్పందాలు కీలకంగా నిలవనున్నట్లు స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ సాంకేతిక నిపుణులు ప్రవేశ్ గౌర్ అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం సెంటిమెంటుపై ప్రభావం చూపనున్నట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. ఈ వారం మార్కెట్లు కన్సాలిడేషన్ బాటలో సాగే వీలున్నట్లు అంచనా వేశారు.

ఫెడ్ నిర్ణయాల ఎఫెక్ట్

యూఎస్ ఫెడ్ 29న పాలసీ సమీక్ష చేపట్టనుంది. ఉపాధి సంబంధ గణాంకాలు సైతం వెలువడనున్నాయి. 30న క్యూ2(ఏప్రిల్–జూన్) జీడీపీ ముందస్తు గణాంకాలు వెల్లడికానున్నాయి. గత పాలసీ సమీక్షలో ఫెడ్ యథాతథ వడ్డీ రేట్ల అమలుకే కట్టుబడింది. ఈసారి కూడా రేట్లలో మార్పులు చేపట్టకపోవచ్చని, సెప్టెంబర్‌కు వాయిదా వేయవచ్చని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు.

సాంకేతికంగా..

2024 అక్టోబర్ తదుపరి ఎన్ఎస్ఈ ఇండెక్స్ నిఫ్టీ వరుసగా నాలుగో వారమూ నష్టాలతో ముగిసిన నేపథ్యంలో ఈ వారం సైతం మార్కెట్లు మరింత క్షీణించవచ్చని సాంకేతిక నిపుణులు అంచనా వేశారు. నిఫ్టీ బలహీనపడితే 24,790, 24,620 పాయింట్ల వద్ద మద్దతు లభించవచ్చని భావిస్తున్నారు. ఇంతకంటే నీరసిస్తే 24,480 వద్ద సపోర్ట్ ఉందని పేర్కొన్నారు. ఒకవేళ బలపడితే.. స్వల్ప కాలానికి 25,200, 25,300 పాయింట్లస్థాయిలో అవరోధాలు ఎదురుకావచ్చని విశ్లేషించారు.

గత వారమిలా..

గత వారం(21–25) దేశీ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగోసారి నికరంగా నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 295 పాయింట్లు(0.4 శాతం) డీలాపడి 81,463 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ సైతం 131 పాయింట్లు(0.5 శాతం) నీరసించి 24,837 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్స్ మరింత అధికంగా 1.5% స్థాయిలో నష్టపోయాయి.

ప్రాధాన్యరంగ రుణాల విక్రయం

- మార్జిన్లపై ఒత్తిడిని అధిగమిస్తాం
- కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు



న్యూఢిల్లీ: అధికంగా ఉన్న ప్రాధాన్యరంగ రుణాల్లో కొంత వరకు ప్రస్తుత త్రైమాసికంలో (జూలై–సెప్టెంబర్) విక్రయించనున్నట్టు కెనరా బ్యాంక్ ఎండీ, సీఈవో కె.సత్యనారాయణ రాజు తెలిపారు. వడ్డీ రేట్లు తగ్గడం కారణంగా మార్జిన్లపై పడే ఒత్తిళ్లను ఈ రూపంలో అధిగమిస్తామన్నారు. జూన్ త్రైమాసికంలో ప్రాధాన్యరంగ రుణాల విక్రయం రూపంలో రూ.1,248 కోట్ల కమీషన్‌ను కెనరా బ్యాంక్ ఆర్జించడం గమనార్హం. అయినప్పటికీ ప్రాధాన్యరంగ రుణాలు నియంత్రణ పరిమితి 40% కంటే అధికంగా 45.63% స్థాయిలో ఉన్నట్టు సత్యానారాయణ రాజు చెప్పారు. మార్కెట్లో ప్రాధాన్య రంగ రుణాలకు డిమాండ్ ఉండటూ.. దీన్ని అనుకూలంగా మలుచుకుంటామన్నారు. ఆర్‌బీఐ 1% మేర రెపో రేటును తగ్గించడంతో నికర వడ్డీ మార్జిన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ముందు పేర్కొన్న విధంగా 2.75 శాతాన్ని సాధించడం కష్టమేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ద్రవ్యోల్బణం 3% లోపు కొనసాగితే మరో విడత రేట్ల కోత ఉండొచ్చన్నారు. కనుక ప్రస్తుత త్రైమాసికంపై ఒత్తిళ్లు ఉంటాయంటూ.. క్యూ3, క్యూ4లలో కొంత పురోగతి ఉండొచ్చని అంచనా వేశారు. రెండు సబ్సిడరీల్లో వాటాల విక్రయంతో వెసులుబాటు లభిస్తుందన్నారు. రెండింటిలో ఒక దానిని ప్రస్తుత త్రైమాసికంలో, మరొకటి వచ్చే త్రైమాసికంలో లిస్ట్ కానున్నట్టు చెప్పారు. కెనరా రొబెకో ఏఎంసీ, కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్‌లను ఐపీవోకు తీసుకొచ్చే ప్రణాళికల్లో బ్యాంక్ ఉండడం గమనార్హం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

28-7-2025	
విశాఖ	465-00
చిత్తూరు	483-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	455-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

ప్యాసివ్ పెట్టుబడులకు ఆదరణ

ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్‌లతో మరింత అందుబాటులోకి

వందన త్రివేది



హెడ్ (ఇనిస్టిట్యూషనల్ బిజినెస్, ప్యాసివ్స్), యాక్సిస్ ఏఎంసీ



గత కొన్నేళ్లుగా, దేశీయంగా ప్యాసివ్ తరహా పెట్టుబడులకు ఆదరణ పెరుగుతోంది. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ తాజా నివేదిక ప్రకారం 2025 జూన్ నాటికి ప్యాసివ్ ఫండ్స్‌లో ఇన్వెస్టర్ల ఏయూఎం రూ. 12 లక్షల కోట్లుగా ఉంది. ఇది నెలవారీగా 3% వృద్ధిని, మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ ఏయూఎంలో (నిర్వహణలోని ఆస్తులు) 17 శాతాన్ని ప్రతిబింబిస్తుంది. సంపద సృష్టి విషయంలో భారతీయ ఇన్వెస్టర్ల ధోరణుల్లో ఫండమెంటల్‌గా చోటు చేసుకుంటున్న మార్పునూ సూచిస్తోంది. ఒకప్పుడు చాలా నైపుణ్యాలు అవసరమయ్యే లేదా అనుబంధ వ్యూహంగానో పరిగణించిన ప్యాసివ్ ఇన్వెస్ట్‌మెంట్ వ్యూహాలు ఇప్పుడు క్రమంగా ఇన్వెస్టర్ పోర్ట్‌ఫోలియోల్లో కీలక భాగంగా మారుతున్నాయి. సరళంగా, పారదర్శకంగా, తక్కువ ఖర్చులతో కూడుకున్నవిగా ఉండటం వల్లే కొత్త తరం ఇన్వెస్టర్లకు ఇవి బాగా ఆకర్షణీయంగా ఉంటున్నాయి.

క్రమంగా ముందుకు ..

భారత్‌లో ప్యాసివ్ ఇన్వెస్టింగ్ ప్రస్థానమనేది క్రమంగా, అనేక మైలురాళ్లను అధిగమిస్తూ ముందుకు సాగుతోంది. 2010 తొలినాళ్లలో రిటైల్ ఇన్వెస్టర్లకు ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ అనేవి అంతగా తెలియదు. ప్రధానంగా నిఫ్టీ50, బీఎస్ఈ సెన్సెక్స్ ఆధారితమై, ప్రోడక్టు పరిధి చాలా పరిమితంగా ఉండేది. ప్యాసివ్ ఇన్వెస్టింగ్‌పై ఇన్వెస్టర్లకు పెద్దగా అవగాహన ఉండేది కాదు. సంప్రదాయ యాక్టివ్ ఫండ్స్ వైపే మొగ్గు చూపే వారు. దీనితో ప్యాసివ్ ఫండ్స్ పక్క వాయిద్యాలుగానే ఉండిపోయేవి. అయితే, ఈటీఎఫ్‌ల ద్వారా డిజిన్వెస్ట్ చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో పాటు ఈక్విటీ ఈటీఎఫ్‌లలో ఇన్వెస్ట్ చేయాలన్న ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయంతో ప్యాసివ్ ఇన్వెస్టింగ్‌పై ఫోకస్ పెరిగింది. నియంత్రణ సంస్థ సెబీ కూడా ఈ తరహా ఇన్వెస్టింగ్, నిర్వహణను సరళతరం చేసేలా మార్గదర్శకాలను రూపొందించింది. ఫలితంగా మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ఇప్పుడు విస్తృత స్థాయిలో ప్యాసివ్ ఫండ్స్‌ను అందిస్తున్నాయి. ఇక, ఫిన్‌టెక్ ప్లాట్‌ఫాంలు పెరగడం కూడా ఈ ప్రోడక్టులు మరింతగా అందుబాటులోకి రావడానికి తోడ్పడింది. ఇన్వెస్టర్లు ఇప్పుడు యాప్‌ల ద్వారా సులువుగా ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్‌ను కొనుక్కోగలుగుతున్నారు. ట్రాక్ చేయగలుగుతున్నారు. ఆ విధంగా ఇన్వెస్టింగ్ మరింత అందుబాటులోకి, యూజర్లకు మరింత అనుకూలమైనదిగాను మారింది. నియంత్రణ సంస్థపరమైన మద్దతు, సంస్థాగత భాగస్వామ్యం, ప్యాసివ్ ఇన్వెస్టింగ్‌పై ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించేందుకు అసెట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ కృషి, సాంకేతిక ఆవిష్కరణల మేళవింపు కలిసి ప్యాసివ్ ఫండ్స్‌ను అన్ని వర్గాలకు అనువైన ఓ పెట్టుబడి సాధనంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి.

తక్కువ వ్యయాలు..

ప్యాసివ్ ఫండ్స్ ప్రాచుర్యంలోకి రావడానికి ఒకానొక కారణం, ఇవి తక్కువ వ్యయాలతో కూడుకున్నవి కావడమే. ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ వ్యయ నిష్పత్తులు, మిగతా పెట్టుబడి సాధనాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటాయి. అందుకే వ్యయాల గురించి ఆలోచించే ఇన్వెస్టర్లకు ఇవి ఆకర్షణీయంగా ఉంటున్నాయి. మార్కెట్లో విస్తృత స్థాయిలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉండటం, ఒకే సాధనంపై మొత్తం ఇన్వెస్ట్ చేయడం మూలంగా వచ్చే రిస్కులను తగ్గించడం, మార్కెట్ వృద్ధిలో స్థిరంగా పాలుపంచుకునే అవకాశం కల్పించడం వంటివి వీటికి సానుకూలాంశాలు. డిజిటల్ విప్లవం కూడా ప్యాసివ్ ఫండ్స్‌కు దన్నుగా నిలిచింది. ఫిన్‌టెక్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలు, ఇన్వెస్ట్‌మెంట్ ప్రక్రియను సరళతరం చేశాయి. 'సాషే ఇన్వెస్టింగ్', అంటే సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్స్ (సిప్‌లు) ద్వారా చిన్న మొత్తాల్లో, క్రమం తప్పకుండా ప్యాసివ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశం కల్పించాయి.

తొలిసారిగా ఇన్వెస్ట్ చేసే వారికి ఎంట్రీపరమైన అవరోధాలు తగ్గేందుకు ఇది దోహదపడింది. క్రమశిక్షణతో పెట్టుబడులు పెట్టే ధోరణిని పెంపొందించింది. అంతేగాకుండా, వివిధ డిస్ట్రిబ్యూషన్ మోడల్స్ కూడా ప్యాసివ్ ఫండ్స్‌ను మెట్రోలు, పట్టణ కేంద్రాల పరిధిని దాటి ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలకు కూడా మరింత చేరువ చేశాయి.

కొత్త ఆవిష్కరణలు..

ప్యాసివ్ ఇన్వెస్ట్‌మెంట్ అనేది కేవలం విస్తత మార్కెట్ సూచీలకే పరిమితం కావడం లేదు. లో వోలటైలిటీ, క్వాలిటీ, వేల్యూ, లేదా మొమెంటం లాంటి అంశాల ప్రాతిపదికన ఉండే సూచీలను ట్రాక్ చేసే స్మార్ట్ బీటా ఫండ్స్‌లాంటి ఆవిష్కరణలు వచ్చాయి. మరింత అధునాతనమైన ప్యాసివ్ ఇన్వెస్టింగ్ విధానాన్ని అందిస్తున్నాయి. ఇంటర్నేషనల్ ఈటీఎఫ్‌లనేవి నేరుగా విదేశాల్లో ఇన్వెస్ట్ చేయడానికి ఉండే సంక్లిష్టతల బాదరబందీ లేకుండా భారతీయ ఇన్వెస్టర్లు అంతర్జాతీయంగా పెట్టుబడులను డైవర్సిఫై చేసేందుకు, విదేశీ మార్కెట్లు మరియు కరెన్సీల్లో పెట్టుబడులు పెట్టేందుకు తోడ్పడుతున్నాయి. హెల్త్‌కేర్, కన్జంప్షన్‌లాంటి థీమ్‌ల ఆధారితమైన థీమ్యాటిక్ ఇండెక్స్ ఫండ్స్ తరహాలోనే కమోడిటీల (గోల్డ్, సిల్వర్) ఆధారిత ఈటీఎఫ్‌లు, ఎఫ్‌వోఎఫ్‌లు కూడా ఇన్వెస్టర్లను ఆకర్షిస్తున్నాయి. ప్యాసివ్ ఫండ్స్ ఆధిపత్యం పెరుగుతుండటమనేది భారత్‌లో అసెట్ మేనేజ్‌మెంట్ పరిశ్రమ రూపురేఖలను మారుస్తోంది. ఏఎంసీలు తమ ప్యాసివ్ ప్రోడక్ట్‌లను విస్తరిస్తున్నాయి. ప్యాసివ్ వ్యూహాలను తగిన విధంగా ఉపయోగించుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనాలను పొందవచ్చనే దానిపై ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించడంపై ఇన్వెస్ట్ చేస్తున్నాయి. పారదర్శకత, తక్కువ వ్యయాలతో అధిక ప్రయోజనాలను అందించడం, దీర్ఘకాలికంగా సంపద సృష్టించడం, ఇన్వెస్టర్లకు ప్రయోజనం చేకూర్చేలా పనిచేయడం, వారి ప్రయోజనాలే పరమావధిగా పనిచేయడం వైపుగా పరిశ్రమ మళ్లుతోంది. ప్యాసివ్ ఇన్వెస్టింగ్ మరింత పుంజుకోవాలంటే, ఈ కోవకు చెందిన ఫండ్స్‌లో పెట్టుబడులను ప్రోత్సహించే విధానాలు కూడా ఉంటే శ్రేయస్కరంగా ఉంటుంది. పన్ను మినహాయింపుల్లాంటివి (ఈఎల్ఎస్ఎస్ స్కీముల తరహాలో) ఇస్తే, సగటు భారతీయుల పొదుపు మొత్తాలు, ఆదాయాన్నిచ్చే ఫిక్స్‌డ్ ఇన్‌కం పోర్ట్‌ఫోలియో నుంచి సంపదను సృష్టించే ప్యాసివ్ ఈక్విటీ ఫండ్స్ పోర్ట్‌ఫోలియోలోకి మళ్లేందుకు తోడ్పడతాయి.

అధిక వృద్ధి రేటు సాధ్యమే..

- ఎలాంటి సవాళ్లు లేవు
- ఆర్‌బీఐ ఎంపీసీ సభ్యుడు నగేష్ కుమార్




న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా వృద్ధి చెందుతోందని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) 6.5 శాతానికి పైన వృద్ధిని సాధించే విషయంలో ఎలాంటి సవాళ్లు లేవని ఆర్‌బీఐ ఎంపీసీ సభ్యుడు నగేష్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచంలో అన్ని ఆర్థిక వ్యవస్థల్లోకి భారత్ ఆశాకిరణంలా కొనసాగుతోందన్నారు. ''నిజానికి మూడింట ఒకవంతుకు పైగా ఆర్థిక వ్యవస్థలు తీవ్రమైన రుణ సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నాయి. పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థలు ఒత్తిళ్లను, అధిక ధరలు, ఆర్థిక మందగమనంతో సతమతం అవుతున్నాయి. కానీ, భారత ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా దేశీ వినియోగం, దేశీ పెట్టుబడుల ఆధారితంగా నడుస్తోంది. ఎగుమతులపై ఆధారపడడం తక్కువ. కనుక 6.5 శాతం కంటే అధిక వృద్ధి సాధించే విషయంలో నాకు ఎలాంటి సవాళ్లు కనిపించడం లేదు'' అని కుమార్ వివరించారు. ఇదే వేగం కొనసాగుతుందంటూ రానున్న సంవత్సరాల్లో 7–7.5 శాతం వృద్ధి రేటును చేరుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మరిన్ని రేట్ల కోతకు అవకాశం ఉంటుందా? అన్న ప్రశ్నకు.. కేవలం ద్రవ్యోల్బణం నియంత్రణ కాకుండా ఇతర స్థూల ఆర్థిక అంశాలపై ఇది ఆధారపడి ఉంటుందని నగేష్ కుమార్ బదులిచ్చారు.


యూఎస్‌తో ఒప్పందం ప్రయోజనకరమే

అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం సాకారమైతే కార్మిక ఆధారిత విస్తృతమైన అమెరికా మార్కెట్‌లో భారత్‌కు మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని నగేష్ కుమార్ అభిప్రాయపడ్డారు. మనదగ్గర పెద్ద ఎత్తున కార్మిక వనరులు ఉన్నందున భారత్ పోటీతత్వం పెరుగుతుందన్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ విషయంలో అమెరికాకు అవకాశాలు కల్పించడం పట్ల భారత్‌కు కొన్ని ఆందోళనలు ఉన్నట్టు ప్రస్తావించారు.

పెన్షనర్లు.. ట్యాక్స్ ప్లానింగ్

కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి | కె.వి.ఎన్ లావణ్య





ట్యాక్సేషన్ నిపుణులు

అరవైఏళ్లు దాటిన వారు, 80 ఏళ్లు దాటిన వారు.. ఇలా వయస్సు పైబడిన వారికి, అంటే, సీనియర్ సిటిజన్లకు బేసిక్ లిమిట్ మారుతుంది. ఇదంతా పాత పద్ధతిలో. కొత్త పద్ధతిలో సీనియారిటీతో సంబంధం లేకుండా అందరికీ ఒకే బేసిక్ లిమిట్. ఈ బేసిక్ లిమిట్‌లు, శ్లాబులు, రేట్లు మీకు తెలిసినవే. పెన్షన్‌ని 'జీతాల' పరిధిలో పరిగణిస్తారు. పెన్షన్ కూడా ట్యాక్సబుల్ ఆదాయమే. రూ. 10,000 పన్ను భారం దాటిన వారు అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాలి. సీనియర్ సిటిజన్లకు వ్యాపారం, వృత్తి మీద ఆదాయం లేకపోతే అడ్వాన్స్ ట్యాక్స్ చెల్లించాల్సినవసరం లేదు.

ఆదాయపు పన్ను చట్ట ప్రకారం, జీతాన్ని ఎలా ట్యాక్సబుల్‌గా భావిస్తారో, అలాగే పెన్షన్లను కూడా భావిస్తారు. చాలా మంది పెన్షన్ మీద మినహాయింపు ఉందనుకుంటారు. కానీ, అది నిజం కాదు. పెన్షన్ ట్యాక్సబుల్ ఆదాయమే. బేసిక్ లిమిట్ లోపు ఉంటే తప్ప.. పన్ను భారం తప్పించుకోవడం ఉండదు. గవర్నమెంటులో రిటైర్ అయిన వారికి కమ్యూటెడ్ పెన్షన్ మినహాయింపు ఉంది. ముందుగా లెక్కలు కట్టి, ట్యాక్స్ ప్లానింగ్ ద్వారా కమ్యుటెడ్ పెన్షన్ మార్చుకోవచ్చు. పరమ్‌వీర్ చక్ర, మహా వీర్ చక్ర, వీర్ చక్ర మొదలైన వాటికి సంబంధించిన పెన్షన్లకు మినహాయింపు ఉంది. విదేశాల్లో సెటిల్ అయిన పెన్షనర్లకు వచ్చే పెన్షన్లను మన దేశంలోని ఆదాయంగా పరిగణిస్తారు. పెన్షన్లలో ఎరియర్స్ అంటే .. బకాయిలు వస్తే, వాటిని పన్ను పరిధిలోకి చేర్చి 89(1) సెక్షన్ కింద రిలీఫ్ పొందవచ్చు. ఈ పెన్షన్‌లో స్టాండర్డ్ డిడక్షన్ మినహాయింపు ఉంది.

ఇక ఫ్యామిలీ పెన్షన్ విషయానికొద్దాం. ఒక వ్యక్తి చనిపోయిన తర్వాత, తన పెన్షన్‌ని కుటుంబంలోని వ్యక్తికి ఇవ్వొచ్చు. ఇలాంటి చెల్లింపులను ఫ్యామిలీ పెన్షన్ అంటారు.



ఇక్కడ పెన్షన్ అని పేరుంది కానీ, ఇలాంటి పెన్షన్‌ను 'జీతం'గా భావించరు. ఇతర ఆదాయంగా భావిస్తారు. టీడీఎస్ అంశాలు వర్తించవు. పాత పద్ధతి అయితే రూ. 15,000 మినహాయింపు ఇస్తారు. కొత్త పద్ధతి అయితే, రూ. 25,000 మినహాయింపు వస్తుంది. సైన్యంలోని ఫ్యామిలీ సభ్యులకు మినహాయింపు పూర్తిగా ఇస్తారు. ఈ విషయానికి సంబంధించి చాలా పరిస్థితులనే పొందుపర్చారు. కానీ విధి నిర్వహణలో ఉండగా, సైన్యంలో చనిపోతే వారి కుటుంబానికి వచ్చే పెన్షన్ మీద మినహాయింపు ఉంటుంది.

పెన్షన్, ఫ్యామిలీ పెన్షన్‌కి సంబంధించి ట్యాక్స్ ప్లానింగ్ విషయాలు..


- పాత పద్ధతిలో వెళ్తే మంచిదా. కొత్త పద్ధతిలో వెళ్తే మంచిదా అనేది ఆలోచించుకోవాలి.
- వైద్యానికి సంబంధించిన మినహాయింపులను గత వారం తెలుసుకున్నాం. ఇవి పాత పద్ధతిలో ఉంటాయి.
- పెన్షనరీ బెనిఫిట్స్ భారీగా వస్తాయి. వాటిని సక్రమంగా, సరిగ్గా, సమగ్రంగా ఆలోచించి ఇన్వెస్ట్ చేయొచ్చు.
- 80సీ డిడక్షన్లు అనవసరం అనుకునే వాళ్లు చాలా మంది ఉన్నారు. వార్ధక్యంలో సేవింగ్ మీద పెద్ద మొత్తాల్ని 'బ్లాక్' చేసుకోవడం ఎందుకు. చేతిలో లేదా అందుబాటులో బ్యాంకు బ్యాలెన్సులు ఉంటే మంచిది. ఉదాహరణకు వైద్యంలాంటి ఏ అవసరానికైనా ఉపయోగపడుతుందనేది ఆలోచన.
- సీనియర్ సిటిజన్లకు ఎన్నో స్కీములు ఉన్నాయి. సరైన నిర్ణయం తీసుకోండి. ఆకర్షణీయమైన ప్రైవేట్ వ్యక్తుల చేతిల మోసపోకండి.
- అయితే, ఎన్నో మంచి ఇన్వెస్ట్‌మెంట్లు, స్కీములు ఉన్నాయి. కేవలం పాత పద్ధతిలోనే వాటిపై వడ్డీకి మినహాయింపులు ఉన్నాయి.
- ఎన్నారై సిటిజన్లు 15హెచ్ ఇవ్వకూడదు. కానీ రెసిడెంట్లు ఇవ్వొచ్చు. బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వడ్డీ రూ. లక్ష దాటితే, టీడీఎస్ వర్తిస్తుంది. ట్యాక్సబుల్ ఇన్‌కం లోపల ఆదాయం ఉంటే, 15హెచ్ ఇస్తే పన్ను రికవరీ చేయరు. బేసిక్ లిమిట్ దాటితే 15హెచ్ ఇవ్వకూడదు.
- గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, పీఎఫ్, సూపర్ యాన్యుయేషన్ ఫండ్ .. వీటన్నింటికీ పూర్తి మినహాయింపు ఉంది. కానీ, అవి ఇన్వెస్ట్ చేస్తే వచ్చే వడ్డీ/ఆదాయంపై మినహాయింపు కొత్త విధానంలో లేదు.
- 75 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్లకు పెన్షన్ ఉండి, ఒకే ఒక బ్యాంకు అకౌంటులో నుంచి వడ్డీ .. ఈ రెండింటి మీదా పన్ను రికవరీ అయితే, రిటర్ను వేయనక్కర్లేదు.
- రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో పిల్లల చదువు కోసమా, స్వంత వైద్యానికా, ఇల్లు కొనుక్కోవడమా, బంగారం కొనడమా, షేర్స్‌లో ఇన్వెస్ట్ చేయడమా, పిల్లలకు బహుమతిగా ఇవ్వడమా.. ఇలా ఎన్నో ఆలోచనలు.
- తన సొంత పెన్షన్, భార్య ఫ్యామిలీ పెన్షన్.. ఇలా రెండూ కలిపి తడిసి మోపెడై.. పన్ను భారం చెల్లించే పెన్షనర్లు ఇంకొందరు.

ఆదాయం అధికంగా ఉంటే పన్ను చెల్లించడమే ట్యాక్స్ ప్లానింగ్.

పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

రిస్క్ - రాబడి సమతుల్యం

కోటక్ మిడ్‌క్యాప్ ఫండ్



రిస్క్–రాబడి సమతుల్యం కోరుకునే ఇన్వెస్టర్లు లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను పరిశీలించొచ్చు. లార్జ్‌క్యాప్‌తో పోల్చినప్పుడు మిడ్‌క్యాప్ స్టాక్స్‌లో అస్థిరతలు ఎక్కువే. అదే సమయంలో రాబడులు కూడా అధికంగా ఉంటాయని చారిత్రక గణాంకాలు తెలియజేస్తున్నాయి. 5–10 ఏళ్ల అంతకుమించిన లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ విభాగంలో మంచి పనితీరు చూస్తున్న వాటిల్లో కోటక్ మిడ్‌క్యాప్ ఫండ్ ఒకటి.

రాబడులు..

మధ్య, దీర్ఘకాలాల్లో కోటక్ మిడ్‌క్యాప్ ఫండ్ అద్భుతమైన రాబడులు అందించినట్టు డేటా తెలియజేస్తోంది. ఏడాది కాలంలో కేవలం 8.39 శాతం రాబడిని ఇవ్వగా, అదే మూడేళ్ల కాలంలో మాత్రం రాబడి ఏటా 26 శాతం మేర ఉంది. ఐదేళ్లలో చూస్తే వార్షిక రాబడి 31 శాతం మేర ఉంది. ఇక ఏడేళ్లలో ఏటా 21.62 శాతం, పదేళ్లలో 19.19 శాతం చొప్పున పెట్టుబడులపై రాబడిని ఈ పథకం అందించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ కంటే ఈ పథకంలోనే మెరుగైన పనితీరును గుర్తించొచ్చు.

పెట్టుబడుల విధానం

టాప్‌డౌన్ విధానంలో రంగాల వారీ అవకాశాలు, అదే సమయంలో బోటమ్ అప్ విధానంలో స్టాక్స్‌ను పెట్టుబడులకు ఈ పథకం ఎంపిక చేస్తుంది. మంచి వృద్ధి అవకాశాలతోపాటు స్టాక్ ధర సహేతుకంగా ఉన్న వాటిని ఎంపిక చేసి పెట్టుబడులు పెడుతుంది. స్థిరమైన పనితీరుతో మంచి కార్పొరేట్ గవర్నెన్స్‌ను ప్రధానంగా చూస్తుంది. రిటర్న్ ఆన్ ఈక్విటీ (పెట్టుబడిపై రాబడి) మెరుగ్గా ఉన్నవి లేదా క్రమంగా పెంచుకుంటున్న కంపెనీలకు ప్రాధాన్యం ఇస్తుంది. రుణ భారం అధికంగా ఉన్న, కార్పొరేట్ గవర్నెన్స్ బలంగా లేని, బలహీన వ్యాపారాలతో కూడిన కంపెనీలకు దూరంగా ఉంటుంది. దీర్ఘకాలంలో మంచి వృద్ధి అవకాశాలతో కూడిన కంపెనీల్లో కొంచెం అధిక వ్యాల్యుయేషన్లలోనూ పెట్టుబడులకు వెనుకాడదు. ఈ పథకానికి అతుల్ భోలే ఫండ్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. నిర్వహణ ఆస్తుల్లో (ఏయూఎం) 75–80 శాతం మేర స్థిరమైన, దీర్ఘకాలం పాటు రాణించగలిగిన కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తుంది. 15–20 శాతం మేర వ్యూహాత్మక అవకాశాల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. కొనుగోలు చేసి, దీర్ఘకాలం పాటు కంపెనీలను పోర్ట్‌ఫోలియోలో కొనసాగించాన్ని అనుసరిస్తుంది.

పోర్ట్‌ఫోలియో

ఈ పథకం నిర్వహణలో ప్రస్తుతం రూ.57,102 కోట్ల పెట్టుబడులు (ఏయూఎం) ఉన్నాయి. 96.65 శాతం మేర స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసింది. 3.15 శాతం మేర నగదు నిల్వలు కలిగి ఉంది. సాధారణంగా ఈ పథకం నగదు నిల్వలు తక్కువే కలిగి ఉంటుంది. మొత్తం ఈక్విటీ పెట్టుబడుల్లో 43 శాతం లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసింది. 55 శాతం మేర మిడ్‌క్యాప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టింది. స్మాల్‌క్యాప్ పెట్టుబడులు 2.48 శాతంగా ఉన్నాయి. పోర్ట్‌ఫోలియోలో 60 స్టాక్స్ ఉన్నాయి. పెట్టుబడుల పరంగా టెక్నాలజీ కంపెనీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ రంగాలకు చెందిన కంపెనీల్లో 18.82 శాతం పెట్టుబడులు ఉన్నాయి. ఆ తర్వాత ఇండస్ట్రియల్స్ కంపెనీల్లో 16.98 శాతం మేర ఇన్వెస్ట్ చేసింది. మెటీరియల్స్ కంపెనీలకు 14.55 శాతం, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ కంపెనీలకు 12.48 శాతం, కన్జ్యూమర్ డిస్క్రెషనరీ కంపెనీలకు 11.75 శాతం, హెల్త్‌కేర్ కంపెనీలకు 10.95 శాతం చొప్పున కేటాయించింది.

టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడుల శాతం
ఫోర్టిస్ హెల్త్‌కేర్	3.44
ఎంఫసిస్	3.29
సోలార్ ఇండస్ట్రీస్	3.04
జీఈ టీఅండ్‌డీ	2.93
స్విగ్గీ	2.90
డిక్సన్ టెక్	2.90
ఇప్కా లాబ్స్	2.90
విశాల్ మెగామార్ట్	2.83
ఒబెరాయ్ రియల్టీ	2.67
జేకే సిమెంట్	2.61


దిలిప్ టిర్కీ

గొప్పగా హాకీ 'శత' వసంతం

పండగగా హాకీ స్వర్ణోత్సవం

- రాష్ట్ర సంఘాలకు గ్రాంట్లు పెంపు
- టోర్నీ నిర్వహణకు నిధుల హెచ్చింపు


మహాబలిపురం: భారత హాకీ స్వర్ణోత్సవాన్ని (వందేళ్ల పండగను) గొప్పగా నిర్వహించేందుకు హాకీ ఇండియా (హెచ్ఐ) ఏర్పాట్లు చేస్తోంది. అలాగే శత వసంతం సందర్భంగా రాష్ట్ర హాకీ సంఘాలకు నిధుల వితరణను పెంచింది. సీనియర్, జూనియర్ అంత ర్జాతీయ, జాతీయ, మహిళల టోర్నీల నిర్వహణ కోసం అందజేసే గ్రాంట్ల మొత్తాన్ని కూడా గణనీయంగా హెచ్చింపు చేసింది. క్షేత్రస్థాయిలో జరిగే ఈవెంట్ల నిర్వ హణను ప్రోత్సహించేలా ఆర్థిక సాయాన్ని పెంచింది. ఏదేని రాష్ట్రంలో ఇకపై పురుషుల, మహిళల సీనియర్ జాతీయ చాంపియన్‌షిప్ జరిగితే రూ. 70 లక్షలు గ్రాంట్‌గా అందజేయనుంది. అదే జూనియర్, సబ్-జూనియర్ స్థాయి ఈవెంట్‌లను నిర్వహిస్తే రూ. 30 లక్షలు ఇవ్వనున్నట్లు హెచ్ఐ ప్రకటించింది. దీంతో పాటు రాష్ట్ర స్థాయి, జిల్లా టోర్నీల నిర్వహణ కోసం రూ. 25 లక్షలు ఇస్తామని ప్రకటించింది. నవంబర్ 7న దేశవ్యాప్తంగా హాకీ వందేళ్ల స్వర్ణోత్సవ సంబరాన్ని అంబరాన్నంటేలా నిర్వహిస్తారు.

భవిష్యత్తుకు భరోసా కల్పించేలా...

నిధుల పెంపుదలతో ఆయా రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాలు మరింత పెరిగేందుకు దోహదం చేస్తుంది. దీంతో పాటు ఈవెంట్‌ను ఘనంగా నిర్వ హించే ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని హెచ్ఐ భావిస్తోంది. దీంతో టోర్నీ ఆకర్షణీయగా మారుతుంది. అదనపు హంగులతో నిర్వహించబడుతుంది. నిష్ణాతులైన రిఫరీలు, అధికారుల మార్గదర్శనంలో జరగడం వలన పోటీల నాణ్యత కూడా పెరుగుతుంది. ప్లేయర్లకు వసతులు పెరుగుతాయి. కొత్తగా మరెంతో మంది ఉత్సాహంగా హాకీ క్రీడను కెరీర్‌గా ఎంచుకుంటారు. ఇలా బహుముఖ ప్రయోజనాలు కలుగుతాయని హాకీ ఇండియా బలంగా నమ్ముతోంది. ఆటగాళ్లే కాదు హాకీ క్రీడ కోసం పనిచేసే అధికారులు, కోచ్‌లు, ఫిజియోలకు ఒనగూరే ప్రయోజనాలూ ఇందులో ఇమిడి ఉంటాయి. వీళ్లందరి భవిష్యత్తుకు భరోసా పెరుగుతుంది.

ఒకేసారి 1000 మ్యాచ్‌ల నిర్వహణ

శత వసంతాల హాకీ మైలురాయి ఘనతకు గుర్తుగా జాతీయ స్థాయి వేడుకలే కాదు... పోటీలు కూడా హాకీని మరింత శోభాయమానం చేయనుంది. 'హాకీ-100'ను చిరస్మరణీయంగా మలిచేందుకు మహిళలు, పురుషుల విభాగాల్లో ఒకే సమయం దేశ వ్యాప్తంగా వెయ్యి చొప్పున మ్యాచ్‌ల్ని నిర్వహించేందుకు హెచ్ఐ ఏర్పాట్లు చేస్తోంది. మహిళల్లో, పురుషుల్లో 18 వేల మంది చొప్పున ఏకంగా 36 వేలమంది క్రీడాకారులు ఈ పోటీల్లో ఒకేసారి పాల్గొనబోతున్నారు. మన హాకీ స్వర్ణ శకం వెయ్యేళ్లు గుర్తుండిపోయేలా, భవిష్యత్ తరాలకు మన హాకీ ప్రభ, శోభ తెలిసేలా వందేళ్ల వేడుక ఉంటుందని హెచ్ఐ అధ్యక్షుడు దిలిప్ టిర్కీ తెలిపారు.



ఐదులో నాలుగు చైనాకే...


షి యు కి


వాంగ్ జి యి

- చైనా ఓపెన్‌లో ఆతిథ్య షట్లర్ల హవా
- నాలుగు విభాగాల్లో టైటిల్స్ సొంతం

చాంగ్జౌ: బ్యాడ్మింటన్ సీజన్‌లోని చివరి వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీ చైనా ఓపెన్‌లో చైనా క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. మొత్తం ఐదు విభాగాలకుగాను నాలుగు విభాగాల్లో టైటిల్స్ దక్కించుకున్నారు. పురుషుల సింగిల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో చైనా క్రీడాకారులే ఫైనల్ చేరుకున్నారు. ఫలితంగా విన్నర్స్, రన్నరప్‌గా చైనా ప్లేయర్లే నిలిచారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ షి యు కి (చైనా) 64 నిమిషాల్లో 14-21, 21-14, 21-15తో ప్రపంచ 23వ ర్యాంకర్ వాంగ్ జెంగ్ జింగ్ (చైనా)పై గెలిచాడు. మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా) 39 నిమిషాల్లో 21-8, 21-13తో ప్రపంచ మూడో ర్యాంకర్ హాన్ యువె (చైనా)పై విజయం సాధించింది. మహిళల డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ జోడీ లియు షెంగ్ షు-టాన్ నింగ్ (చైనా) 69 నిమిషాల్లో 24-22, 17-21, 21-14తో ప్రపంచ ఏడో ర్యాంక్ జాంగ్ షు జియాన్-జియా యి ఫాన్ (చైనా) ద్వయంపై నెగ్గింది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ జంట ఫెంగ్ యాన్ జె-హువాంగ్ డాంగ్ పింగ్ 47 నిమిషాల్లో 23-21, 21-17తో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ జియాంగ్ జెన్ బాంగ్-వె యా జిన్ (చైనా)పై గెలుపొందింది. పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ 210వ ర్యాంక్ జోడీ ఫజర్ అల్ఫియాన్-మొహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ (ఇండోనేసియా) ద్వయం 21-15, 21-14తో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ ఆరోన్ చియా-సో వుయ్ యిక్ (మలేసియా)పై సంచలన విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకుంది. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 1,40,000 డాలర్ల చొప్పున (రూ. 1 కోటీ 21 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 12,000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విజేత జోడీలకు 1,48,000 డాలర్ల చొప్పున (రూ. 1 కోటీ 28 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 12,000 ర్యాంకింగ్ పాయింట్లు దక్కాయి.

పోరాడి ఓడిన యూకీ జోడీ

వాషింగ్టన్: ముబాదాల సిటీ డీసీ ఓపెన్ ఏటీపీ-500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)-మైకేల్ వీనస్ (న్యూజిలాండ్) జోడీ పోరాటం ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో యూకీ-వీనస్ ద్వయం 6-3, 4-6, 7-10తో 'సూపర్ టైబ్రేక్'లో నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్)-జాన్ ప్యాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 93 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో-కివీస్ ద్వయం మూడు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. అయితే నిర్ణాయక సూపర్ టైబ్రేక్‌లో స్కుప్‌స్కీ, స్మిత్ జంట కీలకదశలో పాయింట్లు గెలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఓడిన యూకీ-వీనస్‌లకు 19,860 డాలర్ల (రూ. 17 లక్షల 17 వేలు) ప్రైజ్‌మనీతో పాటు 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



పియాస్ట్రి 'సిక్సర్'

ఈ సీజన్‌లో ఆరో టైటిల్ గెలిచిన మెక్‌లారెన్ డ్రైవర్ ● బెల్జియం గ్రాండ్‌ప్రిలో అగ్రస్థానం సొంతం





స్పా-ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): ఫార్ములావన్ తాజా సీజన్‌లో మెక్‌లారెన్ డ్రైవర్‌ల జోరు సాగుతోంది. ఆస్కార్ పియాస్ట్రి, లాండో నోరిస్ మధ్య ఆధిక్యం చేతులు మారుతూ సాగిన బెల్జియం గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి విజయం సాధించాడు.

బెల్జియం గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	ల్యాప్‌లు	సమయం	వ్యత్యాసం	పాయింట్లు
1	పియాస్ట్రి	మెక్‌లారెన్	44	1:25:22.601 సెకన్లు	-	25
2	నోరిస్	మెక్‌లారెన్	44	1:25:26.016 సెకన్లు	3.415 సెకన్లు	18
3	లెక్‌లెర్క్	ఫెరారీ	44	1:25:42.786 సెకన్లు	20.185 సెకన్లు	15
4	వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	44	1:25:44.332 సెకన్లు	21.731 సెకన్లు	12
5	రసెల్	మెర్సిడెస్	44	1:25:57.464 సెకన్లు	34.863 సెకన్లు	10
6	అల్బోన్	విలియమ్స్ రేసింగ్	44	1:26:02.527 సెకన్లు	39.926 సెకన్లు	8
7	హామిల్టన్	ఫెరారీ	44	1:26:03.280 సెకన్లు	40.679 సెకన్లు	6
8	లాసన్	రేసింగ్‌బుల్స్	44	1:26:14.634 సెకన్లు	52.033 సెకన్లు	4
9	గాబ్రియెల్	కిక్ సాబెర్	44	1:26:19.035 సెకన్లు	56.434 సెకన్లు	2
10	గాస్లీ	అల్పైన్	44	1:26:35.315 సెకన్లు	72.714 సెకన్లు	1

ఈ సీజన్‌లో పియాస్ట్రికిది ఆరో విజయం కావడం విశేషం. ఆదివారం జరిగిన ఈ రేసులో పియాస్ట్రి నిర్ణీత 44 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 25 నిమిషాల 22.601 సెకన్లలో ముగించి విజేతగా నిలిచాడు. మెక్‌లారెన్ జట్టుకే చెందిన నోరిస్ 1 గంట 25 నిమిషాల 26.016 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలిచాడు. పోల్ పొజిషన్‌తో రేసును ప్రారంభించిన నోరిస్... 3.415 సెకన్ల తేడాతో రెండో స్థానానికి పరిమితమయ్యాడు. వర్షం అంతరాయం కారణంగా షెడ్యూల్ కన్నా ఆలస్యంగా ప్రారంభమైన రేసులో ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ (1 గంట 25 నిమిషాల 42.786 సెకన్లు) మూడో స్థానం దక్కించుకున్నాడు. నాలుగుసార్లు ప్రపంచ చాంపియన్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (1 గంట 25 నిమిషాల 44.432 సెకన్లు; రెడ్‌బుల్) నాలుగో స్థానంతో సరిపెట్టుకోగా... ఏడుసార్లు ప్రపంచ చాంపియన్ లూయిస్ హామిల్టన్ (1 గంట 26 నిమిషాల 3.280 సెకన్లు; ఫెరారీ) ఏడో స్థానానికి పరిమితమయ్యాడు. 24 రేసుల తాజా సీజన్‌లో ఇప్పటి వరకు 13 రేసులు ముగియగా... డ్రైవర్స్ చాంపియన్‌షిప్‌లో పియాస్ట్రి 266 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... నోరిస్ 250 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ వెర్‌స్టాపెన్ 185 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. తదుపరి రేసు ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి ఆగస్టు 3న జరుగుతుంది.

మ్యాక్స్‌వెల్ మెరుపులు

- రాణించిన గ్రీన్, ఇన్‌గ్లిస్
- నాలుగో టి20లోనూ వెస్టిండీస్‌పై ఆస్ట్రేలియా విజయం


మ్యాక్స్‌వెల్

బసెటెర్ (సెయింట్ కిట్స్): వెస్టిండీస్ పర్యటనలో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు జోరు కొనసాగుతోంది. టెస్టు సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన ఆసీస్... టి20 సిరీస్‌లోనూ క్లీన్‌స్వీప్ దిశగా సాగుతోంది. ఇప్పటికే సిరీస్ గెలుచుకున్న ఆస్ట్రేలియా... భారత కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున జరిగిన నాలుగో టి20లో 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఫలితంగా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 4-0తో ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (15 బంతుల్లో 31; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన ప్లేయర్లంతా మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. పావెల్ (28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), షెఫర్డ్ (28; 4 ఫోర్లు, 1 సిక్స్), హోల్డర్ (26; 4 ఫోర్లు, 1 సిక్స్), బ్రాండన్ కింగ్ (18; 3 ఫోర్లు, 1 సిక్స్), హెట్‌మైర్ (16; 1 ఫోర్, 2 సిక్స్) తలాకొన్ని పరుగులు చేశారు. క్రీజులో అడుగు పెట్టిన ప్రతి బ్యాటర్ భారీ షాట్‌లు ఆడే ప్రయత్నం చేశారే తప్ప ఎక్కువసేపు క్రీజులో నిలవాలనే ప్రయత్నం చేయలేదు. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆడమ్ జంపా 3 వికెట్లు పడగొట్టగా... సీన్ అబాట్, జేవియర్, ఆరోన్ హార్డీ తలా రెండు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆస్ట్రేలియా 19.2 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మ్యాక్స్‌వెల్ (18 బంతుల్లో 47; 1 ఫోర్, 6 సిక్స్‌లు) జట్టుకు మెరుపు ఆరంభాన్నివ్వగా... జోష్ ఇన్‌గ్లిస్ (30 బంతుల్లో 51; 10 ఫోర్లు, 1 సిక్స్), కామెరూన్ గ్రీన్ (35 బంతుల్లో 55 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) హాఫ్‌సెంచరీలతో రాణించారు. వరుసగా మూడో మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన మ్యాక్స్‌వెల్ భారీ సిక్స్‌లతో చెలరేగిపోయాడు. విండీస్ బౌలర్లలో బ్లేడ్స్ 3 వికెట్లు తీశాడు. రెండొందలపై చిలుకు పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోలేకపోవడం విండీస్‌కు ఇది ఏడోసారి. ఐసీసీ సభ్య దేశాల్లో ఇదే అత్యధికం. ఇరు జట్ల మధ్య మంగళవారం ఆఖరి టి20 జరగనుంది.


గ్రీన్



అంకితకు రజతం

- పురుషుల 4x100 మీటర్లలో కాంస్యం
- ముగిసిన ప్రపంచ యూనివర్సిటీ క్రీడలు
- 2 స్వర్ణాలు సహా భారత్‌కు 12 పతకాలు

రెనె-రుర్ ఎసెన్ (జర్మనీ): ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో భారత స్టీపుల్‌ఛేజర్ అంకిత ధ్యాని రజత పతకంతో మెరిసింది. మహిళల 3000 మీటర్ల పోటీలో అంకిత 9 నిమిషాల 31.99 సెకన్లలో లక్ష్యాన్ని చేరి రెండో స్థానంలో నిలవగా... పురుషుల 4x100 మీటర్ల రిలేలో భారత జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఆదివారంతో ఈ టోర్నీ ముగియగా... చివరి రోజు భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. ఓవరాల్‌గా ఈ క్రీడల్లో భారత్ 12 పతకాలు (2 స్వర్ణాలు, 5 రజతాలు, 5 కాంస్యాలు) సాధించింది. మహిళల స్టీపుల్‌చేజ్‌లో 23 ఏళ్ల అంకిత తన వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శనతో వెండి వెలుగులు విరజిమ్మింది. అంతకుముందు హీట్స్‌లో అగ్రస్థానంతో ఫైనల్‌కు చేరిన అంకిత... తుది రేసులోనూ జోరు కనబర్చి మిల్లీ సెకన్ల తేడాతో స్వర్ణానికి దూరమైంది. ఈ క్రమంలో తన గత వ్యక్తిగత అత్యుత్తమ ప్రదర్శన కంటే 7 సెకన్ల టైమింగ్‌ను మెరుగు పరుచుకోవడం విశేషం. పురుషుల 4x100 మీటర్ల రిలే టీమ్ రేసులో లాలు ప్రసాద్ భోయ్, అనిమేశ్, మణికంఠ, మృత్యం జయరాంతో కూడిన భారత జట్టు 38.89 సెకన్లలో లక్ష్యాన్ని చేరి కాంస్య పతకం గెలుచుకుంది. దక్షిణ కొరియా (38.50 సెకన్లు), దక్షిణాఫ్రికా (38.80 సెకన్లు) జట్లు వరుసగా స్వర్ణ, రజతాలు నెగ్గాయి. మహిళల 4x100 మీటర్ల రిలే టీమ్ విభాగంలో అనఖ బిజుకుమార్; దివ్యనిబ జాలా, రష్‌దీప్ కౌర్, రూపాల్‌తో కూడిన భారత జట్టు 2 నిమిషాల 35.8 సెకన్లలో లక్ష్యాన్ని చేరి ఐదో స్థానంలో నిలిచింది. పురుషుల 4x100 మీటర్ల రిలేలో విశాల్, అశ్విన్, జెరోమ్, బాలకృష్ణతో కూడిన భారత జట్టు 3 నిమిషాల 6.5 సెకన్లతో ఐదో స్థానానికి పరిమితమైంది. రేస్ వాక్‌లో భారత పురుషుల, మహిళల అథ్లెట్లు టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయారు. అంతకుముందు మహిళల 20 కిలోమీటర్ల రేస్‌వాక్ టీమ్ విభాగంలో సెజల్ సింగ్, మునిత ప్రజాపతి, మాన్సి నేగితో కూడిన భారత జట్టు కాంస్య పతకం నెగ్గింది.


అంకిత



ఇద్దరు రైతులు వర్షం నీటితో నిండిన పొలంలో ఎద్దులను జోడుగా కట్టి ఉరికిస్తున్నారు కదూ! సాగు పనులకు పొలాన్ని సిద్ధం చేసేందుకు పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఈ సీజన్‌లో ఇలాంటి పోటీలు సర్వసాధారణం.



ఎద్దుల పోటీలో భాగంగా ఓ వ్యక్తి బురద పొలంలో వాటిని పరుగెత్తిస్తుండగా తీసిన చిత్రం. మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా వహాల్ గ్రామంలో ఏటా జరిగే సంప్రదాయ నంగ్రానీ వేడుకలో భాగమిది.

'రాయబారి' ముసుగులో ఆర్థిక నేరాలు

- వెలుగులోకి వస్తున్న హర్షవర్దన్ జైన్ బాగోతాలు
- ఘజియాబాద్‌లో నకిలీ ఎంబసీని నిర్వహిస్తూ దొరికిపోయిన వైనం
- విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ భారీగా వసూళ్లు
- రూ.300 కోట్ల స్కామ్‌తోనూ సంబంధాలు
- అద్నాన్ ఖషోగ్గి నుంచి జైన్ ఖాతాలోకి రూ.20 కోట్లు



ఘజియాబాద్‌లో జైన్ నిర్వహించే ఫేక్ ఎంబసీ వద్ద ఖరీదైన కార్లు, ఇన్‌సెట్‌లో జైన్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో నకిలీ రాయబార కార్యాలయం(ఎంబసీ) ఏర్పాటు చేసిన కేసులో మరికొన్ని విషయాలు బయటకు వస్తున్నాయి. ఈ ఎంబసీకి సూత్రధారి అయిన హర్షవర్దన్ జైన్(47) గత పదేళ్లలో 162 సార్లు విదేశీ పర్యటనలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా రూ.300 కోట్ల ఆర్థిక కుంభకోణంతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. ఈ స్కామ్‌పై ఉత్తరప్రదేశ్ 'సిట్'దర్యాప్తు చేస్తోంది. హర్షవర్దన్ జైన్ వెస్టార్కిటికా, సెబోర్గా, పౌల్వియా, లాడోనియా వంటి దేశాల పేరుతో ఎంబసీలు నిర్వహించాడు. ఇందుకు ఘజియాబాద్‌లోని తన రెండంతస్తుల బంగ్లాను అడ్డాగా మార్చుకున్నాడు. ఈ బంగ్లాపై విదేశీ జాతీయ జెండాలు ఎగురుతూ కనిపించేవని స్థానికులు చెప్పారు. ఖరీదైన కార్లలో తిరగడం జైన్‌కు అలవాటు. వాటిపై విదేశాల నామఫలకాలు, ముద్రలు ఉంటాయి. తనను తాను వెస్టార్కిటికా దేశ రాయబారిగా స్థానికులకు పరిచయం చేసుకున్నాడు. రాయబారిగా నాటకం ఆడుతూ జనాన్ని నిండా ముంచేశాడు. మొత్తానికి జైన్ గుట్టు గతవారం రట్టయ్యింది. ఈ నెల 22న అతడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి ఎంబసీ కార్యకలాపాలు బహిర్గతమయ్యాయి. ప్రపంచ దేశాల్లో తనకు పలుకుబడి ఉందని, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పటిస్తానంటూ జనం వద్ద భారీగా డబ్బులు వసూలు చేసినట్లు జైన్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విదేశాల్లో షెల్ కంపెనీలు

కేవలం మోసాలే కాదు, ఆర్థిక నేరాల్లోనూ జైన్ ఆరితేరినట్లు పోలీసులు చెబుతున్నారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు, నకిలీ పథకాలు, షెల్ కంపెనీలు, విదేశీ బ్యాంక్ ఖాతాలతో భారీ సొమ్ము కొల్లగొట్టినట్లు పేర్కొంటున్నారు. జైన్ 2005 నుంచి 2015 వరకు 19 దేశాల్లో పర్యటించాడు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)కి 54 సార్లు వెళ్లొచ్చాడు. యూకేకు 22 సార్లు వెళ్లాడు. అంతేకాకుండా మారిషస్, ఫ్రాన్స్, కామెరూన్ తదితర దేశాల్లో పర్యటించాడు. విదేశాల్లో జైన్‌కు సంబంధించిన 25 షెల్ కంపెనీల లింక్‌లను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ వెలికితీసింది. స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్, ఈస్ట్ ఇండియా కంపెనీ యూకే లిమిటెడ్, ఐలాండ్ జనరల్ ట్రేడింగ్ కంపెనీ, ఇందిరా ఓవర్సీస్ లిమిటెడ్ తదితర పేర్లతో ఇవి ఏర్పాటయ్యాయి. అలాగే జైన్ పేరిట విదేశాల్లో 10 బ్యాంకు ఖాతాలున్నాయి. ఆరు దుబాయిలో, మూడు యూకేలో, ఒకటి మారిషస్‌తో తెరిచాడు. 12 నకిలీ డిప్లొమాటిక్ పాస్‌పోర్టులను అతడి నివాసంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అంతర్జాతీయ రాకెట్

హర్షవర్దన్ జైన్ నెట్‌వర్క్ కేవలం ఇండియాకే పరిమితం కాదు. అంతర్జాతీయ స్థాయిలో ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడు. హైదరాబాద్‌లో జన్మించిన టర్కీ జాతీయుడు అహసన్ అలీ సయీద్ కూడా జైన్‌కు సహకరించాడు. ఇతడి సాయంతో జైన్ విదేశాల్లో పలు కంపెనీలను రిజిస్టర్ చేయించాడు. రూ.300 కోట్ల కుంభకోణంలో అహసన్ అలీ సయీద్ ప్రధాన నిందితుడు. ఇతడు జైన్‌తో కలిసి స్విట్జర్లాండ్‌లోని కంపెనీలను టార్గెట్ చేశాడు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సంస్థలను ఎంచుకున్నాడు. తక్కువ వడ్డీకే రుణాలు ఇప్పిస్తామంటూ పెద్ద మొత్తంలో సొమ్ము గుంజాడు. జైన్, అలీ సయీద్ కలిసి హవాలా మార్గాలు, షెల్ కంపెనీలు, విదేశీ బ్యాంకు ఖాతాలతో ఈ డబ్బును సొంతం చేసుకున్నట్లు దర్యాప్తు అధికారులు వెల్లడించారు. సౌదీ అరేబియాకు చెందిన వివాదాస్పద ఆయుధ వ్యాపారి అద్నాన్ ఖషోగ్గితోనూ జైన్‌కు సంబంధాలున్నాయి. 2002, 2004లో ఖషోగ్గి రూ.20 కోట్లను జైన్ బ్యాంకు ఖాతాకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఈ నిధులు జైన్ దేనికోసం ఖర్చు చేశాడన్న దానిపై ఎస్టీఎఫ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. తదుపరి విచారణ కోసం నిందితుడిని తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ అధికారులు కోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌పై సోమవారం విచారణ జరగనుంది. జైన్‌ను పూర్తిస్థాయిలో ప్రశ్నిస్తే మరికొన్ని సంచలన విషయాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

అధికారి పొరపాటు..17 ఏళ్ల పోరాటం

22 రోజుల జైలు, 300 కోర్టు వాయిదాలు

- ఎట్టకేలకు యూపీ వాసి విజయం

మెయిన్‌పురి: పోలీసు అధికారి పొరపాటు కారణంగా గ్యాంగ్‌స్టర్ చట్టం కేసులో ఇరుక్కున్న ఓ వ్యక్తి 17 ఏళ్లపాటు న్యాయ పోరాటం సాగించాడు. చిట్టచివరికి 62 ఏళ్ల వయస్సులో కోర్టు ఆయన్ను నిర్దోషిగా ప్రకటించింది. 22 రోజులపాటు జైలు జీవితం అనుభవించి, కనీసం 300 సార్లు కోర్టు వాయిదాలకు తిరిగి తిరిగీ అలసిపోయిన అతడితో కుటుంబం సంబంధాలు తెంచుకుంది. బడికి వెళ్లాల్సిన ఒక్కగానొక్క కొడుకు రోజు కూలీగా మారాడు. అన్నిటికీ తోడు సొంతూళ్లో అవమాన భారం. ఇదంతా ఏ తప్పూ చేయకుండానే భరించాడు రాజ్ వీర్. దాదాపు రెండు దశాబ్దాల పాటు అనుభవించిన వేదన పోలీసు అధికారి చేసిన చిన్న పొరపాటు ఫలితం కావడం గమనార్హం..!

యూపీలోని మెయిన్‌పురి జిల్లా నగ్లా భంట్ గ్రామంలో ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవపై పోలీసులు నలుగురిపై 2008 ఆగస్టు 31న కేసు నమోదు చేశారు. వీరు మనోజ్ యాదవ్, పర్వేష్ యాదవ్, భోలా యాదవ్, రాంవీర్ సింగ్. అనంతరం వీరిపై గ్యాంగ్‌స్టర్ చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. రాంవీర్ సోదరుడే రాజ్ వీర్. కొత్వాలీ ఇన్‌స్పెక్టర్ రాం వీర్‌కు బదులుగా అతడి సోదరుడు రాజ్ వీర్ సింగ్ పేరు నిందితుల పేర్లలో చేర్చారు. దీంతో అతడి జీవితమే మారిపోయింది. రికార్డుల్లో ఉన్న ప్రకారం పోలీసులు రాజ్ వీర్‌ను పట్టుకెళ్లారు. పట్టుకోవాల్సింది రాంవీర్‌నని, తాను అమాయకుడిననీ ఎంత మొత్తుకున్నా అధికారులు వినిపించుకోలేదు. 22 రోజులపాటు జైలులో ఉన్నాక బెయిల్ లభించింది. అప్పటి నుంచి అతడి కష్టాలు మొదలయ్యాయి. అసలు దోషి తాను కాదని నిరూపించుకునేందుకు కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు. కేసు ఆగ్రా నుంచి మెయిన్‌పురి కోర్టుకు మారే వరకు దాదాపు 300 సార్లు వాయిదాలకు హాజరయ్యాడు. 'నా క్లయింట్ గోడును ఎవరూ పట్టించుకోలేదు. అతడికి ఎలాంటి నేర చరిత్ర లేదు. ఏ కేసులూ లేవు. అయినా 22 రోజులు జైలులో ఉండాల్సి వచ్చింది. ఈ వ్యవస్థపై ఇన్నేళ్లూ ఒంటరిగా పోరాటం సాగించాడు'అని లాయర్ వినోద్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. 'రాజ్ వీర్ కుటుంబం బాగోగులను చూసుకోలేకపోయాడు. ఇద్దరి కూతుళ్లకు ఎలాగోలా పెళ్లిళ్లు చేయగలిగాడు. కుటుంబ పోషణకు కుమారుడు వ్యవసాయ కూలీగా మారాడు'అని వివరించారు. గురువారం వాదనలు విన్న మెయిన్‌పురి కోర్టు రాజ్ వీర్‌ను నిర్దోషిగా ప్రకటించింది. జీవితంపై ఎంతో ఆశతో కష్టపడి పనిచేసే వ్యక్తి చట్టపరమైన చిక్కుల్లో పడిపోయాడు. దాచుకున్న డబ్బు హరించిపోయింది. పరువు పోయింది. కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపింది. తన తప్పు లేకున్నా ఇవన్నీ అనుభవించాల్సి వచ్చింది రాజ్ వీర్. ఈ నెల 24న మెయిన్‌పురి కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి స్వప్న దీప్ సింఘాల్ రాజ్ వీర్‌కు సాంత్వన నిచ్చేలా తీర్పు వెలువరించారు. 'పోలీసులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఒక అమాయకుడు 22 రోజుల పాటు జైలులో ఉండాల్సి వచ్చింది. ఒక తప్పుడు కేసులో 17 ఏళ్లపాటు పోరాడాల్సి వచ్చింది. దీనిపై విచారణ చేపట్టి, ఇందుకు కారణమైన అధికారులపై తగు చర్యలు తీసుకోవాలి'అని జడ్జి ఆదేశించారు.

ఎస్‌ఐఆర్‌పై అనుమానం వద్దు

అర్హుల పేర్లు తొలగించడం లేదు: ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నికల సంఘం ప్రారంభించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్‌ఐఆర్) అంశం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రతిపక్షాలు దీనిపై దుమ్మెత్తి పోస్తున్నాయి. ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ కూటమి అడ్డదారులు తొక్కుతోందని, ప్రతిపక్ష మద్దతుదారుల ఓట్లను తొలగిస్తోందని మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఎన్నికల సంఘం ఆదివారం వివరణ ఇచ్చింది. అర్హులైన ఓటర్ల పేర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించడం లేదని స్పష్టంచేసింది. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించింది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టకుండా ఓటర్ల పేర్లను తొలగించే ప్రసక్తే లేదని పేర్కొంది. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్(ఈఆర్‌ఓ) నుంచి ఉత్తర్వు వస్తేనే అనర్హుల పేర్లు తొలగిస్తున్నట్లు తెలిపింది. ఓటర్లకు ముందస్తుగా నోటీసు ఇవ్వకుండా, వారి వివరణ తీసుకోకుండా ఓట్లను తొలగించబోమని తేల్చిచెప్పింది. బిహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాను ఆగస్టు 1వ తేదీన ఎన్నికల సంఘం ప్రచురించనుంది.

డెన్వర్ ఎయిర్‌పోర్టులో కలకలం

- ల్యాండింగ్ గేర్‌లో సమస్య..పొగలు
- విమానం అత్యవసర ద్వారం నుంచి జారిన ప్రయాణికులు

డెన్వర్: అమెరికాలోని డెన్వర్ విమానాశ్రయంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఘటన తీవ్ర కలకలానికి కారణమైంది. డెన్వర్ నుంచి 173 మందితో మియామి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు టేకాఫ్ తీసుకోవాల్సిన అమెరికన్ ఎయిర్ లైన్స్ విమానం ల్యాండింగ్ గేర్‌లో సమస్య ఏర్పడింది. దీని కారణంగా విమానం ముందు భాగంలో పొగలు వ్యాపించాయి. దీంతో, విమానం సిబ్బంది అత్యవసర ద్వారం కిందికి తెరిచారు. దీంతో, అప్పటికే భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు వెంట ఉన్న చిన్నారులు, లగేజీతో అత్యవసర ద్వారం గుండా జారుతూ హడావిడిగా పరుగులు తీశారు. వీరిని బస్సులో టెర్మినల్ వద్దకు తరలించారు. కిందికి జారే క్రమంలో ఐదుగురు ప్రయాణికులకు సాధారణ గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు, పొగలను అదుపులోకి తెచ్చారు.

ఉక్రెయిన్ డ్రోన్ దాడుల భయం.. నేవీ వేడుకలను తగ్గించుకున్న రష్యా

అధ్యక్షుడు పుతిన్ పాల్గొనాల్సిన కార్యక్రమాలూ రద్దు

మాస్కో: ఉక్రెయిన్ డ్రోన్ దాడులు తీవ్రతరం చేసిన నేపథ్యంలో రష్యా తన నేవీ డే వేడుకలపై కోత పెట్టింది. భద్రతాపరమైన ఆందోళనలతో బాల్టిక్ సముద్ర తీరంలోని సెయింట్ పీటర్స్‌బర్గ్, కలినిన్ గ్రాడ్‌లలో, సుదూర తూర్పు తీర నౌకాశ్రయంలో వార్షిక నేవీ డే ఉత్సవాల సందర్భంగా ఆదివారం చేపట్టాల్సిన యుద్ధ నౌకల పరేడ్‌లను రద్దు చేసుకుంది. ఈ విషయాన్ని రష్యా అధికారులు తెలిపారు. సొంత నగరం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని నేవీ ప్రధాన కార్యాలయంలో అధ్యక్షుడు పుతిన్ స్వయంగా హాజరు కావాల్సిన జరిగే కార్యక్రమాలను సైతం రద్దు చేసుకుంది. ఈ విషయాన్ని అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ ధ్రువీకరించారు. అన్ని రకాల పరిస్థితులను బేరీజు వేసుకున్నాకే ఈ నిర్ణయం ప్రభుత్వం తీసుకుందన్నారు. భద్రతకు మించింది మరేదీ లేదని వ్యాఖ్యానించారు. శనివారం రాత్రి నుంచి వివిధ ప్రాంతాలపైకి ఉక్రెయిన్ ప్రయోగించిన 99 డ్రోన్లను కూల్చినట్లు ఆదివారం రక్షణ శాఖ తెలిపింది. వీటిలో సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంపైకి వచ్చినవి కూడా ఉన్నాయంది. లెమెనొసోవ్ ప్రాంతంలో డ్రోన్ శకలాలు పడి ఒక మహిళ గాయపడినట్లు స్థానిక అధికారులు తెలిపారు. డ్రోన్ల భయంతో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని పుల్కొవో ఎయిర్‌పోర్టు అధికారులు ఆదివారం ఉదయం డజన్ల కొద్దీ విమాన సర్వీసులను రద్దు చేశారు. ఈ నగరంలో జరిగిన పలు కార్యక్రమాల్లో అధ్యక్షుడు పుతిన్ పాల్గొన్నారు. యుద్ధ నౌకలను నిర్మించడంతోపాటు నేవీ శిక్షణను వేగవంతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

గ్రీస్‌లో కార్చిచ్చు విధ్వంసం

ఇళ్లు దగ్ధం, వేలాది మంది తరలింపు

ఏథెన్స్: గ్రీస్‌లో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. వారంరోజులకు పైగా కొనసాగుతున్న మంటలతో వేలాది ఇళ్లు ధ్వంసం అయ్యాయి. వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఏథెన్స్ శివారు ప్రాంతం క్రియోనేరిలో మరో కార్చిచ్చు చెలరేగింది. ఇప్పటికే అనేక ప్రాంతాలను మంటలు చుట్టుముట్టగా.. క్రియోనేరిలోని కార్చిచ్చు వేలాది మందిని ప్రమాదంలో పడేసింది. ఏథెన్స్‌కు ఈశాన్యంగా దాదాపు 20 కి.మీ దూరంలో ఉన్న క్రియోనేరిని ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలు, పొడి పరిస్థితులు, బలమైన గాలులతో మంటలు మరింత తీవ్రమవుతున్నాయి. గ్రీకు జర్నలిస్ట్ ఎవాంజెలో సిప్సాస్ ఎక్స్‌లో షేర్ చేసిన వీడియోలో వినాశకరమైన కార్చిచ్చు దృశ్యాలు కనిపించాయి. ఏథెన్స్‌కు ఉత్తరాన కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న సమీపంలోని మరో గ్రామంలో పేలుళ్లు సంభవించాయి. ఆ ప్రాంతంలో కర్మాగారాలు ఉండటంతో మరింత ప్రమాద భయాలు మరింత పెరిగాయి. హెలికాప్టర్ల ద్వారా అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. క్రీట్, ఎవియా, కై థెరా దీవులలో మరో మూడు ప్రధాన కార్చిచ్చులు చెలరేగాయి. ఈ మంటలను ఆర్పేందుకు దేశవ్యాప్తంగా 335 అగ్నిమాపక సిబ్బంది, 19 విమానాలు, 13 హెలికాప్టర్లు పనిచేస్తున్నాయి. వైమానిక దళాలు పగటిపూట మాత్రమే పరిమితం కావడంతో సహాయక చర్యల్లో జాప్యం జరుగుతోంది. గ్రీసులో ఈ వేసవిలో వేడిగాలులు వీయడం ఇది మూడోసారి. శనివారం ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకున్నాయి.

పెద్దల అనుభవంతో విద్యార్థులకు లబ్ధి

- యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్ నుంచి ప్రతిభావంతులు బయటకు రావాలి
- సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆకాంక్ష

శ్రీనగర్: యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు బయటకు రావాలని, దేశ అభివృద్ధికి, జమ్మూకశ్మీర్ అభివృద్ధికి వారు పాటుపడాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఆకాంక్షించారు. ఆయన ఆదివారం శ్రీనగర్‌లో యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ప్రసంగించారు. పూర్వ విద్యార్థుల అనుభవం, పరిజ్ఞానం నేటి యువతకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ యాజమాన్యానికి విజ్ఞప్తి చేశారు. పెద్దలు చొరవ తీసుకుంటే నేటి విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆ దిశగా సేవలందించాలని పూర్వ విద్యార్థులకు పిలుపునిచ్చారు. యువతకు మెరుగైన భవిష్యత్తు అందించడానికి రోడ్‌మ్యాప్ రూపొందించాలన్నారు. యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ అత్యున్నత నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను దేశానికి అందిస్తున్న సంపూర్ణ విశ్వాసం తనకు ఉందని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు. కాశ్మీర్ నిజంగా భూమిపై స్వర్గమేనని వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే ఇది ఎంతో అందమైన ప్రాంతమని పేర్కొన్నారు. మనం స్వర్గం నుంచి ఇక్కడికి వచ్చామన్నారు. ఈ యూనివర్సిటీలో చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకున్నారని ప్రశంసించారు. యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్‌ను జస్టిస్ గవాయ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పుణెలో డ్రగ్ పార్టీపై పోలీసుల దాడి

మాజీ మంత్రి అల్లుడు సహా ఏడుగురు అరెస్ట్

పుణె(మహారాష్ట్ర): పుణె పోలీసులు ఆదివారం ఉదయం ఓ అపార్టుమెంట్‌లో జరుగుతున్న డ్రగ్ పార్టీ గుట్టురట్టు చేశారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలతోపాటు హుక్కాలు, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర మాజీ మంత్రి ఏక్‌నాథ్ ఖడ్సే కుమార్తె రోహిణి భర్త ప్రాంజల్ ఖేవల్కర్ సహా పలువురు పట్టుబడ్డారు. రేవ్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఖరాడీ ప్రాంతంలోని స్టూడియో అపార్టుమెంట్‌పై తెల్లవారు జామున 3.30 గంటల సమయంలో దాడి చేశామని డీసీపీ(క్రైం) నిఖిల్ పింగ్లే చెప్పారు. ఈ సందర్భంగా చేపట్టిన సోదాల్లో 2.7 గ్రాముల కొకైన్, 70 గ్రాముల గంజాయి, హుకా సామగ్రి, మద్యం దొరికాయన్నారు. పట్టుబడిన వారిపై నార్కోటిక్స్ అండ్ సైకోట్రాపిక్ సబ్‌స్టాన్సెస్(ఎన్‌డీపీఎస్)చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వీరందరికీ వైద్య పరీక్షలు చేయించామని, నివేదికలు అందాల్సి ఉందన్నారు. ఎన్సీపీ(ఎస్పీ)నేత అయిన ఏక్‌నాథ్ షిండే ఈ పరిణామంపై మీడియా ఎదుట స్పందించారు. పోలీసుల దాడి వెనుక రాజకీయ కారణాలున్నాయా అనే విషయం తేల్చేందుకు క్షుణ్నంగా దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్సీపీ(ఎస్పీ) మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా రోహిణీ ఖడ్సే వ్యవహరిస్తున్నారు. ఘటనపై స్పందించేందుకు ఆమె నిరాకరించారు. కాగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారికి ఈ దాడి ఒక హెచ్చరిక వంటిదంటూ శివసేన(యూబీటీ) నేత సుష్మా అంధారె వ్యాఖ్యానించారు.

ఈసీ ఎస్‌ఐఆర్‌ను వెంటనే ఆపేయాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషన్(ఈసీ)కి సంస్థాగత అహంకార ధోరణే లేకుంటే, బిహార్‌లో ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)ను వెంటనే ఆపేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సీపీఎం, ఆర్జేడీ, సీపీఐ (ఎంఎల్) నేతలతో కలిసి కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వి ఆదివారం మీడియాతో మాట్లాడారు. బిహార్ ఈసీ ప్రస్తుతం కొనసాగిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమం పౌరసత్వ పరీక్ష మాదిరిగా ఉందంటూ వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మొదలుపెట్టిన ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారన్నారు. ఈసీ ఇచ్చిన వివిధ ప్రకటనలను బట్టి చూస్తే ఎస్ఐఆర్.. పౌరసత్వ ధ్రువీకరణ కార్యక్రమంగా కనిపిస్తోందని సింఘ్వి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌కు పౌరసత్వ ధ్రువీకరణను చేపట్టే అధికారముందా అని ఆయన ప్రశ్నించారు. 'ఎన్నికల కమిషన్‌కు సంస్థాగత అహంకారం, రాజకీయపరమైన పట్టుదల లేనట్లయితే ఇప్పటికిప్పుడే ఎస్ఐఆర్‌ను ఆపేసి, ఎన్నికల తర్వాత చేపట్టగలదు. రెండు నెలల్లో జరగనున్న ఎన్నికలతో దీన్ని ముడిపెట్టడం వెనుక ఎటువంటి కారణం లేదు'అని ఆయన అన్నారు.

జార్ఖండ్ అడవిలో రూ.35 లక్షల నగదు లభ్యం

చైబాసా: జార్ఖండ్ రాష్ట్రం పశ్చిమ సింఘ్‌భమ్ జిల్లాలోని కరైకేలా అడవిలో భద్రతా బలగాలు ఆదివారం రూ.35 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నాయి. బంకర్ లాంటి నిర్మాణంలో ఈ నగదు లభ్యమైనట్లు అధికారులు చెప్పారు. కరైకేలా అటవీ ప్రాంతంపై నక్సలైట్లకు గట్టి పట్టుంది. వారి కోసం కూంబింగ్ నిర్వహిస్తుండగా నగదు దొరికినట్లు తెలుస్తోంది. ఈ సొమ్మును నక్సలైట్లు భద్రపర్చి ఉండొచ్చని భావిస్తున్నారు. రెండు స్టీల్ కంటైనర్లలో ఈ డబ్బులు దొరికినట్లు ఎస్పీ రాజేశ్ రంజన్ వెల్లడించారు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు సమకూర్చుకోవడానికి నక్సలైట్లు ఈ డబ్బును జనం నుంచి బలవంతంగా వసూలు చేసి ఉంటారని తెలిపారు. ఈ ధనం ఎక్కడి నుంచి వచ్చిందన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అడవిలో రూ.35 లక్షల నగదు దొరకడం స్థానికంగా సంచలనం సృష్టించింది. జార్ఖండ్‌లో చర్చనీయాంశంగా మారింది.

ఇరాన్‌లో ఇద్దరు విపక్ష నేతలకు ఉరి

లండన్: ఇరాన్‌లో ప్రతిపక్ష ముజాహిదీన్–ఈ–ఖల్క్‌కు చెందిన ఇద్దరు నాయకులను ఉరి తీసినట్లు అధికారులు ఆదివారం వెల్లడించాయి. సామాన్య ప్రజలపై, మౌలిక సదుపాయాలపై దాడి చేసినట్లు వీరిపై అభియోగాలు రుజువు కావడంతో శిక్ష అమలు చేసినట్లు తెలిపారు. బెహ్రౌజ్ ఎహసానీ ఎస్లామ్‌లౌ, మెహదీ హసానీ అనే ఇద్దరు నేతలు మోర్టార్ లాంచర్లతో జనావాసాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ భవనాలపై దాడికి దిగినట్లు దర్యాప్తులో తేలింది. వారిని అన్యాయం ఈ కేసులో ఇరికించినట్లు మానవ హక్కుల సంస్థల ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది. ఇద్దరు నాయకులను ఉరి తీయడాన్ని ముజాహిదీన్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇరాన్ ఖండించింది. ముజాహిదీన్–ఈ–ఖల్క్‌లో సభ్యత్వం తీసుకున్నందుకు మరో 14 మందిని ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించిందని, వారికి త్వరలో ఉరిశిక్ష అమలు చేయడానికి ఏర్పాట్లు చేస్తోందని ఆరోపించింది. ముజాహిదీన్–ఈ–ఖల్క్ మార్క్సిస్ట్–ఇస్లామిస్ట్ సంస్థగా గుర్తింపు పొందింది. ఇరాన్‌లో రాజరికానికి వ్యతిరేకంగా ఉద్యమించింది. 1980వ దశకంలో ఇరాక్ అధినేత సద్దాం హుస్సేన్ మద్దతుతో ఇరాన్‌లో బాంబు దాడులకు పాల్పడింది. రాజకీయ నేతలను హత్య చేసింది.

'భారత్'ను తర్జుమా చేస్తే.. గుర్తింపును, గౌరవాన్ని కోల్పోతుంది!

ఆర్ఎస్ఎస్ మోహన్ భగవత్ వ్యాఖ్య

కొచ్చి: మనదేశానికి ఉన్న భారత్ అనే పేరును అనువదించరాదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కోరారు. ఒక వేళ భారత్‌ను తర్జుమా చేసినట్లయితే ప్రపంచ దేశాల్లో ఆ పేరుకు ఉన్న గొప్ప గుర్తింపుతోపాటు గౌరవాన్ని సైతం పోగొట్టినట్టే అవుతుందన్నారు. 'ఇండియానే భారత్. ఇది వాస్తవం. మనం దేశాన్ని గురించి రాసేటప్పుడు, మాట్లాడేటప్పుడు కూడా భారత్ అనే మాటనే వాడాలి. బహిరంగ ప్రదేశాల్లో అయినా, వ్యక్తిగత సందర్భంలో అయినా భారత్ అనే మాటను వాడాలని గుర్తుంచుకోవాలి. భారత్ అనే మాటకు మాత్రమే గౌరవం ఉంటుంది' అని భగవత్ తెలిపారు. ఒక్కసారి గౌరవాన్ని కోల్పోతే తిరిగి దానిని పొందడం చాలా కష్టమనే విషయం మనందరం గుర్తుంచుకోవాలన్నారు. 'భారత్ ఎంతో కాలం బంగారు పక్షిగా కొనసాగజాలదు. సింహంగా మారాల్సిన తరుణమిది. ప్రపంచం శక్తిమంతులనే గుర్తిస్తుంది. అందుకే భారత్ బలోపేతం కావాలి. ఆర్థిక కోణంలో సంపదను పెంచుకోవాలి'అని ఆయన అన్నారు.

వైకల్యానికి గురైన జవాన్లకు పదోన్నతులు, వేతనం

సీఆర్‌పీఎఫ్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో హోం శాఖ కార్యదర్శి

న్యూఢిల్లీ: వివిధ ఆపరేషన్ల సమయంలో అవయవాలను కోల్పోయిన లేదా శాశ్వత వైకల్యానికి గురైన కేంద్ర బలగాల్లోని అధికారులు, జవాన్లు సర్వీసులో కొనసాగుతారని, వారు పదోన్నతులతోపాటు సముచిత వేతనాలు పొందుతారని హోం కార్యదర్శి గోవింద్ మోహన్ తెలిపారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) 87వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆపరేషన్ల సమయంలో అవయవాలను కోల్పోయిన లేదా శారీరక వైకల్యానికి గురైన జవాన్లు, అధికారులను సర్వీసు నుంచి తొలగించకూడదని హోం మంత్రిత్వ శాఖ నిర్ణయించిందన్నారు. అటువంటి సిబ్బందిని దళాల్లోని కొన్ని ఎంపిక చేసిన యూనిట్లలో పని చేయడానికి నియమించనున్నట్లు తెలిపారు. అంతేకాదు.. వారికి జీతభత్యాలతోపాటు పదవీ విరమణ వరకు కొనసాగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వైకల్యానికి గురైన వారికి అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలతో సహా.. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో అత్యాధునిక చికిత్సా పద్ధతులను అమలు చేస్తామని చెప్పారు. అలాగే హోం మంత్రిత్వ శాఖ నిధుల నుంచి సిబ్బందికి ప్రాథమిక కనీస ద్రవ్య ప్యాకేజీ కూడా అందించనున్నామన్నారు. విధుల్లో ఉన్న జవాన్లు, అధికారులు శారీరక, మానసిక ఆరోగ్య సమస్యల బారిన పడకుండా కాపాడేందుకు హోం మంత్రిత్వ శాఖ దళాలకు కొత్త సాంకేతిక పరికరాలను అందజేస్తుందని ప్రకటించారు. దళాలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించేందుకు హోంమంత్రిత్వ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి, మరణించిన జవాన్ల కుటుంబ సభ్యులకు శౌర్య పతకాలను అందజేశారు.

అనర్హతపై అంతిమ అధికారం ఎవరిది?

ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా వివిధ స్థాయిల్లో ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటారు. రాజకీయ పార్టీల ద్వారానే ఎన్నికల ప్రక్రియ, ప్రాతినిధ్యం, ప్రజాస్వామ్యం మనుగడ సాధ్యమవుతుంది. అయితే ఒక రాజకీయ పార్టీ తరఫున ఎన్నికైన సభ్యులు అధికారం కోసం తరచుగా మరో పార్టీలోకి మారుతున్నారు. విలువలకు తిలోదకాలిచ్చి అవకాశ వాదంతో పార్టీలను ఫిరాయించడం వల్ల రాజకీయ అస్థిరత్వం ఏర్పడటంతో పాటు ప్రజాభిప్రాయానికి భంగం వాటిల్లుతోంది. నానాటికీ జటిలమవుతున్న ఈ సమస్యను అరికట్టడానికి నిబంధనలను కఠినతరంచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

పార్టీ ఫిరాయింపులను నివారించడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో అనేక ప్రయత్నాలు జరిగాయి. తొలిసారిగా పశ్చిమబెంగాల్ రాష్ట్రం 1979లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రూపొందించింది. 1985లో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నపుడు 52వ రాజ్యాంగ సవరణ ద్వారా కేంద్రంలో మొదటిసారిగా పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని రూపొందించారు. దీనికి సంబంధించి రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ను చేర్చారు. దీన్నే 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' అంటారు. రాజ్యాంగంలోని 102 (2), 191 (2) ప్రకరణలు పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభ్యుల అనర్హతకు సంబంధించినవి. ప్రకరణ 101,102(2), 190, 191(2) పార్లమెంటు, రాష్ట్ర శాసన సభల్లో ఖాళీలు, అనర్హతకు సంబంధించిన వివరాలను తెలియజేస్తాయి.

2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా 10వ షెడ్యూల్‌లోని పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి మరికొన్ని సవరణలు చేశారు.

అనర్హత- కారణాలు:

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభ్యులు కింది సందర్భాల్లో అనర్హతకు గురవుతారు.

1. ఒక పార్టీ తరఫున టికెట్ పొంది ఎంపికైన శాసనసభ్యుడు ఆ పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు.
2. పార్టీ జారీ చేసిన విప్‌కు వ్యతిరేకంగా సభ్యులు గైర్హాజరైనా, అదేవిధంగా పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసినా సభ్యత్వాన్ని కోల్పోతారు.
3. స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికైన శాసనసభ్యులు ఏదైనా పార్టీలో చేరితే వారి సభ్యత్వం రద్దవుతుంది.
4. పార్లమెంటు/ రాష్ట్ర శాసన సభలకు నామినేటైన సభ్యులు ఏదైనా రాజకీయ పార్టీలో చేరితే వారి సభ్యత్వం రద్దవుతుంది. నామినేటెడ్ సభ్యులు.. నామినేటైన రోజు నుంచి ఆరు నెలల్లోపు ఏదైనా రాజకీయ పార్టీలో చేరితే వారి సభ్యత్వం రద్దు కాదు.

మినహాయింపులు:

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం పైన పేర్కొన్న అనర్హతలు కొన్ని సందర్భాల్లో వర్తించవు. అవి:

ఎ) ఒక రాజకీయ పార్టీ మొత్తం శాసనసభ్యుల్లో 2/3వ వంతు మంది మరో రాజకీయ పార్టీలో చేరినా లేదా స్వతంత్రంగా వేరొక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకున్నా.. వారికి పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని అనర్హతలు వర్తించవు.

బి) లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, రాష్ట్ర విధానసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, విధాన పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్లు తమ పదవికి రాజీనామా చేసినా లేదా పదవీకాలం ముగిసిన తర్వాత వేరొక రాజకీయ పార్టీలోకి చేరినా వారి శాసన సభ్యత్వం రద్దు కాదు.

సభ్యత్వాన్ని రద్దుచేసే అధికారం:

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్ట ప్రాతిపదికన శాసన సభ్యుల సభ్యత్వాన్ని రద్దుచేసే అధికారం సభాధ్యక్షులకు ఉంటుంది. సంబంధిత పార్టీ అధ్యక్షుడి ఫిర్యాదు మేరకు సభాధ్యక్షులు సభ్యత్వాన్ని రద్దు చేస్తారు. సభాధ్యక్షులదే తుది నిర్ణయం.



ఈ నిర్ణయాన్ని ఏ న్యాయస్థానంలోనూ ప్రశ్నించరాదు. కానీ 1993లో కిహోటో హోలాహన్ Vs జాచిల్హు కేసులో సుప్రీంకోర్టు ఈ సెక్షన్‌ను కొట్టివేసింది. సభాధ్యక్షులదే తుది నిర్ణయం కాదనీ, అది న్యాయసమీక్షకు లోబడి ఉంటుందని సుప్రీంకోర్టు నిర్ణయమే తుది నిర్ణయం అని తీర్పు చెప్పింది.

ప్రయోజనాలు:

- రాజకీయ సుస్థిరత సాధించవచ్చు.
- అవకాశవాద, అధికారపూరిత రాజకీయాలను అరికట్టవచ్చు.
- రాజకీయ పార్టీల్లో అవినీతి, అనైతిక ప్రవర్తనలను నిరోధించవచ్చు.
- రాజకీయ పార్టీల గురించి రాజ్యాంగంలో మొదటిసారిగా ఈ చట్టం ద్వారానే ప్రస్తావించారు.

91వ రాజ్యాంగ సవరణ

2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టారు.

కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో మంత్రిమండలితో పాటు సభ్యుల అనర్హతలకు సంబంధించి కొన్ని మార్పులు చేశారు.

- కేంద్రంలో ప్రధానమంత్రి సహా కేంద్ర మంత్రిమండలి సంఖ్య లోక్‌సభలోని మొత్తం సభ్యుల్లో 15 శాతానికి మించరాదు.
- రాష్ట్రాలకు కూడా ఇదే విధానం వర్తిస్తుంది. అయితే రాష్ట్రాల విషయంలో మంత్రి మండలి సంఖ్య 12కు తగ్గకూడదు.
- పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హులుగా ప్రకటించిన పార్లమెంటు లేదా శాసనసభ్యులు మంత్రులుగా నియమించడానికి అనర్హులు.
- పార్టీ ఫిరాయింపు చట్టం కింద అనర్హుడిగా ప్రకటించిన పార్లమెంటు/ రాష్ట్ర శాసన సభ్యులు ఆదాయ, లాభదాయక పదవుల్లో నియమించడానికి అనర్హులు.
- పదో షెడ్యూల్‌లో పార్టీ ఫిరాయింపు అనర్హతలకు మినహాయింపుగా పేర్కొన్న చీలిక (Split) అనే పదాన్ని తొలగించారు. ఈ సవరణ కంటే ముందు ఒక రాజకీయ పార్టీలో 1/3 వంతు సభ్యులు చీలిక ద్వారా బయటకి వచ్చి స్వతంత్రంగా ఉంటే వారి సభ్యత్వం రద్దయ్యేది కాదు. ప్రస్తుతం ఈ మినహాయింపును తొలగించారు.

పార్టీ ఫిరాయింపుల చట్టం - సుప్రీంకోర్టు తీర్పులు



కిహోటో హోలాహన్ Vs జాచిల్హు కేసు (1993)
సభ్యుల అనర్హతకు సంబంధించి సుప్రీం కోర్టుదే అంతిమ నిర్ణయం. పార్టీ ఫిరాయింపుల అనర్హత విషయంలో సభాధ్యక్షులు ఇచ్చిన రూలింగ్‌ను సుప్రీంకోర్టులో సవాలు చేయవచ్చు. కాబట్టి వారి నిర్ణయం సుప్రీంకోర్టు న్యాయ సమీక్షకు లోబడి ఉంటుందని స్పష్టీకరించారు. సభాధ్యక్షులు తీర్పులు కోర్టు తరహాలో (ట్రిబ్యునల్స్) ఉంటాయి. అందువల్ల వారి నిర్ణయాన్ని న్యాయస్థానంలో ప్రశ్నించడం రాజ్యాంగ బద్ధమేనని పేర్కొంది.

జి. విశ్వనాథన్ Vs తమిళనాడు స్పీకర్ (1996):
ఒక శాసనసభ్యుడుని ఒక పార్టీ నుంచి బహిష్కరించిన తర్వాత వేరొక రాజకీయ పార్టీలో చేరితే అతడు పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదలుకున్నట్లుగా భావించవచ్చు. కాబట్టి అతడి సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చు.

రాజేంద్రసింగ్ Vs స్వామి ప్రసాద్ కేస్ (2007)
సభాధ్యక్షుల నిర్ణయాన్ని న్యాయస్థానాలు ఏయే పరిస్థితుల్లో సమీక్షించవచ్చు అనే అంశానికి సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ముఖ్యంగా ఫిర్యాదుపై సభాధ్యక్షులు తగిన నిర్ణయాన్ని తీసుకోనప్పుడు, ఆధారాలు, సాక్ష్యాలు లేకుండా పార్టీ విలీనాలను అంగీకరించినప్పుడు, పదో షెడ్యూల్‌లో నిర్ణయించిన పద్ధతి ప్రకారం చర్యలు తీసుకోవడంలో విఫలమైన సందర్భాల్లో న్యాయస్థానంలో వారి చర్యలను ప్రశ్నించ వచ్చని పేర్కొంది.

మాదిరి ప్రశ్నలు

1. మొదటిసారిగా పార్టీ ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని 1979లో ఏ రాష్ట్రం రూపొందించింది?
   ఎ) పశ్చిమ బెంగాల్
   బి) ఆంధ్రప్రదేశ్
   సి) జమ్మూ-కశ్మీర్ డి) కేరళ
2. ఫ్లోర్ క్రాసింగ్ అంటే?
   ఎ) రాజకీయ లబ్ధి కోసం పార్టీలు మారడం
   బి) శాసనసభలో అధికార పక్షానికి మద్దతు తెలపడం
   సి) రాజకీయ లబ్ధి కోసం అధికార పార్టీలోకి మారడం
   డి) పైవేవీ కావు
3. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హతపై అంతిమ అధికారం ఎవరిది?
   ఎ) సభాధ్యక్షులు బి) రాష్ట్రపతి
   సి) సుప్రీంకోర్టు
   డి) కేంద్ర ఎన్నికల సంఘం
4. కిందివాటిలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టానికి సంబంధించిన రాజ్యాంగ సవరణ ఏది?
   ఎ) 52వ సవరణ బి) 91వ సవరణ
   సి) పై రెండూ డి) పైవేవీ కాదు
5. పార్టీని మారాలనే ఉద్దేశంతో గుర్తింపదగిన ప్రయత్నాలు చేస్తే అవి పార్టీ ఫిరాయింపుల కిందకి వస్తాయని, అలాంటి వారిని అనర్హులుగా ప్రకటించవచ్చని సుప్రీంకోర్టు ఏ కేసులో తీర్పు చెప్పింది?
   ఎ) తమిళనాడు శాసనసభ
   బి) కర్ణాటక శాసనసభ
   సి) ఆంధ్రప్రదేశ్ శాసనసభ
   డి) కేరళ శాసన సభ
6. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని లోపం?
   ఎ) చీలిక, కలయిక అనే పదాలకు సరైన నిర్వచనం లేదు
   బి) సభాధ్యక్షులు నిర్ణీత సమయంలోనే తమ తీర్పును వెలువరించాల్సిన పరిమితి లేదు
   సి) పై రెండూ సరైనవి
   డి) పై రెండూ సరికావు
7. కిందివాటిలో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని ప్రయోజనాన్ని గుర్తించండి.
   ఎ) రాజకీయ సుస్థిరత
   బి) అవకాశవాద రాజకీయాలను అరికట్టడం
   సి) సభ్యుల అనైతిక ప్రవర్తనను నిరోధించడం
   డి) పైవన్నీ
8. కిందివాటిలో సరైన జత ఏది?
   ఎ) అవిశ్వాస, విశ్వాస తీర్మాన సమయంలోనే పార్టీ విప్ జారీ చేయాలి – దినేష్ గోస్వామి కమిటీ నివేదిక
   బి) ఎన్నికల ముందు ఏర్పడే రాజకీయ కూటములను కూడా రాజకీయ పార్టీలుగానే పరిగణించాలి – లా కమిషన్ నివేదిక
   సి) ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా ఓటు వేసినప్పుడే దాన్ని చెల్లని ఓటుగా పరిగణించాలి – రాజ్యాంగ సమీక్షా కమిషన్
   డి) పైవన్నీ

సమాధానాలు

1) సి; 2) సి; 3) సి; 4) సి; 5) బి; 6) సి; 7) డి; 8) డి.

డేవిడ్, గోపి పెట్టుబడుల మొత్తం...



భాగస్వామ్యం

- భాగస్వామ్యం: ఒక వ్యాపారాన్ని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉమ్మడిగా చేస్తే వారిని 'భాగస్వాములు' అని, ఆ వ్యాపారాన్ని 'భాగస్వామ్యం' అంటారు.
- భాగస్వాములందరి పెట్టుబడులు ఒకే కాలం వరకు ఉంటే, పెట్టుబడుల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.
- వేర్వేరు పెట్టుబడులు వేర్వేరు కాలాల్లో ఉంటే పెట్టుబడి, వాటి కాలాల పరిమితి లబ్ధాల నిష్పత్తిలో లాభం లేదా నష్టం ఉంటుంది.

1. A, B అనే ఇద్దరు భాగస్వాములు వరుస గా రూ. 4,000, రూ. 6,000 పెట్టుబడులతో వ్యాపారం చేశారు. వారు సంవత్సరం వ్యాపారం చేయగా రూ.1500 లాభం వస్తే A, Bలకు వచ్చే లాభాల తేడా?
   1) రూ.100 2) రూ.200
   3) రూ.300 4) రూ.600

జ. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన కాలా లు సమానం అయితే లాభాల నిష్పత్తి = పెట్టుబడుల నిష్పత్తి
= 4,000 : 6,000 = 2:3
మొత్తం లాభం = 2+3 → 1500
⇒ 5 → 1500
$1 \rightarrow \frac{1500}{5} = 300$
A, B లకు వచ్చే లాభాల తేడా
= 3–2 = 1 → రూ.300

2. P, Q లు సమాన పెట్టుబడులతో వ్యాపారాన్ని ప్రారంభించారు. 9 నెలల తర్వాత Q వ్యాపారం నుంచి విరమించు కున్నాడు. ఏడాది చివర వచ్చిన లాభం రూ. 8540. అందులో Q వాటా?
   1) రూ.1220 2) రూ.2440
   3) రూ.4880 4) రూ.3660

జ. వ్యాపారంలో సమాన పెట్టుబడులు ఉంటే లాభాల నిష్పత్తి = కాలాల నిష్పత్తి
= 12 నెలలు : 9 నెలలు
= 4 : 3
వచ్చిన మొత్తం లాభం = 4+3 → రూ.8540
(సమస్య నుంచి)
7→ రూ.8540
$1 \rightarrow \frac{8540}{7} = Rs.1220$
Q వాటా = 3→ 3 × 1220 = రూ.3660

3. రూ.9000 పెట్టుబడితో A వ్యాపారం ప్రారంభించాడు. 5 నెలల తర్వాత రూ. 8000 పెట్టుబడితో B చేరాడు. ఏడాది చివర వారి లాభం రూ. 4100 అయితే A వాటా?
   1) రూ. 2700 2) రూ. 1400
   3) రూ. 4100 4) రూ. 1300

జ. వేర్వేరు పెట్టుబడులు, వేర్వేరు కాలాల్లో ఉండే లాభాల నిష్పత్తి =
పెట్టుబడి × కాలాల నిష్పత్తి
A, B ల లాభాల నిష్పత్తి =
9000 × 12 నెలలు : 8000 × 7 నెలలు
= 108:56 = 27:14
మొత్తం లాభం = 27+ 14 → 4100
41 → 4100
$1 \rightarrow \frac{4100}{41} = 100$
Aకు వచ్చే లాభం
27 → 27 × 100 = రూ. 2700

4. రూ. 8,000, రూ.4,000, రూ. 8,000 వరుస పెట్టుబడులతో రాజు, రమణ, రవిలు వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రాజు వ్యాపారం వదిలేశాడు. 8 నెలల తర్వాత రూ. 4005 లాభం వచ్చింది. దానిలో రమణ వాటా?
   1) రూ. 890 2) రూ.1335
   3) రూ. 1602 4) రూ. 1780

జ. లాభాల నిష్పత్తి
= పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
=(8000×6):(4000×8):(8000×8)
= 48:32:64 = 3:2:4
∴ రాజు, రమణ, రవిల లాభాల నిష్పత్తి
మొత్తం లాభం = 3+2+4 → రూ. 4005
9 → రూ. 4005
$1 \rightarrow \frac{4005}{9}$
రమణ వాటా $2 \rightarrow 2 \times \frac{4005}{9} = 890$

5. రాముడు వ్యాపారం ప్రారంభించిన కొద్ది మాసాలకు రహీమ్‌ను వ్యాపారంలో చేర్చుకున్నాడు. అప్పుడు వారి పెట్టుబడుల నిష్పత్తి 4:5. ఏడాది చివరన లాభంలో రాముడు, రహీంల వాటాలు వరుసగా రూ. 3300, రూ.2750 అయితే రహీం వ్యాపారంలో ఎప్పుడు చేరాడు?
   1) 8 నెలల తర్వాత 2) 6 నెలల తర్వాత
   3) 4 నెలల తర్వాత 4) 3 నెలల తర్వాత

జ. రాముడు పెట్టుబడి పెట్టిన కాలం 12 నెలలు
రహీం పెట్టుబడి పెట్టిన కాలం x నెలలు అనుకోండి.
పెట్టుబడుల నిష్పత్తి = 4: 5
లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలాల లబ్ధాల నిష్పత్తి
3300 : 2750 = 4 × 12 : 5× x
$5x = \frac{2750 \times 4 \times 12}{3300} = 40$
$x = 40/5 = 8$
∴ రహీం పెట్టుబడి పెట్టిన కాలం = 8 నెలలు అంటే 4 నెలల తర్వాత (12–8=4) రహీం వ్యాపారంలో చేరాడు.

6. A, B, Cలు కలిసి వ్యాపారంలో రూ. 50,000 మూలధనం సమకూర్చుకున్నారు. B కంటే A రూ. 4,000 ఎక్కువ, C కంటే B రూ. 5,000 ఎక్కువ పెట్టుబడి పెట్టారు. మొత్తం లాభం రూ. 35,000 అయితే A వాటా ఎంత?
   1) రూ. 8,400 2) రూ. 11,900
   3) రూ. 13,600 4) రూ. 14,700

జ. C పెట్టుబడి = x అనుకోండి
B పెట్టుబడి = x + 5000,
A పెట్టుబడి = (x + 5000) + 4000
A, B, C ల మొత్తం పెట్టుబడి
= x + (x + 5000) +
[(x + 5000) + 4000] = రూ. 50,000
(సమస్య నుంచి)
⇒ 3x+ 14,000= రూ. 50,000
⇒ x = రూ.12,000
A, B, Cల పెట్టుబడులు
= (12,000 + 5000) + 4000,
12,000 + 5000, 12,000
A, B, Cల పెట్టుబడుల నిష్పత్తి
= 21,000 : 17,000 : 12,000
= 21 : 17 : 12
మొత్తం లాభం = 21 + 17 + 12
→ 35,000
50→35,000
$1 \rightarrow \frac{35000}{50} = 700$
A వాటా 21 → 21 × 700
= రూ. 14,700

7. భాగస్వామ్య వ్యాపారంలో A, Cల పెట్టుబడి 2 : 1గా, A, B ల పెట్టుబడి 3:2గా ఉంది. సంవత్సరాంతాన మొత్తం లాభం రూ.3,900 అయితే A, C వాటాల తేడా ఎంత?
   1) రూ.600 2) రూ.900
   3) రూ.1200 4) రూ.1500

జ. A : C = 2:1, A : B = 3 : 2
$\frac{A}{C} = \frac{2}{1} = \frac{2 \times 3}{1 \times 3} = \frac{6}{3}$
$\frac{A}{B} = \frac{3}{2} = \frac{3 \times 2}{2 \times 2} = \frac{6}{4}$
A : B : C = 6 : 4 : 3(లేదా)
C : A = 1:2
A : B = 3:2
C : A : B = 1×3 : 2 ×3 : 2×2
= 3 : 6 : 4
మొత్తం లాభం
= 6 + 4 + 3 → 3,900
(సమస్య నుంచి)
13 → 3,900
$1 \rightarrow \frac{3900}{13} = 300$
A, C ల వాటాల తేడా = 6 – 3 = 3
→ 3 × 300 = రూ.900

8. డేవిడ్, గోపి పెట్టుబడుల మొత్తం రూ.40,400. ఏడాది చివర వచ్చిన మొత్తం లాభం రూ.10,000. పెట్టుబడుల నిష్పత్తిలో కాకుండా సమానంగా పంచుకుంటే డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. గోపి పెట్టుబడి?
   1) రూ. 20,402 2) రూ. 19,998
   3) రూ. 31,428 4) రూ. 26,868

జ. మొత్తం లాభం = రూ.10,000
సమానంగా పంచుకుంటే డేవిడ్, గోపిల లాభాలు రూ. 5,000 : రూ. 5,000
డేవిడ్‌కు రూ. 50 నష్టం వస్తుంది. కాబట్టి లాభాలను పంచాల్సిన విధానం
రూ.5050:రూ. 4950
లాభాల నిష్పత్తి = 5050 : 4950
= 101: 99
పెట్టుబడుల నిష్పత్తి = లాభాల నిష్పత్తి
= 101 : 99
పెట్టుబడుల మొత్తం
= 101+99 → రూ. 40,400
(సమస్య నుంచి)
200 → 40,400
$1 \rightarrow \frac{40,400}{200} = 202$
గోపి పెట్టుబడి
99 → 99 × 202 = రూ.19,998

9. అరుణ్, వరుణ్‌ల పెట్టుబడుల మొత్తం రూ. 65,000. సంవత్సర ఆదాయం రూ. 20,000. అందులో రూ.7,000 ఖర్చులకు పోనూ మిగిలింది పెట్టుబడుల నిష్పత్తిలో పంచుకోగా అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1,000 అధికంగా వచ్చింది. అయితే వరుణ్ పెట్టుబడి?
   1) రూ. 30,000 2) రూ. 35,000
   3) రూ. 25,000 4) రూ. 40,000

జ. సంవత్సర ఆదాయం = రూ. 20,000
ఖర్చులకు రూ. 7,000 పోను మిగిలిన ఆదాయం = 20,000– 7000 = 13,000
రూ.13,000ను అరుణ్ కంటే వరుణ్‌కు రూ. 1000 అధికంగా వచ్చేట్లు పంచుకొనే విధానం
= రూ. 6,000, రూ. 7,000
= 6:7
పెట్టుబడుల మొత్తం = 6+7 → 65,000
(సమస్య నుంచి)
13→65,000
$1 \rightarrow \frac{65,000}{13} = 5000$
వరుణ్ పెట్టుబడి 7 → 7× 5,000
= రూ. 35,000

10. A, B, Cలు వరుసగా రూ. 2,500, రూ.1,800, రూ. 2,000 పెట్టుబడి పెట్టి ఒక వ్యాపారం ప్రారంభించారు. 4 నెలల తర్వాత A తన పెట్టుబడి నుంచి రూ. 700 తీసుకొన్నాడు. తమ పెట్టుబడికి B రూ. 400, C రూ.300 కలిపారు. సంవ త్సరం చివర రూ. 945 లాభం వస్తే B, C లాభాల తేడా?
   1) రూ. 10 2) రూ. 20
   3) రూ. 30 4) రూ. 40

జ. A, B, Cల లాభాల నిష్పత్తి = పెట్టుబడి, కాలం లబ్ధాల నిష్పత్తి
= 2500×4 + (2500–700)×8 :1800×4 +(1800+400)×8:2000×4+(2000+300)×8
= 10000+14400:7200+17600:8000+ 18400 = 24400 : 24800 : 26400
= 61: 62: 66
మొత్తం లాభం= 61+62+66 →రూ.945
(సమస్య నుంచి)
$189 \rightarrow 945;\ 1 \rightarrow \frac{945}{189}$
B, Cల లాభాల తేడా = 66 – 62 = 4
$\frac{945}{189} \times 4$ = రూ.20

మాదిరి ప్రశ్నలు

1. గోపాల్, భూపాల్ వరుసగా రూ. 3,000, రూ. 5,000 పెట్టుబడితో వ్యాపారం చేశారు. సంవత్సరాంతమున వచ్చిన లాభం రూ. 1880 అయితే గోపాల్ వాటా?
   1) 705 2) 1175 3) 1435 4) 1715
2. రాణి రూ. 2525 మూలధనంతో కూరల వ్యాపారం ప్రారంభించిన కొంతకాలానికి వాణి రూ. 1,200 పెట్టుబడితో వ్యాపారంలో చేరింది. సంవత్సరాంతాన వచ్చిన మొత్తం రూ. 1664 లాభంలో రాణి వాటా రూ.1212 అయితే వాణి ఎన్ని నెలల తర్వాత వ్యాపారంలో చేరింది?
   1) 3 2) 4 3) 5 4) 6
3. లాల్ వర్తకం ప్రారంభించి కొంత కాలానికి పాల్‌ను భాగస్తునిగా చేర్చుకున్నాడు. వారి పెట్టుబడుల నిష్పత్తి 3:4. సంవత్సరాంతమున వారి లాభాల వాటాలు సమానంగా ఉన్న పాల్ వ్యాపారంలో ఉన్న కాలం ఎన్ని నెలలు?
   1) 3 2) 6 3) 9 4) 12
4. ఒక వ్యాపారంలో A రూ.6,000ను 5 నెలలు, B రూ.10,000ను 4 నెలలు, C రూ.15,000ను 6 నెలలు పెట్టుబడిగా పెట్టారు. వారికి వచ్చిన లాభం రూ.8000 అయితే A వాటా?
   1) రూ.4,500 2) రూ. 2,000
   3) రూ. 1,500 4) రూ. 3,000
5. రూ.15,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత రూ.10,000లతో B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంతమున లాభం రూ.6,000 అయితే B వాటా?
   1) రూ.2,000 2) రూ.3,000
   3) రూ.4,000 4) రూ.5,000
6. రూ.30,000లతో A వ్యాపారం ప్రారంభించాడు. 3 నెలల తర్వాత B వ్యాపారంలో చేరాడు. సంవత్సరాంత మున లాభాలను సమానంగా పంచుకున్నారు. అయితే B పెట్టుబడి?
   1) రూ.15,000 2) రూ.25,000
   3) రూ.35,000 4) రూ.40,000
7. A, B వరుసగా రూ. 8000, రూ.12,000లతో వ్యాపారం ప్రారంభించారు. వారు 10 శాతం లాభాన్ని దానధర్మాలు చేశారు. సంవత్సరాంతమునకు A వాటా రూ. 5400 అయితే మొత్తం లాభం?
   1) రూ.13,500 2) రూ.15,000
   3) రూ.14,800 4) రూ.12,000
8. A,B వరుసగా రూ.20,000, రూ.30,000లతో వ్యాపారం ప్రారంభించారు. 6 నెలల తర్వాత రూ. 10,000లను A అదనంగా పెట్టుబడి పెట్టాడు. కానీ రూ. 5000లను B వెనక్కు తీసుకొన్నాడు. సంవత్సరాంతానికి వారికి వచ్చిన లాభం రూ. 8400 అయితే A వాటా?
   1) రూ. 2,500 2) రూ. 4,000
   3) రూ. 4,400 4) రూ. 5,200
9. A,Bలు 9:6 నిష్పత్తిలో వ్యాపారం ప్రారంభించారు. సంవత్సరం చివరలో వచ్చిన లాభం రూ. 6,800ను పొరపాటున 6:9 నిష్పత్తిలో పంచుకున్నారు. అయితే Bకు వచ్చిన అదనపు లాభం?
   1) రూ.2,720 2) రూ.4,080
   3) రూ.1,360 4) రూ.2,180
10. A, B, C లు 2:3:5 నిష్పత్తిలో పెట్టుబడులు పెట్టి వ్యాపారం ప్రారంభించారు. మరుసటి సంవత్సరం తమ పెట్టుబడుల నుంచి ఒక్కొక్కరు వరుసగా 20%, 25%, 30% వెనక్కు తీసుకున్నారు. రెండో సంవత్సరం వారు పంచుకునే లాభాల నిష్పత్తి?
    1) 32: 45: 70 2) 4: 5:6
    3) 12:17:21 4) ఏదీకాదు
11. ముగ్గురు రైతులు ఒక తోటను అద్దెకు తీసుకొన్నారు. మొదటి వ్యక్తి 30 ఆవులను మూడు నెలలు, రెండో వ్యక్తి 20 ఆవులను 4 నెలలు, మూడో వ్యక్తి 15 ఆవుల్ని 8 నెలలు ఉంచారు. తోట మొత్తం అద్దె రూ.580 అయితే 3వ వ్యక్తి చెల్లించాల్సిన అద్దె?
    1) రూ. 200 2) రూ. 240
    3) రూ. 320 4) రూ. 360
12. ఉమ్మడి వ్యాపారంలో A, Bలు 3:5 నిష్పత్తి పెట్టుబడితో వ్యాపారం ప్రారంభిం చారు. B పెట్టుబడికి సమానంగా 6 నెలల తర్వాత C వాళ్లతో చేరాడు. ఒక సంవత్సరం చివర వచ్చిన లాభాన్ని వారు పంచుకొనే నిష్పత్తి?
    1) 3: 5: 2 2) 1: 2 : 3
    3) 3: 5: 5 4) 6: 10 : 5

సమాధానాలు

1) 1; 2) 1; 3) 3; 4) 3; 5) 1; 6) 4; 7) 2; 8) 2; 9) 3; 10) 1; 11) 2; 12) 4.

ప్రధాన ఖరీఫ్ పంట ఏది?

భారతదేశం - వ్యవసాయం

భారతదేశ వ్యవసాయ ఉత్పత్తులు రుతుపవనాలు తెచ్చే వర్షంపైన ఆధారపడి ఉండటం వల్ల భారతదేశ ఆర్థికస్థితిని రుతుపవనాలతో 'జూదమాడటం'తో అనవచ్చు. భారతదేశ వ్యవసాయ రంగంలో ఉత్పత్తి అయిన వాటిలో ఎగుమతి అయ్యే ముఖ్యమైన సరుకులు.. టీ, కాఫీ, ఆముదాలు, వేరుశనగ, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, పొగాకు, పత్తి, పంచదార, తోళ్లు, నూనెలు, జనపనార మొదలైనవి.

- 1900కి పూర్వం మన దేశ వ్యవసాయం మరీ పురాతన పద్ధతులలో సాగుతూ ఉండేది. 1908లో బిహార్‌లోని 'పూసా' వద్ద ఒక వ్యవసాయ కళాశాల, పరిశోధనా శాలను స్థాపించారు.
- 1937లో బ్రిటీష్ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వ్యవసాయ శాఖల్ని ప్రారంభించింది.
- 1951 తర్వాత భారత వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంటే 1951లో మొదటి పంచవర్ష ప్రణాళికను రూపొందించి, అందులో వ్యవసాయ రంగానికి అత్యధికంగా ప్రాధాన్యతను ఇచ్చారు.
- భారతదేశంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం న్యూఢిల్లీలో ఉంది.
- వ్యవసాయోత్పత్తులను పెంచడానికి భారత ప్రభుత్వం 1963లో 'వ్యవసాయాభివృద్ధి బోర్డు' ఏర్పాటు చేసింది.

రాష్ట్రాలు/ప్రదేశం	పోడు/విస్తాపన వ్యవసాయం పేర్లు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ	పోడు వ్యవసాయం
కేరళ	పోనమ్
హిమాలయ	ఖిల్
జార్ఖండ్	కురువా
అస్సాం, ఈశాన్య రాష్ట్రాలు	జూమ్/ఝూం
మధ్యప్రదేశ్	బేవార్, పెండ
ఒడిశా	ధీటి
రాజస్థాన్	వాత్ర

అనాదిగా భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. శ్రామిక శక్తిలో మూడింట రెండువంతులకు వ్యవసాయం, దాని అనుబంధ కార్యక్రమాల వల్లనే జీవనాధారం లభిస్తోంది. అంతేకాకుండా దాదాపు 70 శాతం జనాభా గ్రామాల్లో నివసిస్తూ వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉండటం, భారతదేశ జాతీయ ఆర్థికాభివృద్ధి.. వ్యవసాయ రంగం అభివృద్ధిపై ఆధారపడి ఉండటం, పెరిగే జనాభాకు ఆహారాన్ని అందించడం, అనేక పరిశ్రమలకు ముడి సరుకులు అందించే దేశంగా ఉండటం, పెద్ద మొత్తాల్లో విదేశీ మారక ద్రవ్యం లభించడం మొదలైన అనేక కారణాల వల్ల భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయాన్ని 'వెన్నెముక' గా చెప్పొచ్చు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
జాగ్రఫీ

ప్రస్తుతం మనదేశంలో విభిన్న ప్రాంతాల్లో వివిధ రకాలైన వ్యవసాయ పద్ధతులున్నాయి. వీటిని ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..

1. విస్తాపన వ్యవసాయం
2. తోట వ్యవసాయం
3. సాంద్ర వ్యవసాయం
4. జీవనాధార వ్యవసాయం
5. విస్తృత వ్యవసాయం
6. మిశ్రమ వ్యవసాయం

1. **విస్తాపన వ్యవసాయం:** దీన్ని స్థలమార్పిడి వ్యవసాయం లేదా సంచార వ్యవసాయం అని కూడా అంటారు. ఇది సాధారణంగా కొండ ప్రాంతాల్లోని గిరిజనులు చేసే వ్యవసాయం.
- ఈ వ్యవసాయంలో చెట్లను నరికి, వాటిని కాల్చి వ్యవసాయ భూములుగా మారుస్తారు. కొన్నేళ్ల తర్వాత అంటే భూసారం తగ్గాక ఆ భూమిని వదిలి, మరొక ప్రాంతానికి వెళ్లి అక్కడ మళ్లీ వ్యవసాయం చేస్తారు. ఇది నిరంతరంగా కొనసాగుతుంది. అందుకే దీన్ని 'నరుకు - కాల్చు' వ్యవసాయం లేదా 'పోడు వ్యవసాయం' అని అంటారు.
- ఇటువంటి వ్యవసాయాన్ని మనదేశంలో వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

2. **తోట వ్యవసాయం:** దీన్ని వాణిజ్య వ్యవసాయం అని కూడా అంటారు.
- ఈ పద్ధతిని మనదేశంలో బ్రిటీష్ వారు ప్రవేశపెట్టారు.
- లాభం లేదా ధనాన్ని సంపాదించడం కోసం 'నగదు పంటల'ను పండిస్తారు.
- ఈ వ్యవసాయానికి ఎక్కువ పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం, భూమి అవసరం.
- గోధుమలు, తేయాకు, కాఫీ, రబ్బరు, బార్లీ, పత్తి, చెరకు, పొగాకు, సుగంధ ద్రవ్యాలు మొదలైన పంటలు వాణిజ్య వ్యవసాయంలో సాగు చేస్తారు.

3. **సాంద్ర వ్యవసాయం:** అధిక జనసాంద్రత ప్రాంతాల్లో ఈ రకమైన వ్యవసాయం చేస్తారు. ఇది అధికంగా వ్యవసాయ శ్రామికులను, అత్యధిక జీవ రసాయనిక ఎరువులను, నీటి పారుదలను ఉపయోగించుకొని అధిక దిగుబడి సాధించే విధానం.
- తక్కువ భూవిస్తీర్ణంలో పురాతన వ్యవసాయ పద్ధతులను ఉపయోగిస్తారు.
- మనదేశంలో గంగానదీ పరీవాహక ప్రాంతం, కృష్ణా, గోదావరి, మహానది, కావేరి డెల్టా ప్రాంతాలు ఈ రకానికి ఉదాహరణగా చెప్పొచ్చు. దీనిలో సరాసరి దిగుబడి ఎక్కువ మోతాదులో ఉంటుంది.

4. **జీవనాధార వ్యవసాయం:** ఆహార అవసరాల కోసం రైతు కుటుంబం అంతా పూర్తిగా వ్యవసాయంపైనే ఆధారపడి చేసే వ్యవసాయాన్ని జీవనాధార వ్యవసాయం అంటారు.
- దీనిలో ఆహార పంటలు మాత్రమే పండిస్తారు. కాబట్టి దీనిలో లాభం ఉండదు.
- దీంతో ఎక్కువగా ప్రచ్ఛన్న నిరుద్యోగం ఏర్పడుతుంది.

5. **విస్తృత వ్యవసాయం:** ఎక్కువ విస్తీర్ణం ఉన్న భూమిలో ఎక్కువ పెట్టుబడితో చేసేదాన్ని విస్తృత వ్యవసాయం అంటారు.
- ఈ పద్ధతిలో వ్యవసాయ కూలీలు తక్కువగా ఉంటూ, యంత్రాలను ఎక్కువగా వినియోగిస్తారు.
- ఇందులో సరాసరి దిగుబడి తక్కువ మోతాదులో ఉంటుంది.
- అమెరికా, కెనడా, రష్యా లాంటి దేశాల్లో ఈ పద్ధతి ఎక్కువగా అమల్లో ఉంది.

6. **మిశ్రమ వ్యవసాయం:** వ్యవసాయంతో పాటు పశుపోషణ లేదా కోళ్ల పెంపకం లేదా సెరికల్చర్ లేదా ఎపికల్చర్ వంటి కార్యకలాపాలు చేపడితే దాన్ని మిశ్రమ వ్యవసాయం అంటారు.

భారతదేశంలో పంట కాలాలు

వ్యవసాయ పంటలు రుతువుల మీద, సహజ వనరులైన మృత్తికలు, నీరు, సూర్యరశ్మిపై ఆధారపడి ఉంటాయి. వీటితోపాటు ఉష్ణోగ్రత, ఆర్ద్రత అంశాలు కూడా ప్రధాన మైనవి. ఏ ప్రాంతంలోనైనా రుతువులను బట్టి పంటలు మారుతూ ఉంటాయి.

భారతదేశంలో ప్రధానంగా మూడు రకాల పంటకాలాలు ఉన్నాయి. అవి..

1. ఖరీఫ్ 2. రబీ 3. జయాద్ లేదా జైద్

1. **ఖరీఫ్ (జూన్ నుంచి అక్టోబర్ మధ్య వరకు):**
- నైరుతి రుతుపవనాల రాకతో దాదాపు దేశమంతటా ఖరీఫ్ ప్రారంభమవుతుంది.
- జూన్, జూలైల్లో విత్తనాలు వేసే కాలం ప్రారంభమై సెప్టెంబర్, అక్టోబర్ మధ్య కాలంలో పంటకోతలు ప్రారంభమవుతాయి.
- వరి, మొక్కజొన్న, జొన్న, సజ్జ, కందులు, పెసలు, మినుములు, పత్తి, జనుము, వేరుశనగ, సోయాబీన్ ముఖ్యమైన ఖరీఫ్ పంటలు.

2. **రబీ (అక్టోబర్ మధ్య నుంచి ఏప్రిల్ వరకు):**
- ఈశాన్య రుతుపవనాల రాకతో దేశంలో రబీ కాలం మొదలవుతుంది.
- ఈ కాలంలోని పంటలు పెరిగేటప్పుడు చల్లని వాతావరణం, కోసేటప్పుడు వెచ్చని వాతావరణం అవసరం.
- రబీ పంటను శీతాకాలంలో అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో విత్తి, ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు పంటలు కోస్తారు.
- పశ్చిమ విక్షోభాల వల్ల శీతాకాలంలో సంభవించే కొద్దిపాటి వర్షపాతం రబీ పంటలకు అత్యంత ఉపయోగకరం.
- దీనిలో ముఖ్యమైన పంటలు గోధుమ, బార్లీ, బఠాణీ, శనగ, ఆవాలు, పప్పుధాన్యాలు మొదలైనవి.

3. **జయాద్/ జైద్ (మే నుంచి జూన్ వరకు):**
- రబీ, ఖరీఫ్ పంట కాలాల మధ్య స్వల్ప వ్యవధిలో ఉన్న పంట రుతువును 'జయాద్' అంటారు.
- నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో పుచ్చకాయలు, కర్బూజ, దోసకాయ, కూరగాయలు, పశువుల మేత వంటి స్వల్ప కాల పంటలు పండిస్తారు.

భారతదేశంలో ముఖ్య పంటలు

భారతదేశంలో పంటలను ముఖ్యంగా నాలుగు విధాలుగా విభజించొచ్చు. అవి..

1. ఆహార పంటలు
2. నగదు లేదా వాణిజ్య పంటలు
3. తోట పంటలు
4. ఉద్యానవన పంటలు

1. **ఆహారపంటలు:** వరి, గోధుమ, మొక్క జొన్న, జొన్న, సజ్జ, రాగి, పప్పుధాన్యాలు.
2. **నగదు లేదా వాణిజ్య పంటలు:** పత్తి, పొగాకు, జనుము, చెరకు, నూనె గింజలు.
3. **తోట పంటలు:** కాఫీ, టీ, సుగంధ ద్రవ్యాలు, కొబ్బరి, రబ్బరు.
4. **ఉద్యానవన పంటలు:** కూరగాయలు, పండ్లు, పూలు మొదలైనవి..

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ప్రధానమైన పంట రుతువులు? (కానిస్టేబుల్ - 2009)
   1) ఖరీఫ్, రబీ 2) ఖరీఫ్, వేసవి
   3) ఖరీఫ్, రబీ, వేసవి
   4) రబీ, వేసవి
2. సాగు చేయడంలో కార్బనిక ఎరువు, సహజ క్రిమినాశనుల మందులను ఉపయోగించే వ్యవసాయం? (కానిస్టేబుల్ - 2009)
   1) జీవనాధార వ్యవసాయం
   2) పోడు వ్యవసాయం
   3) కార్బనిక వ్యవసాయం
   4) మిశ్రమ వ్యవసాయం
3. వ్యవసాయంలో ఖరీఫ్ రుతువు దేన్ని తెలుపుతుంది? (కానిస్టేబుల్ - 2009)
   1) రుతుపవనాల ఆగమనం (జూన్-జూలై)
   2) రుతుపవనాల ఉపసంహరణ (అక్టోబర్- నవంబర్)
   3) వేసవి ఆరంభం (ఏప్రిల్-మే)
   4) పైవేవీ కావు

<u>సమాధానాలు:</u> 1) 3; 2) 3; 3) 1.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో ప్రధాన ఖరీఫ్ పంట?
   1) గోధుమ 2) వేరుశనగ
   3) వరి 4) పొగాకు
2. భారతదేశంలో రబీ కాలంలో ప్రధాన పంట ఏది?
   1) వరి 2) గోధుమ 3) పత్తి 4) సజ్జ
3. 1908లో మనదేశంలో ఎక్కడ వ్యవసాయ కళాశాల, పరిశోధనాశాలను స్థాపించారు?
   1) న్యూఢిల్లీ 2) కటక్
   3) పుణే 4) పూసా
4. కేరళలో పోడు లేదా విస్తాపన వ్యవసాయానికి ఉన్న మరో పేరు?
   1) కురువా 2) పోనమ్
   3) జూమ్ 4) వాత్ర

<u>సమాధానాలు</u>
1) 3; 2) 2; 3) 4; 4) 2.

Understand the Author's Tone..

COMPREHENSION

The comprehension section demands a good reading and understanding capacity of the candidate. You are expected to go through the paragraph given, understand, analyze and derive meaning out of it. Before attempting any passage, skim it as it's very important to understand the tone of the author. It may be optimistic, pessimist, sarcastic, angry or contemplative. If you are able to understand what author is trying to say then there is high probability that you will mark right answers. The passage usually contains 10 questions related to the passage which include synonyms and antonyms of particular words from the paragraph that needs to be answered. If you find that questions are beyond the understanding you found from the passage, simply skip that question, never try to mark nearest answer. Mark the answer only if you are sure about it. Here are a few tips while attempting this section:

- Skim the passage that is given.
- Read the questions first which helps to have an idea as you will be focused.
- Casual reading is not advisable, stay focused and don't miss any detail while reading.
- Make a note of what you read which might help you while you come back in search of answers.
- If doubt persists re-read the passage to make sure you understand it well before answering.
- Understand the author's tone and answer the questions based on author's opinion rather than your opinion.

A methodical and well planned preparation always gives fruitful results. It is essential to have a basic foundation in English which can be acquired by regular reading habits. Time management is crucial during the test. Use time saving techniques. In order to accomplish this you must become familiarize with the directions prior to taking the exam, and practice all the given exercises from this section.

- Keep in mind that you need not dwell too long on any one question or become concerned that you have answered a previous question incorrectly.
- Answer all questions by applying the techniques; keep track of any question that you may want to return to if you have enough time.
- The most important thing is be confident and remember that you have prepared well. Relax and do the best you can.

Competitive exams have provided many aspiring candidates to get jobs in various public and private sectors. Candidates appearing for these exams are from various backgrounds and vernacular mediums. English remained a thing of concern for many as they find it as a stumbling block in getting through the exam. In many competitive exams it is mandatory to go through the English language paper and thus it comes out as a challenge for such candidates who lack in English language skills. Hence, it is essential for these candidates to put extra effort on their preparation to score well and be victorious. The English language part consists of questions pertaining to various sections like, grammatical skills, vocabulary knowledge and comprehension.



BANK EXAMS
English

Model Questions

Directions (Q. 1-15): Read the following passages carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

PASSAGE 1

"Let us laugh" says, W. Mathews, "it is the cheapest luxury man enjoys. It stirs up the blood, expands the chest, clears away the cobwebs from the brain and gives the whole system a healthy treatment." So is it not nice to laugh a lot? It is said, "Laughter is the best medicine." For those who dislike medicine, sweet or bitter. A good joke that provokes laughter is prescribed. It is nice to have a good laugh but a "guffaw" may sometime lock one's jaws and so it is suggested that those who enjoy a loud guffaw go slow and subside into a gurgle but the best thing is, as done in Hon'ble courts before a Hon'ble Judges, just titter. And be able to enjoy all jokes including ones directed at myself, but never making a laughing stock of myself in the process. Let us remember the wise saying, "He is not laughed at that laughs at himself."

1. It is said that laughter is the best medicine because
   1) It is the cheapest luxury man enjoys
   2) It is available free of cost
   3) It is cheaper whereas medicines in the shops are costly
   4) It is not mentioned
   5) It provides better treatment than costly medicines.
2. The writer says he would never make a laughing stock of himself. It means he should not
   1) let others ridicule him
   2) show disrespect to Judges
   3) laugh, but simply smile at others
   4) let others laugh
   5) laugh at others
3. The writer feels laughter is to be prescribed to those who
   1) are seriously ill
   2) dislike medicines
   3) cannot buy medicines
   4) who are happy
   5) do not need medicines
4. What may sometime lock one's jaws?
   1) Laughter 2) Mirth
   3) Guffaw 4) Gurgle 5) Titter
5. By quoting a wise saying in the last line the writer
   1) Reiterates the point that laughter is the best medicine for us
   2) Pity on those who laugh
   3) Guides us about what we should do from being laughed at
   4) Cautions us as to how we should conduct ourselves in the Hon'ble Courts
   5) Censures those who cannot laugh at themselves

PASSAGE 2

I once saw a tigress stalking a month old kid. The ground was very open and the kid saw the tigress while she was still some distance away and started bleating, where on the tigress gave up her stalk and walked straight up to it. When the tigress has approached to within a few yards, the kid went **forward** to meet her, and on reaching the tigress **stretched** out its neck and put up its head to smell her. For the duration of a few heart beats the month-old kid and the queen of the forest stood nose to nose, and then the queen turned and walked off in the direction from which she came.

6. 'Stalking' in this context means
   1) Running threateningly
   2) Moving about in circles
   3) Attacking
   4) Targeting a victim
   5) Moving quietly without being seen or heard
7. The tigress walked straight up to the kid because
   1) It makes the kid joyous
   2) Running would frighten the kid
   3) Stalking was useless now
   4) The tigress was patient
   5) She was sure of her victim
8. The kid's behavior indicates that
   1) It was familiar with the sight of tigress
   2) It was attracted by the tigress's smell
   3) It was attracted to the tiger's food
   4) It took the tigress for a playmate
   5) It was not aware of the danger involved
9. The expression 'for the duration of a few heart beats' suggests
   1) The few seconds the tigress and the kid spent smelling each other
   2) The fear of the kid
   3) The excitement of the tigress
   4) The anxiety of the watcher
   5) The anxiety of the author
10. 'Queen' in the passage refers to
    1) The queen who came to see
    2) The lady 3) The kid
    4) The tigress 5) The author
11. The synonym of **forward** is
    1) Rearward 2) Onward
    3) Inward 4) Review
    5) Rejoice
12. The antonym of **'stretched'** is
    1) Expand 2) Prolong
    3) Lengthen 4) Elongate
    5) Contract

PASSAGE 3

India is not a backward country. It is the version of the outside world which is outdated. India is growing every day. It has a population of more than 100 million in the middle class, out of which a segment of 70 million is earning monthly wages more than that the average weekly pay of an Australian worker, which makes India an economic power as great as France.

13. What is meant by segment in the above paragraph
    1) The total population
    2) A large part of the population
    3) Some part of the population
    4) Half of the population
    5) Less than half of the population
14. What is the underlying theme of the paragraph?
    1) India is a great military power
    2) India is a backward country
    3) India is fast developing into a big power
    4) India has poor economy
    5) India can never develop
15. What is the meaning of the line "India is as great as France"?
    1) India is small as compared to France
    2) India is greater than France
    3) India is on the same level as France
    4) India cannot be compared with France
    5) No other country can be compared with India

ANSWERS:
1) 1 2) 1 3) 2 4) 3
5) 3 6) 5 7) 5 8) 5
9) 4 10) 4 11) 1 12) 5
13) 3 14) 3 15) 3

విద్య, ఉద్యోగ సమాచారం

ఐసీఎంఆర్ న్యూఢిల్లీలో యంగ్ ప్రొఫెషనల్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్) ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ 55 శాతం మార్కులతో పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.42,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** ncd2.icmrhq@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** 29.07.2025.
» **వెబ్‌సైట్:** https://www.icmr.gov.in

యూసీఎస్ఎల్, కర్ణాటకలో 12 గ్రాడ్యుయేట్/డిప్లొమా అప్రెంటిస్‌లు

కర్ణాటక రాష్ట్రం మాల్పేలో ఉడిపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్) వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్/టెక్నీషియన్ (డిప్లొమా)/ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 12.
» **విభాగాలు:** ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, వెల్డర్స్, ప్లంబర్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా, ఇంజనీరంగ్ డిగ్రీ, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 16.07.2025 నాటికి 18 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు గ్రాడ్యుయేట్ పోస్టులకు రూ.12,000, టెక్నీషియన్(డిప్లొమా) పోస్టులకు రూ.10,200, ఐటీఐ ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.8000.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, విద్యార్హతల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.08.2025.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

